సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 240
శుక్రవారం 21-11-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

పీఠంపై పదోసారి
నితీశ్ కుమార్ బిహార్ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.
వివరాలు 6లో ▸

భారత్‌కు 'జావెలిన్' వ్యవస్థ
భారత్‌కు రూ. 826 కోట్ల విలువైన ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా అంగీకారం తెలిపింది.
వివరాలు 6లో ▸



నిఖత్ పంచ్ బంగారం
వరల్డ్ బాక్సింగ్ కప్‌లో 9 స్వర్ణాలు భారత్ ఖాతాలో చేరగా, ఇందులో 7 మహిళా బాక్సర్లే గెల్చుకున్నారు.
వివరాలు 13లో ▸

తిరుచానూరు ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తిరుమల చేరుకున్న రాష్ట్రపతి ముర్ము

10 లో

తిరుచానూరులో శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ద్రౌపది ముర్ము

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం వద్ద వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహంలో ఓ భాగం

ఉప్పొంగిన అభిమానం

కనుచూపు మేర అభిమాన జనం.. పక్క రాష్ట్రంలోనూ చెక్కుచెదరని ప్రజాభిమానం

జగన్నినాదాలతో హోరెత్తిన భాగ్యనగరం

వైఎస్ జగన్‌కు హైదరాబాద్‌లో ఘన స్వాగతం

అభిమాన నేతను చూసేందుకు పోటెత్తిన అభిమానులు

2 లో

దగ్గర నుంచి చూడాలని, చేయి కలపాలని పోటీపడ్డ యువత

నాంపల్లి కోర్టు వరకు అడుగులో అడుగు వేసిన జనం

జగన్‌ను చూసేందుకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సైతం పోటీ

జనాదరణను చూసి ఓర్వలేకపోయిన పచ్చ మీడియా

ఇష్టానుసారం డిబేట్లతో నోరు పారేసుకున్న వైనం

జనం తరలి రావడమే తప్పు అన్నట్లు స్వీయ తీర్పు

చిట్ట చివరన ఏపీ పోలీస్..

చట్టం.. చతికిల!

రెడ్‌బుక్ ఎఫెక్ట్‌తో కుప్పకూలిన పోలీసు వ్యవస్థ

దేశంలోనే అట్టడుగున ఆంధ్రా పోలీస్

బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ చట్టాల అమలులో పూర్తి వైఫల్యం

దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, యూటీల పనితీరుపై కేంద్రం 2025 నివేదిక

2 లో

- 36వ స్థానంతో జాబితాలో చిట్టచివర స్థానంలో ఏపీ పోలీసు శాఖ
- 100 పాయింట్లకు దక్కింది కేవలం 16.70 పాయింట్లే.. పనితీరులో కనీసం పాస్ మార్కులు కూడా దక్కని వైనం
- రాజకీయ కక్ష సాధింపులతో పోలీసు వ్యవస్థ దుర్వినియోగం
- తాజాగా మావోయిస్టుల ఏరివేత ఆద్యంతం కేంద్రం కనుసన్నల్లోనే..

Rank	State / UTs	Total	Administrative Reforms (20%)	Operational Efficiency (45%)	ICT Applications (25%)	Integrations (10%)
29	KERALA	[illegible]	14.42	11.98	0.08	6.50
30	[illegible]	[illegible]	19.38	10.19	0.00	1.80
31	[illegible]	[illegible]	13.31	8.81	0.42	7.10
32	[illegible]	[illegible]	12.58	9.79	0.74	6.50
33	[illegible]	[illegible]	8.15	3.75	10.00	5.90
34	NAGA[illegible]	[illegible]	16.12	5.54	0.00	0.00
35	WEST BENGAL	20.71	8.54	7.43	0.04	4.70
36	ANDHRA PRADESH	16.70	8.77	7.93	0.00	0.00
	All India Avera[illegible]	44.96	15.75	14.11	8.74	6.36

న్యూస్‌రీల్

ముక్కలు ముక్కలుగా పసికందు శరీరభాగాలు

విశాఖ కంచరపాలెంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. ముక్కుపచ్చలారని పసికందు శరీర భాగాలు.. ముక్కలుముక్కలుగా మురుగు కాలువలో కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
5 లో

అంగన్‌వాడీ చిన్నారులకు అస్వస్థత

నంద్యాల జిల్లా మిట్టకందాలలోని అంగన్‌వాడీ సెంటర్–3కు చెందిన 8 మంది చిన్నారులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే తల్లిదండ్రులు ఆస్పత్రులకు తరలించారు. ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
5 లో

12 గ్రుడ్ల ₹90
108 కిలో
196 కిలో
135 కిలో
223 కిలో
Conditions Apply

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు షేక్ మాబు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల కేంద్రం. మూడెకరాలు కౌలుకు తీసుకుని ఖరీఫ్‌లో పత్తి సాగుచేశాడు. కౌలుకు రూ.45 వేలతో పాటు సాగు, ఎరువులు, విత్తనాలు, మందులకు మొత్తం రూ.1.50 లక్షల దాకా పెట్టుబడి పెట్టాడు. మొంథా తుపాను, అంతకుముందు వచ్చిన అధిక వర్షాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపగా, ఉన్న అరకొర కాయలో నీరుచేరి పత్తి నాణ్యత లోపించింది. కూలీలకు రూ.30 వేల వరకు ఖర్చుచేసి ఇటీవల మొదటి తీత పత్తి తీయగా మూడెకరాలకు 11 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పత్తిని విక్రయించేందుకు సత్తెనపల్లి సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే నాణ్యతలేదని తిరస్కరించారు. దీంతో.. మాబు ప్రైవేట్ దళారులకు క్వింటా కేవలం రూ.5,700కు అమ్ముకున్నాడు. మూడెకరాలకు వచ్చింది కేవలం రూ.63 వేలే. మిగిలిన 2, 3 తీతలకు కూలీ డబ్బులు కూడా రావని మాబు బుధవారం పొలంలోని పత్తి పంటను దున్నించేశాడు.

పత్తి రైతుపై కత్తి!

ధరలేక, బాబు సర్కారు ఆదుకోక దగా | 3 తీతల పంట ఉన్నా ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు

తీవ్ర వర్షాలు, మొంథా తుపానుతో తగ్గిన దిగుబడి, నాణ్యత.. పంట నష్టం అంచనాల్లో చంద్రబాబు సర్కారు దారుణంగా కోత

పల్నాడు జిల్లాలో 54,145 ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రభుత్వ ప్రాథమిక అంచనా

10 లో

- చివరికి.. 3,912 ఎకరాలేనని కుదింపు.. తేమ శాతం, నాణ్యత పేరుతో పంటను తిరస్కరిస్తున్న సీసీఐ బయ్యర్లు
- తొలి తీత అమ్ముకోవడానికి నానా అవస్థలు
- ప్రైవేట్ దళారులకు క్వింటాల్ రూ.5 వేలకే విక్రయం
- దిగుబడి, గిట్టుబాటు ధర రాకపోవడంతో పత్తి రైతు కుదేలు
- ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు నష్టం

రాష్ట్రపతి, గవర్నర్లకు

గడువు పెట్టలేం

జస్టిస్ నరసింహ | జస్టిస్ సూర్యకాంత్ | సీజేఐ జస్టిస్ గవాయ్ | జస్టిస్ విక్రమ్‌నాథ్ | జస్టిస్ చందూర్కర్

అది పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం

బిల్లుల కేసులో 'సుప్రీం' కీలక తీర్పు

రెండోసారి పంపినా ఆమోదం గవర్నర్ ఇష్టం

అప్పుడు కూడా రాష్ట్రపతికి నివేదించవచ్చు

మంత్రివర్గం సలహా విధిగా పాటించక్కర్లేదు

సుదీర్ఘకాలం ఆపడం మాత్రం సరికాదు

అలాంటప్పుడు కోర్టులు సమీక్షించవచ్చు

అప్పుడు కూడా గడువు మాత్రం నిర్దేశించలేవు

సీజేఐ రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ

గతంలో ఇచ్చిన 'గడువు' తీర్పు కొట్టివేత

6లో

నిర్ధారణ కాకుండానే నోటీసులా?

సభా హక్కుల కమిటీని నిలదీసిన హైకోర్టు

- 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి వ్యక్తిగత హాజరు వాయిదా
- సభా హక్కుల కమిటీ నోటీసులపై అదనపు వివరాల సమర్పణకు వెసులుబాటు
- 'సాక్షి' కథనం హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందో, రాదో ముందు తేల్చాలిగా?
- సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉండాలి
- సభా హక్కుల ఉల్లంఘన నిర్ధారణకు ముందే నోటీసులు ఎలా ఇస్తారు?
- నిర్ధారణ తర్వాతే కదా.. నోటీసులిచ్చి వివరణ తీసుకోవాల్సింది?
- అవి లేనప్పుడు పిటిషనర్లకు ఎలా నోటీసులిస్తారు?.. సాక్ష్యాలు ఇవ్వాలని, సాక్ష్యం చెప్పాలని ఎలా కోరుతారు?.. వ్యక్తిగత హాజరుకు ఎలా నోటీసులిస్తారు?
- అసెంబ్లీ జనరల్ సెక్రటరీ, సభా హక్కుల కమిటీని ప్రశ్నించిన ధర్మాసనం

10 లో

కేటీఆర్ విచారణకు ఓకే

ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో విచారణకు రెండురోజుల కిందటే తెలంగాణ గవర్నర్ అనుమతి

రూ.54.88 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఫార్ములా-ఈ ఆపరేషన్స్‌కు బదిలీ అయ్యాయనే ఆరోపణలు

గవర్నర్ అనుమతి నేపథ్యంలో ఈ కేసులో చార్జిషీట్ వేసేందుకు మార్గం సుగమం!

10 లో

ముదురుతున్న కర్ణాటక సంక్షోభం

- ముఖ్యమంత్రి పీఠం కోసం డీకే వర్సెస్ సిద్ధు
- రెండున్నరేళ్ల సిద్ధరామయ్య పదవీ కాలం పూర్తి
- కానీ, ఐదేళ్లు తానే సీఎం అంటున్న సిద్ధు
- హామీ ప్రకారం అధికార మార్పిడికి డీకే వర్గం డిమాండ్
- అధిష్టానంతో చర్చించేందుకు ఢిల్లీకి పయనం

11లో

స్వామి సేవలో ఎలాంటి

అవినీతికి పాల్పడలేదు

సిట్ అధికారులకు స్పష్టం చేసిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

- 2014 నుంచి టీటీడీకి నెయ్యి సరఫరాపై విచారణ చేయాలని కోరాను
- ఆ నాలుగు ట్యాంకుల్లోని నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందా? లేదా సిట్ చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ హయాంలో స్వామి వారి ప్రతి రూపాయిని కాపాడాం
- శ్రీవాణి ట్రస్టు ద్వారా దేశ వ్యాప్తంగా శ్రీవారి ఆలయాలు నిర్మించాం
- కిలో నెయ్యి రూ.276తో కొనుగోలు చేసినప్పుడు కల్తీ జరిగిందంటే ఒప్పుకుంటారా?

సాక్షి, అమరావతి: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి సేవలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. టీటీడీ చైర్మన్‌గా తాను శ్రీవారి నిధులను ఆదా చేయడానికి, భక్తులకు మరింతగా సేవలు అందించడానికే పెద్దపీట వేశానని తేల్చి చెప్పారు. రాజకీయ కుట్రతోనే సీఎం చంద్రబాబు శ్రీవారి లడ్డూ ప్రసాదానికి అపవిత్రత ఆపాదించేలా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని సుబ్బారెడ్డి నివాసంలో గురువారం ఏపీ సిట్ అధికారులు

మిగతా 10వ పేజీలో ▶

జగనన్నా.. నీ వెంటే మేమంతా: జగన్ కాన్వాయ్ వెంట పరుగులు తీస్తున్న అభిమానులు

'స్వచ్ఛంద' అభిమానం: హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ వద్ద తనను చూసేందుకు స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉప్పొంగిన అభిమానం

వైఎస్ జగన్‌కు హైదరాబాద్‌లో ఘన స్వాగతం

సాక్షి, హైదరాబాద్: జనాభిమానం పోటెత్తింది.. బేగంపేట ప్రాంతం జన సంద్రంగా మారింది.. కనుచూపు మేర అభిమాన జనం.. జగన్నినాదాలతో భాగ్యనగరం హోరెత్తింది.. పొరుగు రాష్ట్రంలో సైతం అభిమానం చెక్కుచెదరలేదని స్పష్టమైంది.. తమ అభిమాన నేత వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడికొస్తున్నారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న యువత భారీ సంఖ్యలో తరలి రావడం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.. 2014 తర్వాత తెలంగాణలో వైఎస్సార్‌సీపీ కార్యకలాపాలు లేకపోయినా వేలాది మంది అభిమానులు బేగంపేట మొదలు నాంపల్లి వరకు 'జై జగన్.. సీఎం సీఎం..' అంటూ నినాదాలు చేస్తూ జననేత అడుగులో అడుగు వేసుకుంటూ రావడం కనిపించింది.. జగనన్నను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే చేయి కలపాలని, మాట కలపాలని పెద్ద సంఖ్యలో యువత ముందుకు చొచ్చుకు వస్తుంటే నియంత్రించడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.. హైదరాబాద్‌లో వైఎస్ జగన్‌కు ఇంతటి ఆదరణ లభించడం చూసి 'పచ్చ' మీడియాకు పిచ్చెక్కింది.. రెండు రోజుల ముందు నుంచే విషం చిమ్మిన సదరు ఎల్లో మీడియా.. తాజాగా అవాకులు, చెవాకులు పేలుతూ అక్కసు వెళ్లగక్కింది. జగన్‌ను చూడటానికి ఇంత మంది జనం ఎలా వచ్చారంటూ నిష్ఠూరమాడింది. ప్రత్యేకంగా డిబేట్లు పెట్టి జగన్‌ను నోటికొచ్చినట్లు మాట్లాడుతూ తెలంగాణ అధికారగణాన్ని తప్పు పట్టింది. ఓ తోక పత్రికకు చెందిన చానల్ మరో అడుగు ముందుకు వేసి లోటస్ పాండ్ వద్ద జనమే లేరని పచ్చి అబద్ధాలు చెప్పడం దుర్మార్గం. దీనంతటికీ కారణం జగన్‌కు జనాదరణ చెక్కుచెదరక పోగా, మరింత పెరిగిందని తేటతెల్లమవ్వడమే.

బేగంపేటలో అపూర్వ స్వాగతం

గత నెల యూరప్ పర్యటనకు అనుమతిచ్చిన నేపథ్యంలో సీబీఐ కోర్టు సూచించిన మేరకు గురువారం న్యాయస్థానం ఎదుట హాజరయ్యేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హైదరాబాద్‌లో అపూర్వ స్వాగతం లభించింది. బేగంపేట విమానాశ్రయంలో పెద్ద సంఖ్యలో జనం ఆయనకు ఘన స్వాగతం పలికారు. జై జగన్.. అంటూ నినదించారు. 'అన్నా.. జగనన్నా..' అని అరుస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. జగన్ వస్తున్నారని తెలుసుకుని ఉదయం నుంచే నగరంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన అభిమానులు.. ప్రజలు భారీగా తరలివచ్చారు. జగన్ కాన్వాయ్ వెంట నాంపల్లిలోని సీబీఐ కోర్టు వరకు అడుగులో అడుగు వేశారు. దారి మధ్యలో అడుగడుగునా నినాదాలు చేస్తున్న అభిమానులకు వైఎస్ జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

వైఎస్ జగన్ ఉదయం 10.51 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచి చూస్తున్న పెద్ద సంఖ్యలో అభిమానులు, ఆయన్ను చూడగానే.. 'జై జగన్..'అంటూ నినాదాలు చేశారు. వారి కేరింతలతో విమానాశ్రయం ప్రాంగణం మారుమోగింది. ఓ దశలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి జగన్‌ను చూసేందుకు పరుగులు తీశారు. ఉదయం 11.11 సమయంలో తన కాన్వాయ్‌లో విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన జగన్.. గ్రీన్ ల్యాండ్స్, రాజ్‌భవన్, ఖైరతాబాద్, లక్డీకాపూల్ మీదుగా నిర్ణీత సమయానికే నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. ఈ మార్గంలో అభిమానులు భారీ స్థాయిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు

బారికేడ్లను దాటిన అభిమానం

చేశారు. ఆయన కాన్వాయ్ వెనుక ద్విచక్ర వాహనాల్లో అభిమానులు బయలుదేరారు. ఉదయం 11.45 గంటలకు జగన్ కాన్వాయ్ నాంపల్లి కోర్టుకు చేరుకోగానే.. అప్పటికే కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు జగన్ ఉన్న వాహనాన్ని మాత్రమే లోపలకు అనుమతించారు. కోర్టు బయట కూడా అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని వేచి ఉన్నారు. సీబీఐ కోర్టు ప్రాంగణంతో పాటు న్యాయస్థానం లోపల కూడా న్యాయవాదులతో నిండిపోయింది. జగన్‌ను చూసేందుకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కూడా పోటీ పడ్డారు. మధ్యాహ్నం 12.26 గంటలకు జగన్ బయటకు వచ్చారు.

జనతరంగం: హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ వద్ద పోటెత్తిన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అన్నా.. నీవు సంతోషంగా ఉండాలె

వైఎస్ జగన్ కోర్టు హాల్ నుంచి బయటికి రాగానే ఆయనతో ఫొటో దిగేందుకు అభిమానులు, ప్రజలు ఎగబడ్డారు. దీంతో కోర్టు హాల్ నుంచి కారు వరకు జగన్‌ను క్షేమంగా చేర్చడం కోసం పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. లిఫ్ట్ వద్ద పెద్ద ఎత్తున సిబ్బంది, న్యాయవాదులు చొచ్చుకువచ్చారు. 'అన్నా.. నీవు సంతోషంగా ఉండాలె' అంటూ మహిళా సిబ్బంది ఆకాంక్షించారు. 'నమస్తే జగన్ అన్నా.. మిమ్మల్ని చూడటం చాలా సంతోషంగా ఉంది' అంటూ న్యాయవాదులు మాట కలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొంత మంది అభిమానులు పోలీసులను దాటుకుని ఒక్కసారిగా దగ్గరకు వచ్చినా, ఆయన ఎలాంటి ఆగ్రహం వ్యక్తం చేయలేదు. చిరునవ్వుతో అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అక్కడ నుంచి నేరుగా తల్లి వైఎస్ విజయమ్మను కలిసేందుకు బంజారాహిల్స్ లోటస్ పాండ్‌లోని ఇంటికి బయలుదేరారు. ఇంటి వద్దకు వెళ్లాక జన సందోహంలో చిక్కుకుపోయారు. భారీగా తరలి వచ్చిన అభిమానులకు అభివాదం చేసుకుంటూ నెమ్మదిగా ఇంట్లోకి వెళ్లారు. మధ్యాహ్న భోజనం తర్వాత తిరిగి బేగంపేట విమానాశ్రయానికి వెళ్లారు. జగన్ రాక నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు బేగంపేట విమానాశ్రయం, నాంపల్లి కోర్టు, లోటస్‌పాండ్‌తో పాటు వాటి మధ్య మార్గాల్లోనూ పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. అదనపు బలగాలు, రోప్ పార్టీలను రంగంలోకి దింపారు. మధ్య మండల డీసీపీ శిల్పవల్లి స్వయంగా కోర్టు వద్దకు చేరుకుని పరిస్థితిని ఆద్యంతం పర్యవేక్షించారు.

రెచ్చిపోయిన పచ్చ మీడియా

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వైఎస్ జగన్‌కు భారీగా ఆదరణ లభించడం చూసి ఎల్లో మీడియా పూనకాలెత్తింది. ఉదయం 11 గంటల నుంచే అక్కసు వెళ్లగక్కడం ప్రారంభించింది. అంతకు ముందు రెండు రోజుల నుంచి కూడా విష ప్రచారం చేయడమే కాకుండా గురువారం మరో అడుగు ముందుకు వేసి వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ ప్రత్యేక చర్చా వేదికలు నిర్వహించింది. ఇష్టానుసారం మాట్లాడుతూ.. జగన్‌ను చూడటానికి ఇంతగా జనం రావడం తప్పు అని తేల్చింది. యూరప్ పర్యటన తర్వాత కోర్టులో హాజరై వెళ్లాలన్న సూచన మేరకే వస్తున్నారని తెలిసినా, పనిగట్టుకుని దుష్ప్రచారం చేసింది. జగన్‌ను చూడటానికి అంత మంది జనం వస్తే పోలీసులు ఏం చేశారని ఓ పచ్చ చానల్ ప్రెజెంటర్ అక్కసు వెళ్లగక్కడం చర్చనీయాంశమైంది. జగన్ ప్రజాదరణ కలిగి ఉండటమే నేరం అన్నట్లు సదరు ప్రెజెంటర్ తీర్పు చెప్పడం చూసి సోషల్ మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు. ఇంత ఓర్వలేనితనం ఏమిటంటూ నిలదీస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లు ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ ఉదయం టిఫిన్ అమరావతిలో, మధ్యాహ్న భోజనం మరో ఊళ్లో, రాత్రి డిన్నర్ హైదరాబాద్‌లో చేస్తుండటం ఎల్లో మీడియా కంటికి కనిపించడం లేదా? వారినెందుకు తప్పు పట్టరు? అంటూ ప్రశ్నిస్తున్నారు.

చిట్ట చివరన ఏపీ పోలీస్..

చట్టం.. చతికిల!

రెడ్‌బుక్ ఎఫెక్ట్‌తో కుప్పకూలిన పోలీసు వ్యవస్థ

Rank	State / UTs	Total	Administrative Reforms (20%)	Operational Efficiency (45%)	ICT Applications (25%)	Integrations (10%)
29	KERALA	32.98	14.42	11.98	0.08	6.50
30	MIZORAM	31.37	19.38	10.19	0.00	1.80
31	Telangana	29.64	13.31	8.81	0.42	7.10
32	TAMIL NADU	29.61	12.58	9.79	0.74	6.50
33	LAKSHADWEEP	27.80	8.15	3.75	10.00	5.90
34	NAGALAND	21.66	16.12	5.54	0.00	0.00
35	WEST BENGAL	20.71	8.54	7.43	0.04	4.70
36	ANDHRA PRADESH	16.70	8.77	7.93	0.00	0.00
	All India Average	44.96	15.75	14.11	8.74	6.36

బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ చట్టాల అమలులో దేశంలోనే అట్టడుగున ఏపీ పోలీసు శాఖ ఉందని పేర్కొన్న కేంద్ర హోం శాఖ నివేదిక

సాక్షి, అమరావతి

రెడ్‌బుక్ రాజ్యాంగం..
అధికార దుర్వినియోగం...
రాజకీయ కక్ష సాధింపులు....

వెరసి చంద్రబాబు సర్కారు రాజకీయ పాలన ఫలితాలు ఎలా ఉన్నాయో స్వయంగా కేంద్ర ప్రభుత్వ నివేదిక సాక్షిగా మరోసారి బట్టబయలైంది! ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థ కుప్ప కూలినట్లు వెల్లడైంది. పనితీరులో ఏపీ పోలీసు శాఖ దేశంలోనే అట్టడుగు స్థానానికి పడిపోయింది. చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ కక్ష సాధింపు చర్యలకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న ఫలితం ఇదీ! దేశవ్యాప్తంగా పోలీసుల పనితీరుపై కేంద్ర హోంశాఖ రూపొందించిన 2025 నివేదికలో ఏపీ పోలీసు శాఖ చిట్టచివరి స్థానానికి పరిమితమైంది. పోలీసు సంస్కరణల్లో భాగంగా ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ నాగరిక సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్టాల అమలుపై కేంద్ర హోంశాఖ తాజా నివేదికను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖల పనితీరును మదించి ఈ ర్యాంకులు ప్రకటించింది. ఏపీ పోలీసు శాఖ 100 పాయింట్లకు గానూ కేవలం 16 పాయింట్లే తెచ్చుకుని 36 స్థానానికి పడిపోవడం గమనార్హం. అయితే మావోయిస్టులను కట్టడి చేశామని, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా దాదాపు 50 మందిని పట్టుకున్నామని ఏపీ పోలీసు ఉన్నతాధికారులు గొప్పలు చెప్పుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. నిజానికి ఇదంతా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో, కేంద్ర బలగాల ద్వారా జరిగిందని.. ఏపీ పోలీసుల ద్వారా అరెస్టును మాత్రమే చూపించారని పరిశీలకులు పేర్కొంటున్నారు.

16.70 శాతం పాయింట్లతో చిట్టచివరన

100 మార్కుల పరీక్షలో కనీసం 35 మార్కులు తెచ్చుకుంటే పాస్ అయినట్లు లెక్క! మరి బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ చట్టాల అమలులో ఏపీ పోలీసు శాఖ వంద పాయింట్లకు ఎన్ని సాధించిందో తెలుసా..? కేవలం 16.70 పాయింట్లకే పరిమితమైంది. అంటే కనీసం పాస్ మార్కులు కూడా తెచ్చుకోలేక చతికిలపడింది. కేంద్ర హోంశాఖ నిర్వహించిన పరీక్షలో ఫెయిల్ అయ్యింది. జాబితాలో చిట్ట చివరన అంటే 36వ స్థానంలో నిలిచింది. దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కలిపి దేశంలో పోలీసు శాఖ సగటు పాయింట్లు 36. అంటే దేశ సగటును కూడా ఏపీ పోలీసు శాఖ చేరుకోలేకపోయింది.

నాలుగు విభాగాలుగా పనితీరు మదింపు

పౌరులకు సత్వరం, సక్రమంగా పోలీసు సేవలను అందించడం.. బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దేశంలో సంస్కరణలు చేపట్టింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అమలులో ఉన్న కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) చట్టాల స్థానంలో బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ చట్టాలను ప్రవేశపెట్టింది. పోలీసు సంస్కరణల్లో భాగంగా చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించింది. కేసుల నమోదు, దర్యాప్తు, విచారణలో పారదర్శకతకు పెద్దపీట వేసింది. అందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు మార్గదర్శకాలను రూపొందించింది. తద్వారా పోలీసులు నిబంధనలను ఉల్లంఘించకుండా పౌరులకు సత్వరం సక్రమంగా సేవలు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. ఈ క్రమంలో బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ చట్టాలను వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఎలా అమలు చేస్తున్నాయో కేంద్ర హోంశాఖ విశ్లేషించింది. ప్రధానంగా నాలుగు విభాగాలుగా పోలీసు శాఖల పనితీరును మదించింది. పరిపాలన సంస్కరణలకు 20 శాతం, నిర్వహణపరమైన సమర్థతకు 45 శాతం, సమాచార–సాంకేతికత అమలు (ఐసీటీ అప్లికేషన్స్)కు 25 శాతం, పోలీసు – వైద్య – ఆరోగ్య – న్యాయ శాఖల మధ్య సమన్వయానికి 10 శాతం చొప్పున పాయింట్లు కేటాయించింది. మొత్తం 100 పాయింట్లకు పోలీసు శాఖల పనితీరును మదించింది.

దేశంలో మొదటి స్థానంలో అసోం

బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ చట్టాల అమలులో దేశంలో అసోం మొదటి స్థానం సాధించింది. మొత్తం వంద పాయింట్లకు అసోం పోలీసు శాఖ ఏకంగా 72.03 శాతం పాయింట్లు సాధించడం విశేషం. హర్యానా 62.70 పాయింట్లతో రెండో స్థానంలో, సిక్కిం 60.87 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో అట్టుడుకుతున్నప్పటికీ జమ్మూ–కశ్మీర్ 59.20 పాయింట్లతో నాలుగో స్థానం దక్కించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. చివరకు బిహార్ కూడా 47.92 పాయింట్లు సాధించి 15వ స్థానం దక్కించుకుంది. అక్రమ చొరబాట్లతో అతలాకుతలమవుతున్నప్పటికీ మణిపూర్ 45.74 పాయింట్లతో 21 స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ మాత్రం 16.70 పాయింట్లకు పరిమితమై దేశంలోనే అట్టడుగున 36 స్థానానికి పడిపోయింది. చంద్రబాబు సర్కారు రెడ్‌బుక్ రాజ్యాంగం పోలీసు వ్యవస్థను ఎంతగా భ్రష్టు పట్టించిందన్నది ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. బాబు సర్కారు రాజకీయ కుట్రలకు డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, ఇతర టీడీపీ వీరవిధేయ పోలీసు అధికారులు కొమ్ముకాస్తుండటంతో ఏపీ పోలీసు శాఖ పరువు బజారున పడిందని పోలీసు వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.

నాలుగు విభాగాల్లోనూ విఫలం..

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు విభాగాల్లోనూ రాష్ట్ర పోలీసులు అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అందులో ఏపీ పోలీసుల దారుణ పనితీరు ఇలా ఉంది..!

పాలన సంస్కరణలకు కూటమి మోకాలడ్డు

పరిపాలన సంస్కరణల విభాగంలో 20 పాయింట్లకుగానూ ఏపీ పోలీసు శాఖకు కేవలం 8.77 పాయింట్లే లభించాయి. కేసుల దర్యాప్తులో అధికారులు సక్రమంగా వ్యవహరించేందుకు తెచ్చిన సంస్కరణలను ఇందులో నిర్దేశించారు. ఉదాహరణకు గతంలో ఏదైనా నేరం జరిగితే దర్యాప్తు అధికారి ఘటనా స్థలానికి చేరుకుని స్కెచ్ వేయించి ఫొటో తీసి కేస్ డైరీ (సీడీ) ఫైల్‌లో నమోదు చేసేవారు. అయితే ఈ ప్రక్రియలో లొసుగులు ఉన్నట్లు కేంద్ర హోంశాఖ గుర్తించింది. దీంతో ఘటనా స్థలంలో కేవలం ఫొటో కాకుండా స్కెచ్ వేస్తున్నప్పుడు వీడియో తీయాలని, ఆ వెంటనే నేరుగా సీడీ ఫైల్‌లో అప్‌లోడ్ చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. తద్వారా స్కెచ్ వేస్తున్న సమయం, సీడీ ఫైల్‌లో అప్‌లోడ్ చేసిన సమయం రికార్డు అవుతాయి. అందుకోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పోలీస్ స్టేషన్ ఆఫీసర్లు, దర్యాప్తు అధికారులు, ఇతరులకు ట్యాబ్‌లు ఇవ్వడంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయాన్నే పట్టించుకోలేదు. పోలీస్ స్టేషన్‌కు కేవలం ఒక ట్యాబ్‌ను మాత్రమే అందించింది. పట్టణ ప్రాంతాల పోలీస్ స్టేషన్ల పరిధిలో రోజుకు సగటున నాలుగు కేసులు నమోదు అవుతున్నాయి. కానీ ఒక్క ట్యాబ్ మాత్రమే ఉంది. దాంతో తీవ్రత తక్కువ ఉన్న కేసుల దర్యాప్తునకు ట్యాబ్ తీసుకెళుతున్నారు. రాజకీయ కక్ష సాధింపులతో పాల్పడిన నేరాల దర్యాప్తునకు ట్యాబ్‌లు తీసుకువెళ్లడం లేదు. అధికార టీడీపీ కూటమి నేతల దాడులు, దౌర్జన్యాలు, హత్యాచార ఘటనలను తొక్కిపెడుతుండటంతో పోలీసు వ్యవస్థ పనితీరు దారుణంగా దిగజారింది. ఫలితంగా పాలన సంస్కరణల విభాగంలో 20 పాయింట్లకు ఏపీ పోలీసు శాఖ 8.77 పాయింట్లే తెచ్చుకుంది.

కుప్పకూలిన నిర్వహణ సామర్థ్యం

కీలకమైన శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల కట్టడి, సమగ్ర దర్యాప్తులో ఏపీ పోలీసు శాఖ పనితీరు అత్యంత నాసిరకంగా ఉంది. ఈ విభాగంలో మొత్తం 45 పాయింట్లకు ఏపీ పోలీసు శాఖకు కేవలం 7.93 పాయింట్లే రావడం అందుకు నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పోలీసు అధికారులు, సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. ఫోరెన్సిక్ పరిజ్ఞానం, సైబర్ టెక్నాలజీ, ఆధునిక దర్యాప్తు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఆధునిక దర్యాప్తు ప్రక్రియలపై కనీస శిక్షణ కూడా అందించలేదు. 'అప్పా' ఏర్పాటును విస్మరించింది. టీడీపీ కూటమి నేతలు బరితెగించి పాల్పడుతున్న కేసుల దర్యాప్తును నీరుగార్చడమే లక్ష్యంగా వ్యవహరిస్తోంది. హత్యలు, లైంగిక దాడులు, సోషల్ మీడియాలో వేధింపులు, ఫోరెన్సిక్, సైబర్ నేరాలకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో కేసులు నీరుగారుతున్నాయి. పోలీసులకు శిక్షణ గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. దానివల్లే ఈ విభాగంలో ఏపీ పోలీసు శాఖకు కేవలం 7.93 పాయింట్లే వచ్చాయి.

సమాచార, సాంకేతికతలో గుండు సున్నా

చంద్రబాబు ప్రభుత్వం పోలీసు శాఖను ఏ స్థాయికి దిగజార్చిందో కేంద్ర హోంశాఖ నివేదికలోని 'సమాచార సాంకేతిక అమలు (ఐసీటీ అప్లికేషన్స్) విభాగం బట్టబయలు చేసింది. ఈ విభాగంలో 25 పాయింట్లకుగానూ ఏపీ పోలీసులకు వచ్చింది గుండు సున్నా. ఈ విభాగం కింద రాష్ట్రంలోని పోలీసు స్టేషన్లలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, డేటా కమ్యూనికేషన్ల వ్యవస్థ, వెబ్‌సైట్ల సక్రమ నిర్వహణ తదితర అంశాలను కేంద్రం నిర్దేశించింది. ఒక నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు ఎప్పుడు తెచ్చారు?.. లాకప్ పరిస్థితులు.. వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి ఎప్పుడు తరలించారు?.. న్యాయస్థానంలో ఎప్పుడు ప్రవేశపెట్టారు..? లాంటి ప్రక్రియలన్నీ సక్రమంగా పాటించేందుకు విధి విధానాలను నిర్దేశించింది. అందుకే సీసీ కెమెరాల ఏర్పాటును ప్రధానంగా ప్రస్తావించింది. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఆ విషయాన్ని చెవికెక్కించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానాలు ఎంత హెచ్చరించినా సరే.. 9 నెలలుగా పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. కారణం.. రెడ్‌బుక్ వేధింపులతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులను అక్రమంగా అరెస్టు చేస్తుండటమే! కనీసం వారిని అరెస్టు చేసిన విషయం కూడా చెప్పకుండా వివిధ పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ భౌతికంగా, మానసికంగా హింసిస్తోంది. టీడీపీ కూటమి సర్కారు పాలనలో రాజమహేంద్రవరంలో ఓ దళితుడిని అర్ధనగ్నంగా లాకప్‌లో హింసించిన విషయం తెలిసిందే. ఇక వందలాది మంది సోషల్ మీడియా యాక్టివిస్టులను అక్రమంగా అదుపులోకి తీసుకుని వేధించింది. రెడ్‌బుక్ దౌర్జన్యాలు, వేధింపులు బయటపడకూడదనే పోలీస్ స్టేషన్లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయలేదు. ఇక సాంకేతిక మౌలిక సదుపాయల పేరుతో నిధులు పక్కదారి పట్టించారు. కన్సల్టెన్సీ పేరుతో అస్మదీయ కంపెనీకి రూ.10 కోట్ల కాంట్రాక్టును కట్టబెట్టింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పట్టించుకోలేదు. అందుకే కేంద్ర హోంశాఖ ఐసీటీ విభాగంలోనూ ఏపీ పోలీసులకు సున్నా మార్కులు ఇచ్చింది.

సమన్వయం శూన్యం

కేసుల సమగ్ర దర్యాప్తు, పౌరులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసు, ఫోరెన్సిక్, వైద్య –ఆరోగ్య, కోర్టులు, జైళ్ల శాఖలను సమన్వయపరుస్తూ ఒక గొడుగు కిందకు తేవాలి. దీనికి సంబంధించి కేంద్ర హోంశాఖ నిర్దేశించిన సమన్వయం విభాగంలో మొత్తం 10 పాయింట్లకు ఏపీ పోలీసు శాఖకు దక్కిన పాయింట్లు సున్నా. ఒక్క పాయింట్ కూడా దక్కించుకోలేకపోయింది. ఈ విభాగం కింద ఏదైనా కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన తరువాత అన్ని విభాగాలను సమన్వయం చేయాలి. ఎఫ్ఐఆర్ కాపీ, కేసు దర్యాప్తు వివరాలు, ఫోరెన్సిక్, వైద్యుల నివేదిక, విచారణ ప్రక్రియ, తీర్పు, నేరస్తుడిని జైలుకు తరలించడం, ఇతర వివరాలన్నీ కంప్యూటర్‌లో ఒక్క క్లిక్‌లో అందుబాటులో ఉండాలి. అందుకోసం ప్రతి కేసుకు ప్రత్యేకంగా నంబరు కేటాయించాలి. పోలీస్ స్టేషన్, ఫోరెన్సిక్ విభాగం, ప్రభుత్వ ఆసుపత్రి, కోర్టు, జైళ్ల శాఖలకు తక్షణం అందుబాటులో ఉంచాలి. తద్వారా అక్రమాలకు ఆస్కారం లేకుండా చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. కానీ ఈ విభాగం గురించి చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి నేతల అరాచకాలు, అక్రమాల కేసుల దర్యాప్తును పక్కదారి పట్టించడమే లక్ష్యంగా సమన్వయం లేకుండా చేస్తోంది. అన్ని విభాగాలను ఒకే ఛత్రం కిందకు తేవడం లేదు. అందుకే ఈ విభాగం పనితీరులో కేంద్ర హోంశాఖ ఏపీ పోలీసు శాఖకు సున్నా మార్కులు కేటాయించింది.

Nippon india Mutual Fund
Wealth sets you free

GOLD ETFs PURE, SECURE REGULATED.

Parameter	Digital Gold	Gold ETFs
Regulated by SEBI	✗	✓
Traded on Exchanges as a Security*	✗	✓
Investor Protection Mechanism**	✗	✓
Held in Demat	✗	✓
Mandated to disclose the holding / portfolio of the Fund	✗	✓

SEBI regulated Gold ETFs, the choice that scores on every count.

The market is full of "Digital Gold" products with varying levels of safety and transparency. If you want to opt for a gold investment product that is transparent and regulated, has investor protection mechanism and is backed by physical gold with 99.5% purity, then Gold ETF is the answer. It is a confident and efficient way to harness Gold's potential without the hassle of physical storage or purity concerns.

With Gold ETF, you invest **safely and efficiently**, letting your wealth shine without compromise.

mf.nipponindiaim.com/EdgeOfKnowledge

Contact your Mutual Fund Distributor or Investment Advisor I Give us a missed call on **8000112244**

An investor education and awareness initiative of Nippon India Mutual Fund

Helpful information for investors: All Mutual Fund investors have to go through a one-time KYC (Know Your Customer) process. Investors should deal only with registered mutual funds, to be verified on SEBI website under 'Intermediaries/Market Infrastructure Institutions'. For redressal of your complaints, you may please visit https://scores.sebi.gov.in. For more info on KYC, change in various details & redressal of complaints, visit mf.nipponindiaim.com/investoreducation/what-to-know-when-investing. *ETFs are exchange traded funds whereby investors can buy or sell Gold ETFs on the exchange during market hours. However, prices move as per market dynamics. **Investor Protection Mechanism under Securities market purview.

Mutual Fund investments are subject to market risks, read all scheme related documents carefully.

rediffusion.in

ఒకనికి అన్యాయము జరుగుతున్న సమయమున తప్ప,
నలుగురి మధ్య పరుష వ్యాఖ్యలు పలుకుట అల్లాకు అయిష్టము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 21 నవంబర్ 2025

మళ్లీ మొదటికి!

రాష్ట్ర ప్రభుత్వాలకూ, గవర్నర్లకూ తలెత్తే వివాదాల విషయంలో చివరకు కేంద్ర ప్రభుత్వానిదే పైచేయి అయింది. శాసనసభలు ఆమోదించాక రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లుల్ని నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుకోవటాన్ని తప్పుబడుతూ మొన్న ఏప్రిల్‌లో తమ ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పును గురువారం సర్వోన్నత న్యాయస్థానపు రాజ్యాంగ ధర్మాసనం తప్పుబట్టింది. రాష్ట్రపతికీ, గవర్నర్లకూ గడువు విధించటం చెల్లదని అభిప్రాయపడింది. ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును నేరుగా ప్రస్తావించకుండా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నల రూపంలో సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని కోరిన మీదట రాజ్యాంగ ధర్మాసనం తన ఉద్దేశాన్ని తెలియజేసింది. రాజ్యాంగ విధులు నిర్వర్తించే సందర్భంగా ఆచరణలో తలెత్తే సమస్యల విషయంలో ఏ పక్షానికీ గెలుపోటములుండవు. మూడు వ్యవస్థల్లో ఏ ఒక్కటి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన ఆచరణ కనబరచకపోయినా అంతిమంగా నష్టపోయేది ప్రజలే. అలా చూస్తే రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయం కొంత నిరాశ కలిగిస్తుంది.

గవర్నర్లకూ, ప్రభుత్వాలకూ తలెత్తే వివాదాలు జటిలమైనవి. ఎన్నికల సమయంలో పలు వాగ్దానాలు చేసి అధికారంలోకొచ్చిన పక్షం తన వాగ్దానాలు నెరవేర్చటం కోసం లేదా ప్రజల ప్రయోజనాల కోసం బిల్లులు తెస్తాయి. చట్టసభల్లో అవి ఆమోదం పొందుతాయి. తీరా గవర్నర్ల దగ్గర నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. మరి ప్రజలిచ్చిన రాజకీయాధికారం ఏమై పోవాలి? కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ లేదా కూటమి పాలిస్తుంటే ఇలాంటి సమస్య తలెత్తదు. భిన్నమైన పరిస్థితులున్నప్పుడే ఇబ్బందులేర్పడుతున్నాయి. కేంద్రంలో యూపీఏ ఉన్నా, ఎన్డీయే ఉన్నా ఇదే ధోరణి. రాజ్యాంగ ధర్మాసనం కూడా ఈ సంగతిని గమనించింది. బిల్లుల్ని పరిశీలించటంలో రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే వ్యవధికి ఒక స్థాయి 'స్థితిస్థాపకత' ఉంటుందని అంగీకరిస్తూనే దీర్ఘకాలం బిల్లును పెండింగ్‌లో పెట్టడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని చెప్పడం కొంతవరకూ రాష్ట్రాలకు ఊరట.

రాష్ట్రపతి సంధించిన ప్రశ్నలపై అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాం తప్ప ద్విసభ్య ధర్మాసనం లోగడ వెలువరించిన తీర్పుతో దీనికి సంబంధం లేదని రాజ్యాంగ ధర్మాసనం చెప్పడం గమనార్హం. గవర్నర్లు ఏళ్ల తరబడి బిల్లుల్ని పెండింగ్‌లో పెట్టి ప్రజల ద్వారా ఎన్నికైన చట్టసభల్ని నిరర్థకంగా మార్చడం సరికాదని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో గవర్నర్లకు హితవు చెప్పింది. కానీ మారిందేమీ లేదు. అందుకే కావొచ్చు... ద్విసభ్య ధర్మాసనం రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద తనకు దఖలు పడిన అధికారాలను వినియోగించుకుంటూ బిల్లు ఆమోదానికి గవర్నర్లకూ, రాష్ట్రపతికీ మూడు నెలల గడువు విధించి, ఆ తర్వాత ఆమోదం పొందినట్టే భావించాలన్నది. ఇది సరి కాదని, ఇలా చేయటమంటే ఒక రాజ్యాంగ వ్యవస్థ మరో రాజ్యాంగ వ్యవస్థ అధికారాలను చేతుల్లోకి తీసుకోవటమే అవుతుందని ధర్మాసనం తెలిపింది. అదే సమయంలో గవర్నర్లు బిల్లులపై ఏదో ఒకటి చెప్పటానికి 'హేతుబద్ధమైన వ్యవధి'కి మించి తీసుకుంటే మాత్రం సమీక్షించే అధికారం ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం చెప్పటం రాష్ట్రాలకు కొంత వరకూ ఉపశమనం. రాష్ట్రపతికిచ్చిన ప్రత్యుత్తరంలో 'హేతుబద్ధమైన వ్యవధి' అనడం తప్ప, దాన్ని ఎలా నిర్ధారించాలన్నది చెప్పలేదు. అదే జరిగుంటే గవర్నర్ల పెత్తనానికి కాస్తయినా అడ్డుకట్ట పడేది. రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయంలో మౌనంగా ఉండిపోవటం వల్ల ఎప్పటిలాగే బిల్లు ఆగిపోయినప్పుడల్లా న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదు.

రాజ్యాంగ అధికరణం 200 ప్రకారం తన ఆమోదం కోసం వచ్చిన బిల్లుపై గవర్నర్ ముందు మూడు ప్రత్యామ్నాయాలుంటాయి. ఆమోదించటం, రాష్ట్రపతి పరిశీలనకు పంపటం, వెనక్కి తిప్పిపంపటం. ఏ ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేసుకోవాలన్నది గవర్నర్‌కుండే విచక్షణాధికారం. కానీ ఇదంతా సవ్యంగా సాగకపోవటమే సమస్య. గవర్నర్ల నియామకాలు రాజకీయపరమైనవి అయినప్పుడు వారి నిర్ణయాలపైనా ఆ ప్రభావం పడుతుంది. చట్టం చేయటమే ఇందుకు పరిష్కారమని రాజ్యాంగ ధర్మాసనం అన్నది. కానీ అది జరిగే పనేనా?!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.12.47 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** అనూరాధ ప.1.02 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.7.13 నుండి 8.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.07 వరకు తదుపరి ప.12.06 నుండి 12.51 వరకు, **అమృత ఘడియలు:** తె.5.47 నుండి 7.34 వరకు (తెల్లవారితే శనివారం), **పోలి స్వర్గం.**

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

వ్యాయామం

"హాయ్! నేను 86 ఏళ్ల అమ్మాయిని. పులాతేజ్ (వ్యాయామం), యాస్మిన్ (ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా) నేనిలా రాయిలా ఉండటానికి కారణం. ఆరోగ్యాన్ని, చురుకుదనాన్ని కాపాడుకోవటానికి వ్యాయామాన్ని మించింది లేదు. అలాగే, సంతోషాన్ని మించింది కూడా!

– హెలెన్, భారతీయ నటి – నర్తకి

గణిత శాస్త్రం

అసాధ్యం అనిపించే లెక్కల్ని చేయటానికి భయపడకండి. దృష్టిని కేంద్రీకరించండి. మేథ్స్ కెరీర్... సవాళ్లు, ప్రతిఫలాలతో నిండి ఉంటుంది. గణితశాస్త్రం పట్ల మక్కువ కలిగి ఉన్న విద్యార్థుల ఆలోచనలకు అపరిమితమైన అవకాశాలు ఉంటాయి.

– రామన్ పరిమళ, గణిత శాస్త్రవేత్త

మూడు మాటలు

మీ కష్టాలను పక్షి ఈకలా తేలిపోనివ్వండి. మీ ప్రేమను సముద్రమంత లోతుగా ఉండనివ్వండి. మీ విజయాన్ని వేయి సూర్యుళ్లలా ప్రసరించనివ్వండి. ఈ మూడు మాటలనూ శ్వాసలా మీ హృదయం లోపలికి తీసుకోండి. ఇక మీ చుట్టూ ఉండేదంతా వెలుగే!

– దేవయానీ ఛటర్జీ, ఇండో– బ్రిటిష్ కవయిత్రి

కష్టపడాల్సిందే!

ప్రతిభ ఒక్కటే సరిపోదు. మనసు పెట్టాలి. దీక్ష పట్టాలి. విజయం ఏదైనా ఎంతో కష్టపడితే తప్ప మనల్ని వరించదు. కీర్తిని గురి చేసుకుని ఆడితే అస్సలు మనం గెలవలేం. ఆటలో మన గురి ఏపాటిదో చూపించటానికి ఆడాలి. అంతిమ విజయానికి అదొకటే దారి.

– చక్రవోలు స్వురో, ఆర్చర్

బరువే తేడా!

మనమందరం రెండు బాధల్లో ఏదో ఒక బాధ పడక తప్పదు. ఒకటి: క్రమశిక్షణతో ఉండవలసిన బాధ. రెండు: క్రమశిక్షణతో లేకపోవటం వల్ల వచ్చే బాధ. తేడా ఏంటంటే, మొదటి బాధ ఔన్సుల బరువు ఉంటుంది. రెండో బాధ టన్నుల బరువు ఉంటుంది.

– అజయ్ మల్హోత్రా, మాజీ దౌత్యాధికారి

పర్ఫెక్షన్

పనిలో 'పర్ఫెక్షన్' కోసం చూస్తూ కూర్చుంటే, ఎప్పటికీ తెల్లారదు. ఈ లోపు మీ పోటీదారులు మిమ్మల్ని దాటి వెళ్లిపోతారు. వారి పర్ఫెక్షన్ గురించి మార్కెట్‌లో ఎవరూ ఆలోచించరు. ఆ తర్వాత మీరెంత పర్ఫెక్షన్‌తో వచ్చినా మార్కెట్‌లో మీ గురించి ఆలోచించే వారు ఉండరు.

– గ్రాంట్ లీ, 'గామా' సీఈవో

నిఠారీ కేసులో బాధితులకే శిక్ష!

అభిప్రాయం

ఉత్కర్ష్ ఆనంద్

యావత్ దేశాన్నీ దిగ్భ్రాంతికి గురి చేస్తూ నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నిఠారీ గ్రామంలో డ్రైనేజీలో మానవ అవశేషాలు బయటపడి దాదాపు ఇరవై ఏళ్లు గడచిన తర్వాత కూడా, ఏ ఒక్కరూ దోషిగా నిర్ధారణ కాలేదు. 16 మంది మహిళలు, పిల్లల 'నిఠారీ' హత్య కేసులో నిందితుడిగా ఉన్న చిట్టచివరి వ్యక్తి సురేంద్ర కోలీకి విముక్తి కల్పిస్తూ సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు 'నేర న్యాయ' వ్యవస్థలోని దారుణ వైఫల్యాలను బట్టబయలు చేసింది. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు మిగిలింది సమాధానం లేని ప్రశ్నలే.

సురేంద్ర కోలీ

◆ ఇరవై ఏళ్ల నాటి నిఠారీ వరుస హత్యల కేసులో నిర్దోషిత్వాల తీర్పు భారత నేర దర్యాప్తు వ్యవస్థలోని వైఫల్యాలను బట్టబయలు చేసింది. 16 మంది మహిళలు, పిల్లల హత్య కేసులో నిందితుడిగా ఉన్న చిట్టచివరి వ్యక్తి సురేంద్ర కోలీకి విముక్తి కల్పిస్తూ సుప్రీంకోర్టు నవంబర్ 11న చెప్పిన తీర్పుతో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు మిగిలింది సమాధానం లేని ప్రశ్నలే!

కీలక ఆధారాలు లేకపోవడం వల్లే...

2006 చివర్లో నిఠారీ గ్రామ సమీపాన 31వ సెక్టార్‌లో మురుగు కాల్వల పూడిక తీస్తుంటే దిగ్భ్రాంతికరమైన దారుణాలు వెలుగు చూశాయి. అంతకంటే ముందు, డి–5, డి–6 ఇళ్ల మధ్య ఒక చెయ్యి కనబడింది. క్రికెట్ ఆడుతున్న కుర్రాడు దాన్ని చూశాడు. అదే ఏడాది డిసెంబర్‌లో ఈ బంగ్లాల వెలుపల ఉన్న డ్రెయిన్లో మట్టి తొలగించడంతో అక్కడ అనేక పుర్రెలు, ఎముకలు, పీలికలైన పిల్లల దుస్తులు, చిన్ని చిన్ని చెప్పులు దొరికాయి.

డి–5 ఇంట్లో పనిచేసే సురేంద్ర కోలీ అనే వ్యక్తి, ఇంటి యజమాని, వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంఢేర్ ఈ మారణకాండకు బాధ్యులని పోలీసులు అనుమానించారు. పోలీసుల కథనం ప్రకారం – పిల్లలను, ఆడవారిని కోలీ ప్రలోభపెట్టి ఇంటికి రప్పించేవాడు. తర్వాత వారిని హత్య చేసేవాడు. కొన్నిసార్లు హతుల శరీర భాగాలను తిన్నాడు కూడా! ఈ అకృత్యాల్లో పంఢేర్ భాగస్వామి. భయానకమైన ఈ హత్యల కేసులో స్థానిక పోలీసుల విచారణ తీవ్ర విమర్శలకు దారి తీసింది. తమ దర్యాప్తులో భాగంగా ఇంటి మేడ పై భాగంలో నీళ్ల ట్యాంకు కింద దాచిన ఓ కత్తిని పోలీసులు 'స్వాధీనం' చేసుకున్నారు. ఇది, ఇంకా అనేక వస్తువులు వారికి దొరికాయి. ఇవే వారి దర్యాప్తులో 'కీలక ఆధారాలు'. వీటి ఆధారంగా వారు రూపొందించిన కథనాలను కోర్టులు విశ్వసించలేదు.

దీంతో 2007 జనవరిలో దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించారు. సీబీఐ సైతం స్థానిక పోలీసులు చేసిన తప్పిదాలనే పునరావృతం చేసింది. కొన్ని వారాల తరబడి కస్టడీలో ఉంచి రికార్డు చేసిన కోలీ నేరాంగీకార పత్రం మీదే సీబీఐ అధికారులు ఆధారపడ్డారు. వారు రికవర్ చేసిన ఆధారాలు నమ్మదగినవిగా లేవు. కోలీ, పంఢేర్ ప్రమేయాన్ని నిరూపించగల సరైన ఫోరెన్సిక్ లింకులను కూడా సంపాదించలేక పోయారు. స్థానిక పోలీసుల మీద ఆధారపడకుండా మళ్లీ మొదటి నుంచి సొంత దర్యాప్తు చేయడంలో సీబీఐ విఫలమైంది. నేరాంగీకారాలు, రికవరీలు, ఆధారాలను అటూయిటూ చేసి... మోపిన 13 కేసుల్లోనూ వాటినే కోర్టుల ముందుంచారు. కాబట్టే, పై కోర్టులు అన్నీ ఒకదాని తర్వాత మరొకటి వాటన్నిటినీ కొట్టేశాయి. నేరాంగీకార పత్రాలు, నేరాలకు సంబంధించిన రికవరీలు అన్నీ అంతకు ముందు కొట్టేసిన ఇతర కేసుల్లో ఉన్నట్లే ఏ మాత్రం తేడా లేకుండా ఈ కేసులోనూ ఉన్నాయని సుప్రీంకోర్టు తాజాగా నవంబర్ 11 నాటి తీర్పులో గుర్తించింది.

మరి నేరస్థులు ఎవరు?

తప్పిపోయిన పిల్లల తల్లిదండ్రుల విషయానికి వస్తే, వారి పాత గాయాలు ఈ తీర్పుతో మళ్లీ రేగాయి. 2005లో తమ పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది ఈ బాధితులే! డి–5 ఇంటి ముందు తొలుతగా నిరసన చేసింది వీరే. న్యాయస్థానంలో చివరి దాకా పోరాడింది కూడా వీరే. చివరకు కోర్టు తీర్పుతో తమ పిల్లలను ఎవరూ చంపలేదన్న 'న్యాయపరమైన వాస్తవం' వారిని వెక్కిరిస్తోంది.

ఏళ్ల తరబడి సుదీర్ఘంగా దర్యాప్తు జరిగినప్పటికీ, నిజమైన ద్రోహులెవరో నిరూపణ కాకపోవడం పట్ల న్యాయస్థానం తీవ్ర విచారం వ్యక్తం చేసి వారి బాధను గుర్తించింది. నిర్లక్ష్యం వహించి, అసాధారణ జాప్యం చేసి నిజనిర్ధారణ ప్రక్రియ పట్ల విశ్వాసం సన్నగిల్లేలా చేశాయంటూ దర్యాప్తు సంస్థలను తప్పు పట్టింది. అవయవాలతో వ్యాపారం చేసే ముఠాల ప్రమేయం వంటి కొత్త కోణాల నుంచి దర్యాప్తు చేపట్టలేక పోయాయని నిందించింది.

నిఠారీ కేసు నిర్దోషిత్వాల తీర్పులు భారత నేర దర్యాప్తు వ్యవస్థకు సోకిన రోగం లక్షణాలను కళ్లకు కట్టాయి. ప్రతి స్థాయిలోనూ వ్యవస్థ విఫలమైంది. స్థానిక పోలీసులు క్రైమ్ సీన్‌ను పరిరక్షించలేకపోయారు. సరైన ఫోరెన్సిక్ సాక్ష్యాలను సేకరించలేకపోయారు. ఈ లోపాలను చక్కదిద్దడంలో సీబీఐ విఫలమైంది. కొత్త కోణాలను గుర్తించలేక పోయింది. న్యాయ పరీక్షకు నిలబడేలా పకడ్బందీ వాదనలు చేయడంలో ప్రాసిక్యూటర్లు విఫలమయ్యారు. బాధితుల ఘోర విషాదాన్ని వ్యవస్థల ప్రహసనంగా మార్చి, ప్రభుత్వం వారికి తీవ్రమైన నిరాశ కలిగించింది.

సుప్రీం కోర్టు తాజా తీర్పుతో కోలీ జైలు నుంచి బయటకు వచ్చాడు. పంఢేర్ ఇప్పటికే నేర విముక్తుడు. న్యాయస్థానం చట్టాలకు లోబడి వ్యవహరించింది. తిరుగులేని రుజువులు ఉంటే తప్ప కోర్టు శిక్ష విధించలేదు. తమ పిల్లల మసకబారిన పాత ఫోటోలను పట్టుకుని ఆ తల్లిదండ్రులు క్షోభపడుతూ ఉంటే, న్యాయం అమూర్తంగా మారిపోయింది. నిఠారీలో చట్టం తన చివరి మాటను చెప్పేసింది. ఇక మిగిలింది నిశ్శబ్దమే! అది చెవులు పగిలిపోయేంత కఠోరంగా ఉంది.

వ్యాసకర్త లీగల్ అంశాల జర్నలిస్ట్
('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

'చిప్'లు చేస్తున్నాం... చైనావే కొంటున్నాం!

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్: ఏషియన్ న్యూస్ ఇంటర్నేషనల్ (ఎ.ఎన్.ఐ.)

అతిథి: అజయ్ చౌధరీ, టెక్ విజనరీ, హెచ్.సి.ఎల్. కో–ఫౌండర్

హోస్ట్: స్మితా ప్రకాశ్, ఎ.ఎన్.ఐ. ఎడిటర్

సంభాషణలో **అజయ్ చౌధరీ** వెల్లడించిన ముఖ్యాంశాలు:

చైనాలో తయారైన 'సెక్యూరిటీ–చిప్'లకు... ఇండియా డేటాను నేరుగా చైనాకు పంపే 'వెనుక తలుపులు' ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. ఇండియాలోని ప్రతి మూలలో జరిగే ప్రతిదీ తెలుసుకునే పనిలో ఉన్న ఆ దేశం నుండి వచ్చే హార్డ్‌వేర్‌పై ఆధారపడటం ప్రమాదకరం.

పెరటి 'చిప్'లు పనికిరావా?

''ప్రపంచం కోసం మన దేశం చిప్‌లను తయారు చేస్తుంది. కానీ మనం వాటిని ఉపయోగించం! నిజానికి ఇండియా ప్రపంచవ్యాప్తంగా రెండవ అతిపెద్ద చిప్ డిజైనర్ హబ్ కూడా! ఎన్విడియా, ఇంటెల్, మీడియా టెక్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలకు ఇండియాలో చిప్ డిజైన్ కేంద్రాలు ఉన్నాయి. అయితే ఈ అద్భుతమైన చిప్ డిజైన్‌లన్నీ ప్రపంచం కోసం! ప్రపంచ దేశాలకు ఎగుమతి కోసం! మన సొంత ఉపయోగం విషయానికి వస్తే, మనం దాదాపుగా 100 శాతం వరకు చిప్‌లను దిగుమతి చేసుకుంటున్నాం. ఇదొక వైరుధ్యం. చిప్‌ల వృద్ధిలో సాంకేతికతల్ని రూపొందించే మెదళ్లు మన దగ్గర పుష్కలంగా ఉన్నాయి. కానీ మనం సొంత అవసరాల కోసం ఆ మెదళ్లను ఉపయోగించటం లేదు మనం!

ఒప్పందం వల్ల దెబ్బ తిన్నాం!

''వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యు.టి.ఒ.) ఒప్పందం మన ఎలక్ట్రానిక్స్ పరిశ్రమను చావు దెబ్బ తీసింది. 1999లో డబ్ల్యు.టి.ఒ. ఐటీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. 2005 నుండి ఇండియా ఆ ఒప్పందాన్ని అమలు చేయడం ప్రారంభించింది. ఒప్పందం మన మార్కెట్‌కు బార్లా తలుపులు తెరిచింది కానీ, మన సొంత ఎలక్ట్రానిక్స్ తయారీని దుర్బలం చేసింది. అదే సమయంలో చైనా, బ్రెజిల్ వంటి దేశాలు తమ పరిశ్రమలను రక్షించుకుని, వాటిని వృద్ధి చేసుకున్నాయి. అంటే, పాశ్చాత్య దేశాలు మనల్ని ఈ ఒప్పందం ఉచ్చులోకి లాగి, అవి లబ్ధి పొందాయి.

స్మితా ప్రకాశ్



అజయ్ చౌధరీ

పేరుకే అన్నట్లుంది ప్రావీణ్యం!

''ఎంత సేపటికీ మనం విడి పరికరాలను కలపటంతోనే సరిపెట్టుకుంటున్నాం. 'మేక్ ఇన్ ఇండియా' అంటే కేవలం నట్లు, బోల్ట్‌లు, స్క్రూలు బిగించటమేనా? డిజైన్ చేయటం కాదా! అదెందుకు అర్థం చేసుకోలేకపోతున్నాం? కేవలం భాగాలను కలిపే నైపుణ్యం మనల్ని ఎక్కడికీ తీసుకెళ్లదు. మనకు ఎలాంటి గుర్తింపునూ తీసుకురాదు. మనకు ఏ డిమాండునూ కల్పించదు. మేక్ ఇన్ ఇండియాకు ప్రస్తుతం మనం జోడిస్తున్న విలువ సున్నా. దిగుమతి చేసుకున్న భాగాలను కూర్చటం మాత్రమే చేస్తున్నాం. అలా కాకుండా మనమే ఇక్కడ డిజైన్‌కు, తయారీకి మారాలి. అప్పుడే మనం సెమీకండక్టర్లు, డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాల వంటి తుది ఉత్పత్తులను సృష్టించగలం.

చైనా మీద అనుమానాలు

''చైనీస్ చిప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మన జాతీయ భద్రతకు ప్రమాదం. మనం ఉపయోగించే ప్రభుత్వ హాజరు యంత్రాలు (చైనా నుంచి దిగుమతి చేసుకున్నవి) చైనాకు మన డేటాను పంపుతున్నట్లు మేము కనిపెట్టాం. దేశ భద్రతకే ముప్పు తెచ్చిపెట్టే సమస్య ఇది. ప్రభుత్వ పరికరాలు మాత్రమే కాదు, మన స్మార్ట్‌ఫోన్‌లలో ఎక్కువ భాగం– ఏటా అమ్ముడవుతున్న 15 కోట్ల ఫోన్‌లలో దాదాపు 60 శాతం – చైనా కంపెనీలవే! భారతదేశంలోని ప్రతి మూలలో జరిగే ప్రతిదీ తెలుసుకునే పనిలో ఉన్న ఆ దేశం నుండి వచ్చే హార్డ్ వేర్‌పై ఆధారపడటం దేశ సమగ్రతకే ప్రమాదం.

'సేవలు' తగ్గి, ఉత్పత్తి పెరగాలి!

''భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా సేవా రంగాలపై ఆధారపడి ఉంది, ఇది దాదాపు 60 శాతం. మనం స్వయం సమృద్ధిగా ఉండాలనుకుంటే, ఉత్పత్తి ఆధారిత దేశంగా మనం రూపాంతరం చెందాలి. మొదటిసారిగా, ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు 50 సంవత్సరాల పాటు వడ్డీ లేని 'పరిశోధన–అభివృద్ధి' నిధిగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. అది చాలా పెద్ద మొత్తం. మనం చేయవలసింది ఏమిటంటే, సాంకేతిక ఉత్పత్తుల కోసం ఆర్డర్‌లను పొందటం. వాటి తయారీకి భారతీయ కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వడం. బలమైన, స్వదేశీ సాంకేతిక పరిశ్రమను నిర్మించడానికి ఇది చాలా అవసరం''.

❑ ఎడిటోరియల్ టీమ్

తొలితరం సంపాదకుడు

స్వతంత్ర భారతదేశ తొలితరం తెలుగు పత్రికా సంపాదకులలో బుద్ధవరపు వేంకటరత్నం (1925 నవంబర్ 17 – 2025 నవంబర్ 9) ఒకరు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, నాయకంపల్లిలో పుట్టారు. 1944లోనే ఆయన ప్రచారక్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నారు. 1948 చివరలో ఈయన సంపాదకులుగా 'జాగృతి' తొలి సంచిక వెలువడగానే నిషేధానికి గురైంది. గాంధీజీ హత్య నేపథ్యంలో ఆర్ఎస్ఎస్‌ను నిషేధించిన క్రమంలోనే ఆ సంస్థ ఆశయాల కోసం ఏర్పడిన 'జాగృతి'ని నిషేధించారు. అయితే నాటి కృష్ణా జిల్లా కలెక్టర్ క్రోంబితో వాదించి పత్రికను పునః ప్రారంభించడానికి అనుమతి తెచ్చుకున్నారాయన. విజయవాడ కేంద్రంగా పత్రిక వెలువడింది.

బుద్ధవరపు వేంకటరత్నం

గాంధీజీ హత్య తరువాత ఆర్ఎస్ఎస్ మీద తీవ్ర దుమారం మొదలయింది. అయితే అవన్నీ తరువాత దుష్ప్రచారంలో భాగమని తేలింది. కానీ ఇంతలోనే ఎంతో నష్టం జరిగింది. ఈ దుష్ప్రచారం నిగ్గు తేల్చడానికి ప్రాంతీయ భాషలలో పత్రికలు ప్రారంభించాలని ఆర్ఎస్ఎస్ రెండో సర్‌సంఘ్ చాలక్ గురూజీ (గోల్వాల్కర్) ఆశయం మేరకు కొన్ని పత్రికలు ప్రారంభమయ్యాయి. 'రాష్ట్రధర్మ' పత్రికకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ, 'పాంచజన్య' పత్రికకు అటల్ బిహారీ వాజ్‌పేయి, తెలుగు పత్రికకు బుద్ధవరపు వేంకటరత్నం నియమితులయ్యారు. 1948 నుంచి 1957 వరకు ఆయనే 'జాగృతి' సంపాదకులు.

వేంకటరత్నం కవి, కథకుడు, నవలా రచయిత. పత్రికా రచన అప్పుడు కొత్తగా చేపట్టినదే అయినా, గాంధీజీ హత్యానంతర పరిణామాలు, భారత్–పాక్ తొలి యుద్ధం, కాందిశీకుల సమస్యల గురించి ఆయన ఇచ్చిన వివరాలు, విశ్లేషణలు ఎంతో లోతుగా కనిపిస్తాయి. ప్రచ్ఛన్నయుద్ధం పదునెక్కుతున్న కాలం కూడా అదే. కమ్యూనిజం వ్యాప్తి పరిణామాలు అప్పుడు ప్రపంచం ఎక్కువగా చూసింది. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చాలామంది ప్రముఖుల వ్యాసాల అనువాదాలు కూడా ఆనాటి 'జాగృతి'లో దర్శనమిచ్చేవి.

1960వ దశకం నుంచి కరణీకం (యెర్రమిల్లి, తూర్పుగోదావరి జిల్లా) ఆరంభించి, 80వ దశకంలో ఆ వ్యవస్థ రద్దయిన తరువాత హైదరాబాద్‌లో మళ్లీ పత్రికా రచయితగా జీవితం ఆరంభించారు వేంకటరత్నం. ఎందరో ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశారు. 2001లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఒక కాలు తొలగించారు. నాలుక కూడా తెగింది. దాదాపు రెండు దశాబ్దాలు మంచం మీదే ఉన్నా, ఏనాడూ నిరాశకు లోనవ్వలేదు. ఎవరు వచ్చినా జ్ఞాపకాలు పంచేవారు.

– పి. వేణుగోపాలరెడ్డి I ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ – 'జాగృతి' పూర్వ సంపాదకుడు (నేడు హైదరాబాద్ 'జాగృతి' కార్యాలయంలో సంస్మరణ సభ)

డేటా పాయింట్

'అరుదు' అంటే చైనా!

ప్రపంచంలో 2024 నాటికి 'రేర్ ఎర్త్స్'(అరుదైన ఖనిజాలు) ఉత్పత్తిలో చైనాదే అగ్రస్థానం. చైనా దరిదాపుల్లో అమెరికా కూడా లేకపోవడం గమనార్హం.



సమాంతర వేదిక

తెలంగాణలో అర్థవంతమైన సమాంతర సినిమాల దీపధారి 'కరీంనగర్ ఫిలిం సొసైటీ' (కఫిసొ). ఈ సొసైటీ సమస్త కళల సాంస్కృతిక వేదికగా నిర్మించుకున్న 'ఫిలిం భవన్'కు నవంబర్ 21 నాటికి ఇరవై ఏళ్ళు పూర్తి అవుతున్నాయి. దక్షిణ భారత దేశంలో బెంగళూరు 'సుచిత్ర ఫిలిం సొసైటీ' తర్వాత ఏర్పాటైన రెండవ సమాంతర సినిమా వేదిక ఈ 'ఫిలిం భవన్'. 200 సీట్ల పూర్తి స్థాయి ఆడిటోరియం. వ్యాపార ప్రధాన స్రవంతి సినిమా అప్రతిహతంగా సాగుతున్న సమయంలో సమాంతర సినిమా కోసం కరీంనగర్ లాంటి ఒక పట్టణంలో 1978లోనే ఫిలిం సొసైటీ ఏర్పడటమే ఒక చరిత్ర. దాని ప్రభావంతోనే 80వ దశకంలో వేములవాడ, సిరిసిల్లా లాంటి ఎనిమిది పట్టణాల్లో ఫిలిం సొసైటీలు పనిచేశాయి. వాటిల్లో ఆదివారాల్లో ఉదయం 8 గంటలకు సత్యజిత్ రే, మృణాల్ సేన్, అదూర్ గోపాలకృష్ణన్ లాంటి వాళ్ళ సినిమాలే కాకుండా అంతర్జాతీయ కళాత్మక చిత్రాల ప్రదర్శన జరిగేది.

కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వారి సహాయ సహకారాలు, స్థానికుల అండదండలతో 2005 నవంబర్ 21 నాటికి ఫిలిం భవన్ సిద్ధమయింది. హాలును కేవలం సినిమాలకే కాకుండా అన్ని కళారూపాలకూ వేదికగా చేయాలనీ, సామాజిక కార్యక్రమాలకు స్థానం కల్పించాలనీ నిర్ణయం జరిగింది. పలు సంవత్సరాలపాటు జాతీయ స్థాయిలో షార్ట్– డాక్యుమెంటరీ ఫిలిం ఫెస్టివల్స్ నిర్వహణ జరిగింది. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక 'పాలపిట్ట' పేర ఉత్తమంగా ఎంపికయిన సినిమాలకు అవార్డుల ప్రదానం జరిగింది. అనేక ఫిలిం వర్క్ షాప్స్ కూడా జరిగాయి. అంతేకాదు, జాతీయ స్థాయిలో ఫిలిం సొసైటీ కార్యకర్తల సమావేశాలూ, శిక్షణ తరగతులూ జరిగాయి. పలు కాలేజీల్లో 'కంపాస్ ఫిలిం క్లబ్స్' ఏర్పాటు చేశారు. అట్లా మొత్తంగా 'ఫిలిం భవన్' సాహితీ సాంస్కృతిక వేదికగా నిలబడింది. ఈ కృషిలో ఈ రచయితా భాగమైనందుకు సంతోషిస్తున్నాడు.

– వారాల ఆనంద్ I సాహిత్య అకాడెమీ అవార్డ్ గ్రహీత (కరీంనగర్ ఫిలిం సొసైటీ 'ఫిలిం భవన్'కు నేటికి 20 ఏళ్ళు)

క్లుప్తంగా...

ఉత్పత్తితో జీతాలను ముడిపెట్టడం సరికాదు

విశాఖ ఉక్కులో ఆందోళన

బీసీ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికుల జీతాలను ఉత్పత్తితో ముడిపెట్టడం సరికాదని ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. విశాఖ జిల్లా, పెదగంట్యాడ మండలంలోని బీసీ గేట్ వద్ద గురువారం ఉదయం ఆందోళన చేశారు. ఉక్కు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. కార్మికుల జీతాలను లక్ష్యానికి ముడిపెడుతూ ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, పీవీ రమణమూర్తి, జె.అయోధ్యరామ్, డీవీ రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులను తప్పుదోవ పట్టించే సంస్థలకు విరాళాలు ఇవ్వొద్దు

భక్తులకు టీటీడీ చైర్మన్ విజ్ఞప్తి

తిరుమల: భక్తులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న సంస్థలకు విరాళాలు ఇవ్వొద్దని శ్రీవారి భక్తులకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. Heritage Foundation, savetemples. org వంటి వెబ్‌సైట్ల పేరిట కొందరు వ్యక్తులు తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు నవంబర్ 29న ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మోసపూరిత చర్యలతో విరాళాలు సేకరించేందుకు భక్తులను తప్పుదారి పట్టిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విధమైన అనుమానాస్పద సంస్థలకు విరాళాలు ఇవ్వకుండా, వారి వలలో పడకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మృతుడు జోగారావు

టెక్కలి రూరల్: అతిగా మద్యం తాగి శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం ఉదయం పాత నౌపడ గ్రామానికి చెందిన సాన జోగారావు(38) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మృతుడు గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొద్ది నెలలుగా భిక్షమెత్తుకుంటూ మద్యానికి అలవాటు పడ్డాడు. గురువారం ఉదయం స్థానిక షాపుల వద్ద మద్యం అతిగా తాగి, తిరుగుతూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. స్థానికులు ఎంత లేపినప్పటికీ చలనం లేకపోవడంతో మృతి చెందినట్లు గుర్తించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

వైఎస్సార్‌సీపీ రేపల్లె ఇన్‌చార్జిపై అక్రమ కేసులు

రేపల్లె: కూటమి ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలను ప్రజాక్షేత్రంలో నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ రేపల్లె ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరు గణేష్‌పై బుధవారం రాత్రి చెరుకుపల్లి పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారు. ఐదు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు చెరుకుపల్లి ఎస్‌ఐ అనిల్‌కుమార్ నోటీసులు అందజేశారు. జనజీవనానికి ఆటంకం కలిగించటంతోపాటు ట్రాఫిక్‌కు అవరోధం కలిగేలా ఇటీవల ర్యాలీలు నిర్వహించినందుకు కేసులు పెట్టినట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిమటా బాలాజీకి ఇటీవల పార్టీ పదవి వచ్చిన సందర్భంగా రేపల్లె నుంచి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. దీంతో చిమటా బాలాజీపైనా చెరుకుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులపై ఈవూరు గణేష్ స్పందించారు. ప్రభుత్వ ఉడత ఊపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

ఆర్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి అధిక ఖర్చు

ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ కూన రవికుమార్

ఎర్రగుంట్ల: డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లోని యూనిట్లకు బొగ్గు సరఫరా కోసం, విద్యుత్ ఉత్పత్తికి అధికంగా ఖర్చు అవుతోందని.. దీనిపై సమగ్ర విచారణ చేసి అసెంబ్లీకి నివేదిక అందజేస్తామని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ కూన రవికుమార్ చెప్పారు. కమిటీ సభ్యులు గురువారం వైఎస్సార్ జిల్లాలోని ఆర్టీపీపీని సందర్శించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ.. ఆర్టీపీపీకి ఒడిశాలోని తాల్చేర్, తెలంగాణలోని సింగరేణి నుంచి బొగ్గు, ముడి సరుకు సరఫరా కోసం అధికంగా ఖర్చు అవుతోందన్నారు. ఉత్పత్తి, మెయింటెన్స్ తదితరాల గురించి ఆర్టీపీపీ అధికారులు సరైన ఆధారాలు ఇవ్వలేదని చెప్పారు. ఫ్లైయాస్ బూడిద సుమారు కోటి యాభై లక్షల మెట్రిక్ టన్నుల మేర నిల్వ ఉందని తెలిపారు. దీనిని రోడ్లు, ఇతర వాటికి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆర్టీపీపీలోని అకౌంట్స్, తదితరాలను పూర్తిస్థాయిలో సమీక్షించి.. అసెంబ్లీకి నివేదిక ఇస్తామన్నారు.

గనిలో దోపిడీ 'గజనీ'

క్వార్జ్ గనుల్లో వాటాల కోసం కొత్త వేషాలు

- సైదాపురం మైనింగ్‌పై రాజకీయ మాఫియా దాడి
- సిండికేట్ వాటాలకు అదనంగా షాడో ఎమ్మెల్యే డిమాండ్
- టన్నుకు రూ.3 వేలివ్వాల్సిందేనని పట్టు
- గనుల యజమానులు వినకపోవడంతో రంగంలోకి ఎమ్మెల్యే
- తనిఖీల పేరుతో రంగంలోకి రెవెన్యూ అధికారులు

మైనింగ్ ప్రాంతంలో మందీమార్బలంతో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: సైదాపురం క్వార్ట్జ్ గనుల్లో కొత్త కలకలం కనిపిస్తోంది. ప్రభుత్వ ముఖ్య నేత కనుసన్నల్లో నడిచే మైనింగ్ సిండికేట్‌కు ఇచ్చే వాటాలకు అదనంగా తనకూ ముట్టజెప్పాలని ఓ ఎమ్మెల్యే హుంకరించడం దోపిడీ ఏ స్థాయికి చేరుకుందన్నదో తెలియజేస్తోంది. ఏడాదిన్నరగా అక్రమ మైనింగ్ జరుగుతుంటే... ఇప్పుడే గుర్తొచ్చినట్లు అధికారులను, మందీ మార్బలాన్ని వెంటేసుకుని సదరు ఎమ్మెల్యే తనిఖీలు జరిపిస్తుండడం చూసి అంతా విస్తుపోతున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం క్వార్జ్ గనుల్లో వాటాల కోసం ఇలా రాజకీయ మాఫియా దాడికి దిగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గనుల యజమానుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఇదంతా వాటాల కోసం కొత్త వేషాలు అంటూ అధికార పార్టీలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు సర్కారు వచ్చాక మైనింగ్ లీజుల కేటాయింపు నుంచి, వాటాల కోసం ఎవరికివారు రచ్చకెక్కారు. అనుమతులిచ్చిన ప్రభుత్వ పెద్దలు 8 నెలల్లోనే మళ్లీ వాటాల కోసం గనుల యజమానులను ముప్పుతిప్పలు పెడుతున్నారు.

ఒప్పందాలకు తలొగ్గడంతో అనుమతులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, గూడూరు, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాల్లో మైనింగ్‌లో 7 భూగర్భ, 140 ఓపెన్ కార్జ్ గనులు ఉన్నాయి. వీటిల్లో దొరికే మైకా క్వార్ట్జ్‌కు చైనాలో విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం రాగానే గనులను హస్తగతం చేసుకుని నెల్లూరు జిల్లాకు చెందిన ఎంపీ వేమిరెడ్డి, ఆర్‌వీఆర్ కంపెనీలకు కట్టబెట్టింది. ముఖ్య నేతకు నెలకు రూ.30 కోట్లు ఇస్తే ఒప్పందంతో మైనింగ్ ధారాదత్తం చేశారు. ఆ కంపెనీ సిండికేట్‌గా ఏర్పడి వారి కనుసన్నల్లోనే మైనింగ్ నడిపి వారు నిర్ణయించిన ధరకే ముడిసరుకు ఇవ్వాలని పట్టుబట్టారు. కొందరు గనుల యజమానులు ఒప్పుకోకపోవడంతో ఏడాది పాటు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ మైనింగ్ నిలిపివేశారు. కరెంట్ బిల్లులు కూడా కట్టుకోలేని పరిస్థితి రావడంతో వారు చివరకు సిండికేట్‌కు దాసోహమయ్యారు. అనుమతులు తీసుకుని సరుకు ఇస్తున్నారు. ఇదిలా ఉంటే నెల్లూరుకు చెందిన ఓ నేత అనధికారికంగా మైనింగ్ చేయడం గతంలో పెద్ద దుమారం రేపింది. గూడూరు, సైదాపురంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. దీనికి పాల్పడుతున్నవారు సిండికేట్‌లో ముఖ్యులు కావడంతో అడ్డు చెప్పేవారు లేకుండా పోయారు.

సైదాపురం సిండికేట్ ప్రభుత్వ ముఖ్యనేత కనుసన్నల్లో ఏర్పాటైంది. దీని ద్వారా కోట్లు డబ్బు వెళ్తోంది. ఎవరి వాటాలు వాళ్లకు సరఫరా అవుతున్నాయి. అయినా చాలదన్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఇలా అదనంగా వాటా డిమాండ్ చేయడం చూస్తుంటే వీళ్ల దోపిడీ ఏ స్థాయికి చేరుకుందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

మాకూ టన్నుకు రూ.3 వేలివ్వండి

టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే అక్రమ మైనింగ్‌దారుల నుంచి టన్నుకు రేటు పెట్టి వసూలు చేస్తున్నారు. అన్ని అనుమతులున్న గనుల యజమానుల మాత్రం ఎంతో కొంత ఇచ్చి సరిపెట్టారు. మైనింగ్ చేసి వచ్చే ముడిసరుకు సిండికేట్ నిర్ణయించిన రేటుకు ఇస్తున్నప్పుడు ఎమ్మెల్యేకు ఎందుకు ఇవ్వాలనేది యజమానుల వాదన. వెంకటగిరి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న వ్యక్తికి క్వార్జ్ గనుల యజమానుల తీరు నచ్చలేదు. స్థానిక ఎమ్మెల్యేను కాదని సిండికేట్‌కు ఎందుకివ్వాలని, తమకూ టన్నుకు రూ.3 వేలు ఎంతున లెక్క కట్టాలని షాడో ఎమ్మెల్యే ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీనికి వారు ససేమిరా అనడంతో ఆగ్రహం చెందిన షాడో ఎమ్మెల్యే అసలు ప్రజాప్రతినిధిని రంగంలోకి దింపారు. జిల్లా స్థాయి అధికారులతో రెండు రోజుల క్రితం సైదాపురంలో తనిఖీల పేరుతో ఎమ్మెల్యే రెండు గనుల్లో హడావుడి చేశారు. భూముల వివాదాలు తమ ముందు ఉంచాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేటాయింపుల్లో తప్పు చేశారంటూ నిందారోపణలు మొదలుపెట్టారు. 18 నెలల నుంచి అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోనివారు ఇప్పుడు తనిఖీల పేరుతో హడావిడి చేస్తుండడం చూసి అంతా విస్తుపోతున్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అస్వస్థత

- ఎనిమిదిమందికి వాంతులు, విరేచనాలు
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులు
- ఆహారం విషతుల్యం కావడమే కారణమని అనుమానం

ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ చిన్నారులు

పాములపాడు: నంద్యాల జిల్లా మిట్టకందాల గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్–3కు చెందిన ఎనిమిదిమంది చిన్నారులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నాలుగు, ఐదేళ్ల వయసున్న 12 మందికి ఉదయం కోడిగుడ్డు, సాయంత్రం పాలు ఇచ్చారు. ఇంటికి వెళ్లిన తరువాత ఎనిమిదిమందికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వారిని తల్లిదండ్రులు ఆత్మకూరు, నందికొట్కూరు ఆస్పత్రులకు తరలించారు. పిల్లల్లో చైతన్యకుమార్, అలేఖ్య, సంధ్య, వసుంధర ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలోను, రితిక, నిక్షిత్‌కుమార్, రిషి ప్రైవేట్ ఆస్పత్రిలోను, చార్లెస్ రాజు నందికొట్కూరు ప్రైవేటు ఆస్పత్రిలోను చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన అధికారులు గురువారం ఉదయం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్ అరుణ, సహాయకురాలు మంజుల నుంచి వివరాలు సేకరించారు. సెంటరులో మొత్తం 16 మంది చిన్నారులకుగాను బుధవారం 13 మంది హాజరయ్యారు. ఒకరు మధ్యలోనే ఇంటికి వెళ్లగా 12 మందికి ఆహారం అందించినట్లు వారు చెప్పారు. ఈ ఆహారం విషతుల్యం కావడం వల్లే వీరు అస్వస్థతకు గురైనట్లు అధికారులు, వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఐసీడీఎస్, వైద్యశాఖ అధికారులు చిన్నారులు చికిత్స పొందుతున్న ఆస్పత్రులకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు చెప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విచారణ చేపట్టిన అధికారులు అంగన్‌వాడీ కేంద్రంలోని సరుకుల శాంపిళ్లు, విద్యార్థుల రక్తన మూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. అంగన్‌వాడీ చిన్నారులు అస్వస్థతకు గురవడంపై కలెక్టర్ రాజకుమారి ఆరాతీసి, అధికారుల్ని అప్రమత్తం చేశారు.

ముక్కలుముక్కలుగా పసికందు శరీర భాగాలు

- విశాఖ కంచరపాలెంలో అమానుషం
- మురుగు కాలువలో లభ్యం
- నరికి పడేసి ఉంటారని అనుమానం

మర్రిపాలెం(విశాఖ జిల్లా): అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా ఊ.. ఊ.. కొడుతూ ఆడుకోవాల్సిన ముక్కుపచ్చలారని పసికందు శరీరభాగాలు ముక్కలు ముక్కలుగా కాలువలో లభ్యం కావడం కలకలం రేపింది. అతికిరాతకంగా కాళ్లు, చేతులు, మొండెం ముక్కలు, ముక్కలుగా నరికినట్టుగా ఉన్నాయి. తల దొరకలేదు. ఈ హృదయవిదారక ఘటన విశాఖ నగరం కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. తాటిచెట్లపాలెం హైవే సర్వీసు రోడ్డులో సంజీవయ్య కాలనీ–1లో నివాసాల మధ్య ఉన్న కాలువలో గురువారం ఉదయం ఓ పసికందు శరీరభాగాలు కనిపించాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవికుమార్ తన బృందంతో ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. తల భాగం కోసం కాలువలో, అన్ని ప్రాంతాల్లో వెతికినా దొరకలేదు. ఇది బయట నుంచి వచ్చిన దుండగుల పనా..? లేక స్థానికుల పనా? ఆ పసికందు ఎవరు? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. సమీపంలోని అన్ని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఫోరెన్సిక్, క్లూస్ టీంలు, డాగ్ స్క్వాడ్ అక్కడికి చేరుకుని శరీర భాగాల నుంచి ఆధారాలు సేకరించారు. పసికందు నాలుగు, ఐదు నెలల వయసు ఉంటుందని భావిస్తున్నారు. ఆశా వర్కర్ల ద్వారా గర్భిణుల వివరాలు సేకరిస్తున్నారు. చిన్నారుల అపహరణ కేసులు ఏమైనా నమోదయ్యాయా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పసికందు శరీర భాగాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎన్నార్ బైఠాయింపు

పోలీసుల తీరుపై వైఎస్సార్‌సీపీ నేత నిరసన

కైకలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న డీఎన్నార్, నాయకులు

కైకలూరు : ప్రతిపక్ష కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తుండడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నాయకులు, కార్యకర్తలతో కలిసి కైకలూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం బైఠాయించారు. తన సామాజికవర్గం కార్తీక వనసమారాధనపై చిన్న పోస్టు పెట్టాడనే నెపంతో వైఎస్సార్‌సీపీ కైకలూరు మండల అధ్యక్షుడు శింగంశెట్టి రాముపై పోలీసులు కేసు నమోదు చేసి.. స్టేషన్‌కు తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించకపోయినా ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పోలీసులను ప్రశ్నించారు. అనంతరం డీఎన్నార్ మీడియాతో మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తన చేపల చెరువులో ఎమ్మెల్యే కామినేని ఆయన అనుయాయులతో చేపలను దొంగతనం చేయించారని విమర్శించారు. చోరీ చేయలేదని కామినేని అయ్యప్పస్వామి ఆలయంలో సత్యప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

రోడ్డు పక్కకు వెళ్లిన ఆర్టీసీ బస్సు

తాడేపల్లి రూరల్: 16వ నంబర్ జాతీయ రహదారి వెంబడి వడ్డేశ్వరం వద్ద రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు జారింది. ఏపీ07జడ్0691 నంబరు గల బాపట్ల డిపో సూపర్ డీలక్స్ బస్సు 15 మందితో గుంటూరు నుంచి విజయవాడ వెళ్తోంది. ఆ సమయంలో బస్సు 70 కి.మీ. స్పీడ్‌లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక్కసారిగా మార్జిన్ నుంచి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి ఒరిగింది. డ్రైవర్ బ్రేక్ వేయడంతో బస్సు ఆగింది. ఈ ఘటనలో డ్రైవర్, కండక్టర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి.

● టీడీపీ నాయకుల వేధింపులు, భరించలేక ప్రకాశం జిల్లాలో ఓ మహిళా సర్పంచ్ రాజీనామా చేశారు.చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నాయకులు కక్ష సాధింపులకు దిగి గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రకాశం జిల్లా ఏనుగులదిన్నెపాడు గ్రామ సర్పంచ్ బలుసుపాటి లూథియా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీఓను కలిసి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని గాలికొదిలేశారు

- ఈ ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా నిర్వహించడం లేదు
- జీవో 15 ప్రకారం నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వండి
- హైకోర్టులో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా పిటిషన్

సాక్షి, అమరావతి: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణాన్ని ప్రభుత్వం సక్రమంగా నిర్వహించడం లేదని, అక్కడ దారుణమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2024లో గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 15 ప్రకారం ఆ ప్రాంగణాన్ని నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి వేము కొండలరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు పిటిషనర్ తరపు న్యాయవాది జడా శ్రవణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ, గత ప్రభుత్వం రూ.450 కోట్ల వ్యయంతో స్వరాజ్ మైదాన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ విగ్రహంతో పాటు ఆ ప్రాంగణం మొత్తం నిర్వహణ నిమిత్తం ఓ కమిటీని నియమిస్తూ జీవో 15 జారీ చేసిందని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ కమిటీ పని చేయడం మానేసిందన్నారు. అంబేడ్కర్ విగ్రహంతో పాటు స్వరాజ్ మైదాన్ నిర్వహణనే ప్రభుత్వం గాలికొదిలేసిందని చెప్పారు. ఇప్పుడు అక్కడ చుట్టూ మురుగు నీరు, పాచితో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మద్యం బాబులకు అడ్డాగా మారిందని తెలిపారు.

విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలో ఘటన

కురిచేడు: విద్యాబుద్ధులు నేర్పాలిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలో చోటుచేసుకుంది. కల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థినుల పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులకు ఫిర్యాదు అందడంతో ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామంలో ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆ పాఠశాలను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కలిపి ఆ విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయుడు కూడా అక్కడే పనిచేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఉర్దూ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సదరు ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థినులు వారి తల్లిదండ్రుల దృష్టికి తెచ్చారు. దీంతో ఆ ఉపాధ్యాయుడిపై విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈఓ వస్త్రానాయక్‌ను వివరణ కోరగా కల్లూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై విచారించామని, అయితే ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని, శుక్రవారం పాఠశాలకు వెళ్లి విచారించి నివేదికను డీఈఓకు పంపుతామని తెలిపారు.

వైఎస్ జగన్ ఆపన్నహస్తం

- ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పార్టీ కార్యకర్తకు ఆర్థిక సాయం
- అందజేసిన వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రసాద్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు

వినుకొండ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తకు ఆపన్నహస్తం అందించారు. టీడీపీ నేతల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం టి.అన్నారం గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త భీమనాథం వెంకటప్రసాద్‌కు రూ.రెండు లక్షల ఆర్థిక సాయం పంపించారు. ఈ మొత్తానికి వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మరో రూ.లక్ష కలిపి వెంకటప్రసాద్ భార్య శ్రావణికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామంలో వినాయక ఉత్సవాల సమయంలో వెంకటప్రసాద్‌పై టీడీపీ నాయకులు కత్తితో దాడి చేశారని వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వెంకటప్రసాద్ వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా నిలబడ్డాడనే అక్కసుతోనే టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఇప్పుడిప్పుడే వెంకటప్రసాద్ కోలుకుంటున్నాడని చెప్పారు. కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కూటమి ఏడుపే జగన్‌కి దీవెనలు

- ఎల్లో మీడియా విష ప్రచారాలే ఆయనకు ఆశీస్సులు
- కోర్టుకు జగన్ టైమిచ్చారంటూ టీడీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- కోర్టులను తప్పుదోవ పట్టించేలా ఎల్లో గ్యాంగ్ తప్పుడు రాతలు
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు ఫైర్



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక.. తప్పుడు వార్తలు, విశ్లేషణలతో వ్యక్తిత్వ హననం చేయడమే చంద్రబాబు కూటమి ప్రభుత్వం, ఎల్లో మీడియా పనిగా పెట్టుకుందని.. కానీ వారి ఏడుపులే వైఎస్ జగన్‌కి ప్రజా దీవెనలుగా మారుతున్నాయని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను గౌరవించి హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరుకాబోతూ అందుకు షెడ్యూల్‌ని విడుదల చేస్తే కోర్టుకే జగన్ టైమిచ్చారంటూ, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసి టీడీపీ, ఎల్లో మీడియా కోర్టులను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నాయని అంబటి ధ్వజమెత్తారు. మాజీ సీఎంగా జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న నాయకుడిగా నిబంధనల ప్రకారం ఆయన ఎక్కడికెళ్లినా షెడ్యూల్ విడుదల చేస్తున్న విషయాన్ని అంబటి రాంబాబు గుర్తు చేశారు. ఎల్లో మీడియా, కూటమి నాయకులు ఎంత దుష్ప్రచారం చేసినా జగన్‌పై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని అణువంత కూడా తగ్గించలేరన్నారు. చంద్రబాబుకు చేతనైతే ఎన్నికల వాగ్దానాలను అమలు చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. సొంత డబ్బుతో అద్దెకు తెచ్చుకున్న ఫ్లైట్‌లో వైఎస్ జగన్ కోర్టుకి వెళితేనే బురదజల్లిన ఎల్లో మీడియాకి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌లు ప్రజల సొమ్ముతో వారం వారం స్పెషల్ ఫ్లైట్లలో హైదరాబాద్‌కి వెళ్తుంటే కనిపించలేదా అని ప్రశ్నించారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

బాబు, లోకేశ్ స్పెషల్ ఫ్లైట్ల గురించి రాయరేం?

''వైఎస్ జగన్ సీబీఐ కోర్టుకు వచ్చి వెళ్లేంత వరకూ ఎల్లో మీడియా నానా హడావుడి చేసింది. ఆయన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కథనాలు వండివార్చింది. టీవీ5, ఈటీవీ, ఏబీఎన్ చానళ్లు ఏమీ పనిలేదన్నట్టుగా వ్యవహరించాయి. కోర్టుకు హాజరయ్యేందుకు జగన్ లగ్జరీ చార్టెడ్ ఫ్లైట్‌లో వచ్చారని గగ్గోలు పెట్టాయి. ఆయన తన సొంత డబ్బుతో ఫ్లైట్‌లో రావడమూ తప్పన్నట్టు చిత్రీకరించాయి. అయితే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ ప్రజల సొమ్ముతో వారం వారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు స్పెషల్ ఫ్లైట్లలో అప్ అండ్ డౌన్ చేస్తుంటే కనీసం వార్త కూడా రాయడం లేదు. జనం సొమ్ముతో కూటమి నేతలు జల్సాలు చేస్తుంటే కనిపించడం లేదా? '' అని అంబటి ధ్వజమెత్తారు.

శరీరంలోకి చొచ్చుకెళ్లిన 1.5 మీటర్ల ఇనుప కడ్డీ

చాకచక్యంగా తొలగించిన రుయా వైద్యులు

తిరుపతి తుడా: తిరుపతి రుయాలో అరుదైన శస్త్రచికిత్సను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురానికి చెందిన షేక్ వలీ (44) శ్రీకాళహస్తిలో స్థిరపడ్డాడు. ఈ నెల 9న వ్యాపారం నిమిత్తం నగిరి నుంచి పుత్తూరు వెళ్తుండగా.. బస్సు ఓవర్ టేక్ చేయడంతో అతడు బ్రిడ్జిపై నుంచి కిందపడ్డాడు. బ్రిడ్జి దిగువన ఉన్న ఇనుప కడ్డీ షేక్ వలీ శరీరంలోకి చొచ్చుకుపోయింది. అతన్ని రుయా ఆస్పత్రికి తరలించగా వైద్యులు తక్షణమేనే స్పందించి రెండు గంటల్లో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. కార్డియోథొరాసిక్, అనస్థీషియా, సర్జరీ విభాగాల సమన్వయంతో బాధితుడి శరీరం నుంచి 1.5 మీటర్ల ఇనుప కడ్డీని చాకచక్యంగా తొలగించారు. ఊపిరితిత్తులు, గుండెకు సమీపంలో రాడ్డు ఉండటంతో బాధితుడికి ప్రాణాపాయ పరిస్థితిని గుర్తించి అత్యంత సూక్ష్మంగా శస్త్ర చికిత్సను చేపట్టామని సూపరింటెండెంట్ రాధ చెప్పారు. బాధితుడు పూర్తిగా కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేశామని తెలిపారు. ప్రొఫెసర్ కళ్యాణి రమ, డాక్టర్ గౌతమి, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ జ్ఞాపిక, డాక్టర్ రవిశంకర్ బృందం శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిందని వివరించారు. అసిస్టెంట్ ఆర్ఎంఓ హరికృష్ణ, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

● చిత్తూరు జిల్లా గుడుపల్లెలోని పీఈఎస్ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం నర్సింగ్ చదువుతున్న పల్లవి (18) గురువారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పల్లవి హాస్టల్‌లోని నాలుగో అంతస్తు పైనుంచి గురువారం రాత్రి కిందకు దూకేసింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే ఆమెను సిబ్బంది పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పల్లవి మృతిచెందింది.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి X @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఇ-టెండరు ప్రకటన నం. GNT/E.21/ TrD/2025-26

దిగువ పనుల కొరకు 15-12-2025న 15.30 గంటల వరకు కాంట్రాక్టర్ల నుండి దిగువ సంతకందారు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం.:1, టెండరు టైటిల్: GNT-డివిజన్: CTR(P) ట్రాక్ రైల్ రెన్యువల్ (P), TFR, TBR(ML) పనులు–ఎలక్ట్రికల్ TrD ఏర్పాట్లు, టెండరు Ref No: GNT/E.21/TrD/2025-26, తేది: 18-11-2025, సుమారు విలువ: రూ.17,11,828/-, బయానా: రూ.34,300/-, టెండరు ఫారం ధర(వాపసురాదు) : రూ.లేదు.

ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలు కొరకు చివరి తేదీ మరియు సమయం: 15-12-2025, 15.30 గంటల వరకు.

టెండరు తెరచు గడువు తేది తరువాతి తేదీన ప్రభుత్వ సెలవురోజుగా ప్రకటించబడితే టెండర్లు మరుసటి పనిరోజున తెరువబడతాయి. ఏదైనా సవివరమైన సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.inకు 18-11-2025 నుండి 15-12-2025న 15.30 వరకు లాగాన్ చేయవలెను. ఏదైనా తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TRD/గుంటూరు

PUB/1460/25

ఇ-టెండరు ప్రకటన నం. GSU-GTL-ESC-LIFT-08-2025 తేది: 13-11-2025

దిగువ పని కొరకు భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/ గతి శక్తి యూనిట్/గుంతకల్ వారు ఇ-టెండరు కోరుచున్నారు. ముగింపు తేది మరియు సమయం: 05-12-2025న 11.00 గం.కు

క్ర.సం.:1, టెండరు నం.: GSU-GTL-ESC-LIFT-08-2025, పని వివరణ: గుంతకల్ డివిజన్: SW-I (i) రాయచూర్: కొత్త 12m FOB కొరకు 3 నం. ఎస్కలేటర్స్ (అప్ & డౌన్) ఏర్పాట్లు, (ii) ప్రస్తుతం గల FOBకు 2నం. లిఫ్టుల ఏర్పాటు. SW-II (i) యాద్గిర్: కొత్త 12m FOB కొరకు 3నం. ఎస్కలేటర్స్ (అప్&డౌన్) ఏర్పాటు. (ii) ప్రస్తుతం గల FOBకు 2 నం. లిఫ్టుల ఏర్పాటు. ప్రకటిత విలువ: రూ.3,81,84,747.30/-, బయానా: రూ.3,40,900/-

బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు http//ireps.gov.inకు లాగిన్ కావలెను. ఏదైనా సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/గతి శక్తి యూనిట్/ గుంతకల్

A1858 PUB/1461/25

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్
https://www.ireps.gov.in లేదా
www.scr.indianrailways.gov.in

GOVERNMENT OF ANDHRA PRADESH
Insurance Medical Services Department
DENTAL TIE-UP NOTIFICATION

Rc.No.3003043/MR/DENTAL/DIMS/2025, Dated:20-11-2025

Expression of Interest (EOI) is invited from **Government Dental Medical Colleges, reputed Private / Corporate Dental Hospitals and Dental Clinics** for providing **Secondary Care Dental Treatment** to the **Insured Persons (IPs)** and their eligible dependents under **ESI Scheme** in the State of Andhra Pradesh. Interested dental hospitals / dental clinics may submit their EOI applications on or before **05.12.2025 (Friday).** All other details are available in the following website:
https://esihealthconnect.ap.gov.in/

Sd/- V. Anjaneyulu, IRTS.,
Director of Insurance Medical Services, A.P., Vijayawada
DIPR RO No.4586PP/CL/Advt/1/1/2021-22, Dt: 20.11.2025

భారత్‌కు జావెలిన్ క్షిపణి వ్యవస్థ

- అమెరికాతో రూ.826 కోట్ల విలువైన రక్షణ ఒప్పందం ఖరారు
- జావెలిన్ రాకతో భూతల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం

క్షిపణిని ప్రయోగిస్తున్న దృశ్యం

న్యూయార్క్/వాషింగ్టన్: భారత భూతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్టంచేసే రక్షణ ఒప్పందం కార్యరూపం దాల్చింది. భారత్‌కు రూ.826 కోట్ల విలువైన ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా గురువారం అంగీకారం తెలిపింది. ఇటీవల యుద్ధంలో రష్యా యుద్ధ ట్యాంక్‌లను తుత్తునియలు చేసిన జావెలిన్ క్షిపణి వ్యవస్థలను సైతం ఒప్పందంలోభాగంగా భారత్‌కు అమెరికా విక్రయించనుంది. రష్యా నుంచి ముడిచమురును కొంటున్నందుకు ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50 శాతం దిగుమతి టారిఫ్‌లను పెంచాక ఆ దేశంతో మోదీ సర్కార్ కుదుర్చుకున్న తొలి రక్షణరంగ ఉత్పత్తుల కొనుగోలు ఒప్పందం ఇదేకావడం విశేషం. దిగుమతి సుంకాల సుత్తితో మోదాక మోదీ సర్కార్ గుర్రుగా ఉండటంతో వేడెక్కిన ఇరుదేశాల సంబంధాలను శాంతపరిచేందుకే అమెరికా ఈ ఒప్పందాలు చేసుకుందని తెలుస్తోంది. తాజా ఒప్పందంపై అమెరికా స్పందించింది. ప్రధానమైన రక్షణరంగ భాగస్వామి దేశంలో భద్రతను పెంచేందుకే ఈ కొనుగోలు ఒప్పందం ఎంతో దోహదపడుతుంది. ఇండో–పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ సుస్థిరత, శాంతికి ఈ ఆయుధ కొనుగోలు ఒప్పందం తన వంతు సాయంచేస్తుంది'' అని అమెరికా పేర్కొంది. రూ. 418 కోట్ల విలువైన ఎం982ఏ1 రకం 216 ఎక్స్కాలిబర్ ప్రొజెక్టయిల్స్, సంబంధిత ఉపకరణాలతోపాటు రూ. 408 కోట్ల విలువైన ఎఫ్‌జీఎం–148 రకం 25 జావెలిన్ క్షిపణి వ్యవస్థలు, వాటికి అనుబంధంగా కమాండ్ లాంచ్ యూనిట్లు, 100 వరకు మందుగుండును భారత్‌కు విక్రయించేందుకు తమ విదేశాంగ శాఖ అనుమతి ఇచ్చిందని అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ సహకార ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. ప్రభుత్వం తరఫున సాంకేతిక సహకారం, సమాచారం, రిపేర్లు, సేవలను సైతం ఈ ఒప్పందంలో భాగంగా అందివ్వనున్నారు.

ఏమిటీ జావెలిన్ క్షిపణి లాంచర్?

జావెలిన్ ఎఫ్‌జీఎం–148 యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థను అమెరికా దాదాపు మూడు దశాబ్దాలుగా వినియోగిస్తోంది. సైనికుడు భుజంపై పెట్టుకుని మాటువేసి ప్రయోగించే ఈ జావెలిన్

జావెలిన్ క్షిపణులు

మిస్సైల్‌తో శత్రుదేశాల యుద్ధట్యాంక్‌లను అవలీలగా పేల్చేయవచ్చు. జావెలిన్ క్షిపణిని ప్రయోగించిన సైనికుడి జాడను కనిపెట్టడం చాలా కష్టం . దీంతో శత్రుయుద్ధట్యాంక్‌లను వేగంగా తుదముట్టించవచ్చు. జావెలిన్ లాంచర్‌ను సైనికుడు సులభంగా ఎక్కడికైనా మోసుకెళ్లవచ్చు. భూతల సమరంలో పైచేయి సాధించేందుకు భారతీయ సైన్యానికి ఇవి ఎంతగానో ఉపయుక్తం కానున్నాయి. 4 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో పేల్చవచ్చు. దీనిలోని బాంబు బరువు 8 కేజీల పైమాటే. పొడవుగా రెండు కొనల్లో మందుగుండుతో దీనిని డిజైన్‌చేశారు. శత్రు యుద్ధ ట్యాంక్‌ను తాకగానే ఒకసారి పేలిపోయి దాని పైపొర, కవచాన్ని ఛిద్రం చేస్తోంది. వెనువెంటనే మరోసారి పేలి మొత్తం యుద్ధట్యాంక్‌నే ఛిన్నాభిన్నం చేస్తుంది. రష్యాకు చెందిన వందలాది ట్యాంక్‌లను ఉక్రెయిన్ సైనికులు ఈ జావెలిన్‌తోనే నాశనంచేశారు. జావెలిన్ భయానికి రష్యా ట్యాంక్‌లతో దాడులను తగ్గించుకుంది.

రాష్ట్రపతి గవర్నర్లకు గడువు విధించలేం

అది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం

- బిల్లుల కేసులో సుప్రీం కీలక తీర్పు
- రెండోసారి పంపినా ఆమోదం గవర్నర్ ఇష్టం
- అప్పుడు కూడా రాష్ట్రపతికి నివేదించవచ్చు
- మంత్రివర్గం సలహా విధిగా పాటించక్కర్లేదు
- సుదీర్ఘకాలం ఆపడం మాత్రం సరికాదు
- అలాంటప్పుడు కోర్టులు సమీక్షించవచ్చు
- అప్పుడైనా గడువు మాత్రం నిర్దేశించలేవు
- సీజేఐ రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ
- గతంలో ఇచ్చిన 'గడువు' తీర్పు కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీలు ఆమోదించి పంపే బిల్లులకు రాష్ట్రపతి, గవర్నర్లు ఆమోదం తెలిపే అంశంపై న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల నడుమ తలెత్తిన పెను సంక్షోభానికి అత్యున్నత న్యాయస్థానం ఎట్టకేలకు సామరస్యపూర్వకంగా తెరదించింది. ''ఈ విషయంలో సుప్రీంకోర్టుతో సహా ఏ న్యాయస్థానమూ వారికి ఎలాంటి గడువూ విధించజాలదు. అలా చేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. ఎందుకంటే ఇది కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాలను న్యాయవ్యవస్థ తన గుప్పెట పట్టడమే అవుతుంది. దీన్ని రాజ్యాంగం ఏ రూపంలోనూ అనుమతించలేదు'' అని తేల్చి చెప్పింది. అంతేగాక సదరు బిల్లులకు ఆమోదం తెలపడం, రిజర్వులో ఉంచడంపై న్యాయ సమీక్ష కూడా కుదరదని స్పష్టం చేసింది. బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతి, గవర్నర్లకు మూడు నెలల గడువు విధిస్తూ ఇద్దరు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం గతంలో సంచలన తీర్పు వెలువరించడం, అది రెండు కీలక వ్యవస్థల నడుమ సంక్షోభానికి దారితీయడం తెలిసిందే. మూడు నెలల్లోపు నిర్ణయం వెలువరించని పక్షంలో సదరు బిల్లులకు ఆమోదం లభించినట్టే భావించాలని కూడా ఆ తీర్పు పేర్కొంది. ఈ రెండు అంశాలూ చెల్లుబాటు కాబోవని సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ అంశంపై గురువారం ఈ మేరకు ఏకగ్రీవంగా 111 పేజీల తుది తీర్పు వెలువరించింది. ''రాష్ట్రపతి, గవర్నర్లకు ఇది కార్యనిర్వాహక వ్యవస్థ విధుల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడమే అవుతుంది. అది రాజ్యాంగ విరుద్ధం''అని వ్యాఖ్యానించింది. 142వ అధికరణంలోని ప్రత్యేక అధికారాలను వినియోగించుకుంటూ ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన ఆ తీర్పును కొట్టేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే బిల్లులకు ఆమోదాన్ని గవర్నర్లు నిరవధికంగా పెండింగ్‌లో పెట్టడం మాత్రం ఎంతమాత్రమూ సబబు కాదని సీజేఐ ధర్మాసనం ఈ సందర్భంగా విస్పష్టంగా పేర్కొంది. ''రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా అంతులేని జాప్యం చేస్తే కోర్టులు చూస్తూ ఊరుకోబోవు. వాటిపై పరిమిత న్యాయసమీక్ష జరపవచ్చు''అని పేర్కొంది. అయితే, ''అప్పుడు కూడా వీలైనంత త్వరగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా సూచించాలే తప్ప రాష్ట్రపతికి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించడానికి వీల్లేదు'' అని స్పష్టం చేసింది. అంతేకాదు, ''బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహాకు గవర్నర్ కట్టుబడాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో విచక్షణ మేరకు వ్యవహరించే అధికారం రాజ్యాంగమే కల్పించింది''అని కూడా గుర్తు చేసింది. రాజ్యాంగ ధర్మాసనంలో సీజేఐతో పాటు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ఉన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హర్షం ఈ తీర్పుపై వెలిబుచ్చారు. చరిత్రాత్మక తీర్పు వెలువరించినందుకు రాష్ట్రపతి తరఫున సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. దీనిపై డీఎంకే సర్కారు స్పందించలేదు.

ఆపితే తిప్పి పంపాల్సిందే..

ఏ నిర్ణయమూ తీసుకోకుండా గవర్నర్లు సుదీర్ఘ కాలం పాటు బిల్లులను పెండింగ్‌లో పెట్టడం కుదరదని ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. అది సబబు కూడా కాదని పేర్కొంది. ''ఏ బిల్లునైనా ఆపితే దాన్ని కచ్చితంగా అసెంబ్లీకి వెనక్కి పంపాల్సిందే. రాజ్యాంగంలోని 200 అధికరణ ప్రకారం బిల్లుల విషయంలో గవర్నర్ల ముందున్నది మూడు దారులు. వాటిని ఆమోదించడం , రాష్ట్రపతికి నివేదించడం, లేదా పునఃసమీక్ష నిమిత్తం అసెంబ్లీకి తిప్పి పంపడం''అని సీజేఐ పేర్కొన్నారు. వాటిని ఆమోదించకుండా గవర్నర్ తన వద్దే అట్టిపెట్టుకోవచ్చన్న కేంద్రం వాదనను తోసిపుచ్చారు. ''అలా చేయడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఆపేయాలనుకున్న బిల్లులను అసెంబ్లీకి పంపడం ఆప్షన్‌కాదు, నిబంధన'అని చెప్పారు.

న్యాయమూర్తి పేరు లేదు!

రాజ్యాంగ ధర్మాసనం తరఫున తీర్పు రాసిన న్యాయమూర్తి పేరును అందులో పేర్కొనకపోవడం విశేషం. ఇలా అరుదుగా మాత్రమే జరుగుతుంటుంది. 2019లో రామజన్మభూమి–బాబ్రీ మసీదు వివాదం కేసుపై కూడా ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆ తీర్పు రాసిన న్యాయమూర్తి పేరును కూడా అందులో పేర్కొనలేదు.

ఇదీ నేపథ్యం...!

అసెంబ్లీ పంపే బిల్లుల ఆమోదంలో గవర్నర్ల మితిమీరిన జాప్యం కొన్నేళ్లుగా వివాదాలకు దారితీస్తూ వస్తోంది. ముఖ్యంగా విపక్షాల పాలనలో ఉన్న తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఈ సమస్య తరచూ తలెత్తుతోంది. సుప్రీంకోర్టు తాజా తీర్పుకు కారణంగా నిలిచిన కేసు కూడా బిల్లుల ఆమోదం విషయమై తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ ఎన్.రవి మధ్య తలెత్తిన వివాదానికి సంబంధించినదే. అసెంబ్లీ ఆమోదించి పంపిన 10 బిల్లులను ఆమోదించకుండా ఆయన సుదీర్ఘంగా జాప్యం చేయడాన్ని సవాలు చేస్తూ ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దాంతో, చట్టసభలు ఆమోదించి పంపే బిల్లులపై గవర్నర్లతో పాటు రాష్ట్రపతి కూడా మూడు నెలల్లోగా ఏ నిర్ణయమూ తీసుకోవాలంటూ జస్టిస్ జేబీ పార్డీవాలా ద్విసభ్య ధర్మాసనం గత ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. అది తీవ్ర కలకలానికి దారితీసింది. ఆ తీర్పు ఆధారంగా గవర్నర్ ఆమోదించకుండా పక్కన పెట్టిన 10 బిల్లులను చట్టాలుగా నోటిఫై చేస్తూ తమిళనాడు ప్రభుత్వం గెజిట్ కూడా జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో కేంద్ర ప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు మధ్య విభేదాలు మరింత తీవ్రతరమయ్యాయి. దాంతో నేరుగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అంశంలో జోక్యం చేసుకున్నారు. బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను కాదని కోర్టులు ఇలా గడువులు పెట్టవచ్చా అంటూ నేరుగా సుప్రీంకోర్టునే నిలదీశారు. ఈ విషయమై పలు సందేహాలు లేవనెత్తుతూ 14 ప్రశ్నలు సంధించి వాటికి బదులు కోరారు. 143(1)వ అధికరణం రాష్ట్రపతికి కట్టబెట్టిన విశేషాధికారాలను ఉపయోగించుకుంటూ ఈ మేరకు సుప్రీంకోర్టుకు ఆమె లేఖ రాశారు. దాంతో దీనిపై విచారణకు సీజేఐ సారథ్యంలో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. గడువును వ్యతిరేకిస్తూ కేంద్రం, సమర్థిస్తూ తమిళనాడు సహా కేరళ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలు వాదనలు విన్పించాయి. అనంతరం గత సెప్టెంబర్ 11న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. రాష్ట్రపతి వేసిన 14 ప్రశ్నల్లో పదకొండింటిపై తాజా తీర్పులో తమ అభిప్రాయం వెలిబుచ్చింది. మిగతా మూడింటినీ ఈ అంశంతో సంబంధం లేనివిగా పేర్కొంది. ''గవర్నర్లు బిల్లుపై తమ నిర్ణయాన్ని రిజర్వు చేసిన ప్రతిసారీ రాష్ట్రపతి ఇలా 143వ అధికరణ కింద సుప్రీంకోర్టు అభిప్రాయం కోరాల్సిన అవసరం లేదు'' అని పేర్కొంది.

పీఠంపై పదోసారి

ప్రధాని మోదీ సమక్షంలో బిహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

సామాజిక సమతుల్యత పాటిస్తూ పాత, కొత్త ముఖాలతో కేబినెట్ కూర్పు

పట్నా: ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్ పేలవ ప్రదర్శన, తమ ప్రభుత్వ ప్రజారంజక పాలనతో మరోసారి అధికార పగ్గాలు ఒడిసిపట్టిన జేడీయూ అగ్రనేత నితీశ్ కుమార్ గురువారం బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేశారు. పట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్ ఈ ప్రమాణోత్సవానికి వేదికై ంది. గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ నితీశ్‌తో సీఎంగా ప్రమాణం చేయించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, జేడీయూ, బీజేపీ ముఖ్యనేతల సమక్షంలో 74 ఏళ్ల నితీశ్ సీఎంగా ప్రమాణంచేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వంలోనూ డిప్యూటీ సీఎంలుగా కొనసాగుతున్న సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హాలతోపాటు బీజేపీ నుంచి 14 మంది, జేడీయూ నుంచి ఎనిమిది మంది, లోక్‌జనశక్తి(రాంవిలాస్) పార్టీ నుంచి ఇద్దరు, హిందుస్తానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చాల నుంచి చెరొకరు మంత్రులుగా ప్రమాణంచేశారు. కేబినెట్ బెర్తుల కేటాయింపులో నితీశ్ సామాజిక సమతుల్యత పాటించారు. 26 మందిలో ఐదుగురు దళితులకు చోటిచ్చారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకాని దీపక్‌కు కేబినెట్‌లో చోటు

ప్రతిసారీ ఎమ్మెల్సీ మార్గంలో సీఎం కుర్చీపై కూర్చుంటున్న నితీశ్ ఈసారి తనలాగా మరో వ్యక్తిని కేబినెట్ మంత్రిని చేశారు. రాష్ట్రీయ లోక్‌మోర్చా పార్టీ చీఫ్ ఉపేంద్ర కుష్వాహ కుమారుడు దీపక్ ప్రకాశ్ సైతం గురువారం మంత్రిగా ప్రమాణంచేయడం చూసి అక్కడివారంతా ఆశ్చర్యపోయారు. దీపక్ ప్రస్తుతం ఎమ్మెల్యేకాదు, ఎమ్మెల్సీ అస్సలు కాదు. విదేశాల్లో చదువుకుని వచ్చిన దీపక్‌ను ఉన్నపళంగా మంత్రిని చేసినట్లు తెలుస్తోంది.

ఇక డబుల్ ఇంజిన్ పాలన: అమిత్ షా

ప్రమాణస్వీకారం సందర్భంగా అమిత్‌షా తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు. ''నేటి నుంచి బిహార్‌లో మరింత శక్తివంతమైన డబుల్ ఇంజిన్ ప్రభుత్వపాలన జోరందుకోవడం ఖాయం'' అని అమిత్ షా అన్నారు.

నాన్నను గెలిపించినందుకు థాంక్యూ: నిశాంత్

ప్రమాణస్వీకార కార్యక్రమంలో నితీశ్ తనయుడు నిశాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 50 ఏళ్ల నిశాంత్ ఇంతవరకు రాజకీయాల్లోకి అడుగు పెట్టలేదు. తండ్రి రెండు దశాబ్దాలుగా సీఎంగా జనరంజకంగా పాలిస్తున్నా మీరెందుకు రాజకీయాల్లోకి రాలేదని మీడియా ప్రశ్నించగా ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. ఎలాంటి సమాధానం చెప్పలేదు.

ప్రత్యేకంగా అభినందించిన ప్రధాని

కార్యక్రమం తర్వాత ప్రధాని 'ఎక్స్'లో స్పందించారు. ''పదోసారి సీఎంగా పగ్గాలు స్వీకరించిన నితీశ్‌కు నా శుభాకాంక్షలు. ఏళ్లతరబడి సుపరిపాలన అందించిన అనుభవశీలి నితీశ్. డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్‌లకు నా అభినందనలు. వీళ్లిద్దరూ ప్రజాసేవ కోసం అవిశ్రాంతంగా క్షేత్రస్థాయిలో పనిచేశారు. పాత, కొత్త ముఖాల కలబోతగా కొలువుతీరిన కేబినెట్ ఇకపై బిహార్‌ను అభివృద్ధిలో కొత్త శిఖరాలకు చేరుస్తుంది''అని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రమాణస్వీకార వేదికపై అభివాదం చేస్తున్న మోదీ, నితీశ్

50 ఏళ్ల రాజకీయ అనుభవం గడించిన నితీశ్ పని అయిపోయిందనుకున్న ప్రతిసారీ ఉవ్వెత్తున ఎగిసే అలలా మరింత ప్రజాదరణతో సీఎం పీఠంపై ఆసీనులవుతున్నారు. 1970 దశకంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌తో పాటు బిహార్ ఉద్యమంలో పాల్గొని నితీశ్ పెద్దనేతగా ఎదిగారు. మండల్ కమిషన్ రిజర్వేషన్ల అమలు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలకనేతగా మారారు. తర్వాత అవకాశవాదిగా ముద్రపడినప్పటికీ ఆయనకు జనాదరణ తగ్గకపోవడం విచిత్రం. తాజా ఎన్నికల్లో గణమైన స్థాయిలో సీట్లు సాధించి కూడా బీజేపీ ఈయనకే సీఎం కుర్చీ అప్పగించడం నితీశ్ రాజకీయ చాణక్యతకు మచ్చుతునక. దేశంలో సుదీర్ఘకాలంపాటు పరిపాలించిన 10 మంది ముఖ్యమంత్రుల్లో నితీశ్ ఒకరు. గత 19 ఏళ్లుగా ఈయన సీఎంగా కొనసాగుతున్నారు. ఎప్పుడూ కూటములు మార్చే పల్టీబాబుగా చెడ్డపేరు తెచ్చుకున్నా చక్కటి పాలనతో సుశాసన్‌బాబు అనే ఖ్యాతినీ సాధించడం విశేషం. విద్యరీత్యా ఇంజనీర్ అయిన నితీశ్ తన కేబినెట్‌లోనూ సోషల్ ఇంజనీరింగ్‌చేసి అన్ని వర్గాల వారికి సమప్రాధాన్యత కల్పించారు.

19 ఏళ్లుగా అధికారంలోనే..

యూకేలో సెటిల్డ్ స్టేటస్ కష్టమే!

- 20 ఏళ్ల దాకా వేచి చూడాల్సిందే
- పార్లమెంట్‌కు ప్రతిపాదనలు సమర్పించిన ప్రభుత్వం

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో చట్టబద్ధంగా నివసిస్తున్న వలసదారులకు కొత్త కష్టాలు రాబోతున్నాయి. యూకేలో శాశ్వత స్థిరనివాసిత హోదా(సెటిల్డ్ స్టేటస్) పొందాలంటే ఇకపై 20 ఏళ్లదాకా వేచి చూడాల్సిందే. ఈ హోదా కావాలంటే ఇండెఫనట్ లీవ్ టు రిమైన్(ఐఎల్ఆర్)కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐఎల్ఆర్‌కు అర్హత సాధించాలంటే తక్కువ వేతనం కలిగిన వలసదారులు 10 ఏళ్లు, ప్రభుత్వం ఇచ్చే నిధులతో ప్రయోజనం పొందుతున్న వలసదారులు 20 ఏళ్లు వేచి చూడాలి. ఈ మేరకు యూకే ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. హోంశాఖ మంత్రి షబానా మహమూద్ ఈ ప్రతిపాదనలను గురువారం పార్లమెంట్‌కు సమర్పించారు. ప్రస్తుతం ఐదేళ్లుగా ఉన్న గడువును పదేళ్లకు పెంచడం గమనార్హం. 2021 తర్వాత యూకేకు చేరుకున్న 10.6 లక్షల మంది వలసదారులకు ఈ నిబంధన వర్తించబోతోంది. యూకేలో శాశ్వతంగా నివసించడం వలసదారుల హక్కు కాదని, అది కొన్ని అర్హతలతో సాధించుకోవాలని మంత్రి షబానా మహమూద్ తేల్చిచెప్పారు. వలసదారులపై అమెరికా ప్రభుత్వం ఇటీవలి కాలంలో కఠిన ఆంక్షలు విధిస్తున్న సంగతి తెలిసిందే. కొత్త ప్రతిపాదన ప్రకారం.. 12 నెలలకంటే తక్కువ కాలం ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనం పొందితే ఐఎల్ఆర్ కోసం 15 ఏళ్లు వేచి చూడాలి. 12 నెలల కంటే ఎక్కువ కాలం ప్రయోజనం పొందితే 20 ఏళ్లు వేచి చూడాలి. 2021 నుంచి 2024 మధ్య కొత్తగా 20.6 లక్షల మంది యూకేకు వలసదారులుగా వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. సెటిల్డ్ స్టేటస్ లభిస్తే యూకే పౌరసత్వం కూడా లభించడానికి అవకాశం ఉంటుంది.

నిందితులపై ఎన్ఐఏ ప్రశ్నల వర్షం

నలుగురిని తమ కస్టడీలోకి తీసుకున్న దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ: ఎర్రకోట వద్ద బాంబుపేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ విచారణను మరింత వేగవంతంచేసింది. జమ్మూకశ్మీర్ పోలీసులు కస్టడీలో ఉన్న నిందితులు డాక్టర్ ముజామిల్ ఘనీ, అదీల్ రాథర్, వైద్యురాలు షాహీనా సయీద్, మత బోధకుడు ఇర్ఫాన్ అహ్మద్ వగాయ్‌లను ఎన్ఐఏ గురువారం తమ కస్టడీలోకి తీసుకుంది. వారిని రహస్య ప్రదేశంలో ఉంచి ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఫరీదాబాద్ ఉగ్రమాడ్యూల్ సభ్యులు ఎలా అఫ్గాన్, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్, తుర్కియేలోని హ్యాండ్లర్లతో సత్సంబంధాలు పెట్టుకున్నారు? నిధులు ఏఏ మార్గాల్లో సంపాదించారు? విధ్వంసకర రచన చేసిందెవరు? వైద్యుల ముసుగులో ఉన్న ఉగ్రమాడ్యూల్‌లో వాస్తవంగా ఎంత మంది సభ్యులు ఉన్నారు? అంటూ ప్రశ్నలవర్షం కురిపించి వారి నుంచి సమాధానాలు రాబడుతున్నారు. '' ఈ నలుగురు మొత్తం ఉగ్రమాడ్యూల్‌లో అత్యంత కీలకమైన సభ్యులు. వీళ్ల వద్ద చాలా సమాచారం ఉంటుంది'' అని జాతీయ దర్యాప్తు సంస్థ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. ఢిల్లీ పోలీసుల నుంచి నవంబర్ 11న అధికారికంగా కేసు తమ చెంతకు వచ్చాక ఎన్ఐఏ అమీర్ రషీద్ అలీ, జసీర్ బిలాల్ వానీ అలియాస్ డ్యానిష్‌లను అరెస్ట్‌చేసింది. గురువారం ఈ నలుగురిని తమ అదుపులోకి తీసుకోవడంతో ఎన్ఐఏ అరెస్ట్‌ల సంఖ్య ఆరుకు పెరిగింది. గురువారం ముజామిల్, అదీల్, షాహీనా, ఇర్ఫాన్ వగాయ్‌లను ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టుల ప్రాంగణంలోని కోర్టులో ఎన్ఐఏ ప్రవేశపెట్టింది. కేసు దర్యాప్తు నిమిత్తం వీళ్లందర్నీ తమకు అప్పగించాలని కోర్టును కోరగా 10 రోజుల కస్టడీకి అప్పగిస్తూ ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి అంజూ బజాజ్ ఛాంద్నా ఉత్తర్వులు జారీచేశారు.

పోరులో పాక్ గెల్చిందట!

నివేదించిన అమెరికా-చైనా ఆర్థిక, భద్రత సమీక్ష కమిషన్

మోదీ సర్కార్ దౌత్య వైఫల్యంపై కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ: పహల్గామ్‌లో ఉగ్రవాదుల పాశవిక దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ జరిపిన దాడులకు పాకిస్తాన్ దీటుగా బదులిచ్చిందని, ఆ నాలుగు రోజుల పోరులో పాక్ పైచేయి సాధించిందని అమెరికా సెనేట్‌లో సమర్పించిన ఓ నివేదికపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఇది మోదీ సర్కార్ దౌత్యవైఫల్యానికి ప్రబల నిదర్శనమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ గురువారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ వేళ కొనసాగిన పరస్పర సైనిక చర్యల్లో భారత్‌పై పాక్ విజయం సాధించిందని అమెరికా–చైనా ఆర్థిక, భద్రత సమీక్ష కమిషన్ మంగళవారం అమెరికా ఎగువసభ అయిన సెనేట్‌లో 800 పేజీల నివేదికను సమర్పించింది. ''108, 109 పేజీల్లో ఏప్రిల్‌లో పహల్గాం దాడి వెనుక పాక్ హస్తముంది. ఆపరేషన్ సిందూర్ వేళ చైనా అందించిన అత్యాధునిక ఆయుధాలతో భారత్‌ను పాక్ ఓడించింది. చైనా అత్యాధునిక ఆయుధాలు, నిఘా సాయంతో పాక్ పైచేయి సాధించింది. పాక్ సైన్యం మాటున చైనా తన అధునాతన ఆయుధ సంపత్తిని నేరుగా భారత్ పరీక్షించుకునే సువర్ణావకాశాన్ని సద్వినియోగంచేసుకుంది. తద్వారా తమ ఆయుధాల పనితీరును ప్రపంచానికి చాటిచెప్పి అంతర్జాతీయ ఆయుధ, రక్షణ రంగ మార్కెట్‌లో తన వాటాను పెంచుకోవాలని చూసింది'' అని నివేదిక పేర్కొంది. '' అమెరికా సెనేట్‌లో సమర్పించిన నివేదికను చూశాకైనా ప్రధాని మోదీ మౌనం వీడతారా? భారత విదేశాంగ శాఖ తన అభ్యంతరాలను వ్యక్తంచేస్తుందా?'' అని జైరాం రమేశ్ సూటి ప్రశ్న వేశారు.

యుద్ధం ఆపేస్తానన్నారు!

- 350 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో దిగొచ్చారు
- మరోసారి ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్: పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. కానీ, ఈసారి ఒక కొత్త విషయం చెప్పారు. దాడులు ప్రతిదాడులు వెంటనే నిలిపివేయకపోతే ఏకంగా 350 శాతం సుంకాలు విధిస్తానని బెదిరించడంతో ఆ రెండు దేశాలు మరో గత్యంతరం లేక దారికొచ్చాయని అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనతో వ్యక్తిగతంగా ఫోన్‌లో మాట్లాడారని, పాకిస్తాన్‌పై యుద్ధం చేయబోమని చెప్పారని స్పష్టంచేశారు. అణ్వస్త్ర దేశాలైన భారత్–పాక్ మధ్య భీకర యుద్ధాన్ని తానే చొరవ తీసుకొని ఆపేశానంటూ ట్రంప్ నోటివెంట వచ్చిన ప్రకటనల సంఖ్య 60 దాటడం గమనార్హం. రెండు దేశాల నడుమ ఘర్షణ ఆగడం వెనుక మూడో వ్యక్తి ప్రమేయం, పాకిస్తాన్ ప్రాధేయపడడం వల్లనే కాల్పుల విరమణకు అంగీకరించామని భారత్ పదేపదే చెబుతున్నా ట్రంప్ తన వైఖరి మార్చుకోవడం లేదు. ఆయన తాజాగా యూఎస్–సౌదీ అరేబియా పెట్టుబడుల సదస్సులో ప్రసంగించారు. ''భారత్–పాక్ మధ్య దాడులు ఆరంభం కాగానే ఆ రెండు దేశాల అధినేతలతో మాట్లాడా. దాడులు తక్షణమే ఆపాలని, లేకపోతే 350 శాతం సుంకాలు భరించడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించా. అంత పని చేయొద్దని భారత్, పాక్ వేడుకున్నాయి. అణ్వాయుధాలతో పరస్పరం యుద్ధం సాగిస్తే లక్షలాది మంది మరణిస్తారని చెప్పా. లాస్ ఏంజెలెస్ సిటీపై అణుధూళి పేరుకుపోతుందని వెల్లడించా. 350 శాతం సుంకాలు అనగానే రెండు దేశాలు బెదిరిపోయి నా మాట విన్నాయి. ఒక్క మాటతో అంతా సెట్ అయిపోయింది. మొదట నాకు పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నుంచి ఫోన్ వచ్చింది. యుద్ధాన్ని నిలిపివేసి లక్షలాది మంది ప్రాణాలు కాపాడినందుకు ఆయన నాకు కృతజ్ఞతలు తెలియజేశారు. తర్వాత నరేంద్ర మోదీ ఫోన్‌చేసి మాట్లాడారు. మేము చేయాల్సింది చేశాం మీరేం చేస్తారో చెప్పాలని ప్రశ్నించా. పాక్‌పై యుద్ధం చేయబోమని మోదీ బదులిచ్చారు. దాంతో మోదీకి కృతజ్ఞతలు తెలియజేశా'' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సదస్సులో సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ పాల్గొన్నారు.

పదేపదే అదే మాట

350 శాతం టారిఫ్‌లు విధిస్తానని భారత్, పాక్‌లను హెచ్చరించానంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి ఆయన గతంలో మాట్లాడుతూ 200 శాతం టారిఫ్‌లు విధిస్తానని బెదిరించానని చెప్పారు. ఆ సంఖ్యను క్రమంగా పెంచుకుంటూ పోతున్నారు. ఇప్పుడు అది 350 శాతానికి చేరింది. ఇంకా ఎంత పెరుగుతుందో తెలియదు. ఇదిలా ఉండగా, గురువారం వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో డొనాల్డ్ ట్రంప్, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఈ భేటీలోనూ ట్రంప్ తన నోటికి పనిచెప్పారు. భారత్–పాక్ యుద్ధానికి తానే ఫుల్‌స్టాప్ పెట్టేశానని పునరుద్ఘాటించారు.

జీ20 శిఖరాగ్రంలో అమెరికా: దక్షిణాఫ్రికా

జొహన్నెస్‌బర్గ్: జీ20 శిఖరాగ్రం విషయంలో అమెరికా మనసు మార్చుకుందని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా చెప్పారు. ఇప్పటి వరకు శిఖరాగ్రాన్ని బాయ్‌కాట్ చేస్తామని చెప్పిన అగ్రరాజ్యం ఇప్పుడు పాల్గొనేందుకు సానుకూలత వ్యక్తపర్చిందని ఆయన అన్నారు. ఆఖరి క్షణంలో ఈ మేరకు తమకు సందేశం అందడంతో అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లను మారుస్తున్నామన్నారు. మైనారిటీ శ్వేత జాతీయులపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నందున తాము ఆ దేశంలో జరిగే జీ20 శిఖరాగ్రాన్ని బహిష్కరిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ప్రకటించడం తెల్సిందే. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

సాక్షి
గుంటూరు
శుక్రవారం । 21 । నవంబర్ । 2025

నిత్యాన్నదానానికి విరాళం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయ నిత్యాన్నదాన పథకానికి కట్టుబడి వారిపాలెంకు చెందిన చెన్నంశెట్టి ఏడుకొండలు రూ.1,00,116 విరాళంగా అందజేశారు.

స్పర్శలేని మచ్చలను గుర్తించాలి

ఫిరంగిపురం: ఫిరంగిపురంలో కుష్ఠు వ్యాధిపై సర్వే తీరును గురువారం స్టేట్ సర్వేలెన్స్, ఇన్‌చార్జి లెప్రసీ జేడీ డాక్టర్ ఉషారాణి పరిశీలించారు. స్పర్శ లేని మచ్చలను గుర్తించాలన్నారు.

నరేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులోని బాలా త్రిపురసుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి ఆలయంలో కార్తిక మాసం చివరిరోజు గురువారం ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నాగాభరణం బహూకరణ

నకరికల్లు: నర్సింగపాడు గ్రామంలోని గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామికి నకరికల్లుకు చెందిన తిరువీధుల శ్రీనివాసరావు దంపతులు వెండి నాగాభరణాన్ని గురువారం సమర్పించారు. రూ.7.50 లక్షల విలువైన వెండి నాగాభరణాన్ని ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

బగళాముఖి ఆలయంలో విశేష పూజలు

కర్లపాలెం: చందోలు గ్రామంలో కొలువైఉన్న బగళాముఖి అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా దివ్య హోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 9 మంది వేద పండితులచే ఘనంగా హోమం జరిపించారు. కార్తికమాసం ఆఖరి రోజును పురస్కరించుకుని అమ్మవారికి శక్తి స్వరూపిణి అలంకారం చేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బాపట్లకు చెందిన విజయలక్ష్మి నాదస్వర బృందం మంగళ వాయిద్యాలతో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో తెనాలికి చెందిన రంగిసెట్టి రమేష్ రచించిన రావమ్మ రావమ్మా బగళాముఖి అనే పాటను పృథ్వీ మనోజ్ చేత పాడించి, ఆవిష్కరింపచేశారు. ఈవో నరసింహామూర్తి అభివృద్ధి కమిటీ చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి, సభ్యులు పట్టాభి రామరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

పెదకూరపాడు: రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా అమరావతి – సత్తెనపల్లి మార్గమధ్యలో ఉన్న పెదకూరపాడు రైల్వే గేటును 21, 22, 23 తేదీల్లో మూసివేయనున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు పునరుద్ధరిస్తారని చెప్పారు. ప్రయాణికులు వేరే మార్గాల్లో రాకపోకలు సాగించాలని కోరారు.

నారెడ్కో క్యాపిటల్ జోన్ మొబైల్ యాప్ ఆవిష్కరణ



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) : నిర్మాణదారులు, వెండర్ల మధ్య అనుసంధానం కోసం నారెడ్కో యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని నారెడ్కో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య తెలియజేశారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో యాప్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణదారులు, వెండర్ల మధ్య పరస్పర సహకారం, కమ్యూనికేషన్‌ను మరింత బలపరిచేందుకు ఈ యాప్ ఎంతో దోహద పడుతుందన్నారు. రానున్న రోజుల్లో నారెడ్కో ద్వారా నిర్మాణదారులకు, వినియోగదారులకు ఆధునిక నిర్మాణ రంగానికి అవసరమైన అన్ని రకాల సేవలను అందించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మధుసూదనరెడ్డి, చుక్కపల్లి రమేష్, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ అంకారావు, సెక్రటరీ మాదాల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వి. శ్రీనాథ్, ట్రెజరర్ సీహెచ్ తిరుపతయ్య, అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

గీత దాటుతున్న తమ్ముళ్లు

దేవాలయాల ఆస్తుల కోసం టీడీపీ నాయకుల కుయుక్తులు

- గీతామందిరం ఆస్తులపై అక్రమార్కుల కన్ను
- 'కమిటీ' విషయం కోర్టులో ఉన్నా బరితెగింపు
- తమ ఇష్టానుసారం కొత్త కమిటీ వేస్తామని హెచ్చరిక
- స్థానిక ఎమ్మెల్యే అండతో చెలరేగిపోతున్న పచ్చ బ్యాచ్
- ఆర్యవైశ్య మహాసభ వారిని కలవొద్దని ఆశావహులకు వార్నింగ్
- రోజురోజుకు ముదురుతున్న మందిరం వ్యవహారం
- ఆర్యవైశ్య వర్గీయులతోపాటు నగర ప్రజలూ ఆగ్రహం

'మేం చెప్పినట్లు వినాల్సిందే.. కోర్టులో ఉంటే ఏమవుతుంది.. మా కమిటీ వేసి తీరుతాం. ఎవడు అడ్డు వస్తాడో చూస్తాం..' గుంటూరు నగరంలో ఉన్న శ్రీ గీతామందిరం విషయంలో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు ఇదీ. దేవుడు అంటే భక్తి లేదు... కోర్టులు అంటే భయమూ లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ స్థానిక ఎమ్మెల్యే వద్ద ఉంటున్న కొంతమంది వ్యక్తులు గీతామందిరం సంబంధిత ఆస్తులు దోచుకునేందుకే ఇలా బరి తెగిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

గుంటూరు పట్నంబజారులోని గీతామందిరం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గత కొద్ది రోజులుగా పట్నంబజారులో ఉన్న గీతామందిరం అంశం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉన్న కమిటీ గడువు ముగియడంతో తమనే కొనసాగించాలని ప్రతినిధులు కోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కమిటీ చైర్మన్, ఇతర పదవులు కేటాయించే అర్హత ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులకు ఉంది. దీంతో ఎంతో మంది ఆశావాహులు ఆర్యవైశ్య మహాసభ వారిని కలిసి దరఖాస్తు చేసుకునేందుకు సమయాత్తం అయ్యారు. విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు ఇలా దరఖాస్తు చేస్తే సహించబోమని ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా వార్నింగ్‌లు ఇస్తున్నారని చెబుతున్నారు.

బెదిరింపుల పర్వం...

గీతామందిరం ఆస్తులు కాజేసే కుట్రలో భాగంగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, నగర ప్రథమ పౌరుడితో కలిసి సమావేశం అయినట్లు తెలుస్తోంది. స్పష్టంగా స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లో కమిటీ వేయాలనే దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆత్మీయసభ పేరుతో సమావేశం పెట్టిన టీడీపీ నేతలు చైర్మన్ పదవిని ప్రకటించారు. దీనికి అడ్డు వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. టీడీపీ నేతలు ఎన్ని ఇబ్బందులు పెడతారోననే భయంతో ఆర్యవైశ్య ప్రముఖులు కూడా ముందుకు రాలేని పరిస్థితి. కోర్టులో కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ కమిటీ వేసేందుకు సమాలోచనలు చేసినట్లు చెబుతున్నారు. పాత కమిటీ రద్దు అయినా.. కోర్టులో కేసు ఉన్నా.. ఎటువంటి తీర్పు వచ్చినా.. తాము అనుకున్నది చేస్తామని బాహాటంగానే చెప్పేస్తున్నారు. ఈ నెల 24వ తేదీకి కోర్టు వాయిదా ఉందని పాత కమిటీ సభ్యులు చెబుతున్నారు. చట్టాలకు గౌరవం ఇచ్చి టీడీపీ నేతలు ఇకనైనా ఆగుతారో..? లేక వారి ఇష్టానుసారంగా కమిటీలు వేస్తారో..? అని ఆర్యవైశ్యుల్లో చర్చ నడుస్తోంది.

అర్చకులకూ వేధింపులు

నిత్యం అందరూ బాగుండాలని ఆకాంక్షించే వారు అర్చకులు. ఆఖరికి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకులకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆర్యవైశ్య సంఘాల వారు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా వచ్చిన భక్తులు అర్చకులకు తమకు తోచినంత కానుకలు ఇచ్చి వెళ్లడం సహజం. టీడీపీ చెందిన ఒక నేత రెండు రోజుల క్రితం ఆలయ అర్చకుడిని పిలిపించి.. 'నాకు రూ.50 వేలు ఇవ్వాలి. రూ.2 లక్షల వరకు సంపాదించవట కదా. ఇవ్వకుంటే దేవదాయ శాఖ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసి ఉద్యోగం తీయించేస్తానని' బెదిరింపులకు పాల్పడినట్లు ఆర్యవైశ్యులు బాహాటంగానే చెబుతున్నారు. అర్చకులను కూడా వదలిపెట్టడం దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయం, గీతామందిరం విషయంలో టీడీపీ నేతలు కొందరు స్థానిక ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకుని చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

హామీలకే పరిమితం

తూర్పు నియోజకర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తన ఎన్నికల ప్రచార కరపత్రంలో స్పష్టంగా కన్యక పరమేశ్వరి ఆలయ పరిరక్షణకు పాటుపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కేవలం టీడీపీలో ఉన్న కేవలం కొందరు ఆర్యవైశ్యుల కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మిగతా వారు తమ సమస్యలను చెప్పుకొనేందుకు వెళ్లినా పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే తరహాలో వ్యవహారం కొనసాగితే టీడీపీ అధిష్ఠానానికి ఇక్కడి నేతల తీరుపై ఫిర్యాదు చేసేందుకు ఆర్యవైశ్య సంఘాలు సన్నద్ధం అవుతున్నాయి.

నసీర్ అహ్మద్ తన ఎన్నికల ప్రచార పత్రంలో పేర్కొన్న ఆలయ అభివృద్ధి, సంరక్షణ హామీ

వీఐపీల రాకపోకలకు పోలీసులు కాపలా

తాడికొండ: 'సాక్షి' చొరవతో రాజధానికి వెళ్లే రహదారిపై వీఐపీలు, వీవీఐపీల రాకపోకలకు ఎట్టకేలకు కొంత ఉపశమనం కలిగింది. గుంటూరు నుంచి తుళ్లూరు ప్రాంతానికి వెళ్లే రోడ్డుపై తాడికొండ నుంచి భారీగా గుంతలు ఏర్పడ్డాయి. లారీలూ పడిపోవడంతోపాటు గుంతల వద్ద వీఐపీలు, వీవీఐపీల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం 'సాక్షి'లో 'హైకోర్టు జడ్జీలకు తప్పని ఇక్కట్లు' పేరిట ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మరమ్మతులు జరుగుతున్న ప్రాంతం వద్ద పోలీసులను ఏర్పాటు చేశారు. మరమ్మతులకు అధికారులు చొరవ తీసుకోవడంతో పనులు కొనసాగుతున్నాయి. 'సాక్షి'తో సమస్యకు కొంత ఉపశమనం కలిగిందని పలువురు ప్రశంసిస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్

26న ఓపీ పీఎస్ పునర్నిర్మాణానికి భూమిపూజ

నగరంపాలెం: గుంటూరు జీజీహెచ్‌కు కీలకమైన ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ (ఓపీ పీఎస్) పునర్నిర్మాణం ప్రారంభం కానుంది. ఈ నెల 18వ తేదీన 'సాక్షి'లో 'ఖాకీలకు నిలువ నీడ కరువు' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ ఓపీ పీఎస్‌ను శంకర్‌విలాస్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల్లో భాగంగా తొలగించనున్నారు. దీంతో కొత్తపేట పోలీసులు, ఆసుపత్రి వైద్యాధికారులు దాతలతో సంప్రదింపులు జరిపారు. నగరంపాలెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యాధికారులు ముందుకొచ్చారు. అత్యవసర సేవల చికిత్సా విభాగం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఓపీ పీఎస్‌ను నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నెల 26న భూమిపూజ చేయనున్నట్లు ఆసుపత్రి, పోలీస్ వర్గాలు వెల్లడించాయి. వీలైనంత త్వరగా నిర్మించనున్నారు.

కంచర్లపాలెంలో పరీక్షలకు ముందు మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ శారద

ఆమే... ఒక సైన్యం

- పోరాడి సాధించుకున్న పైలట్ ప్రాజెక్ట్‌తో ముందుకు..
- 'డోర్ టు డెస్టినేషన్'తో క్యాన్సర్ స్క్రీనింగ్
- 45 రోజుల్లో 1,650 మందికి పరీక్షలు
- నాలుగు క్యాన్సర్ కేసులు గుర్తింపు
- మరోవైపు ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ
- తెనాలి డాక్టర్ శారద ఔదార్యం

తెనాలి: రోగి అనారోగ్యాన్ని సరిగ్గా తెలుసుకోలేకపోతే వ్యాధి ముదిరాక ఆ కుటుంబం వేదనకు అంతు ఉండదు. రూరల్ మండలం కోపల్లె గ్రామానికి చెందిన మల్లేశ్వరి ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. సమీప గ్రామం అంగలకుదురులో నాలుగిళ్లలో పనులు చేస్తూ గడుపుతోంది. పది నెలలుగా ఆమెను పొత్తికడుపు నొప్పి, నీరసం బాధిస్తోంది. వైద్యులు ఎక్స్‌రే, స్కానింగ్... అన్నీ తీశారు. సాధారణం అని తేల్చేశారు. ఇప్పుడు ఆమెకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మూడో స్టేజీ అని, పేగు వరకూ విస్తరించిందని తెలిసింది. మల్లేశ్వరిలో ఈ పెనుముప్పును గుర్తించింది తెనాలిలోని డీ3 శారద సర్వీస్ సొసైటీ. ప్రైవేటు వైద్యురాలైన డాక్టర్ డి.శారద నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవ సంస్థ ఇది. క్యాన్సర్ రహిత మహిళలు లక్ష్యంగా గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో వార్డుల వారీగా ఉచిత స్క్రీనింగ్ క్యాంపులను జరిపారు. ఏళ్లుగా ప్రతినెలా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తూ అవసరమైతే మందులు ఇస్తున్నారు.

అన్నీ తానై సేవలు...

కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి వైద్యం చేశారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సమకూర్చారు. పలువురికి ప్రాణాపాయం తప్పించారు. 'ధర్మ' ప్రాజెక్టుతో అత్యవసర వైద్య పరీక్షలు, సేవలను అందిస్తున్నారు. తన లక్ష్యాన్ని సాధించేందుకు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖచే పైలట్ ప్రాజెక్టు సాధించుకున్నారు. ఆ ప్రాజెక్టు పేరు 'డోర్ టు డెస్టినేషన్'. తెనాలి మండలంలోని మూడు వేల మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి, తగిన వైద్యం అందేలా చూడటం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా, నిర్వహణ భారమంతా డాక్టర్ శారదే భరిస్తున్నారు. రోజూ 20 నుంచి 30 మందికి సమాచారం ఇచ్చి, పరగడుపున రక్త నమూనాలను సేకరిస్తున్నారు. బీపీ, షుగర్, క్రియాటిన్, థైరాయిడ్ వంటివి చూస్తున్నారు. చినరావూరులోని క్యాంప్ బిల్డింగ్ వద్ద పరిసరాల్లోని ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. మహిళలు సామూహికంగా చేరి, సమాచారమిస్తే అంబులెన్స్ సహా వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. రిపోర్టులు వచ్చాక సమస్య ఉంటే రోగికి తెలియపరిచి, మందులను ఉచితంగా ఇస్తున్నారు. గర్భాశయ ముఖద్వారానికి చిన్న పుండ్లు వంటివి ఉంటే భవిష్యత్‌లో దుష్ఫలితాలు రాకుండా క్రయోథెరపీ పద్ధతిలో చికిత్స చేస్తున్నారు.

నలుగురికి నిర్ధారణ

డిసెంబరు 31వ తేదీ వరకు అమలులో ఉండే ఈ పైలట్ ప్రాజెక్టులో స్క్రీన్, ట్రేస్, ట్రీట్ అనే విధానాన్ని అమలు పరుస్తున్నారు. ఇప్పటి వరకు డాక్టర్ శారద 1,650 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ముగ్గురికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఒకరికి రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. కోపల్లెకు చెందిన మల్లేశ్వరి వీరిలో ఒకరు. అప్పులు చేసి రూ.10 వేలు పోసినా ఆమెలోని మహమ్మారిని గుర్తించలేకపోయారు. 'అంతర్గత పరీక్షలు లైటు వేసి చూసే నాథులు ఇప్పుడు లేరు' అంటారు. ప్రస్తుతం ఆమెకు రేడియేషను ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. ఇంకా 1,350 మందిని పరీక్షించాల్సి ఉందని డాక్టర్ శారద అన్నారు. ఇంటి వద్దనే స్క్రీనింగ్ చేసే వ్యవస్థ రావాలనేది ఆమె అభిప్రాయం. రోగులకు టాంపర్ రెసిస్టెన్స్ విత్ జీపీఎస్ ఉండటం అవసరం అంటారు. సూపర్ మార్కెట్లోనే కస్టమరు వచ్చి వెళుతున్న సమయం రికార్డు అవుతున్నప్పుడు ఆసుపత్రుల్లో రోగుల విషయంలో ఎందుకు ఉండవని ప్రశ్నించారు. మహిళల్లో క్యాన్సర్ లేకుండా చూడటం ప్రధానమని, ముందుగా వ్యాధిని గుర్తించగలిగితే చికిత్స కూడా ఉందనే విషయాన్ని మరువరాదని అన్నారు.

కష్టాల 'ప్రయాణం'

- గుంటూరులో బస్సు, రైల్వే ప్రయాణికులకు అవస్థలు
- పలు ప్రాంతాల్లో మచ్చుకైనా కనిపించని బస్ షెల్టర్లు
- వంతెన పనులతో కొన్నిచోట్ల కూల్చివేసిన అధికారులు
- నిలువు కాళ్లపైనే నిత్యం ప్రయాణికుల పడిగాపులు
- గమ్యస్థానాల వివరాలు తెలిపే సూచికలూ కరువు
- చంద్రబాబు సర్కారు వచ్చాక ప్రణాళిక లేకుండా పనులు
- సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

పల్నాడు బస్టాండ్ వద్ద ఎండలో కూర్చున్న ప్రయాణికులు

నగరంపాలెం: గుంటూరు నగరం, శివారు మీదుగా ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ఏ బస్సులు ఎటు వెళ్తాయనే విషయం కూడా తెలిపే సూచికలు కనిపించడం లేదు. గమ్యస్థానాలను తెలియజేస్తూ బోర్డులు కానరావు. బస్సుల కోసం వేచి ఉందామంటే కూర్చునేందుకు షెల్టర్‌లు ఉండవు. అరకొరగా ఉన్న వాటిల్లో బెంచీలు కనిపించవు. ఒకటీ ఆరా బెంచీలపై ఎవరెవరో కూర్చోవడమో, నిద్రించడమో పరిపాటిగా మారింది. ఇంకొన్నిచోట్ల వాహనాలు పార్కింగ్ చేశారు. శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పునర్నిర్మాణం దృష్ట్యా కొన్ని చోట్ల బస్‌షెల్టర్‌లను తొలగించారు. రైల్వే, ఆర్టీసీతోపాటు జీఎంసీ అధికారుల అలసత్వం ప్రయాణికులకు శాపంగా మారింది.

ఐదు కి.మీ. దూరంలో..

గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు ఐదు కి.మీ. దూరంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లు ఉన్నాయి. గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి రోజూ సుమారు 40కి పైగా రైళ్లు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి వందల్లో బస్సులు రాకపోకలు సాగిస్తాయి. వేల మంది గుంటూరు మీదుగా ప్రయాణిస్తుంటారు. నగరంలోని సుమారు పది లక్షలకుపైగా ఉన్న జనాభాకు ఈ రెండు స్టేషన్లు కీలకం. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ స్టేషన్లకు కూతవేటు దూరంలో షెల్టర్‌లు లేవు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో తూర్పు, పశ్చిమ వైపు దిగే ప్రయాణికులు బస్టాండ్ లేదా ఇతరత్రా వాహనాల్లో వెళ్లేందుకు గుంటూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం వైపు, అరండల్‌పేట ఒకటో వీధి వైపునకు వస్తారు. రెండు వైపులా షెల్టర్‌లు లేవు. దీంతో లగేజీలు, ఇతర సామగ్రి కాళ్ల వద్ద పెట్టుకుని వాహనాల కోసం వేచి ఉండాల్సిందే. వాహనాలు వచ్చి, బాడుగ మాట్లాడుకునే వరకు పిల్లలు, పెద్దలతో కాళ్లపై నిలబడాల్సిందే. జీజీహెచ్ ప్రధాన ద్వారం సమీపాన ఓ షెల్టర్ ఉన్నా అపరిచిత వ్యక్తులు, ఇళ్ల నుంచి వచ్చిన వారితో నిండిపోతోంది. అరండల్‌పేట ఒకటో వీధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వర్షాకాలమైతే ఆటోలు రైల్వేస్టేషన్ లోపలికి వస్తేగానీ ఎక్కే పరిస్థితి లేదు.



పార్కింగ్ స్థలంగా మారిన షెల్టర్

సమన్వయ లోపమే..

శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రయాణికుల పరిస్థితి దయనీయంగా ఉంది. బస్టాండ్ నుంచి బయలుదేరే బస్సులు నగరంలోని ప్రధాన కూడళ్ల మీదగా ఎటు వైపు వెళ్తాయనేది తెలియడం లేదు. ఎక్కడెక్కడ నిలుపుతారు, నిర్ణీత వేళలకు సంబంధించిన సూచికలు ఏర్పాటు చేయలేదు. ఏదైనా ఆర్టీసీ బస్ కనిపిస్తే చాలు పరుగెత్తడం ప్రయాణికులకు నిత్యకృత్యమైంది. ఆర్టీసీ, జీఎంసీ ఉన్నతాధికారులు సమన్వయంతో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇతర సమస్యలపైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్నాడు బస్టాండ్ వద్ద..

పల్నాడు బస్టాండ్ వద్ద ప్రయాణికుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బస్సుల కోసం వేచి చూసేవారు పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైపు వెళ్తుంటారు. కనీస సౌకర్యాలు లేవు. వందల మంది ఎండలో ఉండిపోవాల్సిందే. సరిపడా బెంచీల్లేవు. పైకప్పుతో ఉన్న ఒక్క షెల్టర్ కిందే వేచి ఉంటున్నారు. ఉచిత బస్ సర్వీస్‌లు వచ్చాక వసతులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

తొలగించేశారు..

ఆర్టీసీ బస్టాండ్ నుంచి నగర ప్రధాన రహదారుల మీదుగా వెళ్లే ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. శంకర్‌విలాస్ వంతెన నిర్మాణం దృష్ట్యా ఏసీ కళాశాల ఎదురు, తాలూకా వద్దనున్న బస్‌షెల్టర్‌లను తొలగించారు. సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డులోని రెండు , నగరంపాలెంలో ఓ షెల్టర్ తీసేశారు. అమరావతి రోడ్డులో షెల్టర్‌ను గతంలోనే తొలగించారు. ఇక బస్టాండ్ ఎదురు మూడు బస్‌షెల్టర్‌లు ఉన్నాయి. ఒకచోట కుర్చీలు ఉండవు. మీటర్ల దూరంలో మరో రెండు ఉన్నప్పటికీ, ఒక దానికి ఎదురుగా బైకులు, మరో షెల్టర్‌లో కార్లు నిలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా చంద్రబాబు ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించండి

గుంటూరు వెస్ట్: మరుగుదొడ్ల ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా జిల్లా పారిశుద్ధ్య కమిటీ రూపొందించిన పోస్టర్‌ను గురువారం కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన జరగరాదని చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ శుక్రవారం నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. డిసెంబర్ 6 నుంచి 9 వరకు మరుగుదొడ్ల సుందరీకరణ ఆవశ్యకత సర్వే చేస్తామన్నారు. అదే నెల 10న ముగింపు మరియు మరుగుదొడ్ల చక్కటి నిర్వహణ, సుందరీకరణకు అవార్డుల బహూకరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 700 గరిష్టం : రూ. 1000

మోడల్ ధర రూ. 700

మిర్చి యార్డు సమాచారం (గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	51,202
అమ్మకాలు	54,998
నిల్వ	10,210

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–18,200
నంబరు–5	11,500–16,000
341	10,000–17,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–18,000
నంబరు–5	12,000–16,500
341	11,500–18,000
4884	11,000–14,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 16,000
బాడిగ–355	11,000 – 18,200
దేవనూరు డీలక్స్	11,000 – 17,500
ఆర్మూర్	11,500 – 14,300
తాలుకాయలు	5,500 – 9,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–16,000
బాడిగ – 355	10,000–18,500
దేవనూరు డీలక్స్	10,500–17,700
తాలు	5,300 – 9,000

–కొరిటెపాడు (గుంటూరు)

ఆనాటి స్నేహం..

మధురాతి మధురం

- గుంటూరు వైద్య కళాశాల 1959–65 బ్యాచ్ వైద్య విద్యార్థుల కలయిక
- 66 ఏళ్ల అనంతరం తొలిసారిగా వైద్యుల రీ యూనియన్

66 ఏళ్ల తర్వాత కలుసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాల 1959–65 బ్యాచ్ వైద్య విద్యార్థులు

గుంటూరు మెడికల్: నూనుగు మీసాల నూత్న యవ్వనంలో వైద్య కళాశాలలోకి అడుగుపెట్టారు. చదువు పూర్తిచేశారు. వైద్యవృత్తుల్లో స్థిరపడిపోయారు. కాలచక్రం గిర్రున తిరిగింది. వైద్యవిద్య పూర్తిచేసుకుని 66 ఏళ్ల దాటాయి. ఈ సందర్భంగా వారికి ఓ రోటు స్నప్తంగా కనిపించింది. ఇప్పటివరకు తమ పాత స్నేహితులను ఒక్కసారైనా కలవలేదే బాధ వారందరిలో మెదిలింది. వెంటనే పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయాలని సీనియర్ మోస్ట్ వైద్యులంతా నిశ్చయించుకున్నారు. వైద్య వృత్తిలో దేశ విదేశాల్లో ఉండి, కుటుంబ బాధ్యతలు, వయస్సు రీత్యా వచ్చే సమస్యలు అన్ని అధిగమించి ఎట్టకేలకు గురువారం గుంటూరులో రీ యూనియన్ పేరుతో గుంటూరు వైద్యులంతా కలుసుకున్నారు. ఆరు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వైద్యులంతా ఒక్కసారిగా ఆనంద సాగరాల్లో మునిగితేలారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆనంద డోలికల్లో విహరించారు. ఆ నాటి ఆ స్నేహం ఆనందగీతం... ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం... అంటూ పాటలు పాడుకున్నారు. గోడలు దూకిన రోజులు... మోకాలికి తగిలిన దెబ్బలు అంటూ తమ చిన్ననవ్వు చిలిపి అల్లరి చేష్టలను చెప్పుకొని సంతోషపడ్డారు. వైద్య కళాశాలలో చేరిన రోజుల్లో ఏ విధంగా ఒకరినొకరు నిక్‌నేమ్స్‌తో పిలుచుకున్నారో ఒక్కసారిగా గుర్తుకు తెచ్చుకున్నారు. వయస్సు 80 దాటినా వారు 20 ఏళ్ల యువతీ, యువకుల మాదిరిగానే ఆట పాటలతో అలరించి అందరిని ఆశ్చర్య పరిచారు. కాలగమనంలో మృతిచెందిన తమ మిత్రులను స్మరించుకుని, నివాళులు అర్పించారు. మరోసారి ఇలా కలుసుకోవాలని మదిలో నిశ్చయించుకుని మదినిండా తీయటి జ్ఞాపకాలతో ఒకరిని విడిచి ఒకరు వీడిలేక వీడి వెళ్లారు.

అరుదైన రికార్డు సృష్టించిన వైద్యులు....

గుంటూరు వైద్య కళాశాలలో 1959–65 ఎంబీబీఎస్ చదివిన వైద్యులు అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. తాము వైద్య విద్య అభ్యసించిన 66 ఏళ్ల అనంతరం ఒక్కసారి కూడా రీ యూనియన్ చేసుకోకుండా వైద్య కళాశాలలో ఎవ్వరూ ఊహించని విధంగా గురువారం రీ యూనియన్ పేరుతో గుంటూరులో కలుసుకున్నారు. ఈ బ్యాచ్‌లో 131 మంది ఎంబీబీఎస్ చదవారు. వీరిలో సగం మంది మహిళలే ఉన్నారు. వీరిలో 40 మంది మరణించారు. ఒక్కొక్కరి వయస్సు 80 నుంచి 86 ఏళ్ల మధ్య ఉంటుంది. మొత్తం 26 మంది పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అమెరికా, యూకే, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి గుంటూరు వచ్చారు. తౌలంత బ్రాడీపేట ఎంవీఎస్ ఆర్ ఆఫీసులో మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ ప్రత్యేక ఆకర్షణ. ఆమె కూడా చదువుకున్నారు. క్యాపిటల్ హోటల్‌లో సమావేశమై జ్ఞాపకాలు నెమర వేసుకున్నారు. డాక్టర్ టీఎస్ఎన్ మూర్తి తన 84వ పుట్టినరోజు వేడుకలు బ్యాచ్ మేట్స్ సమక్షంలో చేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ

ఎంబీబీఎస్ చదివి వైద్య వృత్తిలో బిజీగా ఉంటూనే రాజకీయాల్లోకి ప్రవేశించి చిలకలూరిపేటలో 1989లో ఎమ్మెల్యేగా ఎన్నికైన కందిమళ్ల జయమ్మ రీ యూనియన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన ఉన్నతికి కారణమైన గుంటూరు జీజీహెచ్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైద్యులు ఎస్.వి.రమణారావు, పి.ఎస్.జ్యోతి, టి.కృష్ణమూర్తి, రంగారావు, మహేష్, అప్పారావు, లలిత కుమారి, తదితరులు తమ అనుభవాలు పంచుకున్నారు.

బాల్య వివాహ ఘటనలో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు రూరల్: సౌత్ సబ్‌డివిజన్ పరిధిలో 13 ఏళ్ల బాలిక వివాహ ఘటనలో వరుడు, అతని తల్లిదండ్రులను సౌత్ సబ్ డివిజన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నగరంలోని సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భానోదయ నిందితుల వివరాలను వెల్లడించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కపాలెం గ్రామంలో ఈ ఏడాది మే 9వ తేదీన తనకు జరిగిన వివాహంపై చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ బాలిక అందించిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలో బాలికలు, మహిళల రక్షణ, భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.

➡ తురకపాలెం గ్రామానికి చెందిన మహిళ భర్త అకాల మృత్యువాతకు గురవ్వటంతో తల్లితో కలిసి పెదకాకానిలోని పుట్టింటి వద్ద నివాసం ఉండేవారు. ఈ క్రమంలో బాలిక తండ్రి స్వగ్రామమైన వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో తండ్రి తరఫున వచ్చే ఆస్తిలో వాటాకోసం బాలిక మేనత్త కొడుకును వివాహం చేసుకోవాలని మేనత్త కొరవి నిర్మల, భర్త కొరవి శ్యాంసన్‌లు పలు దఫాలుగా బాలిక తల్లిని ఒత్తిడి చేశారు. దీంతో వారి ఒత్తిడికి తట్టుకోలేక బాలిక తల్లి బాలికను మేనత్త కొడుకు కొరవి దానియేలు (26)కు ఇచ్చి తురకపాలెం గ్రామంలో ఈ ఏడాది మే నెల 9వ తేదీన స్థానిక చర్చిలో కుటుంబ సభ్యులు, బంధువులు, చర్చి పాస్టర్ సమక్షంలో వివాహం జరిపించారు. అప్పటినుంచి బాలికను బడికి పంపకుండా తన భర్త పలుమార్లు తనపై లైంగిక వాంఛలు తీర్చుకున్నాడని, ఇంటివద్ద ఉంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బాలిక తల్లికి ఫోన్‌చేసి చెప్పింది.

➡ నెల రోజుల క్రితం బాలిక తల్లి మైనర్ బాలిక మేనత్త, మేనమామలకు చెప్పి బాలికను తీసుకుని పెదకాకానిలోని ఆమె నివాసానికి తీసుకు వెళ్లింది. నెల రోజుల తరువాత బాలిక మేనత్త, మామలు కాపురానికి పంపాలని బాలిక తల్లిని, బాలికను ఒత్తిడి చేస్తుండటంతో బాలిక భయపడి 1098 చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఈనెల 8వ తేదీన ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో తురకపాలెం గ్రామ సెక్రటరీ బ్రహ్మానాయుడు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కావటంతో బాలిక వద్దిన సమాచారాన్ని దర్యాప్తు చేయగా మైనర్ బాలిక వివాహం జరిగినట్లు రుజువు కావటంతో గ్రామ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులైన కొరవి దానియేలు, మామ కొరవి శ్యాంసన్, అత్త నిర్మలను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించామని తెలిపారు. ఘటనలో వివాహం జరిపించిన చర్చి పాస్టర్‌పై, వివాహానికి హాజరైన బంధువులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలి

నరసరావుపేట: మావోయిస్టు అగ్ర నాయకులు హిడ్మా, టెక్ శంకర్, పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని స్టేషన్ రోడ్డు గాంధీపార్కు ఎదుట ప్రజాసంఘాలు నిరసన చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(డీపీఎం) సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు మాట్లాడుతూ అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో అగ్ర నాయకుడు హిడ్మా, ఆతడి భార్య రాజే మరో నలుగురు మావోయిస్టులు, ఆ మరుసటిరోజు టెక్ శంకర్‌తో సహా ఏడుగురు బూటకపు ఎన్‌కౌంటర్లకు గురయ్యారన్నారు. వీటిపై ప్రజలకు అనుమానాలు ఉన్నందున న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కగార్ పేరుతో రెండేళ్ల నుంచి 720 మందికి పైగా ఆదివాసులు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపిందన్నారు. దీనిపై న్యాయవిచారణ చేపడితేనే నిజం బయటపడుతుందన్నారు. ఇది భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. మావోయిస్టులు, ఆదివాసులతో శాంతి చర్చలు నిర్వహించాలని పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా దొరికిన వారిని దొరికినట్లు కాల్చి చంపుతున్నారన్నారు. దేశ ప్రజలు మానవ హక్కుల మీద ఆందోళన చేయాలన్నారు. చట్టం ప్రకారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించాలని, కాల్పులను ఆపివేయాలని ఉద్యమించాలని కోరారు. దోపిడీ వ్యతిరేక పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు ఇచ్చారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కిశోరం చిన్న, ప్రజా కళామండలి రాష్ట్ర నాయకురాలు ఉస్సాం రాణి పాల్గొన్నారు.

అగ్రికల్చర్ బీటెక్ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, బాపట్ల, మడకశిర కళాశాలల్లో మిగిలిన అగ్రికల్చర్ బీటెక్ సీట్ల భర్తీకి ఈనెల 27వ తేదీన స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్స్‌ను గుంటూరు శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న పరిపాలన భవనంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ అడ్మిషన్స్‌కు ఇంటర్‌లో ఎంపీసీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణులైన ఏపీఈఏపీసెట్ 2025 ర్యాంకులు పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను లేదా 8008103115, 9951663399 సెల్ నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

ఇంకుడు గుంతల ఆవశ్యకతను తెలియజేయండి

నారాకోడూరులో చెత్త సంపద కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈఓ

చేబ్రోలు: ఇంకుడు గుంతల ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించి చైతన్య పరచాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతిబసు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో తిరిగి పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించి చెత్త సంపద తయారీ కోసం సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఎంపీడీఓ టి.ఊహారాణి, డిప్యూటీ ఎంపీడీఓ రవిశంకర్, సర్పంచ్ సాంబశివరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

ప్రత్తిపాడు: సిలిండర్ పేలి పూరిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన కాకుమాను మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కాకుమాను మండలం తెలగాయపాలెంకు చెందిన వేముల ఇశ్రాయేలు ఇంట్లో గురువారం ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు, సామగ్రి అన్నీ మంటల్లో దహనమయ్యాయి. మంటలను అదుపుచేసేందుకు తీవ్ర ప్రయాస పడాల్సి వచ్చింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ బి.వెంకటస్వామి రెవెన్యూ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపారు. వారికి తక్షణ సాయంగా బియ్యం అందించడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదన్నారు.

వైఎస్సార్ సీపీలో నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన దరావత్ సాంబశివానాయక్‌ను పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

విద్యుదాఘాతంతో సిమెంట్ కూలీ మృతి

అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో సిమెంట్ పనులకు వెళ్లే కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. గ్రామానికి చెందిన ఉసిరికాయల నరసింహారావు ఉరఫ్ మునయ్య (54) గ్రామంలో ఇంటి నిర్మాణపనుల్లో కూలి పనికి వెళ్లాడు. పని నిమిత్తం ఇంటిపైకి వెళ్గా ఇంటిపైన 11కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడి నుంచి కిందపడిపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌పై దాడి

- పోలీసుల అదుపులో ఒకరు, పరారీలో ముగ్గురు
- ల్యాప్‌టాప్‌లు, ఏటీఎం కార్డులు, బ్యాంక్ పాసు పుస్తకాలు, ఫోన్లు స్వాధీనం

మంగళగిరి టౌన్ : ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందంటూ పోలీసులకు సమాచారం రావడంతో మంగళగిరి రూరల్ పోలీసులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు మంగళగిరి మండలం చినకాకాని గ్రామం ఎన్ఆర్ఐ ఆసుపత్రి వెనుక ఉన్న ఎస్.వి.ఎన్. రెసిడెన్సీలోని ఓ ఫ్లాట్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందంటూ మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందింది. నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ బ్రహ్మం ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకట్ తన సిబ్బందితో ఈనెల 16వ తేదీ రాత్రి దాడి చేశారు. ఏసన్న అనే యువకుడిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారైనట్లు సమాచారం. ఐదు ల్యాప్‌టాప్‌లు, 32 సెల్‌ఫోన్లు, 23 ఏటీఎం కార్డులు, 22 బ్యాంక్ పాస్ పుస్తకాలు, 11 చెక్‌బుక్‌లతో పాటు పలు ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత ఐదు నెలల క్రితం ఈ అపార్ట్‌మెంట్‌లో నలుగురు యువకులు ఫ్లాట్ తీసుకుని ఉంటున్నారు. మచిలీపట్నం పోర్టు రోడ్డుకు చెందిన కొక్కిలిగడ్డ ఏసన్న, తణుకుకు చెందిన బాలు, మరో ఇద్దరు ప్రవీణ్, సూర్యలు కలసి నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తూ జనాల వద్ద నుంచి అందినంత దోచుకుంటున్నారు. హుబ్లీబుక్.కామ్ పేరుతో యూజర్ ఐడీలు క్రియేట్ చేసి యూజర్‌లకు డబ్బు ఆశ చూపి ఈ దందా కొనసాగిస్తున్నారు. వాట్సప్ ద్వారా కస్టమర్లకు కాంటాక్ట్ అయి ఫోన్ నెంబర్ ఇస్తే యూజర్ ఐడి, పాస్‌వర్డ్ క్రియేట్ చేసి ఇస్తారు. వీటి ద్వారా లాగిన్‌అయ్యి వాటిలో ఉన్న కొన్నిరకాల గేమ్స్ ఆడుకోవడం ద్వారా నగదు రావడం, పోవడం జరుగుతుంది. ఇందులో ప్రధానంగా తణుకు చెందిన బాలు కొన్ని ఫేక్ బ్యాంక్ అకౌంట్లు క్రియేట్ చేశాడు. కొంతమంది వ్యక్తుల నుంచి వారికి కొంత మొత్తం డబ్బులు చెల్లించి వారి ఆధార్ కార్డులు సేకరించి రకరకాల బ్యాంకుల్లో పథకం ప్రకారం ముందుగా తీసుకున్న సిమ్ నెంబర్లు ఇచ్చి బ్యాంక్ అకౌంట్‌లు ఓపెన్‌చేశాడు. ఈ ఖాతాలను వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి రిజిస్ట్రేషన్ ఫీ దగ్గర నుంచి మొత్తం నగదు లావాదేవీలను ఆ ఫేక్ అకౌంట్ ద్వారా నిర్వహిస్తుంటాడు. ముందుగా కస్టమర్స్‌కు కొంత లాభం వచ్చేలా చేసి తరువాత ఎక్కువ డబ్బులు బెట్టింగ్ పెట్టినప్పుడు వారిని మోసం చేస్తూ ఉంటారు. గేమ్ ఆడిన తరువాత డబ్బులు కస్టమర్‌కు వస్తే వాటిని విత్‌డ్రా చేయడం వంటి పనిని మిగిలిన ముగ్గురూ చూసుకుంటారు. బాలూ లేని సమయంలో మచిలీపట్నంకు చెందిన మరో యువకుడు మనోహర్ మంగళగిరి పట్టణంలో ఉంటూ ఈ వ్యవహారాన్ని నడుపుతూ ఉంటాడు. వాళ్లు బయటకు రాకుండా వారి అవసరాలన్నీ అతనే చూస్తుంటాడు. బాలు దగ్గర ఉన్న 31 బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఈ వ్యవహారం అంతా బాలు, మనోహర్‌లే చూసుకుంటారు. ఈ ఘటనపై గేమింగ్ యాక్ట్ కింద వీరిపై మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



కెనరా బ్యాంక్ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంకు వ్యవస్థాపకులు అమ్మెంబాల్ సుబ్బారావు జయంతి, బ్యాంకు 120వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాంతీయ అధికారి డి.రాజ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

– కొరిటెపాడు

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, కలెక్టరు తమీమ్ అన్సారియా

తెనాలిరూరల్/కొల్లిపర: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా అతి తక్కువ సమయంలోని వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మండల పరిధిలోని దావులూరు గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షత వహించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా ప్రభుత్వం ధాన్యం కొలుగోలు చేయటం జరుగుతుందని అన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం 51లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే సంకల్పంతో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 209 రైతు సహాయ కేంద్రాల పరిధిలో 47 కస్టర్లు ద్వారా గురువారం నుంచి ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుకు 6.54 కోట్ల గోతాలు సరఫరా చేయటం జరిగిందన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల లోపు రైతులు ధాన్యం అందిస్తే సాయంత్రం 6 గంటలలోపే వారి ఖాతాలో నగదు జమ అయ్యే విధంగా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందన్నారు. ఒక్క బ్యాంకు సెలవు దినాలు తప్పా మిగిలిన అన్ని రోజుల్లో 4 గంటల లోపల నగదు జమ అవుతుందని తెలిపారు. ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 2.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు గంటలలోపే రూ.680 కోట్ల నగదు జమ యటం జరిగిందన్నారు.

రైతులకు ఉచితంగా టార్పాలిన్ పట్టలు

తెనాలి రూరల్: రాష్ట్రంలోని రైతులకు ఉచితంగా టార్పాలిన్ పట్టలను పంపిణీ చేస్తున్నట్టు రాష్ట్ర ఆహార, పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్ లింగారావు సెంటరులో గురువారం సాయంత్రం ఆయన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలకు ఇబ్బందులు పడకుండా రైతులకు టార్పాలిన్ పట్టాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలుస్తోందని, ఈలోగా రైతులు తమ పంటను అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి వృద్ధురాలి మృతి

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలు బస్సు కింద పడి మృతి చెందిన సంఘటన ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం నాగార్జునపేటకు చెందిన ముగావత్ జాంకి (85) గుంటూరులో ఆమె కుమార్తె వద్దకు వచ్చింది. బాపట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇన్ గేటు వద్ద బస్టాండ్‌లోకి వెళుతూ డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలిపై ముందు టైర్ ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడే కళాశాలల పరీక్ష కేంద్రాలు రద్దు

ఏఎన్‌యు(పెదకాకాని): మాస్ కాపీయింగ్‌కు పాల్పడే ఏ కళాశాలకైనా పరీక్షా కేంద్రాలను రద్దు చేయడం జరుగుతుందని వర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ఆలపాటి శివ ప్రసాద్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని డెల్టా ప్రాంతాల్లోని పలు కళాశాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు మీడియా ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షా కేంద్రాలకు తనిఖీ బృందాలను, పరిశీలకులను నియమించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ కళాశాలలోనైనా మాస్ కాపీయింగ్ జరిగినట్లు తెలిస్తే ఆ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేయడం జరుగుతుందని గురువారం సీఈ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ Spot Admissions: Bring Originals before 2 PM 20/11/2025, BA History / Spl English, B.Com Comp App only Rs 5000 per semester. PLNM Degree College, opposite: ANU. Cell: 91774 08565

REAL ESTATE

TOLET

■ గుంటూరు సిద్ధార్థ నగర్ బైపాస్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK Fully Furniture, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె నెలకు రూ.60,000/- సంప్ర।। 9849719999

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED

■ సోలార్ టెక్నాలజీ గుంటూరులో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ టెలికాలర్స్ 3సం।। అనుభవం గలవారు కావలెను. అర్హత: ఐటిఐ, డిగ్రీ. 7981187970

■ గుంటూరు యడ్లపాడు వద్ద బోయపాలెంలో పనిచేయుటకు 1సం।। అనుభవం గల సెక్యూరిటీ ఆఫీసర్ కావలెను. అర్హత : డిగ్రీ, 12గం।। డ్యూటీ, జీతం: 20,000/-. సంప్ర।। 9502087373

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ నందు క్లాసు ఇన్‌ఛార్జ్, హాస్టల్ ఇన్‌ఛార్జ్, వార్డెన్స్‌గా పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10,000/- నుండి 13,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9100024059

■ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3సం।।ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ 30 సం।।ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్, క్లాసు ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము 14వేలు నుండి 21వేలు వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు : ఇంటర్ నుండి పిజి వరకు వయస్సు 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

■ నరసరావుపేట లోని ప్రముఖ అడ్వకేట్ ఆఫీస్ నందు Field work మరియు Legal Opinions టైపు చేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 9398335959

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th Pass, 35సం।।వయస్సు పైబడిన వారు, గృహిణులు కావలెను. 9989909698

■ Dabbawalaaలో సేల్స్ మేనేజర్స్/ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Salary : 24,000–36,000 (ఫీల్డ్ వర్క్) Ph : 9494324112

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్స్) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం

గుంటూరు 7075167663 7075167541

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్: విశాఖపట్నం BO-833300

డి.నెం.9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎంపైర్ బిజినెస్ ట్రేడ్ సెంటర్, సిరిపురం, విశాఖపట్నం-530003

ఇ-మెయిల్: cs8333@pnb.bank.in, ఫోన్: 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది, సమయం: 17-12-2025 ఉ॥ గం॥ 11.00 నుండి సా॥ గం॥ 4.00 వరకు

[illegible]

www.baanknet.com & www.pnbindia.in

తేది : 17-11-2025 ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

బాపట్ల పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.820/2025/ఇ1 ది.20-11-2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

[illegible] www.tender.apeprocurement.gov.in(procurement place) [illegible]

పనులు సంఖ్య : 17	అంచనా విలువ : రూ.[illegible]/-
1. [illegible]	: 20.11.2025 ఉదయం 10.00గం. [illegible]
2. [illegible]	: 24.11.2025 సాయంత్రం 4.00గం॥లకు
3. [illegible]	: 24.11.2025 సాయంత్రం 5.00గం॥లకు
పనులు సంఖ్య : 12	అంచనా విలువ : రూ.[illegible]/-
1. [illegible]	: 20.11.2025 ఉదయం 10.00గం. [illegible]
2. [illegible]	: 04.12.2025 సాయంత్రం 4.00గం॥లకు
3. [illegible]	: 04.12.2025 సాయంత్రం 5.00గం॥లకు

కమీషనర్, బాపట్ల పురపాలక సంఘం

క్లుప్తంగా

ఇంటి పన్నుల ప్రక్రియ ప్రారంభం

దుగ్గిరాల: మండలంలోని అన్ని గ్రామాలలో స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా అవినీతికి తావులేకుండా నేరుగా ఆన్‌లైన్‌లో ఇంటి పన్నులు చెల్లించాలని డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ తెలిపారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో గురువారం ఆయన ఓ ఇంటి వద్దకు వెళ్లి పన్ను కట్టించుకుని వారికి రసీదు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం కొత్త విధానంలో ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, తద్వారా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య పారదర్శకత ఉంటుందని అన్నారు. ప్రజలు నేరుగా స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా లేదా మొబైల్ నుంచే సులువుగా ఇంటి పన్ను చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

23న కాపు కార్తిక వనసమారాధన

తాడేపల్లి రూరల్: కాపు కార్తిక వనసమారాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు కాపు జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ వనసమారాధన మహోత్సవానికి కాపు కుటుంబ సభ్యులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వన సమారాధన కరప్రతాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి శివాలయం ట్రస్టు బోర్డు డైరెక్టర్ తిరుమలశెట్టి మురళీకృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, కాపు రక్షణ వేదిక నాయకులు చందు భావనారాయణ, జాతీయ కాపు సంఘం ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి రాము, కాపు చైతన్య రథం నాయకులు పులిగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పార్లమెంట్ నిర్వహణపై అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి మండల పరిధి కొనులకొండలో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల వారోత్సవాల్లో భాగంగా గురువారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్‌లో పార్లమెంట్ నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ ఎండీవో ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్ బరాయ్, సిస్టర్ విద్య మాట్లాడుతూ.. బాలల హక్కులు ముఖ్యమైనవని, ప్రాథమికంగా 4 రకాలుగా వర్గీకరించారని అన్నారు. భావిభారత పౌరులుగా పిల్లలు ఎదగడానికి సమాజ అభివృద్ధికి ఈ బాలల పార్లమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది అనూష, అత్తోట పోతురాజు, ఇశ్రాయేల్, ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై స్పందించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలని యూనియన్ నాయకులు కె.స్టీవెన్ అన్నారు. గురువారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు అంకయ్య, ఆశీర్వాదం, పిచ్చయ్య, నాగేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హగ్గయ్య, ఇశ్రాయేల్, దేవరాజు, శారమ్మ, రమాదేవి, దుర్గాభవానీ, అన్నమ్మ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తాం

తాడేపల్లి రూరల్: రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధి ప్రాతూరు, చిర్రావూరు గ్రామాల్లో నాయకులతో రైతులను కలిసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా రైతుల ఖాతాల్లో కేవలం మూడు గంటల్లోనే నగదు జమ అవుతుందని తెలిపారు. బస్తా రూ.1,792కు కొనుగోలు చేస్తున్నామన్నారు. 20369, 20389 రకం ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాన్నారు.

ఉద్యమంలా సంతకాల సేకరణ

- కూటమి ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న ప్రజలు

పూర్తయిన సంతకాల పత్రాలను వేమారెడ్డికి అందజేస్తున్న నాయకులు

సేకరించిన సంతకాల పత్రాలను వేమారెడ్డికి అందజేస్తున్న మంగళగిరి నాయకులు

కుంచనపల్లిలో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య సూచనల మేరకు మండల పరిధిలో గ్రామ గ్రామానా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ నిర్వహిస్తున్నారు. గురువారం ఉండవల్లి గ్రామ అధ్యక్షులు మున్నంగి వీర శివారెడ్డి వారికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేసి వేమారెడ్డి, నాగయ్యలకు దొంతిరెడ్డి వేమారెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. ఉండవల్లి పార్టీ నాయకులు ముందుండి తమకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ రవీంద్రరెడ్డి, నాయకులు కళ్లం పిచ్చిరెడ్డి, కూరపాటి బుల్లిబాబు, మన్నెం సుబ్బారావు, విస్తర్ల అనీల్‌కుమార్, వెంకటరమణ, జయరాజు, వల్లభాపురం శివశంకర్, అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి, భాగ్యరాజు, అనిల్, జోజిబాబు, జోజప్ప, చికెన్ కోటిరెడ్డి, దివ్య, శాంతి, అరుణ, కుసుమ, నరసమ్మ, అంకరాజు, తంబి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మంగళగిరిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉవ్వెత్తున వ్యతిరేకత ఏర్పడింది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆత్మకూరులో గురువారంతో పూర్తయ్యింది. ఇచ్చిన లక్ష్యాన్ని ముందుగా పూర్తిచేయడంతో ప్రైవేటీకరణపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు అద్దం పట్టింది. పూర్తయిన సంతకాల సేకరణ పత్రాలను ఆత్మకూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డికి నియోజకవర్గ కార్యాలయంలో గురువారం అందజేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజల మద్దతుతో ఆత్మకూరు గ్రామంలో 3,294 సంతకాల సేకరణ చేశారని వేమారెడ్డి కొనియాడారు. సంతకాల సేకరణలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, ఆత్మకూరు గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, సాంబశివరావు, కిషోర్‌రెడ్డి, ప్రేమ్ చంద్, ప్రభుదాస్, శివనాగేశ్వరరావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సుధారాణి, యేసుబాబు, శ్రీకాంత్, బుజ్జిబాబు, రత్నకోటి, ఎం.విజయ్‌బాబు, ఇందిర, రాంబాబు, యేసమ్మ, శాంత, నీలిమ, వెంకటేష్, సాయి, యేసుపాదం, కె.విజయ్‌బాబు, నరసింహారావు, దుర్గారావు, బుజ్జి, సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ..

తాడేపల్లి రూరల్: నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య సూచనల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాడేపల్లి రూరల్ పరిధి కుంచనపల్లి, కొలనుకొండ, ప్రాతూరు గ్రామాల్లో పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు, నూతక్కి శ్రీనివాసరావు, డోగిపర్తి షారోన్(చలపతి) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో నాయకులు శిఖా నాగేశ్వరరావు, బాణావత్ వెంకటేశ్వరరావు, వెనిగంటి రాంబాబు, శిఖా బాజీ, పౌలు, రబ్బాని, మాలాది జాను, నిరంజన్, సీతారామరాజు, బాలరాములు, జిలాని, జాన్, కరిముల్లా, కార్యకర్తలు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పేరేచర్ల డొంక నరసరావుపేట రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వాసు(22) అనే యువకుడు ఫిరంగిపురం నుంచి గుంటూరు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో పేరేచర్ల దగ్గర తన బైకును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆయన కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు. వాసు చికిత్స పొందుతూ అక్కడ మరణించాడు. యువకుడిది గుంటూరు జిల్లా వెంగళయపాలెంగా గుర్తించారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

మంగళగిరి టౌన్: యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళగిరి మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. యర్రబాలెం గ్రామం అంబటి నగర్‌కు చెందిన సన్నాయిల శివశంకర్(23) విజయవాడలోని ఓ ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ఇంట్లో వారందరూ ఎవరి పనుల నిమిత్తం వారు బయటకు వెళ్లగా శివశంకర్ ఒక్కడే ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ క్రమంలో చున్నీతో ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి శివశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న రవి

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలో ఈనెల 23, 24 తేదీలలో జరగనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి పిలుపునిచ్చారు. గురువారం ఉండవల్లి సచివాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఎప్పుడూ అండగా ఉండేది సీఐటీయూ అని స్పష్టం చేశారు. ఈనెల 23వ తేదీ సాయంత్రం తాడేపల్లి బోసు బొమ్మ సెంటర్ నుంచి జరిగే కార్మిక ప్రదర్శన, కృష్ణుని ఆలయం సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజధాని డివిజన్ నాయకులు కె.రామకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవాల నారాయణ, ఎం.స్వర్ణకుమారి, వై.సుందరరావు, కుశాలరావు, మేరి, స్వరూప, శ్రావణి, ఈశ్వరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు. కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులతో సీఐటీయూ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తాడేపల్లి మండల కన్వీనర్ పల్లె కృష్ణ మాట్లాడుతూ.. పోరాటాలతోనే కార్మికులు ఏదైనా సాధించగలరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు అమ్మిశెట్టి రంగారావు, పారిశుద్ధ్య కార్మికులు కృష్ణతులసి, రాంబాబు, జోజిబాబు, కోటేశ్వరి, వెంకాయమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ: తాడేపల్లిలో జరిగే సీఐటియూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ కో కన్వీనర్ ఎం.రవి తెలిపారు. తుళ్లూరు మండలం మందడంలో పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడుతూ.. మహాసభలలో భాగంగా 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్ నుంచి కార్మికుల ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజధాని ప్రాంత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

23న కాపు కార్తిక వనసమారాధన

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: కాపు కార్తిక వనసమారాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు కాపు జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ వనసమారాధన మహోత్సవానికి కాపు కుటుంబ సభ్యులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వన సమారాధన కరప్రతాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి శివాలయం ట్రస్టు బోర్డు డైరెక్టర్ తిరుమలశెట్టి మురళీకృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, కాపు రక్షణ వేదిక నాయకులు చందు భావనారాయణ, జాతీయ కాపు సంఘం ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి రాము, కాపు చైతన్య రథం నాయకులు పులిగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మేడికొండూరు కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుగ్గిరాల: విద్యార్థులు దేశనాయకుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దారు ఐ.సునీత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని దుగ్గిరాల గ్రంథాలయంలో వారోత్సవాలు ముగిసాయి. గ్రంథాలయ అధికారి బి.జ్యోతి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. సభాధ్యక్షులుగా ప్రొఫెసర్ బి.లలితానంద ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె.శ్రీనివాసరావు, కె.లక్ష్మీనారాయణ, హెచ్ఎం ఎస్.శోభాదేవి, దోస్త్ సంస్థ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

తాడికొండ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మండలంలో గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తుళ్లూరు శాఖా గ్రంథాలయంలో జరిగిన వేడుకలకు ఎంఈవో అజయ్ కుమార్ పాల్గొని గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి పి.భాగ్యలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మేడికొండూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక ఆటల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.జయప్రద హాజరయ్యారు. కార్యక్రమాన్ని మేడికొండూరు శాఖా గ్రంథాలయాధికారి పి.సుధారాణి పర్యవేక్షించారు. గ్రామ సర్పంచి పూల నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: గాలిబాలి శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కొండవీటి రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్‌రఫీ, గ్రంథాలయాధికారి ఐవీ దుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: గ్రంథాలయాలు జ్ఞానాన్ని పెంపొందిస్తాయని తాడేపల్లి మండల విద్యాశాఖ అధికారి డి.నాగేశ్వరరరావు అన్నారు. గురువారం తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిణి సునీత, రవీంద్ర భారతి పాఠశాల కరస్పాండెంట్ హుస్సేన్, శ్రీ భగవాన్ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయశారద, గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

తెనాలిరూరల్: మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉంటుందని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు తెలిపారు. పట్టణ చెంచుపేటలోని ఉమేశ్ చంద్ర విగ్రహం వద్ద గురువారం ఉదయం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, బ్రహ్మయ్యతో కలిసి నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ ఎక్కువగా జరుగుతుందని వాటిని ఉపేక్షించేది లేదని, వాహనాలను నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. మున్సిపల్ సిబ్బందితో కలసి చెంచుపేటలో ఆక్రమణలను తొలగించారు.

జలపాలేశ్వరుడి ఆలయంలో శివనామ ఏకాహం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో కొలువైయున్న జలపాలేశ్వరస్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప స్వాములు, భవానీలు, శివస్వాములు కలిసి శివనామ ఏకాహం కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ఆర్ ఉమాపతి శాస్త్రి తెలిపారు. కార్తికమాస చివరి రోజును పురస్కరించుకొని 24 గంటల పాటు భక్తులు శివనామాన్ని జపిస్తారని ఆయన వివరించారు.

మత్స్యకారుల వలలో కొండచిలువ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌పై కృష్ణాకెనాల్ బ్రిడ్జి కింద గురువారం మత్స్యకారులు చేపల వేట ప్రారంభించారు. ఈ సమయంలో నీటి లోపల కొండచిలువ ఉండడంతో అది వలలో చిక్కింది. దీంతో మత్స్యకారుడు వల పైకి లాగగా కొండచిలువ కనిపించింది. వలలో ఇరుక్కున్న కొండచిలువను బయటకు తీసి దగ్గరలో గల కొండ ప్రాంతంలో వదిలిపెట్టారు. నీటిలోపల అడుగు భాగంలో కొండచిలువ వలకు చిక్కడం మొదటిసారిగా చూస్తున్నామని మత్స్యకారులు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి

దుగ్గిరాల: పక్కా గృహం లేని అర్హులందరూ ఈనెల 30వ తేదీ లోపు ఇంటి నిర్మాణానికి నమోదు చేసుకోవాలని ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన వారందరూ పీఎంఏవై 2.0 గ్రామీణ్ పథకం కింద పేరు నమోదు చేసుకోవాలని దుగ్గిరాల హౌసింగ్ ఏఈ జీవీ సుబ్బారావు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

తెనాలి అర్బన్: పట్టణ 19వ వార్డులోని 23వ సచివాలయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఆరోపణలపై ఆ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ పి.శామ్యూల్ డైమండ్‌బాబును సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వెల్ఫేర్ సెక్రటరీ శామ్యూల్ డైమండ్‌బాబు గత సోమవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఒక మహిళను వెంటబెట్టుకుని, సచివాలయం తాళాలు తెరచి, లోపలకు వెళ్లారు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయటంతో మహిళతో సహా పరారయ్యాడు. ఈ విషయం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్, మంత్రి నాదెండ్ల కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాలతో అధికారులు విచారణ జరిపారు. అనుచిత చర్య నిరూపణ కావటంతో సదరు వెల్ఫేర్ సెక్రటరీని సస్పెండ్ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు తెలియజేశారు.

మోటారు వాహన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

తాడేపల్లి రూరల్: కార్మికులకు ఉరితాడుగా మారిన మోటారు వాహన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణంలోని పలు ఆటోస్టాండ్‌లో ఈనెల 23, 24 తేదీల్లో తాడేపల్లిలో జరగనున్న సీఐటీయూ గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. అర్హులైన ఆటోడ్రైవర్ల అందరికీ రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 23వ తేదీ తాడేపల్లి పట్టణ పరిధి బోసుబొమ్మ సెంటర్ వద్ద జరిగే కార్మిక ప్రదర్శనలో ఆటో కార్మిక కుటుంబాలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, చిన్నారావు, స్వామి, రాజు, బాష, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుడి భూమి కబ్జా

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

మంగళగిరి టౌన్: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన దళితులు వంకదార చిన్నప్పకు ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల్లో భూమిని ఆక్రమించేందుకు కుమ్మరి దస్తగిరి చేసిన ప్రయత్నాలను పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు ఆరోపించారు. మంగళగిరి పట్టణ పరిధి ప్రెస్‌క్లబ్‌లో గురువారం బాధితుడు చిన్నప్పతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. చిన్నప్ప ఫిర్యాదుపై కేసు ఉన్నప్పటికీ సంబంధిత సీఐ రమేష్‌బాబు అధికార దుర్వినియోగం చేస్తూ చిన్నప్పపై తప్పుడు కేసులు బనాయించి రౌడీషీట్ తెరిచారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేసిన దస్తగిరిని పోలీసులు అరెస్ట్ చేయకుండా కాపాడుతున్న సీఐ రమేష్‌బాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తనకు ప్రాణహాని ఉన్నట్లు డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చిన్నప్ప పేర్కొన్నాడు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు జాన్ పాల్, నాయకులు దేవరత్నం, శీలం శ్రీనివాసరావు, శామ్యేల్, దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న బీసీల రిజర్వేషన్లపై విజ్ఞాపన పత్రం అందజేత

మాట్లాడుతున్న కేశన శంకరరావు

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని ఎన్‌డీఏ, కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు పరచాలంటూ తమ సంఘం అన్ని జిల్లాల అధ్యక్షులు ఈనెల 24న కలెక్టర్ల ద్వారా పీఎం, సీఎంలకు బీసీల రిజర్వేషన్ల గురించి విజ్ఞాపన పత్రాలను సమర్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధి బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ.. ఏయే సామాజిక వర్గాల్లో ఎవరు ఎంతమంది ఉన్నారో తెలియకుండా రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారంటూ ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాబాజీ, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, బీసీ ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధి కుక్కల బెడదను అరికట్టాలి

మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యుల ఆందోళన

మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నకేశవులు, ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: సుప్రీంకోర్టు మెట్లు ఎక్కిన వీధి కుక్కల బెడద గ్రామాల్లో ఎప్పుడు తగ్గుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తెనాలి మండల పరిషత్ సమావేశంలోనూ ఇదొక ప్రధాన సమస్యగా చర్చకు వచ్చింది. గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలను కట్టడి చేయాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం వ్యాక్సినేషను చేసి, వాటి అభివృద్ధిని ఆపాలని సూచించారు. తెనాలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. కఠెవరం, గుడివాడ, పెదరావూరు, సంగంజాగర్లమూడి గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు తమ గ్రామాల్లో బోర్లు, మంచినీటి పంపులు ఏర్పాటు చేయాలని అడుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. వర్క్ ఆర్డరు అప్రూవ్ కాగానే చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష చెప్పారు. గుడివాడలో డ్రెయినేజీ నిర్మాణంపై మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అడిగిన సమస్యపై, నిధుల లభ్యత ప్రకారం చేపడతామని ఎంపీపీ చెన్నకేశవులు, ఎంపీడీవో దీప్తి బదులిచ్చారు. కొలకలూరు గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు ఫెయిలయ్యాయనీ, నీరు నిలిచిపోయి మురుగుకంపుతో జనం అవస్థలు పడుతున్నారని ఆ గ్రామ ఎంపీటీసీ కాలిశెట్టి ఫణికుమార్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీడీవో అత్తోట దీప్తి సమాధానమిస్తూ మ్యాజిక్ డ్రెయిన్లు ఫెయిల్ కాలేదన్నారు. బీసీ కాలనీలో తాత్కాలికంగా ఏర్పడిన సమస్యను నివారించామని, గ్రామం మొత్తం మ్యాజిక్ డ్రెయిన్లను తీసుకురాబోతున్నట్టు స్పష్టం చేశారు. తన స్వగ్రామం సోమసుందర పాలెంలో జరిగిన గంగానమ్మ జాతరకు శానిటేషనును లోపభూయిష్టంగా చేయించిన పంచాయతీ కార్యదర్శిపై ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తగిన చర్యలు తీసుకోవాలంటే ఎంపీడీవోకు సిఫార్సు చేశారు. నందివెలుగు–హాఫ్‌పేట వరకు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా తయారైందని, మరమ్మతులు ఎప్పుడు చేస్తారని కాలిశెట్టి ఫణికుమార్ ప్రశ్నించారు. అదే రోడ్డులో కొలకలూరులో ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. కఠెవరం, కోపల్లె, ఖాజీపేట గ్రామాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఎంఈవో-2 వి.జయంతిబాబు, విద్యుత్ ఏఈ సుధీర్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణ, సీడీపీఓ విజయగౌరి, డ్రెయినేజీ ఏఈ సత్యనారాయణ, కార్యాలయ సూపరింటెండెంట్ ఆచంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

బిహార్ సీఎం నితీష్‌కుమార్‌కు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: బిహార్ ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణస్వీకారం చేసిన నితీష్ కుమార్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ‘మీ పదవీకాలం విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నాను’ అని వైఎస్ జగన్ గురువారం ‘ఎక్స్’లో పోస్టు చేశారు.

24 నుంచి ‘రైతన్నా.. మీకోసం’

టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఈ నెల 24 నుంచి ‘రైతన్నా.. మీ కోసం’ పేరుతో వ్యవసాయంలో పంచ సూత్రాలపై ఏడ్రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇందులో భాగంగా 24 నుంచి 29 వరకు ప్రతి రైతు ఇంటికి ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్తారన్నారు. డిసెంబరు 3న రైతుసేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నట్లు చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతుసేవా కేంద్రాల సిబ్బందితో గురువారం ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

రేపు, ఎల్లుండి సీఎం పుట్టపర్తి పర్యటన..

ఈ నెల 22, 23 తేదీల్లో సీఎం చంద్రబాబు పుట్టపర్తిలో పర్యటించనున్నారు. 22న ప్రశాంతి నిలయంలో రాష్ట్రపతి ముర్ముతో కలిసి భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. సా.4 గంటలకు శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవానికి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి హాజరవుతారు. 23న ఉదయం 9 గంటలకు శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొని మధ్యాహ్నానికి ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

వచ్చే ఏడాది ఐదుగురు ఐఏఎస్‌ల పదవీ విరమణ

శ్రీలక్ష్మి, సాయిప్రసాద్, అజయ్‌జైన్, కృష్ణబాబు, కరుణ

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది మే నుంచి జూలై నెలాఖరు నాటికి ఐదుగురు ఐఏఎస్‌లు పదవీ విరమణ చేయనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. వై.శ్రీలక్ష్మి జూన్ నెలాఖరున, జి.సాయిప్రసాద్ మే నెలాఖరున, అజయ్‌జైన్, ఎంటీ కృష్ణబాబు, వి.కరుణ జూలై నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు.

ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

వైఎస్సార్‌సీపీ, వామపక్ష నేతల వినతి

వినతిపత్రం అందిస్తున్న మల్లాది విష్ణు, శ్రీనివాసరావు వామపక్షాల నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం ఉన్నందున ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని పలు రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వివేక్ యాదవ్‌ను గురువారం కలిసిన ఆ నేతలు ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌లో ప్రకటించిన 12 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ లేదని.. పైగా ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోందని గుర్తుచేశారు. రాజ్యాంగ హక్కులను హరించేలా, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించేలా ఎస్ఐఆర్ నిర్వహణ సరికాదని అభ్యంతరం తెలిపారు. సీఈఓకు వినతిపత్రం అందించిన వారిలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కమ్యూనిస్టు పార్టీల నేత సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కమ్యూనిస్టు నేతలు జంగాల అజయ్‌కుమార్, డి.హరినాథ్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బాషా, జానకిరాములు, రామకృష్ణ సుధీర్, షేక్ మస్తాన్‌వలీ (కాంగ్రెస్) తదితరులున్నారు.

పత్తి రైతుపై కత్తి!

ధరలేక, చంద్రబాబు సర్కారు ఆదుకోక చిత్తు

ఇంకా మూడు తీతల పంట ఉన్నా ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు

పెదకూరపాడులో దున్నేసిన పత్తిచేను

కూలీ ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేక రెండో తీతలోనే తొలగించిన పత్తి

సాక్షి, నరసరావుపేట: చంద్రబాబు ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు రాష్ట్రంలో రైతుల్ని కుదేలు చేస్తున్నాయి. ఇప్పటికే మామిడి, ఉల్లి, టమోటా, అరటి రైతులు తమ ఉత్పత్తులను రోడ్లపై పారబోసి పంటలను దున్నేయగా తాజాగా ఆ జాబితాలో పత్తి రైతులూ చేరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు పల్నాడు జిల్లాలో పత్తి పంట బాగా దెబ్బతింది. పత్తి కాయల్లోకి వర్షపునీరు చేరడంతో అవి నల్లగా మారిపోయాయి. పత్తి నాణ్యతతో పాటు దిగుబడిపైనా వర్షాల ప్రభావం ఎక్కువగా పడింది. తుపానుకు ముందు ఎకరాకు 8–10 క్వింటాళ్ల పత్తి ఆశించిన రైతులకు వర్షాలవల్ల 5–6 క్వింటాళ్లు కూడా దిగుబడి రాని దుస్థితి. ఇలా పల్నాడు జిల్లా వ్యాప్తంగా 54,145 ఎకరాల్లో పత్తి పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాలు వేసిన చంద్రబాబు ప్రభుత్వం.. చివరకు 3,912 ఎకరాలు మాత్రమే నష్టపోయినట్లు తుది లెక్కలను కుదించి మిగతా పంట పరిహారాన్ని ఎగ్గొట్టేస్తోంది. నిబంధనల పేరిట నష్టపోయిన రైతులను జాబితా నుంచి తొలగించింది.

విసుగు చెంది దున్నేస్తున్న రైతులు

ఇలా ప్రకృతి ప్రకోపాలు, చంద్రబాబు సర్కారు దగాతో నష్టపోయి మిగిలిన అరకొర పంటనైనా అమ్ముకుందామని చూసిన పత్తి రైతును సీసీఐ నిబంధనలు కూడా చిత్తుచేస్తున్నాయి. నిజానికి.. పత్తి తేమ శాతం 8 నుంచి 12 శాతం మధ్య ఉండాలి, ఎనిమిది శాతం ఉంటే పూర్తిస్థాయిలో మద్దతు ధర రూ.8,110 దక్కగా, తేమ శాతం పెరిగితే రూ.7,710 దాకా ఇస్తున్నారు. 12 శాతం దాటితే తిరస్కరిస్తున్నారు. అయితే, తుపాను ప్రభావం, మారిన వాతావరణ పరిస్థితులవల్ల పత్తిలో తేమ శాతం 18 నుంచి 22 వరకు ఉంటోంది. దీంతో.. బయ్యర్లు కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చి, వెనక్కి తీసుకెళ్లడంతో రవాణా, కూలీల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రైవేట్ దళారులు క్వింటా పత్తి రూ.5 వేలకే కొనుగోలు చేస్తున్నారు. ఆ డబ్బులు కూలీలు, రవాణా ఖర్చులకు కూడా మిగలకపోవడంతో రైతులు విసుగుచెంది పత్తిపంటను దున్నేస్తున్నారు. నష్టపోయిన రైతుల్లో అత్యధికంగా కౌలు రైతులున్నారు. వీరికి నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ వంటి సదుపాయాలేవీ చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వడంలేదు.

రూ.లక్షకు పైగా నష్టపోయా..

మూడెకరాల్లో పత్తి పంట సాగుచేయగా ఇప్పటికి ఏడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. మిగిలిన తీతలలో పెద్దగా వచ్చేలా లేదు. అధిక వర్షాలకు నీరు ఎక్కువ రోజులు నిలిచి మొక్కలు ఎండిపోయాయి. చేసేదిలేక పంటను దున్నేశా. ఎకరాకు రూ.35 వేల చొప్పున రూ.లక్షకు పైగా నష్టపోయా. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే సాగు కష్టం.

– గోగులపాటి కన్నయ్య, పత్తి రైతు, పెదకూరపాడు

తుపాను పరిహారం అందలేదు

ఈ ఏడాది ఎకరాన్నర భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగుచేశా. అధిక వర్షాలకు తెగులు, కాయలకు పుచ్చు ఎక్కువగా వచ్చి దిగుబడి పడిపోయింది. కేవలం ఒకటిన్నర క్వింటా పత్తి మాత్రమే వచ్చింది, దాన్ని అమ్మడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పంటను తీయడానికి మళ్లీ అప్పులుచేయాల్సి వస్తుండడంతో ట్రాక్టర్‌తో పంటను దున్నేశా. తుపాను పరిహారం కూడా అందలేదు. ప్రభుత్వం సాయం చేయకపోతే కౌలు రైతులు సాగుచేసే పరిస్థితి ఉండదు.

– దొడ్డా బాబురావు, పత్తి రైతు, పెదకూరపాడు

తిరుమల చేరుకున్న రాష్ట్రపతి

తిరుచానూరులో శ్రీపద్మావతి అమ్మవారి దర్శనం

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ద్రౌపది ముర్ము

ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, హోం మంత్రి అనిత

తిరుమల/చంద్రగిరి: శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. స్థానిక శ్రీపద్మావతి అతిథి గృహం వద్ద రాష్ట్రపతికి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా శ్రీ భూవరాహస్వామి వారిని దర్శించుకుని అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకుని వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. తిరిగి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుని తిరుపతికి బయలుదేరి వెళతారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని తిరుమలలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి హోదాలో రెండో పర్యాయం ఆమె శ్రీవారిని దర్శించుకోనున్నారు. అంతకుముందు రాష్ట్రపతి తిరుమల వెళ్లడానికి ముందు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ ఎస్.వేంకటేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు. రాష్ట్రపతి ఆలయంలోని ధ్వజస్తంభానికి మొక్కుకుని శ్రీపద్మావతి అమ్మవారి మూల మూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో మంత్రి ఆనం, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ రాష్ట్రపతిని శేష వస్త్రంతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. తిరుమలలో రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాకలక్ష్మి, జానకీదేవి, భానుప్రకాష్ రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఉన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్ విచారణకు ఓకే

గవర్నర్ అనుమతి నేపథ్యంలో ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో చార్జిషీట్ వేసేందుకు మార్గం సుగమం

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రూ.54.88 కోట్ల హెచ్ఎండీఏ నిధులు నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు చెల్లించారంటూ నమోదైన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ మాజీ మంత్రి కేటీ రామారావును ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ మేరకు రెండురోజుల క్రితమే గవర్నర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి సమాచారం వెళ్లిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ప్రజా ప్రతినిధి కావడంతో పాటు, గతంలో మంత్రిగా పని చేసినందున.. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ ఏసీబీ గతంలో లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటు చేసుకుంది. దీంతో ఈ కేసులో ఏసీబీ వేగం పెంచే అవకాశాలున్నాయని అంటున్నారు. గవర్నర్ అనుమతి రావడంతో ఈ కేసులో చార్జిషీట్ వేసేందుకు ఏసీబీ అధికారులకు అవకాశం చిక్కినట్టయ్యింది. అయితే ఇదే కేసులో ఏ–2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ పైనా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అందుకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) అనుమతి తప్పనిసరి. ఆ అనుమతి వస్తేనే ఈ కేసులో చార్జిషీట్ ప్రక్రియ వేగవంతం అవుతుందని ఏసీబీ అధికారులు అంటున్నారు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో ఏ–1గా కేటీఆర్, ఏ–2గా అర్వింద్‌కుమార్, ఏ–3గా హెచ్ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి ఉన్నారు. అలాగే నెక్స్ జెన్‌కు చెందిన కిరణ్‌రావు, ఫార్ములా–ఈ ఆపరేషన్స్ ప్రతినిధులు సహా మొత్తం 10 మందిపై కేసులు నమోదయ్యాయి.

నిర్ధారణ కాకుండానే నోటీసులా?

సభాహక్కుల కమిటీని నిలదీసిన హైకోర్టు

‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డి వ్యక్తిగత హాజరు వాయిదా

‘సాక్షి కథనం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని దేని ఆధారంగా నిర్ధారణకు వచ్చారు? అందుకు ఉన్న ప్రాథమిక ఆధారాలు ఏమిటి? ఆధారాలు లేనప్పుడు ఎలా నిర్ణయానికి వస్తారు? సభా హక్కుల ఉల్లంఘన జరిగిందా లేదా అన్న విషయంలో ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చి, షోకాజ్ నోటీసు జారీ చేయడం ఏమిటి? షోకాజ్‌కు వివరణ తీసుకుని ఆ తర్వాత నిర్ధారణకు రావడం ఏమిటి? సాక్ష్యాలు తేవాలని, సాక్ష్యం చెప్పాలని ఎలా కోరుతారు?’

– హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: సభా హక్కుల ఉల్లంఘన పేరుతో ‘సాక్షి’పై కక్షసాధింపులకు పాల్పడుతున్న అసెంబ్లీ వర్గాలకు హైకోర్టు మరోసారి గట్టి షాక్ నిచ్చింది. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడంపై కథనాన్ని ప్రచురించినందుకు ‘సాక్షి’ని లక్ష్యంగా చేసుకోవడంపై కళ్లెం వేసింది. కథనం తాలూకు ఆధారాలతో ఈ నెల 21న సభా హక్కుల కమిటీ ఎదుట హాజరై సాక్ష్యం చెప్పాలంటూ ‘సాక్షి’ ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఈ నెల 11న జారీ చేసిన లేఖ విషయంలో హైకోర్టు జోక్యం చేసుకుంది. సభా హక్కుల కమిటీ ముందు ధనుంజయరెడ్డి, ఫణికుమార్ వ్యక్తిగత హాజరును వాయిదా వేసింది. అదనపు వివరాలను కమిటీ ముందు ఉంచేందుకు వారిద్దరికీ వెసులుబాటు ఇచ్చింది. అసలు ‘సాక్షి’ కథనం సభా హక్కుల ఉల్లంఘన పరిధిలోకి వస్తుందో రాదో తేల్చకుండా షోకాజ్ నోటీసులు ఎలా ఇస్తారని అసెంబ్లీ సెక్రటరీ జనరల్, సభా హక్కుల కమిటీని ప్రశ్నించింది. అన్ని అంశాలపై లోతైన విచారణ జరుపుతామని పేర్కొంది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.కోట్ల ప్రజాధనం వృథాపై ‘సాక్షి’ కథనం

ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల నిర్వహణలో సరైన ప్రణాళిక, అవగాహన లేకపోవడంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయింది. రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించేలా శాసనసభ వర్గాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్ణయించాయి. ఎమ్మెల్యేలు, అతిథులకు హోటళ్లు, భోజనాలు, బహుమతులు తదితరాల కోసం భారీగా ఖర్చు చేశారు. కానీ, లోక్‌సభ స్పీకర్ ఈ కార్యక్రమానికి రాలేదు. దీంతో ఖర్చంతా వృథా అయింది. ఆ విషయాన్నే చెబుతూ ‘కోట్లు ఖర్చు... శిక్షణ తుస్సు’ శీర్షికన ఫిబ్రవరి 22న ‘సాక్షి’ కథనం ప్రచురించింది. దీంతో కంగుతిన్న అధికార పార్టీ నేతలు కక్షసాధింపు చర్యలు చేపట్టారు.

సభా హక్కుల కమిటీకి నివేదించిన స్పీకర్

‘సాక్షి’ కథనం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, దానిని తాను సభలో ప్రస్తావించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే జయసూర్య ఫిబ్రవరి 25న అసెంబ్లీ స్పీకర్‌కు నోటీసు ఇచ్చారు. స్పీకర్ ఈ వ్యవహారాన్ని సభా హక్కుల కమిటీకి నివేదించారు. ఆ కమిటీ ఆదేశాల మేరకు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ‘సాక్షి’కి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన నోటీసుతో పాటు సెక్రటరీ జనరల్ ఇచ్చిన షోకాజ్ నోటీసును సవాలు చేస్తూ ఎడిటర్ ధనంజయరెడ్డి, ఫణికుమార్ జూన్‌లో హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ విచారణ జరిపారు. ఇచ్చింది షోకాజ్ నోటీసు మాత్రమేనని, ఆ తర్వాత చాలా ప్రక్రియ ఉన్న నేపథ్యంలో ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవి అంటూ వాటిని కొట్టివేస్తూ ఈ నెల 4న తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ధనంజయరెడ్డి, ఫణికుమార్ ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు.

ప్రజాధనం వృథా అనే చెప్పాం..

సభా కార్యకలాపాల్లో జోక్యం చేసుకోలేదు

వారి అప్పీళ్లపై గురువారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓబిరెడ్డి మనోహర్‌రెడ్డి, వేలూరు మహేశ్వర్‌రెడ్డి, అనూప్ కౌశిక్ వాదనలు వినిపించారు. ‘‘అసలు సాక్షి కథనం సభా హక్కుల పరిధిలోకి రాదు. అది కేవలం పరిపాలనాపరమైన అంశానికి సంబంధించినది. ఆ కథనం సభ్యుల హక్కులకు భంగం కలిగించడం లేదు. కాబట్టి సభా హక్కుల పరిధిలోకి వస్తుందా? రాదా? అన్న విషయం తేల్చాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి ఏది సభా హక్కుల పరిధిలోకి వస్తుంది? ఏది రాదు..? అన్న విషయమై ఎక్కడా నిర్దిష్టమైన నిర్వచనం లేదు’’ అని మనోహర్‌రెడ్డి తెలిపారు. ‘సాక్షి’ కథనాన్ని చదివి వినిపించారు. ‘‘అసెంబ్లీ కార్యకలాపాల్లో జోక్యం చేసుకున్నప్పుడు, వాటిని అడ్డుకున్నప్పుడే సభా హక్కుల ఉల్లంఘన తెరపైకి వస్తుంది. సాక్షి కథనం ఎక్కడా సభా కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవడం లేదు. శిక్షణ తరగతులు నిర్వహించకపోవడంతో ప్రజాధనం వృథా అయిందన్న విషయాన్ని మాత్రమే ఎత్తిచూపింది. సాక్షికి షోకాజ్ నోటీసిచ్చే అధికార పరిధి సభా హక్కుల కమిటీకి లేదు’’ అని వివరించారు. షోకాజ్ నోటీసుకు వివరణ కూడా ఇచ్చినా, దానిని సభా హక్కుల కమిటీ పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అంతేకాక తాము ప్రచురించిన కథనానికి తగిన ఆధారాలతో స్వయంగా ఈ నెల 21న హాజరై సాక్ష్యం ఇవ్వాలంటూ కమిటీ తరఫున అసెంబ్లీ జనరల్ సెక్రటరీ లేఖ పంపారని పేర్కొన్నారు.

సభా హక్కుల ఉల్లంఘన అని దేని ఆధారంగా నిర్ధారణకు వచ్చారు

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్, సభా హక్కుల కమిటీ తరఫున గింజుపల్లి సుబ్బారావు వాదనలు వినిపిస్తూ.. సహజ న్యాయ సూత్రాల్లో భాగంగా పిటిషనర్లకు నోటీసులు ఇచ్చామన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, సాక్షి కథనం సభా హక్కుల ఉల్లంఘన అని దేని ఆధారంగా నిర్ధారణకు వచ్చారంటూ వరుసగా ప్రశ్నలు సంధించింది. దమ్మాలపాటి స్పందిస్తూ సభా హక్కుల ఉల్లంఘన విషయంలో సభా హక్కుల కమిటీ తన నివేదికను సభకు ఇస్తుందని, ఈ నివేదిక తుది నిర్ణయం కాదన్నారు. పిటిషనర్లు తప్పు చేశారా లేదా అన్నది సభే నిర్ణయిస్తుందన్నారు. నోటీసులకు స్పందించి అదనపు వివరాలు ఇవ్వొచ్చని, సాక్ష్యం ఇవ్వాలన్న బలవంతం కానీ, నిబంధన కానీ ఏమీ లేదన్నారు.

కమిటీ ఎదుట హాజరైతే దోషులుగా తేల్చేస్తారు

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, ‘‘సభా హక్కుల కమిటీ ఇచ్చిన నోటీసులకు స్పందించండి. కమిటీ ముందు హాజరుకండి. మీరు చెప్పాల్సింది చెప్పండి. మీకు వ్యతిరేకంగా కమిటీ ఉత్తర్వులిస్తే మా వద్దకు రండి. అప్పుడు తప్పకుండా మేం స్టే ఇస్తాం’’ అని ప్రతిపాదించింది. దీనిపై మనోహర్‌రెడ్డి స్పందిస్తూ, వార్తా కథనం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందా? రాదా? అన్నది తేలకుండా పిటిషనర్లు కమిటీ ఎదుట హాజరు కావడంలో అర్థం లేదని.. ఒకవేళ వారు హాజరైతే వెంటనే విచారణ మొదలుపెట్టి దోషులుగా తేలుస్తారని తెలిపారు.

ఉల్లంఘన తేల్చకుండా పిటిషనర్లను విచారించడం సరికాదు

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సాక్షి కథనం సభా హక్కుల ఉల్లంఘన పరిధిలోకి వస్తుందో రాదో తేల్చకుండా పిటిషనర్లను విచారించడం సరికాదని ప్రాథమికంగా అభిప్రాయపడింది. పిటిషనర్ల వివరణను కమిటీ పరిగణనలోకి తీసుకోలేదని వారి తరఫు సీనియర్ న్యాయవాది చెబుతున్నందున సభా హక్కుల కమిటీ ఎదుట పిటిషనర్ల వ్యక్తిగత హాజరును వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. కమిటీకి అదనపు వివరాలు ఉంటే వాటిని సమర్పించవచ్చునని పిటిషనర్లకు సూచించింది.

జోగి రమేష్‌తో వైఎస్సార్‌సీపీ నేతల ములాఖత్

జోగి రమేష్‌ను కలిసిన మాజీ మంత్రులు కాకాణి, వెల్లంపల్లి శ్రీనివాస్

మీడియాతో మాట్లాడుతున్న కాకాణి, చిత్రంలో వెల్లంపల్లి , పర్వతరెడ్డి, అరుణ్‌కుమార్, అవినాష్

వెంకటాచలం: టీడీపీ సర్కార్ మోపిన అక్రమ కేసులతో నెల్లూరు సెంట్రల్ జైలు ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రాముతో మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ గురువారం సాయంత్రం ములాఖత్ అయ్యారు. అనంతరం జిల్లా జైలు వద్ద మీడియాతో కాకాణి మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం, చంద్రబాబు వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై గళం విప్పడం వల్లే జోగి రమేష్‌ను సంబంధంలేని కేసులో ఇరికించి జైలుకు పంపారని ధ్వజమెత్తారు. ఈ విషయమై ప్రజల్లోనూ ఆగ్రహం వ్యక్తమవుతోందని చెప్పారు. జోగి రమేష్ త్వరలో కడిగిన ముత్యంలా బయటకొస్తారని చెప్పారు.

శాంతిభద్రతలపై దృష్టేదీ?

కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసు వల్ల 19 రోజులుగా జోగి రమేష్, ఆయన సోదరుడు రాము జైల్లో గడపాల్సి వచ్చిందని, రాష్ట్రంలో దారుణాలు జరుగుతుంటే, శాంతిభద్రతలపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదని వెల్లంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన నకిలీ మద్యం మరకను తమ పార్టీకి అంటగట్టడమేమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, దేవినేని అవినాష్ మాట్లాడుతూ అక్రమ కేసులకు తమ పార్టీ భయపడదని స్పష్టం చేశారు.

జోగి రమేష్ ములాఖత్‌లకు అనుమతి

విజయవాడ లీగల్: నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి జోగి రమేష్ ములాఖత్‌లకు కోర్టు అనుమతించింది. ములాఖత్‌లు కోరుతూ జోగి రమేష్ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన 6వ అదనపు జ్యుడీషియల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి లెనిన్‌బాబు విచారణ జరిపారు. వారంలో రెండుసార్లు కుటుంబసభ్యులతో, న్యాయవాదులతో విడిగా రూములో మాట్లాడేందుకు అవకాశమిస్తూ ఆదేశాలు జారీచేశారు.

స్వామి సేవలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదు

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన్ను విచారించారు. అనంతరం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా బాధ్యత గల పదవిలో ఉన్న సీఎం చంద్రబాబు స్వామి వారి ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందనే వ్యాఖ్యలపై సిట్ అధికారులు తనను స్పష్టత ఇవ్వాలని కోరారన్నారు. 2019 నుంచే కాకుండా 2014 నుంచి.. వీలైతే అంతకు ముందు నుంచి కూడా టీటీడీకి నెయ్యి సరఫరా వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి ఇంకా ఏమన్నారంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రచారం చేశారు. దీనిపై దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇద్దరు ముగ్గురు భక్తులతో పాటు మేము కూడా భక్తులకు వాస్తవాలు తెలియాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాం. దేశ సర్వోన్నత న్యాయ స్థానం సిట్‌ను నియమిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత విచారణ చేయకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కీలక పదవుల్లో ఉండే వ్యక్తులు కామెంట్లు చేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. 2024 జూన్‌లో నాలుగు ట్యాంకుల ద్వారా కల్తీ నెయ్యి (అడల్టెడ్) సరఫరా చేశారా? అందులో జంతువుల కొవ్వు కలిసిందా? లేకుంటే ఏ విధంగా కల్తీ జరిగిందో నిర్ధారించాలని సిట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మొదట వాటిని నివృత్తి చేయాలని సిట్ అధికారులను కోరాను. అయితే, అధికారులు విచారణ పూర్తి కాలేదని చెబుతున్నారు. కానీ, ఇప్పటికే దాఖలు చేసిన చార్జిషీట్‌లో కల్తీ నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్స్ వంటివి మాత్రమే కలిశాయని పొందుపరిచారు. వెనక్కి వెళ్లిన ట్రక్కులు మళ్లీ వేరే పేరుతో వచ్చాయని, వాటిని వాడారని చార్జిషీట్‌లోనే పొందుపరిచారు. అందులో జంతువుల కొవ్వు కలిసిందా.. లేక పామాయిల్, ఇతర వాటి ద్వారా కల్తీ జరిగిందా అని సిట్ అధికారులు చెప్పాలి. పది రోజుల నుంచి ఓ వర్గం మీడియాలో నా మాజీ పీఏ చిన్నఅప్పన్నను అడ్డుపెట్టుకుని నేను అవినీతికి పాల్పడినట్టు దుష్ప్రచారం చేయడం దారుణం. ఆయనతో 2018 తర్వాత నాకు ఎలాంటి సంబంధం లేదు. దయచేసి దుష్ప్రచారాన్ని ఆపాలి.

స్వామివారి ప్రతి రూపాయి కాపాడాం

శ్రీనివాస్‌సేతు బ్రిడ్జి కోసం సుమారు రూ.690 కోట్లు కేటాయిస్తే.. మేము రూ.90 – 100 కోట్లు వరకు తగ్గించి నిర్మాణం చేయించి ప్రారంభించాం. స్వామి ప్రతి రూపాయి కాపాడటానికి శ్రమించాం. టీడీపీ ప్రభుత్వం రూ.1,100 కోట్లు స్వామివారి కానుక నిధులు ఎస్ బ్యాంకులో డిపాజిట్ చేస్తే దానిని జాతీయ బ్యాంకుల్లోకి మార్పించి కాపాడగలిగాం. శ్రీవాణి పథకం ద్వారా దళారులను నిర్మూలించాం. దేశవ్యాప్తంగా దేవాలయాలు నిర్మించాం. పద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చిన్నారుల ప్రాణాలను కాపాడటానికి నిధులు వెచ్చించాం.

ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టిన వైవీ సుబ్బారెడ్డి

టీటీడీ నెయ్యి కేసులో టీడీపీ ప్రభుత్వ కుట్రను వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి దీటుగా తిప్పికొట్టారు. ప్రభుత్వం నమోదు చేసిన ఈ అక్రమ కేసులో సిట్ అధికారులు ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం విచారించారు. ఉ. 10.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విచారణ పేరుతో సిట్ అధికారులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు ఎటువంటి విచారణ లేకుండానే సిట్ అధికారులు కాలయాపన చేశారు. కేవలం 12 గంటల పాటు వైవీ సుబ్బారెడ్డిని విచారించామనే భావన కల్పించేందుకు ఈ ఎత్తుగడ వేశారు. టీటీడీ వ్యవహారాలపై సిట్ ఆరోపణలను వైవీ సుబ్బారెడ్డి సమర్థంగా తిప్పికొట్టారు. టీటీడీ చైర్మన్ హోదాలో ఎటువంటి అవినీతికి పాల్పడలేదని పూర్తి వివరాలతో వెల్లడించారు. నెయ్యి కాంట్రాక్టుల్లో, ఇతర కాంట్రాక్టుల్లో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని ఆయన తేల్చి చెప్పారు. కిలో నెయ్యి రూ.351తో కొనుగోలు చేస్తే నాసిరమైన నెయ్యి సరఫరా చేశారని ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం గగ్గోలు పెడుతోందని, గతంలో ఇదే చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కిలో నెయ్యి కేవలం రూ.276 చొప్పున కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మరి అప్పుడు నాసిరకమైన నెయ్యి సరఫరా చేశారని సీఎం చంద్రబాబు అంగీకరిస్తారా? అని వైవీసుబ్బారెడ్డి ప్రశ్నించారు. వీటిపై సిట్ అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్టు తెలుస్తోంది.

సాఫ్ట్ 'టెక్ దోపిడీ'

సాఫ్ట్‌వేర్ సంస్థకు అడ్డగోలుగా కాంట్రాక్టు

రూ.25 కోట్ల ప్రాజెక్టుకు దాదాపు రూ.43 కోట్లు

సాఫ్ట్‌వేర్ లోపాలపై ఫిర్యాదులు వస్తున్నా పట్టని వైనం

ప్రజాధనం వృథా చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి కన్సల్టేషన్లు, సాఫ్ట్‌వేర్ పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేస్తోంది. ఇందులో కూడా మీకింత.. మాకింత అన్నట్టు దోచేసుకుంటున్నారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ సహకారం అందిస్తున్న సాఫ్ట్‌టెక్ అనే సంస్థకు కాంట్రాక్ట్ విలువ భారీ స్థాయిలో పెంచి, మరికొన్నేళ్లు కట్టబెట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత సంస్థకు ప్రతి ఐదేళ్లకు కాంట్రాక్టును పునరుద్ధరిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వంలో రూ.25 కోట్లతో తొలి ఐదేళ్లకు కాంట్రాక్టు అప్పగించారు. అయితే, గత ప్రభుత్వంలో ఎలాంటి అదనపు భారం లేకుండా పాత ధరతోనే పనులు అప్పగించారు. కానీ, కూటమి ప్రభుత్వం అదే సంస్థకు ఈసారి కాంట్రాక్టును భారీగా పెంచి కట్టబెట్టింది. తాజాగా ఐదేళ్ల కాల వ్యవధికి సాఫ్ట్‌వేర్ సహకారం అందించేందుకు దాదాపు రూ.43 కోట్లు కాంట్రాక్టు ఇచ్చింది.

సేవలు అరకొర... చెల్లింపులు ఘనం

అరకొర సేవలకు కూడా భారీస్థాయిలో ప్యాకేజీలు, కాంట్రాక్టులు కట్టబెట్టడం చంద్రబాబు సర్కార్‌కే చెల్లింది. ఈ క్రమంలోనే సాఫ్ట్‌టెక్ సంస్థకు కోట్ల రూపాయిల కాంట్రాక్ట్‌ను ధారపోసింది. కానీ, ఈ సంస్థ సేవలు మాత్రం పేలవంగా ఉన్నాయి. దాని సాఫ్ట్‌వేర్‌తో అనేక సమస్యలు వస్తున్నట్లు నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కాంట్రాక్టును దాదాపు రెట్టింపు చేసి

ఎక్కడైనా కాంట్రాక్టు ఇచ్చేందుకు గతంలో చేసిన పనులను బేరీజు వేసి ప్రస్తుత ధరల్లో గరిష్టంగా 5 లేదా 10 శాతం పెంపుతో ఇస్తారు. ఇక్కడ మాత్రం సాఫ్ట్‌టెక్‌కు అందుకు భిన్నంగా దాదాపు రెట్టింపు చేసి ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. 2015–19 మధ్య ఈ సంస్థకు చంద్రబాబు ప్రభుత్వం రూ.25 కోట్లు చెల్లించి దోపిడీకి పాల్పడింది. ఇప్పుడు అదే చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రెట్టింపు దోపిడీకి తెరతీస్తూ సుమారు రూ.43 కోట్లు చెల్లిస్తున్నట్టు తెలిసింది. కేవలం సాఫ్ట్‌వేర్ అందించడానికి ఇంత పెద్దమొత్తం పెంచడంలో ఆంతర్యం ఏమిటనే చర్చ నడుస్తోంది.

దుబారా బాబు

ప్రజాధనాన్ని ప్రణాళికలు, సాఫ్ట్‌వేర్ పేరిట ఏజెన్సీలు, సంస్థలకు కట్టబెట్టడం చంద్రబాబుకు ఎప్పటినుంచో ఉన్న అలవాటేననే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఓ వైపు బీద అరుపులు అరుస్తూ, మరోవైపు ఊరూపేరులేని సంస్థలకు ప్రభుత్వ భూములు కట్టబెడుగూ.. ఇంకోవైపు ఎలాంటి ఉపయోగం లేని పనులకు డబ్బు వృథా చేయడం బాబు మార్కు పాలన అని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ముదురుతున్న కర్ణాటక సంక్షోభం

సాక్షి, బెంగళూరు : అందరూ ఊహించినట్లే కర్ణాటకలో రాజకీయ సంక్షోభం మరింత ముదురుతోంది. 2023 వేసవిలో ఎన్నికల అనంతరం కుదిరిన చెరో రెండున్నరేళ్ల ఒప్పందం ప్రకారం... సీఎంగా సిద్ధరామయ్య వైదొలగాల్సి ఉంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలి. గురువారంతో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న క్రమంలో అధికార మార్పిడిపై ఉత్కంఠ నెలకొంది. కానీ, అలాంటిదేమీ లేదని సంకేతాలు రావడంతో పాటు మంత్రివర్గ విస్తరణ కూడా ఉండదని తేలింది. దీంతో డీకే శివకుమార్ వర్గానికి చెందిన మంత్రులు చెలువరాయస్వామి, దినేశ్ గుండూరావు, ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, హెచ్‌సీ బాలకృష్ణ, ఎస్ఆర్ శ్రీనివాస్, గుబ్బి శ్రీనివాస్, రవిగణిగ, ఉదయ్‌గౌడ, అనేకల్ శివణ్ణ, రంగనాథ్, బసవరాజు తదితర పదిమందిపైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధిష్ఠానంతో తాడోపేడో తేల్చుకునేందుకు ఢిల్లీ వెళ్లారు. అధికార మార్పిడి దిశగా చర్యలు లేకపోవడాన్ని ఢిల్లీలో అగ్ర నేతల ఎదుట లేవనెత్తేందుకు సిద్ధమయ్యారు. డీకేను సీఎం చేయాలని డిమాండ్ చేయనున్నారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ కోరారు. ఆయనతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్ గాంధీతో కూడా భేటీ కానున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం వీరు అధిష్ఠానం పెద్దలను కలిసే అవకాశం ఉంది.

■ కర్ణాటకలో 2023 వేసవిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. సిద్ధు, డీకే వర్గాలు గట్టిగా పోటీపడడంతో సీఎం పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఎవరూ పట్టు వీడలేదు. దీంతో చెరో రెండున్నరేళ్ల ప్రతిపాదన తెచ్చి ముందుగా సిద్ధును సీఎంను చేసేలా అనధికార ఒప్పందం జరిగింది. అప్పటికి ఉప ముఖ్యమంత్రి పదవితో డీకే సర్దుకున్నారు. ఇప్పుడు రెండున్నరేళ్లు పూర్తి కావడంతో తమ నేతను సీఎం చేయాలంటూ డీకే మద్దతుదారులు, ఎమ్మెల్యేలు హస్తిన బాట పట్టారు.

ఐదేళ్లు నేనే సీఎం..

మిగతా రెండున్నరేళ్లు తానే సీఎంగా ఉంటానని, అధికార మార్పిడి లాంటిదేమీ లేదని సీఎం సిద్ధు ఇప్పటికే స్పష్టం చేశారు. ప్రజలు తమకు 'ఐదేళ్లు' అవకాశం ఇచ్చారని.. తాను కొనసాగుతానా? లేదా? అన్నది అప్రస్తుత చర్చ అని అంటున్నారు. నవంబర్ విప్లవం అంటూ సాగుతున్న ప్రచారం మీడియా కల్పితం అని కొట్టిపడేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కూడా తానే బడ్జెట్ ప్రవేశపెడతానని తేల్చిచెప్పారు. రెండున్నరేళ్ల కాలం ముగిసినందున కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ అంశాన్ని పరిశీలించవచ్చని అధిష్ఠానాన్ని కోరినట్లు చెప్పారు. అయితే, దీనిపై రాహుల్‌తో చర్చించి చెబుతానని ఖర్గే హామీ ఇవ్వగా.. దానిని అధికార మార్పిడి అంటూ తప్పుగా అర్థం చేసుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎంగా తానే కొనసాగుతానని సిద్ధు చాలా స్పష్టంగా చెప్పడం, డీకే వర్గం అలర్ట్ కావడంతో కర్ణాటక కాంగ్రెస్ రాజకీయం సంక్షోభ దిశగా సాగుతోంది.

అధిష్ఠానం ఇప్పుడు మార్పు చేస్తుందా?

బిహార్ ఎన్నికల్లో చతికిలపడి వారం రోజులు కూడా కాకముందే.. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కర్ణాటక తలనొప్పి మొదలైంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంలో మార్పులు చేసి ఇబ్బంది కొని తెచ్చుకోవడం ఎందుకనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దీంతో సిద్ధు ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అందుకే ఆయన అంత ధైర్యంగా, బహిరంగంగా వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. ఈ క్రమంలో తమకు అన్యాయం జరుగుతున్నదని గ్రహించిన డీకే వర్గం వెంటనే తేరుకుంది. అధిష్ఠానం వద్ద తేల్చుకునేందుకే డీకే వర్గం ఎమ్మెల్యేలు, నేతలు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

శబరిమలలో సౌకర్యాల కల్పనలో కేరళ ప్రభుత్వం విఫలం: మాధవ్

సాక్షి, అమరావతి: శబరిమల యాత్రకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేయడంలో కేరళ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అయ్యప్ప సేవా సంఘం, అమృతానందమయి మఠం లాంటి ధార్మిక సంస్థలు సేవ చేయకుండా అడ్డుకోవడం అక్కడి ప్రభుత్వానికి హిందువుల పట్ల ఎంత వ్యతిరేకత ఉందో తెలియజేస్తుందన్నారు. భక్తుల ఇబ్బందులకు కేరళ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. భక్తుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరో ఇద్దరు మావోయిస్టులకు రిమాండ్

విజయవాడ లీగల్: విజయవాడ కొత్త ఆటోనగర్‌లో అరెస్టు చేసిన 28మంది మావోయిస్టులలో నలుగురికి కోర్టు ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ వైద్యులతో వయసు నిర్ధారణ పరీక్షలు చేయించారు. వారిలో ఇద్దరు మేజర్లుగా, మరో ఇద్దరు మైనర్లుగా తేలింది. దీంతో పోలీసులు ఏ–7, ఏ–10 నిందితులను విజయవాడలోని 6వ అదనపు జ్యుడీషియల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు ఎదుట హాజరుపరిచారు. వారిద్దరికీ వచ్చే నెల 2వ తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనంతరం వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. మైనర్లయిన మరో ఇద్దరు మావోయిస్టులు ఏ–9, ఏ–26ను శుక్రవారం జువెనైల్ కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు.

రామరాజ్యం పేరుతో కేంద్రం మారణకాండ

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం రామరాజ్యం పేరుతో దేశంలో రాక్షస రాజ్యం సాగిస్తోందని, చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కుట్రపూరితంగా మారణకాండ సృష్టిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. గిరిపుత్రులను చర్చలకు పిలిచి వారి సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపించాల్సిన కేంద్రం.. బాధ్యత వదిలి అత్యంత క్రూరంగా హతమారుస్తోందని మండిపడ్డారు.

దేవ్‌జీని కోర్టులో హాజరుపర్చాలి

వామపక్ష పార్టీల డిమాండ్

సాక్షి, అమరావతి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా అరెస్టు చేసిన వారందరినీ వెంటనే కోర్టులో హాజరుపరచాలని, ఏజెన్సీలో హిడ్మాతో సహా 13 మంది మావోయిస్టుల మృతికి కారణమైన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని 10 వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆ పార్టీల కీలక నేతలు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దేవ్‌జీ తమ అదుపులో ఉన్నాడని ఒకసారి, అదుపులో లేడని మరొకసారి పోలీసులు ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. వివిధచోట్ల నిర్బంధంలో ఉన్న మావోయిస్టులు, వారి అనుయాయులను వెంటనే సంబంధిత న్యాయస్థానాల ముందుంచాలని కోరారు. ఏడాది కాలంలోనే ఏడెనిమిది వందల మందిని ప్రభుత్వం కాల్చి చంపిందని, అందులో ఆదివాసీల శాతం అధికంగా ఉందన్నారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్, ఎంసీపీఐ–యు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీ–సీ, ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలు ఈ ప్రకటన విడుదల చేశాయి.

అక్కసుతోనే జగన్‌పై విషప్రచారం

ఆయనకొచ్చిన ప్రజాదరణ చూసి టీడీపీ కూటమి నేతలకు కడుపుమంట

మాజీ సీఎంగా తన పర్యటన వివరాలు ముందుగా వెల్లడించినా విషపు రాతలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు మండిపాటు

సాక్షి, అమరావతి: హైదరాబాద్ పర్యటనలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వచ్చిన ప్రజాదరణ చూసి టీడీపీ కూటమి నేతల్లో కడుపుమంట మొదలైందని.. వెల్లువలా తరలివచ్చిన జనాలను చూసి ఓర్వలేకే టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు మండిపడ్డారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లండన్ పర్యటన తర్వాత హాజరుకావాలని కోర్టు నిబంధన ఉన్నందున న్యాయస్థానాలపై అపార గౌరవంతో వైఎస్ జగన్ గురువారం కోర్టుకు హాజరయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా తన పర్యటన వివరాలు ముందుగానే వెల్లడిస్తే.. దానిపైనా టీడీపీ కూటమి నేతలు, ఎల్లో మీడియా విషపు రాతలతో చేస్తున్న దుష్ప్రచారంపై ఆయన మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను మోసంచేసిన చంద్రబాబు పతనం ఖాయమని ఆయన చెప్పారు. జూపూడి ఇంకా ఏమన్నారంటే..

పాలన గాలికొదిలిన కూటమి ప్రభుత్వం..

18 నెలలుగా రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ప్రజల ఆశలు, ఆలోచనల నుంచి దూరంగా వెళ్లిన చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తప్పుడు హామీలుగా మిగిలిపోయాయి. వీటన్నింటికీ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి చంద్రబాబు ప్రభుత్వం, ఎల్లో మీడియా గతంలో మాదిరిగానే వైఎస్సార్‌సీపీపై విషప్రచారం చేస్తోంది. వైఎస్ జగన్ ఈరోజు హైదరాబాద్‌లో కోర్టు ముందు హాజరైతే.. వేలాదిగా జనం ఆయన కోసం తరలివస్తే ఎల్లో మీడియా దాన్ని చిలువలు పలువులు చేస్తూ విషపు రాతలు రాసింది. అత్యంత ప్రజాదరణగల నాయకుడిగా జగన్ జెడ్ కేటగిరీలో ఉన్నందున తన షెడ్యూల్‌ను కచ్చితంగా ప్రకటిస్తారు. ఇదే పని చంద్రబాబు కూడా చేస్తారు. దీన్ని బూతద్దంలో చూపిస్తూ.. ఆయన ప్రత్యేకమైన విమానంలో వచ్చారని, గంటకు రూ.8 లక్షల ఖర్చు అని ఇష్టం వచ్చినట్లు టీడీపీ కూటమి నేతలు అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారు. మీకున్న పత్రికలు, టీవీ చానెళ్ల ద్వారా వైఎస్ జగన్ మీద విషం కక్కడాన్ని చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రజల్లో వైఎస్ జగన్‌కున్న ఆదరణ చూసి చంద్రబాబుకు నిద్ర పట్టదు.

టీడీపీ కూటమి పాలన అట్టర్‌ఫ్లాప్..

18 నెలల పాలనలో చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్వహించలేక పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. మీ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఒక మహా ఉద్యమాన్ని నిర్వహిస్తోంది. దానికి కూడా ప్రజలు అండగా నిలబడుతున్నారు. మరోవైపు.. వైఎస్ జగన్‌పై చేస్తున్న విషప్రచారాన్ని కూడా ప్రజలు గమనిస్తున్నారు.

ఎల్లో మీడియా విన్యాసాలు ఆపాలి..

వైఎస్ జగన్‌కు వస్తోన్న ప్రజాస్పందనను జీర్ణించుకోలేకే ఎల్లో మీడియా అనేక విన్యాసాలు చేస్తోంది. వీటన్నింటినీ ఆపాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోంది. ప్రజాస్వామిక వాదులందరూ వైఎస్సార్‌సీపీ నేతల మీద, కార్యాలయాల మీద జరుగుతున్న దాడులను ఖండించాలని కోరుతున్నాం. చంద్రబాబు ప్రభుత్వం కేసులు పెట్టినా, ఎంత నిర్బంధించినా అంతకు రెట్టింపు స్థాయిలో పోరాటం చేస్తాం. రాష్ట్రంలో రైతులు, విద్యార్థుల పరిస్థితి అత్యంత దుర్భరంగా, దయనీయంగా తయారైంది.

సాక్షి
SAKSHI.COM
సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం..
చట్టరీత్యా నేరం...
సాక్షి టీవీ ప్రసారాలు మీ హక్కు..
ప్రసారాలను అడ్డుకోవడం చట్టవిరుద్ధం...
ప్రజల కోసమే మా పోరాటం ప్రజా గొంతుకై నినదిస్తాం
వార్తల వెనుక వాస్తవాలు తెలియాలంటే
సాక్షి టీవీ చూడండి
సాక్షి టీవీ ప్రసారాల కోసం...
మీ స్థానిక కేబుల్ ఆపరేటర్‌ను వెంటనే సంప్రదించండి.
డీటీహెచ్‌లో సాక్షి ప్రసారాల కోసం
1456 | 2449 | airtel 907 | SUN 184
ఇంటర్నెట్‌లో సాక్షి ప్రసారాల కోసం
youtube.com/SakshiNews | Jio Fiber | airtel xstream
సత్యమేవ జయతే

దేవ్‌జీ, రాజారెడ్డిలను పోలీసులు అక్రమంగా నిర్బంధించారు

వారిని కోర్టుముందు హాజరుపరిచేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో కుటుంబసభ్యుల హెబియస్ కార్పస్ పిటిషన్
- వారిని నిర్బంధించలేదని హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం
- ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- 9 మంది కీలకనేతలను అదుపులోకి తీసుకున్నామని పోలీసులే చెప్పారు
- ఆ వీడియోను కోర్టు ముందుంచుతామన్న పిటిషనర్ల న్యాయవాది
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: మావోయిస్టు పార్టీ అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, వారిని కోర్టుముందు హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దేవ్‌జీ సోదరుడు తిప్పిరి గంగాధర్, రాజిరెడ్డి కుమార్తె స్నేహలత హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్ గేదెల ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ల న్యాయవాది యు.జైభీమారావు వాదనలు వినిపిస్తూ.. ఈ నెల 18న పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మృతి చెందారన్నారు. ఇదే సమయంలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలను పోలీసులు నిర్బంధించారని చెప్పారు. వారిని కోర్టుముందు ప్రవేశపెట్టేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ సమయంలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) తిరుమణి విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. దేవ్‌జీ, రాజారెడ్డి పోలీసుల అదుపులో లేరని చెప్పారు. అరెస్ట్ చేసిన 50 మంది మావోయిస్టులను పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని నివేదించారు. దేవ్‌జీ, రాజారెడ్డిలను అక్రమంగా నిర్బంధించారన్న వాదనలో వాస్తవం లేదన్నారు.

పోలీసుల అదుపులో ఉన్నారనేందుకు ఆధారాలేమున్నాయి?

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. దేవ్‌జీ, రాజారెడ్డి పోలీసుల అక్రమ నిర్బంధంలో ఉన్నారనేందుకు ఆధారాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించింది. ఏ ఆధారాలతో వారు పోలీసుల అదుపులో ఉన్నారని చెబుతున్నారని ప్రశ్నించింది. ఇలాంటి వ్యవహారాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకోవాలంటే.. అక్రమ నిర్బంధంపై ప్రాథమిక ఆధారాలుండాలని స్పష్టం చేసింది. ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు తాము చేయగలిగిందీ ఏమీ లేదని పేర్కొంది. పిటిషనర్ల న్యాయవాది జైభీమారావు స్పందిస్తూ.. దేవ్‌జీ, రాజారెడ్డిల సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. ఎన్‌కౌంటర్ తరువాత పోలీసులు మీడియాతో మాట్లాడుతూ 9 మంది కీలకనేతలు తమ ఆధీనంలో ఉన్నట్లు చెప్పారని, ఆ వీడియోను కోర్టు ముందుంచుతామని చెప్పారు. దీంతో ధర్మాసనం.. దేవ్‌జీ, రాజారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారనేందుకు ఆధారాలను తమ ముందుంచాలని పిటిషనర్ల న్యాయవాదికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి (నేటికి) వాయిదా వేసింది.

నిందితులు ఎన్నాళ్లు నింద మోయాలి?

విచారణలో జాప్యం సరికాదు

సునీత పిటిషన్‌పై వైఎస్ భాస్కర్‌రెడ్డి తదితరుల న్యాయవాది వాదనలు

తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా నిందమోపి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని నిందితులుగా చేర్చారని వారి న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు సీబీఐ కోర్టులో వాదనలు వినిపించారు. న్యాయస్థానం విచారణ పూర్తిచేసి నిర్దోషులుగా తీర్పునిచ్చేవరకు వారు ఆ నింద మోయాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులుగా చేర్చడంతో అవకాశం కోసం చూస్తున్న కొన్ని పత్రికలు తప్పుడు రాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని, కొందరు సోషల్ మీడియాలో నిందితుల పరువుకు భంగం వాటిల్లేలా పోస్టులు పెడుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. వైఎస్ వివేకా హత్యకేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురామ్ గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఆధారాలు లేకుండా నిందితులుగా చేర్చారన్నారు. ఈ కారణంగా వారి పరువుకు తీవ్రనష్టం కలుగుతోందని, విచారణ త్వరగా ముగియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిర్వహించేది పారదర్శక ట్రయల్ కాదన్నారు. దోషులు శిక్షించబడాలి.. అమాయకులు రక్షించబడాలి.. అని చట్టం చెబుతోందన్నారు.

విచారణను ఆలస్యం చేసేందుకే పిటిషన్లు

సుప్రీంకోర్టులో ఎవరు పిటిషన్ వేసినా దిగువ కోర్టును ఆశ్రయించమని చెబుతుందని, అంత మాత్రాన ఈ కేసులో సీబీఐని మరోసారి దర్యాప్తు నిర్వహించాలని చెప్పినట్లు కాదని తెలిపారు. వాదనలు, పరిస్థితుల కారణంగా నిర్ణయం తీసుకునే అధికారం దిగువకోర్టుదేనని వెల్లడించారు. ఇప్పటికే మూడేళ్లకుపైగా సీబీఐ దర్యాప్తు చేసిందని, చార్జిషీట్‌తోపాటు అనుబంధ చార్జిషీట్‌లను కూడా దాఖలు చేసిందని చెప్పారు. ఈ కేసులో శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డిని కావాలనే ఇరికించారని, దీనిపై ట్రయల్ కొనసాగే సమయంలో వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఇప్పటికే దర్యాప్తులో చాలా ఆలస్యం జరిగిందని.. దీనికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. 4 టెరాబైట్స్, 3 లక్షల ఫైళ్లు పరిశీలించారని, ఇంకా దర్యాప్తు కోరడం ఎంతవరకు సమంజసమని అడిగారు. కొందరి పక్షపాత వైఖరితో నిందితుల హక్కులకు భంగం కలుగుతోందన్నారు. పిటిషనర్ (సునీత) నిజంగా తన తండ్రిని హత్యచేసిన వారికి సత్వరం శిక్ష పడాలని కోరుకుంటోందా అన్న ప్రశ్న తలెత్తుతోందని చెప్పారు. సత్వర శిక్ష కోరుకుంటే ట్రయల్‌ను ఆలస్యం చేసే చర్యలు చేపట్టరన్నారు. ప్రతి పిటిషన్‌లో ఇంప్లీడ్ అవుతూ విచారణను ఆలస్యం చేస్తూ ఏళ్లకు ఏళ్లు కొనసాగే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో కోర్టు సమయం ముగియడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఎదురుకాల్పుల్లో ఎస్ఐ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ – మహారాష్ట్ర – మధ్యప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు జంక్షన్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక ఎస్ఐ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లా బోర్తాలాబ్ పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌కు చెందిన పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఎస్ఐ ఆశీష్‌శర్మ మృతి చెందాడు. ఆయన స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్ జిల్లా బోహాని గ్రామం.

పీఎం కిసాన్‌తో కలిపి రూ.20వేలే ఇస్తామన్నాం

'సాక్షి' కథనంపై మంత్రి అచ్చెన్నాయుడు బుకాయింపు

సాక్షి, అమరావతి: 2023–24లో అర్హత పొందిన 53.58 లక్షల మంది రైతులకు రూ.20వేల చొప్పున రెండేళ్లలో రూ.21,433.46 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.4,685.84 కోట్లు మాత్రమే ఇచ్చిందని 'అన్నదాత దుఃఖీభవ' శీర్షికతో గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై మంత్రి అచ్చెన్న తన అక్కసు వెళ్లగక్కారు. తాము ఎన్నికల్లో పీఎం కిసాన్‌తో కలిపి రూ.20 వేల చొప్పున ఇస్తామని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చామంటూ గురువారం ఒక ప్రకటనలో బుకాయించారు.

హిడ్మా దంపతులకు కన్నీటి వీడ్కోలు

పువర్తిలో ఒకే చితిపై హిడ్మా • రాజే దహన సంస్కారాలు

హిడ్మా, రాజే మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడ్వి హిడ్మా అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువర్తిలో జరిగాయి. ఈ నెల 18న ఏపీలోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన హిడ్మా, ఆయన భార్య రాజే మృతదేహాలతో కుటుంబీకులు గురువారం ఉదయం 8 గంటలకు పువర్తికి చేరారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ఆదివాసీలు వందలాదిగా పువర్తికి చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతులను అనుసరిస్తూ తలపై రెండు చేతులు ఉంచుకొని రున్–సాన్ అంటూ రోదించారు. మధ్యాహ్నం 11 గంటలకు హిడ్మా మృతదేహాన్ని దహనం చేసేందుకు తీసుకెళ్లగా స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల వారితో పువర్తిలో ఇటీవల వేసిన విశాలమైన రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఒకే చితిపై హిడ్మా–రాజే మృతదేహాలను ఉంచి దహన కార్యక్రమాలను పూర్తి చేశారు. ఆదివాసీ సంప్రదాయాలను అనుసరిస్తూ చితికి నిప్పంటించడానికి ముందు గ్రామస్తులు టవళ్లు, దుప్పట్లు, బ్లాంకెట్స్.. ఇలా ఏదో ఒక వస్త్రాన్ని చితిపై పేర్చారు. హిడ్మా తల్లి పోజే ఇటీవల ప్రభుత్వం అందించిన కొత్త బ్లాంకెట్‌ను హిడ్మా చితిపై వేసింది. హిడ్మా అంత్యక్రియల సందర్భంగా భద్రతాదళాలు బందోబస్తు ఏర్పాటు చేశాయి. గురువారం స్థానికంగా జరిగే సంతను సైతం రద్దు చేశారు. ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్‌శర్మ పిలుపు మేరకు లొంగిపోయేందుకు వచ్చిన హిడ్మా, ఆయన భార్య రాజేను ప్రభుత్వ దళాలు ప్రాణాలతో పట్టుకొని కాల్చి చంపాయని ఆయన కుటుంబీకులు ఆరోపించారు. ఆపై ఎన్‌కౌంటర్ అని చెబుతున్నారని వాపోయారు.

'ఆపరేషన్ సంభవ్' ఆగదు

మార్చి నాటికి రాష్ట్రంలో మావోయిస్టులు లేకుండా చేస్తాం

దేవ్‌జీ, మల్ల రాజారెడ్డి పోలీసుల అదుపులో లేరు

రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఆయుధాలు పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

రంపచోడవరం(అల్లూరి సీతారామరాజు జిల్లా): రాష్ట్రంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా ఏపీ పోలీసు శాఖ పని చేస్తున్నట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా చెప్పారు. మావోయిస్టుల ఏరివేతకు 'ఆపరేషన్ సంభవ్' కొనసాగుతుందని స్పష్టంచేశారు. మావోయిస్టుల వైపు వెళ్లే ప్రతి ఒక్కరిని అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టు నాయకులు దేవ్‌జీ, మల్ల రాజారెడ్డి పోలీసుల అదుపులో లేరని చెప్పారు. డీజీపీ గురువారం రంపచోడవరంలో పర్యటించారు. అనంతరం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ... వరుసగా రెండు రోజులపాటు జరిగిన ఎన్‌కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతిచెందారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీ కీలక నేతలు హిడ్మా, టెక్ శంకర్ వంటి వారు మరణించారని చెప్పారు. ఘటనాస్థలాల్లో అధిక సంఖ్యలో ఆయుధాలు లభ్యమయ్యాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిపిన సెర్చ్ ఆపరేషన్‌లో 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం సమన్వయంతో పనిచేయడం వల్ల మంచి ఫలితం వచ్చిందన్నారు. 2026 మార్చి నాటికి నక్సల్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే పోలీస్ శాఖ అంతిమ లక్ష్యమని డీజీపీ చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కీలక నేతలు మృతిచెందారని, అప్పుడే మావోయిస్టులు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరామని పేర్కొన్నారు.

హెలికాప్టర్ నుంచి అటవీ ప్రాంతంలో పరిశీలన

విశాఖపట్నం నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తొలుత మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. గతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న గుర్తేడు, పాతకోటతోపాటు తాజాగా మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిన జీఎం వలస అటవీ ప్రాంతాన్ని హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు.

ఇవి కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటర్లే

అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు

మాట్లాడుతున్న అంజమ్మ, అరుణ

రంపచోడవరం: అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్లు కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటర్లే అని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, సామాజిక కార్యకర్త అరుణ ఆరోపించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద వారు మీడియాతో మాట్లాడారు. పోలీసుల ఆధీనంలో ఉన్న వారిని వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. పోలీసులు చెబుతున్న దానిని బట్టి చూస్తే రెండు ఎన్‌కౌంటర్లు హత్యలేనని ఆరోపించారు. వారు చేస్తున్న ప్రకటనల్లో స్పష్టత లేదన్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగింది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్ అన్నారు. 'మావోయిస్టులను 2026 మార్చి నాటికి అంతమొందిస్తామని చెబుతుండటం కరెక్టు కాదు. అది రాజ్యాంగ ఉల్లంఘనే. అణచివేత ఉన్నంత కాలం ఉద్యమాలు ఉంటాయి.' అని స్పష్టం చేశారు.

● నోస్టాల్జియా

**కొద్దిగా ఉన్నప్పుడే బాగుండేది.
టీవీ ఉన్న ఇంటికి టీవీ లేని వాళ్లంతా వచ్చి కూచునేవారు.
ఆదివారం రామాయణం కోసం ప్రతి ఇల్లూ ఆతిథ్యం ఇచ్చేది.
చిత్రలహరికి గడప బయట నిలబడి
తొంగి చూసే పిల్లల్ని అదిలించేవారు కాదు.
ఇంటి పైన యాంటెనా, ఇంట్లో డయనారా
అదీ హోదా అంటే.
టెలివిజన్ జీవితంలో భాగం అయిన రోజులు
బాగుండేవి.
ఇవాళ జీవితమంతా టీవీగా మారి ఊపిరి
సలపడం లేదు.
టీవీ వచ్చిన రోజులకూ ఇప్పటికీ ఎంత తేడా!**

నేడు వరల్డ్ టెలివిజన్ డే

చిత్రలహరి వస్తుంది పద...

సినిమా తెర మీద కాకుండా మరో తెర మీద, అదీ ఇంట్లో ఉండే తెర మీద బొమ్మ పడుతుందని ఊహించని రోజుల్లో టెలివిజన్ వచ్చి చేసిన సందడి అంతా ఇంతా కాదు. నాటి హైద్రాబాద్, లేదా మద్రాస్ (చెన్నై), లేదా కొండపల్లి నుంచి సిగ్నల్స్ సరిగా ఆ రోజుకి అందాయో ఇక పండగే పండగ. ఎందుకు పండగ? సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది వరకు ఆ తెలుపు నలుపు టీవీలో ఏదో ఒకటి ఉచితంగా ప్రసారం అవుతూ ఉంటుంది. చూడొచ్చు. అందుకని.

సమయం ఉన్న రోజులు

మన దేశంలో 1959లో టెలివిజన్ మొదలైనా సరైన ప్రసారాలు రూపుదిద్దుకోవడానికి 1976కి కాని సాధ్యపడలేదు. నగరాలను దాటి ఊళ్లకు సిగ్నల్ అందే వ్యవస్థ ఏర్పడటానికి మరో పదేళ్లు పట్టింది. కలర్ ప్రసారాలు 1982లో మొదలైనా 1990లకు గాని కలర్ టీవీలు కొనే శక్తి ఊళ్లల్లో ఏ కొద్దిమందికో తప్ప అందరికీ రాలేదు. ఏతా వాతా 1985 నుంచి తెలుపు, నలుపు టీవీ ప్రసారాలు తెలుగు ప్రేక్షకులకు తెలుస్తూ వచ్చాయి. ఆ రోజుల్లో మనుషులందరి దగ్గరా ఎక్కడ లేని తీరిక, సమయం. కాబట్టి టీవీ ఆన్ చేసి అర్థమైనా కాకపోయినా చూస్తూ ఉండటం అలవాటుగా మారింది. ఇక అందులో ఆసక్తికరమైన కార్యక్రమాలు మొదలయ్యాక అతుక్కుపోయారు. టెలివిజన్ చేసిన మొదటి పని ఏమిటంటే– దేశ వాసులందరికీ ఒకే టీవీ ఒకే వినోదం అనే భావన కలిగించడం. ప్రాంతీయ ప్రసారాలు ఉన్నా ముఖ్యమైన మీట ఢిల్లీలో ఉంటుందని అందరికీ తెలియచేయడం. కేంద్ర శక్తిని స్థాపించడంలో టెలివిజన్ ముఖ్యపాత్ర పోషించింది.

రామాయణం సంచలనం

1987 నుంచి మొదలైన 'రామాయణం' సీరియల్ టెలివిజన్ పవర్ ఏంటో దేశానికి చాటింది. వ్యాపార ప్రకటనలు ఎలక్ట్రానిక్ మీడియాలో వెల్లువెత్తడం కూడా మొదలయ్యాయి. అంతవరకూ టికెట్ ఇచ్చి సినిమా హాల్లో రామాయణం చూసిన జనం ఈ ఉచిత రామాయణాన్ని తండోపతండాలుగా చూశారు. ఆ తర్వాత 'మహాభారత్', 'హమ్‌లోగ్', 'నుక్కడ్', 'ఉడాన్', 'మాల్గుడీ డేస్'... ప్రేక్షకులకు అందమైన డేస్ మిగిల్చాయి.

చిత్రహార్-చిత్రలహరి

ప్రతి బుధవారం వచ్చే హిందీ పాటల 'చిత్రహార్', శుక్రవారం వచ్చే 'చిత్రలహరి' సూపర్‌హిట్ ఆదరణ పొందాయి. జనం తెలుగు పాటల కోసం టీవీల ముందు కొలువు తీరేవారు. ఆ రోజుల్లో ప్రతివారం 'ఒక బృందావనం సోయగం' (ఘర్షణ 1988) పాట తప్పనిసరిగా ఉండేది. పండగల ముందు ఆయా పండగలకు తగ్గట్టుగా పాటలు ఉండేవి. అదే సమయంలో ధర్మవరపు సుబ్రహ్మణ్యం 'ఆనందో బ్రహ్మ' సూపర్‌హిట్ అయ్యింది. ఆదివారం రోజు అతి పాత తెలుగు చిత్రం వచ్చినా జనం విరగబడి చూసేవారు.

అపురూప క్షణాలు

ఇంటి పైనా యాంటెనా, ఇంట్లో టీవీ ఉండటం ఎంతో గొప్పయిన రోజులు అవి. ఇక కలర్ టీవీ ఉన్న ఇంటికి డిమాండ్ జాస్తిగా ఉండేది. వాన వచ్చినా, గాలి వీచినా నిలువని బొమ్మతో వేగినా అదే పెద్ద సంబరం. ఇన్‌స్టాల్‌మెంట్‌లో కొని ఇంటికి టీవీ తెచ్చిన రోజు పండగ ఉండేది. మధ్యతరగతి జీవులకు తగినట్టుగా 'మినీ టీవీ'లు కంపెనీలు తెచ్చాక వాటితోనే సర్దుబాటు చేసుకున్న సన్నజీవులెందరో. దూరదర్శన్ సిగ్నేచర్ ట్యూన్‌తో సహా దూరదర్శన్ అందరికీ అభిమానపాత్రమైంది. ఆదివారం మధ్యాహ్నం ప్రాంతీయ భాషా చిత్రాలు కూడా సబ్‌టైటిల్స్‌తో చూసేవారు. అలా ఎన్నో ఉత్తర కన్నడ, తమిళ, మలయాళ సినిమాలు చూశారు. టీవీ ప్రసారాల వల్ల ఇరుగిల్లు పొరుగిల్లు ఒకే ఇల్లయినట్టుగా అందరూ కలిసి మెలిసి ఉండేవారు. టీవీలో క్రికెట్ లైవ్ చూడటానికి ఎంతో మంచిగా వ్యవహరించాల్సి వచ్చేది. స్నేహాలు చేయాల్సి వచ్చేది.

ఇప్పుడు చేతిలో ఫోన్. అనుక్షణం రీల్స్. చేతిలోనే కదిలే బొమ్మ. దేనికీ విలువ లేదు. ఓటీటీల్లో వందల సినిమాలు ఉన్నా దేనిని ఎంపిక చేసుకోవాలో తెలియని పరిస్థితి. ఏదీ నచ్చదు. కానీ ఆ రోజుల్లో వచ్చిందే నచ్చేది. అతిగా లభ్యమైనది ఏదైనా విలువ కోల్పోతుంది. ఇవాళ విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ వేయి రూపాలు సంతరించుకున్నా, ఇరవై నాలుగ్గంటల న్యూస్ చానల్స్ ఉన్నా అవన్నీ జల్లెడలో జారే ఊకలానే ఉంటున్నాయి. టెలివిజన్ ప్రసారాల ప్రొఫెషనలిజమ్, హుందాతనం, ఆ న్యూస్‌రీడర్లు, ఆ యాంకర్లు... ఆ మాట... ఉచ్చారణ... పలుకు... ఇప్పుడెక్కడ.

పసిడి రెక్కలు విసిరి కాలం పారిపోయింది.

● బుక్ షెల్ఫ్

మహిళల మానసిక ప్రపంచంలోకి...



ఉత్తరాన కశ్మీర్ నుండి దక్షిణాన మలయాళం వరకు, పశ్చిమాన రాజస్థానీ నుంచి తూర్పున అస్సామీ వరకు 'బ్యాండెజ్డ్ మూమెంట్స్' పుస్తకంలో ఎంతోమంది మహిళల గొంతులు వినిపిస్తాయి. మానసిక ఆరోగ్యం నుంచి సామాజిక శ్రేయస్సు వరకు ఎన్నో అంశాలపై పదిహేను భారతీయ భాషలలో, మూడు మాండలికాలలో (మార్వారీ, మాగహి, భోజ్‌పురి) మహిళలు రాసిన కథల ఇంగ్లీష్ అనువాదం... బాండెజ్డ్ మూమెంట్స్ పేరుతో ముందుకు వచ్చింది.

ఉపాధ్యాయులైన ఇద్దరు మహిళలు ఈ పుస్తకానికి ముందుమాట రాశారు.

పేదరికం మాత్రమే కాదు మానసిక అనారోగ్యం కూడా పెద్ద సమస్యే అని చెబుతాయి ఈ పుస్తకంలోని కథలు.

ఆందోళన, నిరాశ, అబ్సెసివ్-కంపల్సివ్ డిజార్డర్ (వోసిడి), స్కిజోఫ్రేనియా...మొదలైన వాటి గురించి రచయిత్రులు తమ జీవితానుభవాల నుంచి చెప్పిన కథలు ఇందులో ఉన్నాయి.

గ్లాస్ వాల్స్ (తమిళ్), ఫ్లైయింగ్ ఫిష్ (అస్సామీ), ది టేల్ ఆఫ్ ది టాయిలెట్ (కన్నడ), కన్వర్ట్ మై బ్యాడ్ కర్మ టు గుడ్ (హిందీ)... మొదలైన కథలు స్త్రీలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యల గురించి రాసినవే.

మానసిక ఆరోగ్యం కూడా ఒక సామాజిక సమస్య అని, అది వివక్షతకు గురవుతుందని చెప్పే కథలు... ఓ మై టెనిఫాక్టర్ (మైథిలి), గర్ల్ ఇన్ ది డాల్‌హౌస్ (పంజాబీ)... మొదలైనవి.

అబ్సెషన్ అనేది వ్యక్తి యొక్క మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. విసియస్ సైకిల్ (గుజరాతి), ది స్మెల్ ఆఫ్ న్యూస్ (మలయాళం), బ్రేకింగ్ అవుట్ (ఉర్దూ), బోర్డర్ లైన్ (బెంగాలీ) అనేవి అబ్సెషన్ కేంద్రంగా నడిచే కథలు. క్రేజీ రివర్ (ఒడియా) అనేది మాట్లాడాలనే కోరికను, ఉత్సాహాన్ని కోల్పోయిన మహిళ కథ. ది షాడో (ఒడియా) ఒక మహిళ మానసిక ఆరోగ్యం క్రమంగా క్షీణించడాన్ని గురించి చెబుతుంది. ది ఎల్లో రోజ్ (ఉర్దూ) మానసిక సమస్యల్లో ఉన్న వారి ఒంటరితనం గురించి చెబుతుంది.

● బ్యూటిప్

ఎగ్ మాస్క్

దీనిని రెండు రకాలుగా వేసుకోవచ్చు. జిడ్డు చర్మానికైతే కేవలం తెల్లసొనను వాడాలి. తెల్లసొనను ముఖానికంతటికీ పట్టించి పదినిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల జిడ్డు వదిలి ముఖం తాజాగా ఉంటుంది. చర్మం మృదువుగా, శుభ్రంగా ఉంటుంది. కొన్ని ప్యాక్‌లను కళ్ల చుట్టూ మినహాయించాల్సి ఉంటుంది.తెల్లసొన కళ్లకింద నల్లటి వలయాలను పోగొడుతుంది కాబట్టి నిరభ్యంతరంగా కళ్ల చుట్టూ కూడా రాసుకోవచ్చు. పొడి చర్మానికైతే గుడ్డులోని పచ్చసొననుబాగా చిలికి ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత వేడినీటితో కడగాలి. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాల్లో పట్టివున్న మురికి వదిలిపోతుంది. చర్మం తెల్లబడుతుంది. నార్మల్ స్కిన్ అయితే గుడ్డులోని రెండు సొనలను కలిపి వాడుకోవచ్చు.

సాక్షి సినిమా

ప్రపంచ సినిమాను గోవాకు తీసుకురావడం మా లక్ష్యం

- గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

● అశోక గజపతిరాజు, బాలకృష్ణ, ప్రమోద్ సావంత్, మురుగన్

''భారతీయ దర్శకులు, నిర్మాతలు, కథారచయితలు... ఇలా అందరూ ప్రపంచాన్ని కలుసుకునే వేదిక ఇది. గోవాను క్రియేటివ్ క్యాపిటల్‌గా మలిచే దిశగా కృషి చేస్తున్నాం. చిత్ర నిర్మాణ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, గోవా ఫిల్మ్ మేకర్స్‌ను ప్రోత్సహిస్తూనే ప్రపంచ సినిమాను గోవాకు తీసుకురావడం మా లక్ష్యం'' అని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు. 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ) గురువారం భారీ పరేడ్ నేపథ్యంలో గోవా గవర్నర్ అశోక గజపతిరాజు ప్రారంభించారు. 2004లో మనోహర్ పారికర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇఫీలో పాల్గొడానికి గోవా వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా అశోక గజపతిరాజు గుర్తుచేసుకున్నారు.

50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసిన ఘనతకు గుర్తింపుగా ప్రముఖ తెలుగు నటుడు నందమూరి బాలకృష్ణకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ–''ఇఫీ వేడుకల్లో భాగమైనందుకు ఆనందంగా ఉంది. భారత దేశంలో పుట్టడం నా అదృష్టం'' అన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ– ''సనాతన ధర్మం సత్తా చూపించేలా 'అఖండ 2' రూపొందింది. ప్రస్తుతం నటనని గ్రాఫిక్స్ డామినేట్ చేస్తున్నాయి. అయితే నా సినిమాలను గమనిస్తే నేనే వాటిని డామినేట్ చేస్తాను'' అని పేర్కొన్నారు బాలకృష్ణ. ఔత్సాహిక యువతను ప్రోత్సహించేందుకు మారియట్ హోటల్‌లో కేంద్ర మంత్రి మురుగన్ ఆరంభించిన 'వేవ్స్ ఫిల్మ్ బజార్–2025' ప్రారంభ కార్యక్రమంలో కూడా బాలకృష్ణ పాల్గొన్నారు.

టాలీవుడ్ సందడి: 'ఇఫీ' కార్యక్రమాల్లో దేశ విదేశీ సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు శ్రీలీల, 'దిల్' రాజు, సి కల్యాణ్, మాదాల రవి, వీరశంకర్, భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు. ''ప్రాంతీయ భాష నుంచి పాన్ ఇండియా స్థాయికి తెలుగు సినిమా ఎదిగింది. ప్రాంతాలకు అతీతంగా ఇంతమందిని ఒక్కటి చేసి ఇండియన్ సినిమాగా మార్చేందుకు ప్రపంచ సినిమాతో పోటీ పడేందుకు 'ఇఫీ'లాంటి వేదికలు ఉపకరిస్తాయి'' అన్నారు 'దిల్' రాజు, మాదాల రవి. హిందీ పరిశ్రమ నుంచి అనుపమ్ ఖేర్, రాకేష్ ఓంప్రకాశ్ మెహ్రా, శేఖర్ కపూర్, జాకీ ష్రాఫ్ తదితరులు హాజరయ్యారు.

– గోవా నుంచి 'సాక్షి' ప్రతినిధి

ఆ ప్రేమ నాకు ఇంకా కావాలి

- భాగ్యశ్రీ బోర్సే

''నేను నార్త్ నుంచి సౌత్‌కి వచ్చాను. ఇక్కడ ఒక స్టార్ హీరోని ఫ్యాన్స్ ఎంత గొప్పగా ఆరాధిస్తారో, ప్రేమిస్తారో చూశాను. అదో గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా, పరిచయం లేకుండా ఒక వ్యక్తిని ప్రేక్షకులు అంతలా ఎలా అభిమానిస్తారు? అనిపించేది. 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కథను పి. మహేశ్‌బాబు చెప్పినప్పుడు ఈ ప్రశ్నకు నాకు సమాధానం దొరికింది'' అని భాగ్యశ్రీ బోర్సే అన్నారు. రామ్, భాగ్యశ్రీ బోర్సే జంటగా ఉపేంద్ర కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నేను మహాలక్ష్మి అనే కాలేజీ అమ్మాయి పాత్రలో నటించాను. మంచి ఎమోషన్ ఉన్న ఈ పాత్ర నాకు చాలా స్పెషల్. సాగర్ (రామ్ క్యారెక్టర్)తో తను ప్రేమలో ఉంటుంది. తెలుగులో నేను కలిసిన తొలి నిర్మాతలు నవీన్, రవిశంకర్‌గార్లు. ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. తెలుగులో నాకు మంచి ప్రేక్షకాదరణ లభిస్తుండం హ్యాపీ. ఆ ప్రేమ నాకు ఇంకా కావాలి. నాకు వచ్చిన ప్రతి పాత్రకి వంద శాతం కష్టపడుతూ, వెర్సటైల్ యాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది'' అని చెప్పారు.

ఫుల్ పాజిటివ్‌గా ఉన్నాం

- 'అల్లరి' నరేశ్

''ఈ రోజుల్లో ఆడియన్స్‌కు ఏదైనా కొత్తగా చెబితేనే థియేటర్స్‌కు వస్తున్నారు. నా ప్రయత్నంలో భాగంగా నేను తొలిసారిగా ఓ సస్పెన్స్ థ్రిల్లర్ '12ఎ రైల్వే కాలనీ' మూవీ చేశాను. నా ప్రతి సినిమాకూ నాకు టెన్షన్ ఉంటుంది. కానీ ఈ సినిమాపై పూర్తి నమ్మకంతోనే ఉన్నాం. ఫుల్ పాజిటివ్ ఫీలింగ్‌తో ఉన్నాం. ఇటీవలి కాలంలో ఈ సినిమాలోని స్క్రీన్‌ప్లేతో చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ఈ కథలోని మైండ్‌గేమ్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది" అని 'అల్లరి' నరేశ్ చెప్పారు. 'అల్లరి' నరేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. ఈ చిత్రంలో కామాక్షీ భాస్కర్ల హీరోయిన్. 'పొలిమేర' ఫేమ్ అనిల్ విశ్వనాథ్ కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించి, షో రన్నర్‌గా ఉన్న ఈ సినిమాకు నాని కాసరగడ్డ దర్శకత్వం వహించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో 'అల్లరి' నరేశ్ చెప్పిన విశేషాలు.

● ఈ చిత్రంలో లోకల్ ఎమ్మెల్యే దగ్గర పని చేసే కార్తీక్ అనే పాత్రలో నటించాను. ఈ సినిమా కోసం వర్క్‌షాప్స్ చేశాం. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాం. ఇది పూర్తిగా హారర్ సినిమా కాదు. పారానార్మల్ టింజ్ ఉంటుంది. ఈ సినిమా కథను అనిల్ చెబుతున్నప్పుడు ఇంట్రవెల్ సీక్వెన్స్‌కు షాక్ అయ్యాను. కథలో ఎక్కడో మొదలైన సీన్‌కి చివర్లో మరో కనెక్షన్ ఉంటుంది. అలాగే ఈ సినిమాలో మూడు నాలుగు కథలు సమాంతరంగా జరుగుతుంటాయి. ఈ సినిమా రిలీజ్ తర్వాత స్క్రీన్‌ప్లే గురించి మాట్లాడుకుంటారు. అలాగే నేనో మంచి సినిమా చేశాననే రెస్పాన్స్ ఆడియన్స్ నుంచి వస్తుందనే నమ్మకం ఉంది. నాని సినిమాను బాగా డైరెక్ట్ చేశారు. శ్రీనివాసగారి బేనర్లో నేను చేసిన తొలి సినిమా 'నా సామిరంగ' (ఇందులో నాగార్జున హీరో). రాజీ పడకుండా '12ఎ రైల్వే కాలనీ' సినిమాను నిర్మించారాయన. మనం మరో సినిమా చేద్దామని ఆయన నాతో చెప్పారు.

● హాస్యనటుడిగా నేను దాదాపు యాభై సినిమాలు చేశాను. ప్రతివాళ్ళు మీ ఫలానా కామెడీ సినిమా బాగుందనే వారు. కానీ యాక్టర్‌గా నా గురించి మాట్లాడేవారు కాదు. అయితే నటుడికి గుర్తింపే ముఖ్యం. నేను సీరియస్ సినిమాలు, కామెడీ సినిమాలూ చేశాను. కామెడీ చేయడం చాలా కష్టం. ఇప్పటి ప్రేక్షకులు కొత్త రకం కామెడీ, ఆర్గానిక్ కామెడీని కోరుకుంటున్నారు. ● దర్శకుడిగా సినిమా చేయాలని ఉంది. దర్శకుడిని అయితే కథలో ఇన్‌వాల్వ్ అవుతానని, దర్శకుడిగా బిజీ అవ్వాలనుకుంటున్నానని అనుకుని యాక్టర్‌గా నాకు అవకాశాలు రాకపోవచ్చు. అందుకే నాలుగైదేళ్ల తర్వాత డైరెక్షన్ చేస్తాను. ఓ మూకీ సినిమా చేయాలని ఉంది. ఒక్క డైలాగ్ లేకుండా రెండున్నర గంటలు నవ్వించడం చిన్న విషయం కాదు. ఇక రెండు కామెడీ సినిమాలు చేయబోతున్నాను. నేను నటించిన 'ఆల్కహాల్' చిత్రం జనవరిలో రిలీజ్ కానుంది.

ప్రకృతి గొప్పదనం చెప్పే కలివి వనం

● సమ్మెట గాంధీ, నాగదుర్గ, రఘుబాబు

రఘుబాబు, నాగదుర్గ, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీచరణ్, అశోక్ నటించిన చిత్రం 'కలివి వనం'. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రాజ్ నరేంద్ర మాట్లాడుతూ– ''సినిమా అంటే వినోదమే కాదు... విజ్ఞానం అని తెలియపరుస్తూ ఒక విలేజ్ డ్రామా ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు సమాజానికి మంచి సందేశాన్ని 'కలివి వనం' ద్వారా ఇస్తున్నాం. సినిమా చూసి బయటకి వచ్చిన ప్రేక్షకులకు మనం కూడా ఒక మొక్కను నాటాలనే ఆలోచన వస్తుంది'' అని తెలిపారు. రఘుబాబు మాట్లాడుతూ–''చెట్ల ప్రాధాన్యత, ప్రకృతి నేపథ్యంలో తీసిన 'కలివి వనం'కి ప్రేక్షకులు పెద్ద విజయం అందించాలి'' అన్నారు. ''మంచి కథాంశంతో వస్తున్న ఈ సినిమా చిన్నది కాదు... చాలా పెద్ద సినిమా'' అని చెప్పారు నాగదుర్గ.

నేను కాస్ట్ ఫెయిల్యూర్ హీరోని కాదు

- ప్రియదర్శి

"సినిమాల్లో నేను పోషించే పాత్రలపై నా వ్యక్తిత్వ ప్రభావం ఉండదు. నేననేవాడిని లేకుండా సినిమాల్లో నేను పోషించే పాత్రల్లోకి నటుడిగా నేను ఎంటర్ కావాలి. నన్ను నేను వెనక్కి పెట్టుకుంటేనే ప్రయోగాత్మక చిత్రాలు, కొత్త తరహా పాత్రలు చేయగలను. 'మల్లేశం, బలగం, కోర్టు' వంటి చిత్రాలు ఇలా వచ్చినవే. ఎవరైనా మీ స్టైల్లో ఒక సినిమా చేద్దామంటే నాకేం స్టైల్ లేదు. మీరేదైనా కొత్తగా చెప్తే అదే నా స్టైల్ అవుతుందని చెప్తుంటాను" అని ప్రియదర్శి అన్నారు. ప్రియదర్శి, ఆనంది హీరో హీరోయిన్లుగా, సుమ కనకాల ముఖ్య పాత్రలో నటించిన సినిమా 'ప్రేమంటే..'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో రానా స్పిరిట్ మీడియా సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రియదర్శి చెప్పిన విశేషాలు...

● ప్రతి సినిమా రిలీజ్‌కి ముందు ఉండే టెన్షనే నాకు ఈ సినిమాకి కూడా ఉంది. ఒక రైతు వాన కోసం ఎదురు చూసినట్లు నేను కూడా సినిమా రిజల్ట్ కోసం ఎదురు చూస్తుంటాను (నవ్వుతూ...). మనం ఇష్టపడి పెళ్లి చేసుకున్న తర్వాత మొదలయ్యే జీవితంలో చాలా డైనమిక్స్ మారతాయి. ప్రేమంటే ఇంత బాగుంటుంది అని అనుకోవడం దగ్గర్నుంచి ఇలా కూడా ఉండొచ్చని మా సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం. పెళ్లి నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చాయి. కానీ మనం ఎప్పుడు, ఏ విధంగా, ఏ టైమ్‌లైన్‌లో చెప్పాం అన్నది ముఖ్యం. 'ప్రేమంటే..'ని అందరూ రిలేట్ చేసుకుంటారు. ● ఈ సినిమాలో నా క్యారెక్టర్ కాస్త కొత్తగా ఉంటుంది. ఆనంది మంచి పెర్ఫార్మర్. చాలా ప్రొఫెషనల్. సుమక్క నుంచి చాలా నేర్చుకున్నాను. నవనీత్ మంచి క్లారిటీ ఉన్న డైరెక్టర్. పెళ్లిపై మెచ్యూరిటీతో ఈ కథ రాశాడు. సునీల్ నారంగ్, రామ్మోహన్‌రావు, జాన్వీగార్లు మంచిగా సపోర్ట్ చేశారు. ● నేను విలక్షణమైన కథలు చేస్తాననే గుర్తింపును ప్రేక్షకులు ఇచ్చారు. ఈ బాధ్యతతో సినిమాలు చేస్తున్నాను. అలాగే నాతో సినిమాలు చేసే నిర్మాతలు నష్టపోకూడదనుకుంటాను. 'డార్లింగ్' సినిమా ప్రాఫిటబుల్ వెంచర్. 'సారంగపాణి, డార్లింగ్, మిత్రమండలి' సినిమాలు థియేటర్స్‌లో ఆడకపోవడానికి చాలా కారణాలు ఉండొచ్చు. కానీ... ఇప్పటి వరకు నేను కాస్ట్ ఫెయిల్యూర్ హీరోని అయితే కాదు. ప్రస్తుతం 'అసమర్థుడు', 'సుయోధన' అనే సినిమాలు చేస్తున్నాను.

ఈ సినిమా క్లైమాక్స్ విని షాకయ్యాను

- కిరణ్ అబ్బవరం

● వంశీ, తేజస్విని, కిరణ్, అఖిల్, సాయిలు

''రాజు వెడ్స్ రాంబాయి' క్లైమాక్స్ విని, షాక్ అయ్యాను. ఇలాంటి దారుణం కూడా జరిగిందా? ఇలా చేస్తారా? ఇలాంటి మనుషులు ఉంటారా? అనిపించింది. ఈ సినిమాను మిగతా వారికంటే ముందు పదిహేనేళ్లు ప్రేమకథను దాచిపెట్టిన ఆ ఊరివాళ్లు చూడాలి'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. అఖిల్ ఉడ్డెమారి, తేజస్విని జంటగా నటించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సాయిలు కంపాటి దర్శకత్వంలో డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్, డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్‌సూన్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాసు విడుదల చేస్తున్న ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా హాజరయ్యారు కిరణ్ అబ్బవరం. ''ఒక ఊరు నేపథ్యంలో ఈ సినిమాను రూపొందించాం'' అన్నారు రాహుల్ మోపిదేవి. వంశీ నందిపాటి మాట్లాడుతూ– ''ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మా సినిమా టిక్కట్ ధర కేవలం రూ.99 మాత్రమే ఉంటుంది. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు చేరువ చేసే ప్రయత్నం ఇది'' అని పేర్కొన్నారు. ''ఉప్పెన'లో అమ్మాయి తండ్రి ఎలా ఉంటాడో చూసి ఉంటారు. 'కోర్టు' చిత్రంలో మంగపతిని చూశారు. ఆ పాత్రలకు మించి 'రాజు వెడ్స్ రాంబాయి'లో నేను చేసిన హీరోయిన్ తండ్రి వెంకన్న పాత్ర ఉంటుంది'' అన్నారు చైతన్య జొన్నలగడ్డ.

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
446	140
85,633	26,192

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	22,239	▼	321
డోజోన్స్	45,785	▼	354
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,543	▲	36
డాక్స్	23,292	▲	129
షాంఘై	3,931	▼	16
నికాయ్	49,824	▲	1,286

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఎస్‌బీఐ	88.20	89.22
£	బ్రిటన్‌ పౌండ్	ఎస్‌బీఐ	113.82	118.14
€	యూరో	ఎస్‌బీఐ	100.80	103.58
¥	జపాన్‌ యెన్‌ (100)	ఎస్‌బీఐ	55.69	57.06
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.23	59.05
S$	సింగపూర్‌ డాలర్	థామస్‌కుక్	65.60	69.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.77	24.27
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.26	24.52
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.60	13.42

టీసీఎస్, టీపీజీ నుంచి
డేటా సెంటర్

రూ. 18,000 కోట్ల పెట్టుబడులు

ముంబై: ఐటీ సర్వీసుల దేశీ దిగ్గజం టీసీఎస్, పీఈ దిగ్గజం టీపీజీ డేటా సెంటర్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్నాయి. రెండు సంస్థల భాగస్వామ్యంలో ఇందుకు రూ. 18,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించే యోచనలో ఉన్నట్లు వెల్లడించాయి. హైపర్‌వాల్ట్ పేరుతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీపీజీ బిలియన్ డాలర్లు(రూ. 8,870 కోట్లు) వెచ్చించనుంది. తద్వారా భాగస్వామ్య వెంచర్‌లో 27.5–49 శాతం మధ్య వాటాను పొందనుంది. టీపీజీని వ్యూహాత్మక పెట్టుబడుల భాగస్వామిగా చేసుకోవడం ద్వారా వాటాదారులకు పటిష్ట రిటర్నులందించేందుకు వీలుంటుందని టీసీఎస్ పేర్కొంది. అంతేకాకుండా పెట్టుబడి అవసరాలు తగ్గడంతోపాటు.. డేటా సెంటర్ ప్లాట్‌ఫామ్‌కు దీర్ఘకాలిక విలువ చేకూరుతుందని తెలియజేసింది. డేటా సెంటర్లలోకి భారీస్థాయిలో ప్రవేశించనున్నట్లు గత నెలలో టీసీఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

6.5 బిలియన్ డాలర్లు

దేశీయంగా 1 గిగావాట్ సామర్థ్య ఏర్పాటుకు 6.5 బిలియన్ డాలర్లు(రూ. 57,650 కోట్లు) వెచ్చించనున్నట్లు టీసీఎస్ తెలిపింది. వేగంగా పెరుగుతున్న డిమాండుకు అనుగుణంగా దేశంలో డేటా సెంటర్లను నెలకొల్పేందుకు టీపీజీ భాగస్వామికావడం సంతోషకరమని టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. దీంతో హైపర్‌స్కేలర్స్, ఏఐ కంపెనీలతో తమ భాగస్వామ్యం మరింత పటిష్టంకానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా డేటా సెంటర్ల సామర్థ్యం 1.5 గిగావాట్‌కాగా.. 2030కల్లా 10 గిగావాట్లకు బలపడనున్నట్లు అంచనా. ఇప్పటివరకూ డేటా సెంటర్ల బిజినెస్ 94 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకట్టుకోవడం గమనార్హం!

టీసీఎస్ షేరు యథాతథంగా రూ. 3,146 వద్ద ముగిసింది.

గ్లోబల్ టాప్ 100లో...
మరిన్ని భారతీయ బ్యాంకులు

- వేగంగా వృద్ధి చెందుతున్న బ్యాంకింగ్ వ్యవస్థ దన్ను
- మ్యూల్ హంటర్ ఏఐతో సత్ఫలితాలు వస్తున్నాయ్
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా టాప్ 100 బ్యాంకుల జాబితాలో త్వరలో మరిన్ని భారతీయ బ్యాంకులు చోటు దక్కించుకోగలవని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక సేవలు విస్తరిస్తుండటం, బ్యాంకింగ్ వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటం ఇందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. 'ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో చాలా బ్యాంకులు వేగంగా ఎదుగుతున్నాయి. వాటిలో నుంచి కొన్ని బ్యాంకులు కొద్ది కాలంలోనే ప్రపంచంలో టాప్ వంద బ్యాంకుల్లో చోటు దక్కించుకోగలవని భావిస్తున్నాను' అని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ (43వ ర్యాంకు), ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (73వ ర్యాంకు) మాత్రమే టాప్ 100 బ్యాంకుల్లో ఉన్నాయి. దేశానికి మరిన్ని భారీ స్థాయి బ్యాంకులు అవసరమంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలే చెప్పిన నేపథ్యంలో మల్హోత్రా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, డిజిటల్ మోసాలను కట్టడి చేసేందుకు ఉద్దేశించిన మ్యూల్ హంటర్ సాధనం చాలా మంచి ఫలితాలను ఇస్తోందని మల్హోత్రా చెప్పారు. ఇది ప్రతి నెలా 20,000కు పైగా మ్యూల్ అకౌంట్లను గుర్తిస్తోందని వివరించారు. మోసపూరితంగా కాజేసిన నిధులను మళ్లించేందుకు ఉపయోగించే ఖాతాలను మ్యూల్ అకౌంట్లుగా వ్యవహరిస్తారు. వీటిని గుర్తించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌బీఐహెచ్) మ్యూల్‌హంటర్‌డాట్‌ఏఐ పేరిట ఏఐ ఆధారిత సాధనాన్ని రూపొందించింది. డిజిటల్ మోసాలను అరికట్టడానికి హోంశాఖలో భాగమైన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)తో కలిసి పని చేయడంతో పాటు ఇతరత్రా పలు చర్యలు కూడా తీసుకుంటున్నట్లు మల్హోత్రా వివరించారు.

మనం చేయాల్సింది చేయాలి.. అంతే..

కర్మ సిద్ధాంతాన్ని అనుసరించి, ఫలితం గురించి ఆలోచించకుండా, మనం చేయాల్సినది చేయాలని, ఫలాలు వాటంతటవే లభిస్తాయని విద్యార్థులకు మల్హోత్రా చెప్పారు. ఈ సందర్భంగా అమెరికన్ టెక్ దిగ్గజం, దివంగత స్టీవ్ జాబ్స్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఎదగాలంటే 'కొన్ని చిట్కాలు' చెప్పాలంటూ ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు మల్హోత్రా ఈ మేరకు సమాధానమిచ్చారు. తాను విద్యాభ్యాసం చేసిన కాన్పూర్ ఐఐటీకి వెళ్లినప్పుడు కూడా ఇలాంటి ప్రశ్నే వచ్చిందని, కర్మ సిద్ధాంతం గురించే చెప్పినట్లు ఆయన వివరించారు.

అనిశ్చితే రూపాయి క్షీణతకు కారణం..

ఇటీవలి కాలంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ క్షీణించడానికి అమెరికా టారిఫ్‌ల వడ్డనతో నెలకొన్న వాణిజ్య అనిశ్చితులే కారణమని మల్హోత్రా చెప్పారు. రూపాయి మారకాన్ని మార్కెట్ వర్గాలే నిర్దేశిస్తాయి తప్ప దాన్ని నిర్దిష్ట స్థాయిలో నిలపాలని ఆర్‌బీఐ టార్గెట్ ఏదీ పెట్టుకోదని ఆయన తెలిపారు. డాలర్లకు డిమాండ్ పెరిగితే రూపాయి తగ్గుతుందని, అలాగే రూపాయికి డిమాండ్ పెరిగితే డాలర్లకు డిమాండ్ తగ్గుతుందని పేర్కొన్నారు. అమెరికాతో మెరుగైన వాణిజ్య ఒప్పందం కుదురుతుందని, కరెంట్ అకౌంట్‌పై నెలకొన్న ఒత్తిడి తొలగిపోతుందని విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండో రోజూ అదే జోరు

- ఇంట్రాడేలో ఏడాది గరిష్టాన్ని తాకిన సూచీలు
- కలిసొచ్చిన అంతర్జాతీయ మార్కెట్ల రికవరీ
- విదేశీ ఇన్వెస్టర్ల మళ్లీ పెట్టుబడుల బాట

ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో దేశీయ స్టాక్ మార్కెట్ రెండో రోజూ జోరు కనబరిచింది. ముఖ్యంగా చమురు, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో గురువారం సెన్సెక్స్ 446 పాయింట్లు బలపడి 85,633 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు పెరిగి 26,192 వద్ద స్థిరపడింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 615 పాయింట్లు బలపడి 85,802 వద్ద, నిఫ్టీ 194 పాయింట్లు ఎగసి 26,247 వద్ద ఏడాది గరిష్ట స్థాయిలను అందుకున్నాయి. టెక్నాలజీ రంగ కంపెనీల ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల నుంచి రికవరీ అయ్యాయి. ఆసియాలో చైనా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు లాభపడ్డాయి. జపాన్, కొరియా, హాంగ్‌కాంగ్ మార్కెట్లు 3–1% ఎగిశాయి. యూరప్ మార్కెట్లు 1% రాణించాయి. అమెరికా సూచీలు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డాలర్ మారకంలో రూపాయి విలువ 20 పైసలు క్షీణించి 88.68 వద్ద స్థిరపడింది.
- అదానీ గ్రూప్ టేకోవర్‌కు రుణదాతల కమిటీలోని మెజారిటీ రుణదాతలు ఆమోదం తెలపడంతో జేపీ అసోసియేట్స్ షేరు రెండో రోజూ లాభపడింది. బీఎస్‌ఈలో 6.50% పెరిగి రూ.22 వద్ద స్థిరపడింది.
- ఫిజిక్స్‌వాలా షేరు లిస్టింగ్ తర్వాత వరుసగా రెండోరోజుల్లో 9% క్షీణించింది. బీఎస్‌ఈలో గురువారం షేరు 2% నష్టపోయి రూ.141 వద్ద స్థిరపడింది.
- బ్రోకింగ్ కంపెనీ 'గ్రో' షేరు రెండో రోజూ డీలాపడింది. బీఎస్‌ఈలో 8% పతనమై రూ.157 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్'	ఈ-పేపర్‌లో ..
100 కోట్లకు 5జీ కనెక్షన్లు	పర్యాటక రంగానికి జాతీయ బోర్డు ఉండాలి

కీలక రంగాల్లో వృద్ధి ఫ్లాట్

- బొగ్గు, విద్యుదుత్పత్తి క్షీణత
- ఎరువులు, స్టీల్, రిఫైనరీ మెరుగు

న్యూఢిల్లీ: మౌలిక రంగం పనితీరు అక్టోబర్‌లో ఫ్లాట్‌గా (ఎలాంటి వృద్ధిలేని) నమోదైంది. ఎనిమిది కీలక రంగాలకు గాను పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్‌లో ఉత్పత్తి విస్తరించగా, బొగ్గు, విద్యుదుత్పత్తి తగ్గడంతో మొత్తం మీద పనితీరు ఫ్లాట్‌గా ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎనిమిది మౌలిక రంగాల్లో ఉత్పత్తి 3.3 శాతం పెరగ్గా, 2024 అక్టోబర్‌లోనూ 3.8 శాతం వృద్ధి కనిపించింది. కేంద్ర వాణిజ్య శాఖ ఈ గణాంకాలను విడుదల చేసింది.

- అక్టోబర్‌లో బొగ్గు ఉత్పత్తి 8.5 శాతం తగ్గింది.
- విద్యుదుత్పత్తి సైతం 7.6%, సహజ వాయువు ఉత్పత్తి 5 శాతం మేర తక్కువ నమోదైంది.
- ముడి చమురు ఉత్పత్తి 1.2 శాతం తగ్గింది.
- పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు 4.6 శాతం వృద్ధిని నమోదు చేశాయి.
- ఎరువుల ఉత్పత్తి 7.4%, స్టీల్ ఉత్పత్తి 6.7%, సిమెంట్ ఉత్పత్తి 5.3 శాతం చొప్పున పెరిగింది.
- ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 8 కీలక మౌలిక రంగాల్లో వృద్ధి 2.5%కి పరిమితమైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 4.3%గా ఉండడం గమనార్హం.

వర్షాల వల్లే..: అధిక వర్షాలతో మైనింగ్ కార్యకలాపాలపై, విద్యుత్ డిమాండ్‌పై అక్టోబర్‌లో ప్రభావం పడినట్టు ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. మౌలిక రంగంలో ఫ్లాట్ పనితీరు నేపథ్యంలో అక్టోబర్ నెలకు సంబంధించి పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి 2.5–3.5% మధ్య పరిమితం కావొచ్చన్నారు.

నిరాశపరిచిన ఫుజియామా పవర్ సిస్టమ్స్

ఇంటి పై కప్పు సౌర ఉత్పత్తుల తయారీ సంస్థ ఫుజియామా పవర్ సిస్టమ్స్ షేరు లిస్టింగ్‌లో నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ.228)తో పోలిస్తే బీఎస్‌ఈలో 4% డిస్కౌంటుతో రూ.218 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 10% క్షీణించి రూ.205 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 9% నష్టంతో రూ.208 వద్ద స్థిరపడింది. మార్కెట్ ముగిసే సరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.6,384 కోట్లుగా ఉంది.

ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ బరిలో హంపి

దోహా: వచ్చే నెలలో జరిగే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత స్టార్ క్రీడాకారిణులు బరిలోకి దిగనున్నారు. డిసెంబర్ 25 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో మహిళల ర్యాపిడ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి డిఫెండింగ్ చాంపియన్‌గా పోటీ పడనుంది. గత ఏడాది న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో హంపి 8.5 పాయింట్లతో విజేతగా అవతరించి రెండోసారి ఈ ప్రతిష్టాత్మక టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈసారి హంపితోపాటు భారత్ నుంచి మరో 12 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్, వైశాలి, వంతిక, పద్మిని రౌత్, సవిత శ్రీ, నందిత, నూతక్కి ప్రియాంక, ఇషా శర్మ, రక్షిత, చర్వీ తమ ఎంట్రీలను ఖరారు చేశారు. ఓపెన్ విభాగంలో భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ, కార్తీక్ వెంకటరామన్, రాజా రిత్విక్ తదితరులు బరిలో ఉన్నారు.

పసిడి 'దీక్ష'

భారత మహిళా గోల్ఫర్‌కు స్వర్ణం

బధిరుల ఒలింపిక్స్ క్రీడలు

టోక్యో: భారత బధిర క్రీడాకారిణి దీక్షా డాగర్ డెఫిలింపిక్స్‌లో టైటిల్ నిలబెట్టుకుంది. బధిరుల విశ్వక్రీడల్లో గురువారం జరిగిన మహిళల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే గోల్ఫ్ ఫైనల్లో ఆమె వరుసగా 68, 65, 72 స్కోర్లతో విజేతగా నిలిచింది. ఫైనల్లో మొత్తం 21 మంది తలపడగా భారత ప్లేయరే అగ్రస్థానంలో నిలిచింది. తద్వారా 24 ఏళ్ల దీక్ష వరుస డెఫిలింపిక్స్‌ల్లో విజేతగా నిలిచిన గోల్ఫర్‌గా ఘనతకెక్కింది. నాలుగేళ్ల క్రితం 2021లో జరిగిన బధిర విశ్వక్రీడల్లోనూ ఆమె బంగారు పతకంతో మెరిసింది. అంత క్రితం 2017లో జరిగిన క్రీడల్లో ఆమె రజతం గెలుచుకుంది. పాల్గొన్న ప్రతి మెగా ఈవెంట్‌లోనూ ఆమె పతకంతోనే తిరిగొచ్చింది. జకార్తాలో 2018లో జరిగిన రెగ్యులర్ ఆసియా క్రీడల్లోనూ ఆమె పోటీ పడింది. ఆ మరుసటి ఏడాది (2019) మహిళల యూరోపియన్ టూర్‌లో 18 ఏళ్ల వయసులో టైటిల్ గెలిచింది. అదితి అశోక్ తర్వాత ఈ టైటిల్ గెలిచిన రెండో భారత గోల్ఫర్‌గా ఘనత వహించింది. ఈ పోటీల్లో భారత్ తరఫున ఆమెతో పాటు హర్ష్ సింగ్, విభు త్యాగిలు కూడా పోటీపడినప్పటికీ వీళ్లిద్దరు వరుసగా 12వ, 14వ స్థానాలతో సరిపెట్టుకున్నారు.

మాహిత్ 'ట్రిపుల్ ధమాకా'

భారత రైఫిల్ షూటర్ మాహిత్ సంధూ డెఫిలింపిక్స్‌లో ట్రిపుల్ ధమాకా సాధించింది. 50 మీటర్ల ప్రోన్ ఈవెంట్‌లో ఆమె 246.1 స్కోరుతో రెండో స్థానంలో నిలిచి రజతం గెలుచుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆమె 619.7 స్కోరుతో కొత్త ప్రపంచ రికార్డు లిఖించింది. ఈ మెగా ఈవెంట్‌లో మాహిత్ 10 మీటర్ల మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, 10 మీటర్ల వ్యక్తిగత విభాగంలో రజతం నెగ్గింది. ఆమె మూడు పతకాలతో ఒక్క షూటింగ్ క్రీడాంశంలోనే భారత్ డజను పతకాలను ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం భారత్ 4 స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి 12 పతకాలతో ఆరో స్థానంలో ఉంది.

నిఖత్ పంచ్ బంగారం

వరల్డ్ కప్ బాక్సింగ్ ఫైనల్స్ టోర్నీలో మెరిసిన భారత బాక్సర్లు ● తొమ్మిది స్వర్ణ పతకాలతో అద్భుత ప్రదర్శన

న్యూఢిల్లీ: వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్–2025లో భారత బాక్సర్లు సత్తా చాటారు. ఓవరాల్‌గా 9 స్వర్ణాలు మన ఖాతాలో చేరగా, ఇందులో 7 పసిడి పతకాలు మహిళా బాక్సర్లే గెలుచుకోవడం విశేషం. గురువారం జరిగిన ఫైనల్ పోటీల్లో నెగ్గి మహిళల విభాగంలో నిఖత్ జరీన్, జైస్మీన్ లంబోరియా, మీనాక్షి హుడా, ప్రీతి పవార్, పర్వీన్ హుడా, అరుంధతి చౌధరీ, నుపుర్ షెరాన్ స్వర్ణాలు సాధించగా... పురుషుల విభాగంలో సచిన్ సివాచ్, హితేశ్ గులియా కనకపు మోత మోగించారు. మాజీ ప్రపంచ చాంపియన్, తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ (51 కేజీలు) అంచనాలను అందుకుంటూ ఫైనల్లో చెలరేగింది. తుది పోరులో ఆమె 5–0తో గ్యూ యి యువాన్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 57 కేజీల కేటగిరీలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జైస్మీన్ 4–1తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతకం విజేత వు షి యిని ఓడించింది. ఇతర ఫైనల్ బౌట్‌లలో మీనాక్షి (48 కేజీలు) 5–0తో ఫర్జానా ఫొజిలోవా (ఉజ్బెకిస్తాన్)పై, ప్రీతి (54 కేజీలు) 5–0తో సిరీన్ చరాబి (ఇటలీ)పై, పర్వీన్ (60 కేజీలు) 3–2తో తగుచి అకయా (జపాన్)పై, అరుంధతి (70 కేజీలు) 5–0తో జొకిరొవా అజ్బాబ్ (ఉజ్బెకిస్తాన్), నుపుర్ (ప్లస్ 80 కేజీలు) 3–2తో సొటింబోవా (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొంది పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల విభాగంలో సచిన్ (60 కేజీలు) 5–0తో మునార్బెక్ (కిర్గిస్తాన్)ను, హితేశ్ (70 కేజీలు) నూర్బెక్ ముర్సల్ (కజకిస్తాన్)ను ఓడించి స్వర్ణాలు గెలుచుకున్నారు. ఫైనల్లో ఓడిన మరో ఆరుగురు భారత బాక్సర్లు రజత పతకాలతో సంతృప్తి చెందారు. పురుషుల విభాగంలో జాదూమణి సింగ్ (50 కేజీలు), పవన్ బర్త్‌వాల్ (55 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), అంకుశ్ ఫంగాల్ (80 కేజీలు), నరేందర్ (ప్లస్ 90 కేజీలు)... మహిళల విభాగంలో పూజ రాణి (80 కేజీలు)లకు వెండి పతకాలు దక్కాయి. సెమీఫైనల్లోనే ఓడిన మరో ఐదుగురు బాక్సర్లు కాంస్యంతో సరిపెట్టుకున్నారు. నీరజ్ ఫొగాట్ (65 కేజీలు), స్వీటీ బూరా (75 కేజీలు), సుమిత్ కుందు (75 కేజీలు), జుగ్నూ (85 కేజీలు), నవీన్ (90 కేజీలు)లకు కంచు పతకాలు దక్కాయి. దాంతో 9 స్వర్ణాలు, 6 రజతాలు, 5 కాంస్యాలతో ఓవరాల్‌గా భారత్ సొంతగడ్డపై 20 పతకాలు సొంతం చేసుకోవడం విశేషం.

ఆయుశ్ శెట్టి సంచలనం

- ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్‌పై విజయం

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి సంచలనం సృష్టించాడు. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)ను బోల్తా కొట్టించిన ఆయుశ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 68 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆయుశ్ 21–17, 21–16తో నరోకాపై గెలుపొందాడు. భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ కూడా క్వార్టర్ ఫైనల్ చేరగా... కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, తరుణ్ మన్నేపల్లి పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. లక్ష్య సేన్ 21–17, 13–21, 21–13తో చి యు జెన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు. శ్రీకాంత్ 20–22, 16–21తో షోగో ఒగావా (జపాన్) చేతిలో, తరుణ్ 13–21, 21–19, 10–21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో, ప్రణయ్ 19–21, 10–21తో ఫర్హాన్ అల్వీ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–18, 21–11తో సు చింగ్ హెంగ్–వు గువాన్ జున్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది.

సెమీఫైనల్లో జోష్నా, అనాహత్



ఇండోర్: ఇండియన్ ఓపెన్ స్క్వాష్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత వెటరన్ జోష్నా చినప్ప... రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ అనాహత్ 11–5, 11–1, 11–4తో ఎనిమిదో సీడ్ కాటరీనా టైకోవా (జర్మనీ)పై గెలుపొందగా... జోష్నా చినప్ప 11–4, 11–6, 11–3తో ఏడో సీడ్ సోఫియా మటియోస్ (స్పెయిన్)ను ఓడించింది. భారత్‌కే చెందిన తన్వీ ఖన్నా పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. తన్వీ ఖన్నా 4–11, 9–11, 8–11తో నాదీన్ ఎల్‌హామి (ఈజిప్ట్) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడో సీడ్ రమిత్ టాండన్ పోరాడి ఓడిపోయాడు. టాప్ సీడ్ యూసుఫ్ సోలీమన్ (ఈజిప్ట్) 11–5, 9–11, 3–11, 11–3, 11–5తో రమిత్ టాండన్‌ను ఓడించి సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు.

'యాషెస్' సమరానికి సిద్ధం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'గంభీర్‌పై విమర్శలేల'

- బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ అసహనం
- భారత హెడ్ కోచ్‌పై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్య

గువాహటి: తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓడిపోవడంతో వస్తున్న తీవ్ర విమర్శలపై భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ అసహనం వ్యక్తం చేశాడు. కొందరు పనిగట్టుకొని గంభీర్‌పై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని అతను వ్యాఖ్యానించాడు. భారత జట్టు పరాజయంలో ఆటగాళ్ల పాత్రను వదిలి కోచ్‌ను లక్ష్యంగా చేసుకోవడంలో అర్థం లేదని కొటక్ అన్నాడు. రేపటి నుంచి ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జరగనున్న నేపథ్యంలో అతను గురువారం మీడియాతో మాట్లాడాడు. 'గంభీర్, గంభీర్ అంటూ ఒకే వ్యక్తిపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది సరైన పద్ధతి కాదు. నేను కూడా సహాయక సిబ్బందిలో భాగం కాబట్టి చాలా బాధగా ఉంది. కొందరికి తమ వ్యక్తిగత అజెండాలు ఉండవచ్చు. అందుకే పనిగట్టుకొని ఇలా చేస్తున్నారని అనిపిస్తోంది' అని కొటక్ స్పందించాడు. ఓటమి బాధ్యతను గంభీర్ తన మీదకు వేసుకున్నాడని కొటక్ గుర్తు చేశాడు. 'మ్యాచ్ ఓడిపోయాక ఫలానా బ్యాటర్ బాగా ఆడలేదని లేదా ఫలానా బౌలర్ ఇలా ఆడలేదని ఎవరూ విమర్శించడం లేదు. బ్యాటింగ్‌లో ఇలా ఉంటే బాగుండేదని ఎవరూ సూచించడం లేదు. కోల్‌కతాలో పిచ్ గురించి మాట్లాడుతూ గంభీర్ ఓటమి బాధ్యత అంతా తన మీద వేసుకున్నాడు. క్యురేటర్‌పై ఎవరూ విమర్శలు చేయకుండా కాపాడేందుకే అతను ఇలా చేశాడు' అని తమ హెడ్ కోచ్‌ను సితాన్షు వెనకేసుకొచ్చాడు. బ్యాటర్ క్రీజ్‌లోకి వెళ్లేటప్పుడు ఇలాగే ఆడాలని తాము చెప్పలేమని, పరిస్థితిని బట్టి అతను తన ఆటను మార్చుకుంటాడని కోచ్ అన్నాడు.

నేడు గిల్‌కు ఫిట్‌నెస్ పరీక్ష

కెప్టెన్ శుబ్‌మన్ గిల్ రెండో టెస్టు నుంచి తప్పుకోవడం దాదాపు ఖాయంగానే అనిపిస్తున్నా... టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన ఇవ్వడం లేదు. కోల్‌కతా టెస్టు రెండో రోజు మెడ నొప్పితో తప్పుకున్న అనంతరం ఇప్పటి వరకు గిల్‌కు చికిత్స కొనసాగుతూనే ఉంది. అతను ఆ తర్వాత ఒక్కసారి కూడా మైదానంలోకి దిగలేదు. అయితే మ్యాచ్‌కు ముందు రోజు గిల్‌ను ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తామని కొటక్ వెల్లడించాడు. 'గిల్ వేగంగా కోలుకుంటున్నాడు. అయితే అతను ఆడే విషయంపై టీమ్ వైద్యులు, ఫిజియో నిర్ణయం తీసుకుంటారు. ఈరోజు సాయంత్రం ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుంది. ఒకవేళ కోలుకున్నా... టెస్టు మధ్యలో మెడ నొప్పి తిరగబడితే కష్టం కదా. గిల్ లాంటి ఆటగాడు లేకపోవడం ఏ జట్టుకైనా లోటే' అని సితాన్షు వివరించాడు.

క్లుప్తంగా...

పనిదినాల్లో కార్యాలయాల్లో ఉండండి

డీఈవోలు, ఎంఈవోలకు ఆదేశం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ అధికారులు పనిదినాల్లో కార్యాలయాల్లో ఉండాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా డీఈవోలు, ఎంఈవోలు కార్యాలయాల్లో ఉండి గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. డీఈవోలు అన్ని పనిదినాల్లో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఎంఈవోలు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా డీఈవోలు, ఎంఈవోలు ప్రతిరోజు విధిగా పాఠశాలల పరిశీలనకు వెళ్లాలని, కనీసం రెండు మూడు స్కూళ్లను తనిఖీ చేయాలని గతంలో డైరెక్టరేట్ ఆదేశించింది. జిల్లా శివారు ప్రాంతాలు, మండల శివారు గ్రామాల్లో స్కూళ్ల పరిశీలనకు వెళ్లే డీఈవోలు, ఎంఈవోలు ప్రతిరోజు ఈ సమయాల్లో కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం సాధ్యమయ్యే పనికాదు. ఒకే సమయంలో ఒక అధికారి రెండు విధుల్లో ఎలా పనిచేయగలరని డైరెక్టరేట్ ఆదేశాలపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏఎన్‌యూ దూరవిద్య పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యు(పెదకాకాని): ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం పరిధిలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో జరిగిన పీజీ పరీక్ష ఫలితాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కో–ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ గురువారంవిడుదల చేశారు. ఎంఏ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, హిందీ, తెలుగు, ఇంగ్లిష్, జర్నలిజం, సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బోటనీ, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, సైకాలజీ, ఎంకాం, ఎంబీఏ, ఎంసీఏ, హెచ్‌ఆర్ఎం, ఎంఎల్ఐసీ, బీఎల్ఐసీ అన్ని సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి.

ప్రజావిశ్వాస సంరక్షకులుగా పనిచేయాలి

ఆడిట్ దివస్ ప్రారంభ వేడుకల్లో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ

సాక్షి, అమరావతి/గాంధీనగర్(విజయవాడసెంట్రల్) : ఆధునిక సాంకేతికతతో వినూత్న ఆడిట్ పద్ధతులను అవలంబిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసేలా మానవవనరులను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ చెప్పారు. విజయవాడలో గురువారం ఆమె 5వ ఆడిట్ దివస్ వేడుకల్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ.. అధునాతన సాంకేతికతలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సేవలను పరిపాలనలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజావనరులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజావిశ్వాసానికి సంరక్షకులుగా పనిచేయాలన్నారు. పరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పాత్రను, చేస్తున్న కృషిని వివరించారు. ఆడిటింగ్ ద్వారా ప్రజాధనం సమర్థంగా వినియోగమవుతుందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

దూర విద్య పరీక్ష

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దిగజారుతున్న ప్రమాణాలు

సాక్షి, అమరావతి: శతాబ్ది ఉత్సవాల వేళ ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ఖ్యాతి మసకబారుతోంది. ఏడాదిన్నరగా వర్సిటీ పాలకవర్గ నిర్ణయాలు రాజకీయాలకు, కార్పొరేట్లకు కొమ్ముకాసేలా ఉండడంతో ప్రాజెక్టులు చేజారే పరిస్థితి నెలకొంది. నిర్వహణ లోపం అక్కడితో ఆగకుండా లక్షలాది విద్యార్థులకు డిగ్రీలు అందిస్తున్న 'దూర విద్య' వ్యవస్థనూ కలుషితం చేస్తోంది. ఈ విధానంలో పీజీ, యూజీ పరీక్షల షెడ్యూల్ ప్రకటించి నెల కావొస్తోంది. రాష్ట్రంలోని 80 సెంటర్లలో వచ్చే మంగళవారం (25) నుంచి పరీక్షలు జరగనున్నాయి. దాదాపు పది రోజుల ముందే ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేరాల్సి ఉన్నా ఇంకా తయారవుతూనే ఉన్నాయి. దీంతో రెండు, మూడు రోజుల్లో పేపర్లు సెట్ చేసి, ముద్రించి సీల్డ్ కవర్లలో పంపడం సాధ్యమేనా అని అనుమానాలు కలుగుతున్నాయి.

చేతులు మారిన నిర్వహణ

గతంలో ప్రశ్నపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు దూరవిద్య కేంద్రంలోనే 'కాన్ఫిడెన్షియల్ సెక్షన్' ద్వారా పరీక్షలు నిర్వహించేవారు. ఈసారి బాధ్యతను రెగ్యులర్ ఎగ్జామినేషన్ కేంద్రానికి అప్పగించారు. ఎన్నడూ లేని విధంగా, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా సైన్స్ విద్యార్థుల హాజరును పట్టించుకోకుండా పరీక్షలకు అనుమతించారు. హాజరు లేదని ప్రాక్టికల్స్‌కు రానీయలేదు. థియరీ పరీక్షలకు మాత్రం అనుమతిస్తుండడం గమనార్హం. ఏయూ క్యాలెండర్ ఇయర్, అకడమిక్ ఇయర్‌లలో రెండుసార్లు దూరవిద్య ప్రవేశాలు కల్పిస్తోంది. 50–60 వేల ప్రవేశాలు నమోదవుతుంటాయి. ప్రస్తుతం యూజీ, పీజీ అన్ని సంవత్సరాల వారు కలిపి 90 వేల మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో అధికులు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. చాలామంది వివిధ రంగాల్లో ఉపాధి పొందుతూ చదువుకుంటున్నారు. పరిస్థితుల రీత్యా ఒకేసారి పరీక్షలకు హాజరవలేరు. కానీ, వీరి నుంచి నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశ రుసుముతో పాటు పరీక్ష ఫీజు వసూలు చేస్తున్నారు. ఇది వారిపై ఆర్థిక భారాన్ని మోపుతోంది. దీనికితోడు ఇప్పుడు పరీక్షలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఏయూ క్యాంపస్‌లో 5 వేల మంది ఉంటే దూర విద్యలో లక్షలమంది చదువుతున్నారు. ఏటా ప్రవేశాలతో రూ.40కోట్ల నుంచి రూ.50 కోట్ల ఆదాయం వస్తోంది. అలాంటి వ్యవస్థను దెబ్బతీసి కార్పొరేట్లకు మేలు చేసేలా కుట్రలు జరుగుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. కాగా, దూరవిద్యలో ప్రవేశాలను ఆయా సెక్షన్లు స్క్రూటినీ చేయాలి. కానీ, విద్యార్థుల డేటాను బయటి వ్యక్తుల చేతుల్లో పెడుతూ స్క్రూటినీని బయటి వ్యక్తులతో చేయించడం గమనార్హం. ఇదంతా చూస్తూ విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిబంధనలు పాటించలేదని రాష్ట్రంలోని ఓ వర్సిటీ దూరవిద్య సైన్స్ కోర్సులను యూజీసీ నిలిపివేసిందని, ఏయూపైనా అలాంటి చర్యలే తీసుకుంటే ప్రతిష్ఠ దెబ్బతింటుందని వాపోతున్నారు.

షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు

దూరవిద్యలో షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు ఉంటాయి. రాత్రింబవళ్లు పనిచేసైనా ప్రశ్నపత్రాలు తయారు చేసి పంపిస్తాం. తయారీ బాధ్యత మాకు లేనందునే మరింత వెసులుబాటుతో పని చేస్తున్నాం. నేను బాధ్యతలు తీసుకున్నాక జరుగుతున్న పరీక్షలివి. హాజరు లేని సైన్స్ విద్యార్థులు తక్కువమంది ఉన్నారు. అందుకే ప్రాక్టికల్స్‌కు అనుమతించకున్నా థియరీ పరీక్షలు రాసేందుకు అనుమతించాం.

– ఆచార్య అప్పలనాయుడు, ఏయూ దూరవిద్య డైరెక్టర్

నూతన ఆవిష్కరణలతోనే పేదరిక నిర్మూలన

సత్యసాయి శత జయంతి వేడుకల సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రశాంతి నిలయం: సాంకేతిక విజ్ఞానం ద్వారా నూతన ఆవిష్కరణలతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో గురువారం సత్యసాయి శతజయంతి వేడుకలలో భాగంగా సత్యసాయి సేవాసంస్థల 11వ జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గడ్కరీ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా ఆధ్యాత్మిక బోధనలు, సేవా కార్యక్రమాలతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చారన్నారు. తాను ఇక్కడి భక్తి భావనను, విలువలను, సేవా భావాన్ని చూసి ప్రేరణ పొంది తదుపరి జీవితంలో మరింత మంచి చేయాలనే తపనతోనే వచ్చానని చెప్పారు. ప్రతి మనిషిలో సత్ప్రవర్తన, మంచి సాంగత్యం, ఉన్నత విద్యాగుణం ఉత్తముడిలా తీర్చిదిద్దుతాయన్నారు. ఎదుటి వ్యక్తి అవసరాలను గుర్తించి చేతనైన సాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సత్యసాయిని స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు నడిపే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల కార్యక్రమాల వివరాలతో కూడిన పుస్తకాన్ని సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు విడుదల చేశారు. అంతకుముందు గడ్కరీ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

బెంగళూరులో రూ.7 కోట్లు కొట్టేసిన దుండగులు..

చిత్తూరు జిల్లాలో వాహనం లభ్యం

గుడిపాల మండలంలో దొరికిన ఇన్నోవా

గుడిపాల: బెంగళూరులో ఏటీఎంలలో నగదు నింపే వాహనం నుంచి బుధవారం పట్టపగలే రూ.7.11 కోట్లు కొట్టేసిన ఆరుగురు దుండగులు డబ్బుతో పరారైన ఇన్నోవా వాహనం గురువారం చిత్తూరు జిల్లాలో లభించింది. రిజర్వు బ్యాంకు, ఆదాయపన్ను అధికారులమంటూ ఏటీఎంలకు నగదు తీసుకెళుతున్న వాహనాన్ని అడ్డగించి సిబ్బందిని దించేసి డ్రైవర్‌ను తీసుకెళ్లిన దుండగులు కొంతదూరం వెళ్లాక డ్రైవర్‌కు పిస్టల్ చూపించి కేంద్ర ప్రభుత్వ స్టిక్కర్ ఉన్న ఇన్నోవా వాహనంలోకి ఆ నగదును మార్చి పరారైన విషయం తెలిసిందే. జీపీఎస్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన కర్ణాటక పోలీసులు.. చెన్నై–బెంగళూరు రహదారిలోని చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 190 రామాపురం చర్చివద్ద యుపి14–బిఎక్స్2500 నంబరుగల ఆ ఇన్నోవా వాహనం ఉన్నట్లు గుర్తించారు. ఇన్నోవాను అక్కడ ఆపేసిన దుండగులు డబ్బును మరో వాహనంలో తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఇన్నోవా వాహనం బుధవారం రాత్రి 11 గంటల సమయంలో గుడిపాల మండల కేంద్రం మీదుగా మండలంలోని చిత్తపార గ్రామానికి వెళ్లి కొంత సమయం తరువాత వెనక్కి వచ్చినట్టు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. దీంతో చిత్తపార గ్రామంలో ఎవరైనా అనుమానితులు ఉన్నారా అనే కోణంలో విచారిస్తున్నారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాగుబడి

అనూరాధ కార్తె:
డిసెంబర్ 3 వరకు

COOPERATIVE CULTURAL HERITAGE

coop International Cooperative Alliance 130 YEARS

2025 International Year of Cooperatives

వారసత్వ సంపద అపురూపమైనది. విలువను గుర్తెరిగి పరిరక్షించుకోదగినది. కొత్త తరానికి ఆ స్ఫూర్తిని అందించదగినది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నెన్నో పురాతన నాగరికతలకు ప్రతిరూపాలుగా వారసత్వ కట్టడాలు, స్థలాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వరల్డ్ కల్చరల్ హెరిటేజ్ సైట్స్‌గా గుర్తించి పరిరక్షించటం ఆధునికుల బాధ్యత. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక, వ్యవసాయక హెరిటేజ్ సైట్స్ గురించి మాత్రమే ఇప్పటికి తెలుసు. ఇప్పుడు తాజాగా ఈ జాబితాలో సహకార సంస్థలు కూడా చేరాయి.

ఇది అంతర్జాతీయ సహకార సంవత్సరం. ఈ సందర్భంగా సుప్రసిద్ధ సహకార సాంస్కృతిక వారసత్వ సంస్థలను గుర్తించే బృహత్ కృషికి అంతర్జాతీయ సహకార కూటమి (ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలియన్స్- ఐసీఏ) శ్రీకారం చుట్టింది. 25 దేశాలకు చెందిన అంతర్జాతీయంగా పేరొందిన 31 పురాతన సహకార సంస్థలకు 'కోఆపరేటివ్ కల్చరల్ హెరిటేజ్ సైట్స్'గా తొలివిడతలో విశిష్ట గుర్తింపు లభించింది. ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఈ సైట్స్ విశిష్టతలను తాజాగా అందుబాటులోకి తెచ్చారు.

సహకార సాంస్కృతిక వారసత్వంలో భారత్‌కు విశేష భాగస్వామ్యం ఉంది. 'కోఆపరేటివ్ కల్చరల్ హెరిటేజ్ సైట్స్'గా గుర్తింపు పొందిన సంస్థల్లో గుజరాత్ కేంద్రంగా విస్తరించిన పాడి రైతుల సహకార మకుటం 'అమూల్'తో పాటు కేరళకు చెందిన 'ఉరులుంగల్ వర్కర్స్ సొసైటీ' చోటు దక్కించుకున్నాయి. అసలు సహకార ఉద్యమం అంటే ఏమిటి? ఈ ఉద్యమ చరిత్ర ఏమిటి? సుసంపన్న వారసత్వం ఏమిటి?... వివరంగా తెలుసుకుందాం!

సుసంపన్న సహకార వారసత్వ సంపద!

సహకార ఉద్యమం అంటే..?

ఉమ్మడి యాజమాన్యంలో, ప్రజాస్వామ్యబద్ధంగా నియంత్రించబడే సంస్థ ద్వారా తమ సాధారణ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చుకోవడానికి స్వచ్ఛందంగా ఐక్యమయ్యే వ్యక్తులతో కూడిన స్వయంప్రతిపత్తి గల సంఘం. స్వయం సహాయం, పరస్పర సహాయం సూత్రాలపై సభ్యుల అవసరాలు తీర్చటం కోసం పనిచేసే ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆర్థిక, సామాజిక ఉద్యమం. బాహ్య వాటాదారులకు లాభాలను పెంచడం కంటే సభ్యులకు సేవ చేసే లక్ష్యంతోనే ఏర్పాటైనవి సహకార సంఘాలు.

అంతర్జాతీయంగా విస్తరించిన సహకార ఉద్యమానికి చోదక శక్తి అంతర్జాతీయ సహకార కూటమి (ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలియన్స్- ఐసీఏ). ఇది 130 ఏళ్లుగా పనిచేస్తోంది. ప్రతి కథా ఒక స్వరంతో ప్రారంభమవుతుంది. వ్యక్తులు బృందంగా ఏర్పడి కలలను పండించుకున్నప్పుడు.. కోఆపరేటివ్ ఉద్యమంలో ఈ స్వరం ప్రతిధ్వనిస్తుంది. ఇది సమాజాలను మార్చేస్తుంది. తరతరాల పాటు ఆ మార్పు కొనసాగుతూ ఉంటుంది. కోఆపరేటివ్ కల్చరల్ హెరిటేజ్ ఒక ప్రపంచ ఉద్యమం. సహకారం నుంచి పుట్టిన కథల్లో, సంప్రదాయాల్లో, కల్పనల్లోని ఈ సహకార ఉద్యమ స్వరాలన్నిటినీ ఈ ఉద్యమం భద్రంగా కాపాడుతూ ఉంటుంది అని ఐసీఏ తెలిపింది.

సహకార సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల మొదటి ప్రపంచ పటం ఆవిష్కరణ

దిగ్గజ సహకార సంస్థలకు 'సహకార సాంస్కృతిక వారసత్వ' సంస్థలుగా గుర్తించటంతో పాటు వీటన్నిటినీ ఆన్‌లైన్‌లో ఒక్కచోట చూపించే ప్రపంచ పటం ఇప్పటి వరకు లేదు. ఈ కొరత తీర్చుతూ ఈ నెల 12న అంతర్జాతీయ సహకార కూటమి (ఐసీఏ) అధికారికంగా ప్రకటన చేసింది. సహకార సాంస్కృతిక వారసత్వ వేదికను, సహకారం తరతరాలుగా సంస్కృతి, విద్య, జీవనోపాధిని ఎలా రూపొందించిందో వివరించే స్థలాల మొట్ట మొదటి ప్రపంచ పటాన్ని ప్రారంభించింది. బ్రెసిలియాలోని బ్రెజిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక వేడుకలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సహకార ఉద్యమ సజీవ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం, దాని ప్రాముఖ్యతను ఎత్తిచూపటానికి ఈ ఆవిష్కరణ ఒక చారిత్రాత్మక అడుగుగా నిలిచిపోతుంది.

ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల నుంచి 31 సహకార సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను మొట్టమొదట ఈ పటంలో ఐసీఏ చోటు కల్పించింది. ఆధునిక సహకారానికి జన్మస్థలం రోచ్‌డేల్ (యునైటెడ్ కింగ్‌డం) మొదలుకొని.. నోవా పెట్రోపోలిస్ (బ్రెజిల్) లోని మాన్యుమెంటో ఆవో కోఆపరేటివ్ నుంచి అముల్ డెయిరీ కోఆపరేటివ్ – వర్గీస్ కురియన్ మ్యూజియం (భారతదేశం), ఉరులుంగల్ వర్కర్స్ కోఆపరేటివ్ (భారతదేశం), ఫెడరేషన్ ఆఫ్ సదరన్ కోఆపరేటివ్స్ (అమెరికా), మోషి కో–ఆపరేటివ్ యూనివర్సిటీ (టాంజానియా) నుంచి అంతర్జాతీయ కార్మిక సంస్థ కోఆపరేటివ్, సోషల్ అండ్ సాలిడారిటీ ఎకానమీ యూనిట్ (స్విట్జర్లాండ్) వరకు ఇందులో ఉన్నాయి. ఐసీఏ గ్లోబల్ ఆఫీస్ సహకారంతో ఆర్గనైజేషన్ ఆఫ్ బ్రెజిలియన్ కోఆపరేటివ్స్ (ఓసీబీ), భారత్‌కు చెందిన నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ఈ మ్యాప్‌ను రూపొందించాయి.

'ఈ వారసత్వ స్థలాలు సహకారం, సంఘీభావాన్ని బోధించే సజీవ తరగతి గదులు. సహకారం సుసంపన్న చరిత్ర అని, న్యాయమైన సమాజాలను నిర్మిస్తున్న సాంస్కృతిక శక్తి అని ఇవి నిరూపిస్తున్నాయి' అని ఆర్గనైజేషన్ ఆఫ్ బ్రెజిలియన్ కోఆపరేటివ్స్ (ఓసీబీ) అధ్యక్షుడు మార్సియో లోప్స్ డి ఫ్రీటాస్ అన్నారు.

'ఈ గ్లోబల్ ప్లాట్‌ఫామ్, వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయడంలో ఎన్‌సీడీసీ సాంకేతిక పరమైన భాగస్వామి కావటం సంతోషకరం. సహకారానికి సంబంధించిన కాలాతీత వారసత్వాన్ని ప్రపంచ ప్రజలు చూడటం కోసం నమోదు చేయటానికి ఈ కృషి దోహదపడింది' అని ఎన్‌సీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ బన్సాల్ (ఐఏఎస్) అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా మొదట విడతలో 31 ప్రసిద్ధ సంస్థలను సహకార సాంస్కృతిక వారసత్వ సంస్థలుగా ఈ పటంలో చేర్చారు. ఇక ముందు కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. పంచవ్యాప్తంగా సహకార సంస్థలు, సమాఖ్యలు, సంఘాలు తమకు తెలిసిన సహకార వారసత్వ హోదా ఇవ్వదగిన సైట్‌లు, సంస్థలు, జీవన సంప్రదాయాలను ప్రతిపాదించవచ్చు. సహకార సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల గుర్తింపుపై కొత్త మార్గదర్శకాలలో నిర్వచించిన స్పష్టమైన అంతర్జాతీయ ప్రమాణాల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుంది. ఐసీఏలో సభ్యులైన సహకార సంస్థలు, వ్యక్తులు ఈ పటంలో చేర్పింపునకు ఈ కింది వెబ్‌సైట్ ద్వారా నామినేట్ చెయ్యవచ్చు.

www.culturalheritage.coop/ nominations

ఐసీఏ డైరెక్టర్ జనరల్ జెరోయిన్ డగ్లస్ అధ్యక్షతన గల వర్కింగ్ గ్రూప్ నిర్ణయం తీసుకొని, అర్హతగల సంస్థలకు హెరిటేజ్ గుర్తింపునిచ్చి ఈ పటంలో పొందుపరుస్తారు. ఈ బృందంలో మొరాకో, జర్మనీ, నైజీరియా, భారతదేశం, జపాన్, యూకే, బ్రెజిల్, అమెరికాలకు చెందిన సీనియర్ సహకారవేత్తలు ఉన్నారు.

ఇప్పటి వరకు మనం మాట్లాడుకుంటున్నది కంటికి కనిపించే సుప్రసిద్ధ సహకార సంస్థలకు సంబంధించిన ప్రపంచ సహకార సాంస్కృతిక వారసత్వ పటం గురించి. దీన్ని 'గోచర సహకార వారసత్వ జాబితా' అనొచ్చు. వచ్చే ఏడాదిలో 'అవ్యక్త సహకార వారసత్వ జాబితా'ను కూడా ఐసీఏ ప్రకటించనుంది. సహకార సంస్కృతిని ప్రతిబింబించే మౌఖిక సంప్రదాయాలు, అభ్యాసాలు, ఆచారాలకు ఇందులో చోటుకల్పిస్తారు.

రోచ్‌డేల్ అండ్ ది నేషనల్ కోఆపరేటివ్ ఆర్కైవ్, యూకే

నేషనల్ క్యాపిటల్ ఆఫ్ కోఆపరేటివిజమ్, బ్రెజిల్

మోషి కోఆపరేటివ్ యూనివర్సిటీ, టాంజానియా

ది ఆల్ఫోన్స్ డెజార్డిన్స్ హిస్టారికల్ సొసైటీ, కెనడా

అంతర్జాతీయ కార్మిక సంస్థ కోఆపరేటివ్, సోషల్ అండ్ సాలిడారిటీ ఎకానమీ యూనిట్, స్విట్జర్లాండ్

అమూల్: శ్వేత విప్లవ స్ఫూర్తి

'ఆనంద్ మిల్క్ యునైటెడ్ లిమిటెడ్ (అమూల్)' పాల ఉత్పత్తుల దిగ్గజ సహకార సంఘం, ఆనంద్ మ్యూజియం భారతీయ చిన్న, సన్నకారు పాడి రైతుల శ్వేత విప్లవ స్ఫూర్తికి సంబంధించిన అవిచ్ఛిన్న సహకార సంస్కృతి వారసత్వ స్ఫూర్తికి నిదర్శనాలుగా నిలుస్తాయి. 1946లో త్రిభువన్‌దాస్ పటేల్, తర్వాత డాక్టర్ వర్గీస్ కురియన్ చూపిన బాటలో అమూల్ దిగ్గజ సంస్థగా అవతరించింది. ఇవ్వాళ 78 ప్రాసెసింగ్ ప్లాంట్లలో రోజుకు 28 కోట్ల లీటర్ల పాలను శుద్ధి చేసి ఉత్పత్తులను తయారు చేస్తారు. గుజరాత్‌లోని 37 లక్షల పాడి రైతుల శ్రమ అమూల్ గుండెచప్పుడై వెల్లివిరుస్తోంది.

ఆనంద్ నగరంలోని అమూల్ మ్యూజియం భవనం భారతదేశంలోని అత్యంత అసాధారణ సహకార విజయ గాథలలో ఒకదాన్ని చెప్పే భవనం ఉంది. అమూల్ మ్యూజియం కేవలం ప్రదర్శనల గ్యాలరీ కాదు, ఇది ఒక దేశాన్ని మార్చిన సహకార ఆదర్శాలకు సజీవ నివాళి. ఇక్కడ భారతదేశ స్వాతంత్ర్య పోరాటం, క్షీర విప్లవం పెనవేసుకున్న కథనాలు వినిపిస్తాయి. స్వావలంబన కల సహకార ఉద్యమంలో ఎలా శాశ్వత రూపాన్ని పొందిందో అముల్ మ్యూజియం చూపిస్తుంది. నవంబర్ 26న కురియన్ పుట్టిన రోజును భారత దేశం జాతీయ పాల దినంగా జరుపుకుంటుంది.

ఉరలుంగల్: శ్రామిక సహకార స్ఫూర్తి

ఉరలుంగల్ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ (యూఎల్‌సీసీఎస్).. సాధారణ కార్మికులు తమ ఉపాధి కోసం, పని భద్రత కోసం నిర్మించుకున్న అద్భుత సహకార సౌధం. కేరళ తీరప్రాంత పట్టణం వడకరలో ఉరలుంగల్ ప్రధాన కార్యాలయం ఉంది. శ్రామికుల చెమట చుక్కలతో ఇటుక ఇటుక పేర్చి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆశాసౌధం ఇది.

ఆసియాలోని అత్యంత గొప్ప సహకార సంస్థలలో ఒకది. 1925లో కొద్ది మంది దార్శనిక కార్మికుల సమూహం స్థాపించారు. సంపద లేదా ప్రత్యేక హక్కు నుంచి పుట్టలేదు. అవసరం, ఐక్యత, ధైర్యం నుంచి పుట్టింది. న్యాయమైన వేతనాలు, గౌరవానికి నోచుకోని 14 మంది ఉరలుంగల్ గ్రామ కార్మికులు న్యాయం కోసం వేచి ఉండటానికి బదులుగా, దాన్ని తామే నిర్మించుకోవాలని నిర్ణయించుకొని సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సామాజిక సమానత్వం, సహకార చర్యను సమర్థించిన స్థానిక తత్వవేత్త వాగ్భటానంద సంస్కరణవాద ఆదర్శాలే వారికి మార్గనిర్దేశం చేశాయి. 'గౌరవంగా పని చేయండి, సమిష్టిగా పంచుకోండి, సమాజానికి సేవ చేయండి' ఇదీ వారి నినాదం.

రోడ్లు, వంతెనలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు నిర్మించే ప్రజా మౌలిక సదుపాయాల నిర్మాణ సంస్థగా ఈ సొసైటీ ఎదిగింది. సేంద్రియ వ్యవసాయం, కళలు, సాఫ్ట్‌వేర్, డిజిటల్ రంగాల్లోకి కూడా ప్రవేశించటం విశేషం. ప్రజలు నిజాయితీ, క్రమశిక్షణ, ఒకరిపై ఒకరు విశ్వాసంతో కలిసి పనిచేసినప్పుడు, వారు సృష్టించగల సంపదకు పరిమితి లేదని ప్రపంచానికి గుర్తు చేస్తూనే ఉంటుంది ఉరులుంగల్.

ఇవి కేవలం సంస్థలు మాత్రమే కాదు!

సహకార సంస్థలు కేవలం సంస్థలు మాత్రమే కాదు. అవి సంస్కృతి, చరిత్ర, గుర్తింపును కలిగి ఉంటాయి. ఈ సహకార సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల ప్రపంచ పటాన్ని ఆవిష్కరించటం ద్వారా సహకారాన్ని యావత్ మానవాళి భాగస్వామ్య వారసత్వ విజయంగా జరుపుకుంటున్నాం. సంఘీభావం, స్వయం సహాయం ద్వారా ప్రజలను, సమాజాలను అనుసంధానిస్తాం.

– ఏరియల్ గ్వార్కో,
అధ్యక్షుడు,
అంతర్జాతీయ సహకార కూటమి (ఐసీఏ)

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

బిజినెస్ రీల్

సుదీప్ ఫార్మా @ రూ. 563-593

- నేడు షురూ– 25న ముగింపు
- రూ. 895 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: ఫార్మా కంపెనీలకు స్పెషాలిటీ ఇన్‌గ్రెడియంట్స్ అందించే సుదీప్ ఫార్మా పబ్లిక్ ఇష్యూకి రూ. 563–593 ధరల శ్రేణి ప్రకటించింది. నేడు(21న) ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 95 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ ప్రమోటర్లు(భయానీ కుటుంబీకులు, ట్రస్ట్) విక్రయానికి ఉంచుతున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 895 కోట్లు సమీకరించాలని వడోదర(గుజరాత్) కంపెనీ భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 20న షేర్లను ఆఫర్ చేస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 25 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 76 కోట్లు గుజరాత్‌లోని నందేశారీ యూనిట్1 మెషీనరీ కొనుగోలుకి వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా టెక్నాలజీ ఆధారిత ఎక్సీపియంట్స్, స్పెషాలిటీ ఇన్‌గ్రెడియంట్స్ తయారీలో ఉంది. వివిధ పోషకాహారాలు, పానీయాల రంగాలలో వినియోగించే ఫుడ్‌గ్రేడ్ ఐరన్ ఫాస్ఫేట్‌ను భారీస్థాయిలో రూపొందిస్తోంది. కంపెనీ కస్టమర్లలో ఫార్మా దిగ్గజాలు ఫైజర్, మెర్క్ గ్రూప్, అరబిందో, క్యాడిలా, దానోన్ ఎస్ఏ, మ్యాన్‌కైండ్ తదితరాలున్నాయి.

ఒప్పో నుంచి సరికొత్త ఫైండ్ ఎక్స్9 సిరీస్

- ధర రూ. 74,999 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: ఒప్పో ఇండియా తాజాగా ఫైండ్ ఎక్స్9 సిరీస్‌ని భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. వేరియంట్‌ని బట్టి దీని ధర రూ. 74,999 నుంచి ప్రారంభమవుతుంది. నవంబర్ 21 నుంచి అమ్మకాలు ప్రారంభమవుతాయి. ఒప్పో ఈ–స్టోర్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర మాధ్యమాల్లో అందుబాటులో ఉంటాయి. హాసెల్‌బ్లాడ్‌తో కలిసి రూపొందించిన కొత్త తరం కెమెరా సిస్టం, సుదీర్ఘ బ్యాటరీ లైఫ్, శక్తివంతమైన పనితీరు మొదలైన విశేషాలు ఇందులో ఉన్నట్లు సంస్థ తెలిపింది. అలాగే హాసెల్‌బ్లాడ్ టెలీకన్వర్టర్ కిట్ రూ. 29,999కి లభిస్తుంది. ఇక, లేటెస్ట్ టీడబ్ల్యూఎస్ ఎన్‌కో బడ్స్3 ప్రోప్లస్‌ని కూడా కంపెనీ ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ. 1,899గా ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-11-2025

విశాఖ	635–00
చిత్తూరు	673–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	645–00
విజయవాడ	660–00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	635–00
వరంగల్	637–00
రిటైల్ ధర	6.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
EICHERMOT	7,125.00	3.31
BAJFINANCE	1,028.70	2.3
BAJAJFINSV	2,097.20	2.29
RELIANCE	1,549.50	2.01
TECHM	1,460.00	1.82

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,860.00	-1.16
HCLTECH	1,644.40	-1.09
TITAN	3,900.00	-0.84
HINDUNILVR	2,429.00	-0.52
ONGC	247.8	-0.48

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,897
ఎన్ఎస్ఈ	96,628
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,73,294
ఎఫ్ఐఐ	+ 284
డీఐఐ	- 824

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.18 (రాత్రి 11.30కు)	$ 59.25 (క్రితం ముగింపు)
బ్రెంట్	63.49 (రాత్రి 11.30కు)	$ 63.51 (క్రితం ముగింపు)

100 కోట్లకు 5జీ కనెక్షన్లు

నెలకు 65 జీబీకి డేటా వినియోగం

భారత్‌లో 2031 నాటికి ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక అంచనా



న్యూఢిల్లీ: భారత్‌లో 2031 నాటికి 5జీ సబ్‌స్క్రిప్షన్స్ సంఖ్య 100 కోట్లకు చేరవచ్చని ఎరిక్సన్ మొబిలిటీ ఒక నివేదికలో అంచనా వేసింది. స్మార్ట్ ఫోన్లలో డేటా వినియోగం గణనీయంగా పెరుగుతుండటం ఇందుకు దోహదపడుతుందని పేర్కొంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధికంగా నెలకు 36 జీబీగా ఉన్న డేటా వినియోగం 2031 నాటికి 65 జీబీకి చేరనుందని నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో 2025 ఆఖరు నాటికి 5జీ సబ్‌స్క్రిప్షన్లు 39.4 కోట్లకు చేరవచ్చని వివరించింది. మొత్తం మొబైల్ సబ్‌స్క్రిప్షన్స్‌లో వీటి వాటా 32 శాతంగా ఉంటుందని పేర్కొంది. అటు అంతర్జాతీయంగా కూడా 5జీ కనెక్షన్లు 640 కోట్లకు చేరతాయని, మొత్తం మొబైల్ సబ్‌స్క్రిప్షన్లలో వీటి వాటా మూడింట రెండొంతులుగా ఉంటుందని నివేదిక వివరించింది. భారత్‌లో డిజిటలీకరణను వేగవంతం చేసే దిశగా 5జీ ఇప్పటికే కీలక మౌలిక సదుపాయంగా నిలుస్తోందని పేర్కొంది. అందుబాటు ధరలో 5జీ ఎఫ్‌డబ్ల్యూఏ సీపీఈ (ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ కస్టమర్ ప్రిమిసెస్ ఎక్విప్‌మెంట్) లభ్యత, ఎఫ్‌డబ్ల్యూఏ యూజర్లు అత్యధికంగా డేటాను వినియోగిస్తుండటంలాంటి అంశాలు భారత్‌లో డేటా ట్రాఫిక్ వృద్ధికి దోహదపడుతున్నట్లు వివరించింది.

నివేదికలో మరిన్ని విశేషాలు...

- 2031 నాటికి అంతర్జాతీయంగా 5జీ కనెక్షన్లు 640 కోట్లకు చేరనున్నాయి. ఇందులో 410 కోట్ల కనెక్షన్లు, ప్రస్తుత 4జీ మౌలిక సదుపాయాలతో సంబంధం లేకుండా కేవలం 5జీ నెట్‌వర్క్‌పైనే పని చేస్తాయి.
- 2024 మూడో త్రైమాసికం నుంచి 2025 మూడో త్రైమాసికం మధ్య కాలంలో మొబైల్ నెట్‌వర్క్ డేటా ట్రాఫిక్ 20 శాతం పెరిగింది. 2031 వరకు ఇది వార్షిక ప్రాతిపదికన సగటున 16 శాతం మేర వృద్ధి చెందుతుంది.
- 2024 ఆఖరు నాటికి గణాంకాలతో పోలిస్తే మొత్తం మొబైల్ డేటా వినియోగంలో 5జీ నెట్‌వర్క్ వాటా 34 శాతం నుంచి పెరిగి 43 శాతానికి చేరుతుంది. 2031 నాటికి ఇది 83 శాతానికి చేరుతుంది.
- ఎఫ్‌డబ్ల్యూఏ బ్రాడ్‌బ్యాండ్ సేవలను వినియోగించుకునే వరి సంఖ్య 2031 ఆఖరు నాటికి ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకి చేరుతుంది.
- అంతర్జాతీయంగా 6జీ సబ్‌స్క్రిప్షన్లు 2031 ఆఖరు నాటికి 18 కోట్లకు చేరతాయి. ఒకవేళ 6జీ ఆవిష్కరణలను మరింత ముందుగా తీసుకొస్తే ఈ సంఖ్య మరింతగా పెరుగుతుంది.

అనధికార ఫారెక్స్ ప్లాట్‌ఫామ్స్‌తో జాగ్రత్త

ఆర్‌బీఐ హెచ్చరికలతో జాబితా అప్‌డేట్

ముంబై: అనధికారిక ఫారెక్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్‌పట్ల జాగ్రత్త వహించవలసిందిగా ఇన్వెస్టర్లను రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజాగా హెచ్చరించింది. ఇప్పటికే ఇలాంటి సంస్థల జాబితాను విడుదల చేసిన ఆర్‌బీఐ కొత్తగా అలర్ట్ లిస్ట్‌లో 7 ప్లాట్‌ఫామ్స్‌ను జత చేసింది. దీంతో వీటి సంఖ్య 95కు చేరింది. వీటిలో స్టార్‌నెట్ ఎఫ్ఎక్స్, క్యాప్‌ప్లేస్, మిర్రరాక్స్, ఫ్యూజన్ మార్కెట్స్, ట్రైవ్, ఎన్ఎక్స్‌జీ మార్కెట్స్, నార్డ్ ఎఫ్ఎక్స్ చేరాయి. విదేశీ మారక నిర్వహణ చట్టం, 1999(ఫెమా) ప్రకారం జాబితాలోని సంస్థలకు అధికారికంగా ఫారెక్స్ లావాదేవీలు చేపట్టేందుకు అనుమతిలేకపోవడంతోపాటు.. ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్(ఈటీపీలు)ను సైతం నిర్వహించేందుకు వీలులేదని కేంద్ర బ్యాంకు పేర్కొంది. అంతేకాకుండా జాబితాలోని సంస్థలు, ప్లాట్‌ఫామ్స్, వెబ్‌సైట్లు ప్రకటనల ద్వారా అనధికారిక ఈటీపీలను ప్రమోట్ చేస్తున్నట్లు వెల్లడించింది. శిక్షణ, అడ్వయిజరీ సర్వీసులందిస్తున్నట్లు క్లెయిమ్ చేసుకుంటున్నాయని తెలియజేసింది.

విరామ ఆతిథ్యంలోకి మహీంద్రా

మహీంద్రా సిగ్నేచర్ రిసార్ట్‌తో షురూ

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం మహీంద్రా హాలిడేస్ అండ్ రిసార్ట్స్ తాజాగా విరామ సంబంధ ఆతిథ్య(లీజర్ హాస్పిటాలిటీ) విభాగంలోకి ప్రవేశించనుంది. మహీంద్రా సిగ్నేచర్ రిసార్ట్స్ బ్రాండుతో సొంత అనుబంధ సంస్థ ద్వారా లీజర్ హాస్పిటాలిటీ సేవలు ప్రారంభించనుంది. ఇందుకు తాజాగా కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం వెకేషన్ ఓనర్‌షిప్ విభాగంలో సర్వీసులందిస్తున్న కంపెనీ మహీంద్రా సిగ్నేచర్ రిసార్ట్స్ బ్రాండుతో తాజాగా లీజర్ మార్కెట్లో విలాసవంత(లగ్జరీ) ఆతిథ్య సేవలను ప్రవేశపెట్టనుంది. ఈ విభాగంలో 2030కల్లా 2,000 గదులకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. లీజర్ హాస్పిటాలిటీలోకి ప్రవేశించడం ద్వారా ప్రస్తుత బిజినెస్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించనున్నట్లు మహీంద్రా హాలిడేస్ పేర్కొంది. తద్వారా పర్యటన(టూరిజం) రంగంలోని వేగవంత వృద్ధిలో ఉన్న విభాగాలు, కస్టమర్లను ఆకట్టుకోనున్నట్లు తెలియజేసింది. ఇందుకు అనుగుణంగా ప్రాథమిక దశలో పూర్తి అనుబంధ కంపెనీ ద్వారా సుమారు రూ. 1,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది.

విభిన్నంగా..

దేశీయంగా సెలవుదినాలను విభిన్నంగా వినియోగించుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నట్లు మహీంద్రా హాలిడేస్ ఎండీ, సీఈవో మనోజ్ భట్ పేర్కొన్నారు. దీంతో సంప్రదాయ టూరిజంతో పోలిస్తే మరింత ఆకర్షణీయ ప్రయాణాలు, అనుభూతులకు ప్రాధాన్యత పెరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో దేశీయంగా టాప్ లీజర్ ఆతిథ్య రంగ కంపెనీగా ఆవిర్భవించే లక్ష్యంతో ఉన్నట్లు తెలియజేశారు. దీనిలో భాగంగా క్లబ్ మహీంద్రాను 'క్లబ్ ఎం'గా రీబ్రాండింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. 2030కల్లా 10,000 గదులకు సామర్థ్యాన్ని పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. ఎన్ఎస్ఈలో మహీంద్రా హాలిడేస్ షేరు 3 శాతం జంప్‌చేసి రూ. 333 వద్ద ముగిసింది.

తెలంగాణలో జేహ ఏరోస్పేస్ రెండో ప్లాంటు

రూ. 445 కోట్ల పెట్టుబడి

ముంబై: ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ అంకుర సంస్థ జేహ ఏరోస్పేస్ తెలంగాణలో తమ రెండో తయారీ యూనిట్‌ను ప్రకటించింది. వచ్చే 6–12 నెలల్లో దీనిపై 50 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 445 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లోని హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో మాక్ 2 పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంటు 2 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉంటుందని వివరించింది. వచ్చే ఏడాదిలో ఇందులో తయారీ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సంస్థ వ్యవస్థాపకుడు విశాల్ సంఘవి తెలిపారు. దీనితో హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్ల విస్తీర్ణం నాలుగు రెట్లు పెరిగి 2.50 లక్షల పైగా చ.అ. స్థాయికి చేరుతుందన్నారు. కంపెనీ గతేడాది జనవరిలో హైదరాబాద్‌లో 60,000 చ.అ. విస్తీర్ణంలో తొలి తయారీ ప్లాంటును ఏర్పాటు చేసింది.

దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవాలి

ఫార్మాకు కేంద్ర మంత్రి నడ్డా సూచన



న్యూఢిల్లీ: కీలకమైన ముడి వస్తువుల తయారీలో స్వయం సమృద్ధి సాధించాలని దేశీ ఫార్మా పరిశ్రమకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా పిలుపునిచ్చారు. వచ్చే దశాబ్దకాలంలో కీలకమైన ఏపీఐల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఫార్మా తయారీ సంస్థల సమాఖ్య ఓపీపీఐ 60వ వార్షిక సదస్సుకు ఈ మేరకు ఆయన వీడియో సందేశాన్ని పంపించారు. బయోసిమిలర్లు, వినూత్న మాలిక్యూల్స్, జీన్..సెల్ థెరపీల్లో కొత్త ఆవిష్కరణలను మరింత వేగవంతం చేయాలని పరిశ్రమ దిగ్గజాలను ఆయన కోరారు. అదే సమయంలో ఆరోగ్య సంరక్షణ సేవలు అందరికీ సమానంగా, అందుబాటు ధరల్లో లభ్యమయ్యేలా చూడటంపైనా దృష్టి పెట్టాలని సూచించారు.

భారత ఫార్మా గత దశాబ్దకాలంలో గణనీయంగా పురోగమించిందని, 200 పైచిలుకు దేశాలకు ఔషధాలను సరఫరా చేస్తోందని, అమెరికా..బ్రిటన్‌లో జనరిక్ ఔషధాల మార్కెట్లో భారీ వాటాను దక్కించుకోవడంతో పాటు అంతర్జాతీయంగా 60 శాతం పైగా టీకాలను సరఫరా అందిస్తోందని మంత్రి చెప్పారు. అంతర్జాతీయంగా పరిశోధనలు, డిజిటల్ ఆవిష్కరణలకు హబ్‌గా ఎదుగుతోందని, ఫార్మా..లైఫ్‌సైన్సెస్ తదితర రంగాలకు చెందిన 1,600 పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు కేంద్రంగా నిలుస్తోందని వివరించారు. ఓపీపీఐతో కలిసి ఈవై పార్థినాన్ ఈ సందర్భంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం నవకల్పనలపై ప్రధానంగా దృష్టి పెడుతూ ఫార్మా పరిశ్రమ 2047 నాటికి 450 బిలియన్ డాలర్లకు చేరనుంది. ప్రస్తుతం 7 బిలియన్ డాలర్లుగా ఉన్న కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీ (సీఆర్‌డీఎంవో) రంగం 2028 నాటికి రెట్టింపై 14 బిలియన్ డాలర్లకు చేరనుంది.

హోండా కార్ల విక్రయాలకు జీఎస్‌టీ దన్ను

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎస్‌టీలో మార్పుల నేపథ్యంలో ఈ పండుగ సీజన్‌లో తమ కార్ల అమ్మకాలు సుమారు 15 శాతం వృద్ధి చెందాయని హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ తెలిపారు. దేశీయంగా తమకు రెండు తెలుగు రాష్ట్రాలు కీలకంగా ఉంటున్నాయని, మొత్తం అమ్మకాల్లో వీటి వాటా సుమారు 7 శాతంగా ఉంటోందని ఆయన చెప్పారు. హైదరాబాద్ మార్కెట్లో ఎలివేట్ ఏడీవీ ఎడిషన్‌ని ఆవిష్కరించిన సందర్భంగా గురువారమిక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. యువతను లక్ష్యంగా చేసుకుని, ఈ వాహనాన్ని ప్రత్యేక డిజైన్, ఐ–వీటెక్, అధునాతన హోండా సెన్సింగ్ సేఫ్టీ ఫీచర్లు మొదలైన ప్రత్యేకతలతో రూపొందించినట్లు చెప్పారు. దీని ధర రూ. 15,29,000 నుంచి (హైదరాబాద్ ఎక్స్‌షోరూం) ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా తమ వాహన విక్రయాల్లో ఆటోమేటిక్ సీవీటీ వేరియంట్ల వాటా సుమారు 60 శాతంగా ఉంటే తెలంగాణలో 72 శాతంగా ఉందని బెహల్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ వృద్ధి స్థాయిలోనే తమ అమ్మకాల వృద్ధి కూడా సుమారు అయిదు శాతం వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు వివరించారు.

హైదరాబాద్‌లో సొనొకో కొత్త కార్యాలయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ ప్యాకేజింగ్ సొల్యూషన్స్ దిగ్గజం సొనొకో ప్రోడక్ట్స్ తాజాగా హైదరాబాద్‌లో తమ పర్ఫార్మెన్స్ హబ్ కార్యకలాపాలకి సంబంధించి కొత్త ఆఫీస్‌ను ప్రారంభించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన అధునాతన హబ్‌ను దీనితో పర్మనెంట్ కార్యాలయానికి మార్చినట్లవుతుందని సంస్థ తెలిపింది. పర్ఫార్మెన్స్ హబ్‌లో ప్రస్తుతం 145 మంది నిపుణులు ఉన్నారని, కంపెనీ డిజిటల్ పరివర్తన, ఆటోమేషన్, కొత్త టెక్నాలజీల రూపకల్పనలో హైదరాబాద్ బృందం కీలక పాత్ర పోషిస్తోందని వివరించింది. ఈ నేపథ్యంలో ఇక్కడ తమ ఫైనాన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని కూడా ప్రారంభించే యోచన ఉందని సొనొకో ప్రెసిడెంట్ హొవార్డ్ కోకర్ తెలిపారు. తమ గ్లోబల్ టెక్నాలజీ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలుస్తుందని కంపెనీ వీపీ రాజీవ్ అంకిరెడ్డిపల్లి చెప్పారు.

నాస్కామ్ యూకే ఫోరమ్ షురూ

- యూకే, ఇండియా మధ్య భాగస్వామ్యం
- ద్వైపాక్షిక టెక్నాలజీ, వాణిజ్య సహకారం

న్యూఢిల్లీ: దేశీ ఐటీ పరిశ్రమల అసోసియేషన్ నాస్కామ్ యూకే ఫోరమ్‌ను ఆవిష్కరించింది. తద్వారా రెండు యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), భారత్ మధ్య ద్వైపాక్షిక టెక్నాలజీ, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత విస్తరించనున్నట్లు పేర్కొంది. దేశీ టెక్నాలజీ పరిశ్రమకు యూకే రెండో పెద్ద మార్కెట్‌కాగా.. వార్షిక ఆదాయం 90 బిలియన్ డాలర్లను మించుతోంది. ఈ నేపథ్యంలో నాస్కామ్ యూకే ఫోరమ్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 56 బిలియన్ డాలర్లుకాగా.. సర్వీసుల వాణిజ్యం 33 బిలియన్ డాలర్లుగా అంచనా. 2030కల్లా రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని రెట్టింపునకు పెంచుకోవాలనేది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) లక్ష్యంకాగా.. డిజిటల్, టెక్నాలజీ ఆధారిత వృద్ధి కీలకంగా నిలవనుంది. సాంకేతిక భద్రతా కార్యాచరణ(టీఎస్ఐ)లో భాగంగా రెండు దేశాల మధ్య ఏఐ సాంకేతిక సహకారం మరింత ముందుకు సాగడంలో నాస్కామ్ యూకే ఫోరమ్ ప్రధాన పాత్ర పోషించనుంది. ప్రధానంగా ప్రభుత్వ రంగంలో ఏఐ వినియోగం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూకే సిటిజన్ సర్వీసులను పెంచుకోవడంలో ఉపయోగపడనున్నట్లు నాస్కామ్ పేర్కొంది. ఏఐకు సిద్ధపడటం, మానవవనరుల నైపుణ్య పెంపు, డిజిటల్‌వైపు ఎస్ఎంఈల ప్రయాణం(ట్రాన్స్‌ఫార్మేషన్)సహా బాధ్యతాయుత ఏఐ వినియోగం, ఇన్నోవేషన్ విధానాలను పంచుకోవడం ద్వారా రెండు దేశాలు లబ్ధి పొందనున్నట్లు అభిప్రాయపడింది.

400 రోజుల్లో 50వేల ఎంజీ విండ్సర్ అమ్మకాలు

గురుగ్రాం: కేవలం 400 రోజుల వ్యవధిలో రికార్డు స్థాయిలో 50,000 విండ్సర్ కార్లను విక్రయించినట్లు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్స్ వెల్లడించింది. ప్రతి గంటకు 5 యూనిట్లు చొప్పున అమ్ముడైనట్లు తెలిపింది. దేశీయంగా ఈ రికార్డు సాధించిన తొలి ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్ ఇదేనని పేర్కొంది. దీనితో దేశీయంగా 4వీలర్ ఈవీ సెగ్మెంట్లో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నట్లు తెలిపింది. ఇటీవలే లిమిటెడ్ ఎడిషన్ కింద ఎంజీ విండ్సర్ ఇన్‌స్పైర్‌ని ఆవిష్కరించినట్లు పేర్కొంది.

పర్యాటక రంగానికి జాతీయ బోర్డు ఉండాలి

- సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయాలి
- అన్ని రాష్ట్రాల్లోనూ పరిశ్రమ హోదా ఇవ్వాలి
- కేంద్ర ఆర్థిక శాఖకు పర్యాటక, ఆతిథ్య రంగం వినతి

న్యూఢిల్లీ: దేశంలో పర్యాటక రంగం దీర్ఘకాల అభివృద్ధి కోసం నేషనల్ టూరిజం బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖను పరిశ్రమల ప్రతినిధులు కోరారు. అలాగే, మరింత మంది పర్యాటకులను ఆకర్షించేందుకు నిధుల మద్దతు అవసరమని స్పష్టం చేశారు. బడ్జెట్‌కు ముందు పర్యాటకం, ఆతిథ్య రంగాల ప్రతినిధులతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పర్యాటకం–ఆతిథ్యానికి అన్ని రాష్ట్రాలూ పరిశ్రమ హోదా కల్పించేందుకు సహకరించాలని.. దీనివల్ల అందుబాటు ధరలపై రుణాలను పొందడం సాధ్యపడుతుందని ఈ రంగాల ప్రతినిధులు కోరారు. కొన్ని రాష్ట్రాలు పరిశ్రమ హోదా ఇవ్వగా, మరిన్ని రాష్ట్రాలు ఈ దిశగా నిర్ణయం తీసుకోవాల్సి ఉండంతో పరిశ్రమ ప్రతినిధులు కేంద్రం సహకారాన్ని ఆశించారు. పరిశ్రమ హోదా లేకపోవడం, సమన్వయం లేని నియంత్రణలు వృద్ధికి అడ్డు పడుతున్నట్టు చెప్పారు. లైసెన్స్‌ల మంజూరు, హోటళ్లకు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) దాఖలుకు వీలుగా సింగిల్ విండో అనుమతుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్, ఇండియా ఫుడ్ టూరిజం ఆర్గనైజేషన్, టూరిస్ట్ గైడ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తదితర సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అల్యూమినియం చౌక దిగుమతులను కట్టడి చేయాలి

కేంద్రానికి మైనర్ల సంఘం డిమాండ్

చౌక అల్యూమినియం దిగుమతుల నుంచి దేశీ పరిశ్రమను కాపాడాలంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ (ఫిమి) కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. ప్రాథమిక అల్యూమినియంతోపాటు అల్యూమియం డౌన్‌స్ట్రీమ్ ఉత్పత్తుల (షీట్లు, ఫాయిల్స్, రాడ్లు తదితర) దిగుమతులపై 15 కస్టమ్స్ సుంకం విధించాలని డిమాండ్ చేసింది. అల్యూమినియం ఉత్పత్తి మిగులు ఉన్న చైనా, రష్యా, ఆసియా, మధ్యప్రాచ్య దేశాల నుంచి దిగుమతులు పెరిగిపోతుండడంతో దేశీ పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. ఇతర దేశాలు టారిఫ్‌లు విధించడంతో ఇవి తమ మిగులు ఉత్పత్తులను భారత్‌కు మళ్లిస్తున్నట్టు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. దీనివల్ల దేశీ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేమని, అది పెట్టుబడులకు విఘాతం కలిగిస్తుందని పేర్కొంది. దిగుమతులతో దేశీ సంస్థలు పోటీ పడేందుకు వీలుగా కస్టమ్స్ సుంకం విధించాలని కోరింది. 2025–26లో అల్యూమినియం డిమాండ్‌లో 55 శాతం దిగుమతులతోనే భర్తీ అయ్యే పరిస్థితి ఉన్నట్టు వివరించింది. కనుక చౌక దిగుమతుల కట్టడికి ప్రమాణాలను పెంచాలని కోరింది. తయారీలోకి వినియోగించే కీలక ముడిపదార్థాల దిగుమతులపై మాత్రం సుంకాలు తగ్గించి పరిశ్రమను ఆదుకోవాలని పేర్కొంది.

‘యాషెస్’ సమరానికి సిద్ధం

టెస్టు క్రికెట్‌లో చారిత్రాత్మక ప్రాధాన్యత ఉన్న సుదీర్ఘ వైరానికి రంగం సిద్ధమైంది. చిరకాల ప్రత్యర్థులైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగే ప్రతిష్టాత్మక ‘యాషెస్’ సిరీస్‌కు నేటితో తెర లేవనుంది. ఇరు జట్ల ఆటగాళ్లను ఒక్క మంచి ప్రదర్శనతో హీరోలుగా, ఒక్క పరాజయంతో జీరోలుగా మార్చగల ఈ సమరంపై క్రికెట్ అభిమానులందరి దృష్టి నిలిచింది. సొంతగడ్డపై ఆస్ట్రేలియా ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తున్నా... ‘బాజ్‌బాల్’ తరహా ఆటతో తమకంటూ విజయావకాశాలు ఉన్నాయని ఇంగ్లండ్ నమ్ముతోంది. ఈ నేపథ్యంలో దాదాపు ఏడు వారాల పాటు హోరాహోరీ ఆట ఖాయం. పెర్త్ స్టేడియంలో పిచ్‌పై పచ్చిక ఉంది. ఆరంభంలో పేస్, బౌన్స్‌కు బాగా అనుకూలిస్తూ ఆ తర్వాత నెమ్మదించే అవకాశం ఉంది.

- నేటి నుంచి తొలి టెస్టు
- సొంతగడ్డపై ఆత్మవిశ్వాసంతో ఆస్ట్రేలియా
- విజయంపై ఇంగ్లండ్ ఆశలు
- ఉదయం గం. 7:50 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

పెర్త్: యాషెస్ సిరీస్‌లో భాగంగా రెండేళ్ల క్రితం ఇంగ్లండ్‌లో ఆస్ట్రేలియా పర్యటించగా, ఆ సిరీస్ 2–2తో ‘డ్రా’గా ముగిసింది. అంతకుముందు 2021లో ఆసీస్ గడ్డపై ఆడిన ఇంగ్లండ్ 0–4తో చిత్తుగా ఓడింది. ఈ గణాంకాలు చూస్తే ఎవరిది పైచేయో అర్థమవుతుంది. అయితే కోచ్ బ్రెండన్ మెకల్లమ్ పర్యవేక్షణలో దూకుడు కనబరుస్తున్న ఇంగ్లండ్ తమ ప్రత్యర్థిని ఓడించేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తోంది. ముఖ్యంగా తొలి టెస్టులో ఇద్దరు ఆసీస్ ప్రధాన పేసర్లు జట్టుకు దూరం కావడం ఇంగ్లండ్‌కు సానుకూలంగా మారే అవకాశం ఉంది. సిరీస్‌లో శుభారంభం చేస్తే దానిని కొనసాగించాలని బెన్ స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. అయితే సమర్థుడైన స్టీవ్ స్మిత్ టీమ్‌కు నాయకత్వం వహించడం ఆసీస్‌కు బలం.

ఇద్దరు అరంగేట్రం...

‘స్మిత్‌ను 40 పరుగుల్లోపు ఆపగలిగితే మంచిది. లేదంటే మ్యాచ్ చేజారినట్లే’... ఇంగ్లండ్ మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ చేసిన వ్యాఖ్య ఇది. అతని బ్యాటింగ్ ప్రభావం ఎలాంటిదో ఇది చెబుతుంది. ఇప్పుడు కూడా స్మిత్ బలమైన బ్యాటింగే ఆసీస్‌కు పెద్ద బలం. ఇతర సీనియర్లలో లబుషేన్, హెడ్‌లపై ప్రధానంగా బ్యాటింగ్ భారం ఉంది. చాలా కాలంగా విఫలమవుతున్నా ఉస్మాన్ ఖ్వాజా అదృష్టవశాత్తూ ఈ సిరీస్‌లో అవకాశం దక్కించుకున్నాడు. అతనికి ఓపెనింగ్ భాగస్వామిగా కొత్త ఆటగాడు జేక్ వెదరాల్డ్ బరిలోకి దిగుతాడు. కీపర్ అలెక్స్ కేరీకి కూడా టెస్టు బ్యాటర్‌గా మంచి రికార్డు ఉంది. ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ ఫిట్‌నెస్ సమస్యలు దాటి కొత్తగా మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. గాయాల కారణంగా రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్, హేజిల్‌వుడ్ తొలి టెస్టు నుంచి తప్పుకోవడంతో బౌలింగ్‌లో సీనియర్ మిచెల్ స్టార్క్‌పై చాలా పెద్ద బాధ్యత ఉంది. బోలండ్ అతనికి తగిన భాగస్వామి కాగా, మరో పేసర్ బ్రెండన్ డగెట్ తొలి టెస్టు ఆడబోతున్నాడు. ఎప్పటిలాగే ఏకైక స్పిన్నర్ లయన్ ప్రత్యర్థికి సవాల్ విసురుతున్నాడు. 2019 తర్వాత ఆస్ట్రేలియా జట్టు తరఫున ఒకే టెస్టులో ఇద్దరు ఆటగాళ్లు అరంగేట్రం చేయడం ఇదే తొలిసారి.

స్పిన్నర్ లేకుండా...

తొలి టెస్టు వరకు మాత్రం ఆసీస్‌తో పోలిస్తే ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ పటిష్టంగా కనిపిస్తోంది. ఆ జట్టు ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగనుండటం విశేషం. ఆర్చర్, మార్క్‌వుడ్‌లాంటి ఫాస్టెస్ట్ బౌలర్లతో పాటు అట్కిన్సన్, కార్స్ ఆడనుండగా బౌలింగ్‌లో స్టోక్స్ కీలక పాత్ర పోషించడం ఖాయం. తుది జట్టులో ఇంగ్లండ్ ఒక్క స్పిన్నర్‌ను కూడా తీసుకోవడం లేదు. బ్యాటింగ్‌తో భారత్‌తో సిరీస్ సహా గత కొంతకాలంగా టాప్–7లో ఎలాంటి మార్పూ లేదు. పెద్దగా రాణించకపోయినా క్రాలీ, పోప్‌లపై జట్టు నమ్మకం ఉంచింది. డకెట్, బ్రూక్, స్టోక్స్ ఎలా ఆడతారనేది ఆసక్తికరం. అందరి దృష్టి ఇప్పుడు జో రూట్‌పై నిలిచింది. ఆధునిక టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు ఉన్న రూట్ ఆసీస్ గడ్డపై ఒక్క సెంచరీ కూడా సాధించలేకపోయాడు. అతని తాజా ఫామ్‌ను బట్టి చూస్తే ఈ సిరీస్‌లో ఆ లోటును పూర్తి చేసుకునే అవకాశం ఉంది. వ్యక్తిగతంగా, జట్టుపరంగా చూసినా కూడా రూట్ ఆట సిరీస్ ఫలితాన్ని నిర్దేశించగలదు.

34-32 ఓవరాల్‌గా 73 యాషెస్ సిరీస్‌లు జరిగితే...ఆస్ట్రేలియా 34, ఇంగ్లండ్ 32 గెలవడం ఇరు జట్ల మధ్య పోటీని చూపిస్తోంది.

152-111 యాషెస్ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మొత్తం 361 టెస్టులు జరిగాయి. ఆస్ట్రేలియా 152 గెలవగా, ఇంగ్లండ్ 111 మ్యాచ్‌లలో విజయం సాధించింది.

13 సొంతగడ్డపై జరిగిన గత 15 యాషెస్ టెస్టుల్లో ఆస్ట్రేలియా 13 గెలిచి, 2 ‘డ్రా’ చేసుకుంది. ఒక్కదాంట్లోనూ ఓడలేదు. 2011 జనవరి తర్వాత ఇక్కడ ఇంగ్లండ్ ఒక్క టెస్టు కూడా నెగ్గలేకపోయింది. 2023 తర్వాత ఓవరాల్‌గా అన్ని జట్లపై కలిపి ఆడిన 18 టెస్టుల్లో ఆసీస్ 14 గెలిచింది. ఆసీస్ గడ్డపై ఆడిన గత మూడు ‘యాషెస్’లలో ఇంగ్లండ్ 0–5, 0–4, 0–4తో ఓడింది.

142వ ర్యాంక్‌లో భారత్

- మరో ఆరు స్థానాలు పడిపోయిన భారత ఫుట్‌బాల్ జట్టు
- ‘ఫిఫా’ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న భారత ఫుట్‌బాల్ జట్టు ‘ఫిఫా’ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరింత వెనుకబడింది. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా ఇటీవల బంగ్లాదేశ్ చేతిలో 0–1 గోల్స్ తేడాతో ఓడిన టీమిండియా ఆరు స్థానాలు కోల్పోయి 142వ ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. ఆసియా కప్‌నకు అర్హత సాధించే అవకాశం కోల్పోయిన భారత జట్టుకు గత తొమ్మిదేళ్లలో ఇదే చెత్త ర్యాంక్. చివరిసారిగా 2016 అక్టోబర్‌లో 148వ ర్యాంక్‌లో నిలిచిన భారత్ జట్టుకు ఆ తర్వాత ఇదే అత్యధిక ర్యాంక్. 2023 డిసెంబర్‌లో 102వ స్థానంలో ఉన్న టీమిండియా... వరుస పరాజయాల కారణంగా 40 స్థానాలు దిగజారింది. ఆసియా ర్యాంకింగ్స్‌లో భారత్ 27వ ర్యాంక్‌లో ఉంది. ‘ఫిఫా’ ర్యాంకింగ్స్ ప్రారంభించినప్పటి నుంచి టీమిండియా అత్యుత్తమంగా 1996లో 94వ స్థానం దక్కించుకుంది.

ర్యాన్ విలియమ్స్‌కు అనుమతి



ఆస్ట్రేలియా ఆటగాడు ర్యాన్ విలియమ్స్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు ‘ఫిఫా’ అంగీకారం తెలిపింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)కు ప్రాతినిధ్యం **వహిస్తున్న ర్యాన్ విలియమ్స్ ఇటీవల** ఆసీస్ పౌరసత్వాన్ని వదులుకున్నాడు. దీంతో అతడు భారత జట్టు సెలెక్షన్‌కు అందుబాటులోకి వచ్చాడు. ఈ మేరకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) వివరాలు వెల్లడించింది. 32 ఏళ్ల ర్యాన్ ఆస్ట్రేలియా పాస్‌పోర్ట్ అప్పగించి భారత పౌరసత్వం పొందాడు. విలియమ్స్ తల్లి ముంబైలో జన్మించడంతో అతడికి ముందు నుంచే భారత్‌పై ప్రత్యేక అభిమానం ఉంది. మరి **ఇప్పుడు జాతీయ జట్టు తరఫున** అతడికి అవకాశం దక్కుతుందా చూడాలి. ‘ర్యాన్ విలియమ్స్‌కు సంబంధించిన అసోసియేషన్ మార్పు అభ్యర్థనను ఫిఫా ఆమోదించింది. దీంతో ర్యాన్ భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి అధికారికంగా అర్హత పొందాడు’ అని ఏఐఎఫ్‌ఎఫ్ వెల్లడించింది. ఆస్ట్రేలియా అండర్–20, అండర్–23 జట్లకు ప్రాతినిధ్యం వహించిన ర్యాన్... సీనియర్ టీమ్ తరఫున దక్షిణ కొరియాతో మ్యాచ్‌లో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగాడు. ఇంగ్లిష్ క్లబ్‌లు ఫుల్హామ్, పోర్ట్స్‌మౌత్ తరఫున కూడా ర్యాన్ **మ్యాచ్‌లు ఆడాడు.**

శ్రీలంకపై జింబాబ్వే విజయం

రావల్పిండి: ముక్కోణపు టి20 టోర్నమెంట్ తొలి పోరులో ఆతిథ్య పాకిస్తాన్ చేతిలో ఓడిన జింబాబ్వే... ఆ పరాజయం నుంచి వేగంగా కోలుకొని సమష్టి ప్రదర్శనతో సత్తా చాటి టోర్నీలో బోణీ కొట్టింది. గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో జింబాబ్వే 67 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. టి20ల్లో శ్రీలంకతో పదోసారి ఆడిన జింబాబ్వే మూడో విజయాన్ని అందుకుంది. ఏడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. బ్రియాన్ బెనెట్ (42 బంతుల్లో 49; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ సికందర్ రజా (32 బంతుల్లో 47; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 61 పరుగులు జోడించారు. శ్రీలంక బౌలర్లలో హసరంగ 3 వికెట్లు పడగొట్టగా... ఇషాన్ మలింగ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక పూర్తిగా విఫలమై 95 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ దసున్ షనక (25 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాజపక్స (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఇవాన్స్ 3, రిచర్డ్ నగరవా 2 వికెట్లు తీశాడు.

‘ఫైనల్’ లక్ష్యంగా భారత్ ‘ఎ’ బరిలోకి

బంగ్లాదేశ్ ‘ఎ’తో సెమీఫైనల్ నేడు • రైజింగ్ స్టార్స్ ఆసియా కప్
మధ్యాహ్నం 3 గంటల నుంచి నుంచి ‘సోనీ’ నెట్‌వర్క్‌లో ప్రసారం

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ క్రికెట్ టి20 టోర్నీలో జోరు మీదున్న భారత ‘ఎ’ జట్టు ఫైనలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. నేడు బంగ్లాదేశ్ ‘ఎ’తో జరిగే సెమీఫైనల్‌లో టాప్ ఫామ్‌లో ఉన్న ఓపెనింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి బ్యాటర్ల సహకారం లభిస్తే చాలు భారత్ విజయానికి ఢోకా ఉండదు. ఈ టోర్నీలో వైభవ్ 201 పరుగులతో అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. కానీ మిగతా బ్యాటర్లలో కెప్టెన్ జితేశ్ శర్మ సహా నమన్ ధీర్, ప్రియాన్ష్ ఆర్య, నేహల్ వధేరాలు మాత్రం ఆశించిన స్థాయిలో ఇప్పటివరకు ఏ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయారు. కీలకమైన సెమీస్‌లో వీరంతా బాధ్యత కనబరిస్తేనే బంగ్లాపై విజయం సాధించవచ్చు. లేదంటే ఊహించని ఫలితం ఎదురైనా ఆశ్చర్యపడక్కర్లేదు. ఈ టోర్నీలో భారత్‌లాగే బంగ్లాదేశ్ కూడా దీటుగా రాణించింది. అఫ్గానిస్తాన్ ‘ఎ’, శ్రీలంక ‘ఎ’ జట్లను కంగుతినిపించిన బంగ్లా... భారత్‌తో క్లిష్టమైన పోరుకు సై అంటోంది. పేసర్ రిపాన్ మోండల్, లెఫ్టార్మ్ స్పిన్నర్ రకీబుల్ హసన్‌ల నుంచి భారత బ్యాటర్లకు సవాళ్లు ఎదురవొచ్చు. భారత బౌలర్లలో గుర్జప్‌నీత్, స్పిన్నర్ హర్ష్ దూబేలు నిలకడగా ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నారు. కీలకమైన సెమీస్‌లోనూ వీరి జోరు కొనసాగాలని జట్టు ఆశిస్తోంది. శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్ ‘ఎ’తో శ్రీలంక ‘ఎ’ తలపడుతుంది. ఈ రెండు సెమీఫైనల్స్‌లో చిరకాల ప్రత్యర్థులు గెలిస్తే... ఆదివారం జరిగే ఫైనల్ సమరం దాయాదుల మధ్యే జరిగే అవకాశముంది.

భారత్ ‘ఎ’ జట్టు: జితేశ్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్, నేహల్, నమన్ ధీర్, సూర్యాన్ష్, రమణ్‌దీప్, హర్ష్ దూబే, అశుతోష్, యశ్ ఠాకూర్, గుర్జప్‌నీత్, వైశాక్. **బంగ్లాదేశ్ ‘ఎ’ జట్టు:** అక్బర్ అలీ (కెప్టెన్), హబీబుర్, యాసిర్ అలీ, జీషాన్, అరిఫుల్ ఇస్లామ్, రకీబుల్, మహిదుల్, అహ్మద్ రేహాన్, రిపాన్ మోండల్, అబు హిదార్, గఫార్, అబ్రార్.

100లో 100

మైలురాయి టెస్టులో ముష్ఫికర్ సెంచరీ

ఈ ఘనత సాధించిన 11వ ప్లేయర్ • బంగ్లాదేశ్ 476 ఆలౌట్ • ఐర్లాండ్ 98/5

మిర్పూర్: బంగ్లాదేశ్ సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ (214 బంతుల్లో 106; 5 ఫోర్లు) కెరీర్‌లో ఆడుతున్న వందో టెస్టును సెంచరీతో చిరస్మరణీయం చేసుకున్నాడు. ఆ జట్టు తరఫున సుదీర్ఘ ఫార్మాట్‌లో వందో మ్యాచ్ ఆడుతున్న తొలి ప్లేయర్‌గా ఘనత సాధించిన ముష్ఫికర్... చక్కటి సెంచరీతో దాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకున్నాడు. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో వందో టెస్టులో సెంచరీ చేసిన 11వ ప్లేయర్‌గా ముష్ఫికర్ నిలిచాడు. అతడితో పాటు వికెట్ కీపర్ లిటన్ దాస్ (192 బంతుల్లో 128; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా సెంచరీతో మెరిశాడు. ఫలితంగా ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 292/4తో గురువారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... చివరకు 141.1 ఓవర్లలో 476 పరుగులు చేసి ఆలౌటైంది. క్రితం రోజు సెంచరీకి ఒక్క పరుగు దూరంలో నిలిచిన ముష్ఫికర్... రెండో రోజు తొమ్మిదో బంతికి సింగిల్ తీసి మూడంకెల స్కోరు ఖాతాలో వేసుకున్నాడు. శతకం తర్వాత ముష్ఫికర్ ఎక్కువసేపు నిలవలేకపోగా... లిటన్ దాస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఐర్లాండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న అతడు... ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి మెహదీ హసన్ మిరాజ్ (107 బంతుల్లో 47; 3 ఫోర్లు, 1 సిక్స్) నుంచి చక్కటి సహకారం లభించింది. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 123 పరుగులు జోడించడంతో

బంగ్లాదేశ్ భారీ స్కోరు చేయగలిగింది. ఐర్లాండ్ బౌలర్లలో ఆండీ మెక్‌బ్రిన 6 వికెట్లు పడగొట్టగా... మాథ్యూ హంఫ్రేస్, గావిన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్... రెండో రోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. కెప్టెన్ ఆండీ బాల్‌బిర్నీ (21), పాల్ స్టిర్లింగ్ (27), కార్మిచెల్ (17), టెక్టర్ (14), కర్టిస్ కాంఫెర్ (0) పెవిలియన్ చేరారు. టకర్ (11 బ్యాటింగ్), స్టీఫెన్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మురాద్ 2 వికెట్లు పడగొట్టగా... ఖాలెద్ అహ్మద్, తైజుల్ ఇస్లామ్, మెహదీ హసన్ మిరాజ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. చేతిలో 5 వికెట్లు ఉన్న ఐర్లాండ్ జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 378 పరుగులు వెనుకబడి ఉంది.

వందో టెస్టులో సెంచరీ చేసిన ప్లేయర్ల జాబితా

ఆటగాడు	దేశం	పరుగులు	సంవత్సరం	ప్రత్యర్థి
కొలిన్ కౌడ్రీ	ఇంగ్లండ్	104	1968	ఆస్ట్రేలియా
జావెద్ మియాందాద్	పాకిస్తాన్	145	1989	భారత్
గ్రీనిడ్జ్	వెస్టిండీస్	149	1990	ఇంగ్లండ్
అలెక్ స్టీవార్ట్	ఇంగ్లండ్	105	2000	వెస్టిండీస్
ఇంజమామ్	పాకిస్తాన్	184	2005	భారత్
పాంటింగ్	ఆస్ట్రేలియా	120	2006	దక్షిణాఫ్రికా
పాంటింగ్	ఆస్ట్రేలియా	143•	2006	దక్షిణాఫ్రికా
గ్రేమ్ స్మిత్	దక్షిణాఫ్రికా	131	2012	ఇంగ్లండ్
హాషిమ్ ఆమ్లా	దక్షిణాఫ్రికా	134	2017	శ్రీలంక
రూట్	ఇంగ్లండ్	218	2021	భారత్
వార్నర్	ఆస్ట్రేలియా	200	2022	దక్షిణాఫ్రికా
ముష్ఫికర్	బంగ్లాదేశ్	106	2025	ఐర్లాండ్

హెవిట్ జోడీ పరాజయం

క్వార్టర్స్‌లో ఓడిన తండ్రీకొడుకులు

సిడ్నీ: రిటైర్మెంట్ నుంచి బయటికొచ్చిన గ్రాండ్‌స్లామ్ మాజీ చాంపియన్ లీటన్ హెవిట్ తన తనయుడితో కలిసి ఆడుతున్న డబుల్స్ ఆటకు క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. ఈ 44 ఏళ్ల ఆస్ట్రేలియన్ వెటరన్ స్టార్ న్యూసౌత్‌వేల్స్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్‌లో 16 ఏళ్ల టీనేజ్ కుమారుడు క్రూజ్‌తో కలిసి శుభారంభం చేశాడు. కానీ క్వార్టర్ ఫైనల్లో మాత్రం తండ్రీతనయుల జోడీకి చుక్కెదురైంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో హెవిట్–క్రూజ్ ద్వయం 5–7, 4–6తో డేన్ స్వీని–కలమ్ పుటెర్‌గిల్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది. అంతకుముందు తండ్రీతనయుల జోడీ 6–1, 6–0తో ఆసీస్‌కే చెందిన హేడెన్ జోన్స్–పావ్‌లె మారినకొవ్ ద్వయంపై అలవోక విజయం సాధించింది. ఆస్ట్రేలియా డేవిస్ కప్ కెప్టెన్‌గా వ్యవహరించిన మాజీ ప్రపంచ నంబర్ వన్ హెవిట్ 2001లో యూఎస్ ఓపెన్, 2002లో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లను సాధించాడు. 2016లోనే ఆటకు వీడ్కోలు పలికాడు. దాదాపు దశాబ్దకాలం తర్వాత మళ్లీ టెన్నిస్ ఆటపై మనసుపెట్టి ఆడేందుకు సిద్ధమయ్యాడు. 2005లో ఆస్ట్రేలియా ప్రముఖ నటి బెక్ కార్ట్‌రైట్‌ను వివాహమాడిన వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు.

నైపుణ్యం కలిగిన వలసదారులను స్వాగతిస్తాం: ట్రంప్

- వారు మా కార్మికులకు నైపుణ్యాలు నేర్పించాలి
- స్వదేశంలో వ్యతిరేకత వచ్చినా భరిస్తానని వెల్లడి

వాషింగ్టన్: వలసదారులపై ఇన్నాళ్లూ కఠిన వైఖరి ప్రదర్శించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనసు మార్చుకున్నారు. అమెరికాకు వారి అవసరమేంటో ఆయనకు ఎట్టకేలకు తెలిసొచ్చింది. నైపుణ్యం కలిగిన వలసదారులను కచ్చితంగా స్వాగతిస్తామని చెప్పారు. కంప్యూటర్ చిప్స్, క్షిపణులు లాంటి సంక్లిష్టమైన ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో అమెరికన్ కార్మికులకు వలసదారులు శిక్షణ ఇవ్వాలని కోరారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలకు గతంలో మద్దతు ఇచ్చానని గుర్తుచేశారు. ఇప్పుడు వలసదారులకు పెద్దపీట వేస్తే స్వదేశంలో కొందరి నుంచి వ్యతిరేకత రావొచ్చని అన్నారు. వ్యతిరేకతను భరిస్తానని చెప్పారు. బుధవారం యూఎస్–సౌదీ అరేబియా ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ట్రంప్ మాట్లాడారు. దేశ ఆర్థిక ప్రగతి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, మిస్సైల్స్ వంటి కంపెనీల్లో పని చేయడానికి నిపుణులైన వలసదారులు కావాలని తెలిపారు. వారి పరిజ్ఞానం తమ కార్మికులకు ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మానవ వనరులను విదేశాల నుంచి రప్పించుకోవచ్చని అమెరికా సంస్థలకు ట్రంప్ సూచించారు. వేలాది మంది వచ్చినా తప్పకుండా స్వాగతిస్తామని వ్యాఖ్యానించారు.

ఈ విషయంలో నన్ను క్షమించాలి

వలసదారుల రాకను వ్యతిరేకించేవారు నిజంగా చాలా తెలివైనవారు, నమ్మశక్యం కాని దేశభక్తులు అని డొనాల్డ్ ట్రంప్ కొనియాడారు. అయితే, అమెరికా కార్మికులకు నైపుణ్యాలు నేర్పించాల్సిన అవసరం ఎంతో ఉందని, ఈ విషయం అందరూ అర్థం చేసుకోవాలని కోరారు. మన కంపెనీల్లో బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పెట్టేవారిని అనుమతించకపోతే మనం విజయవంతమైన వ్యక్తులుగా ఎప్పటికీ ఎదగలేమని తేల్చిచెప్పారు. ఒక పెద్ద కంపెనీ ఏర్పాటై, ఉత్పత్తి ప్రారంభం కావాలంటే విదేశాల నుంచి భారీగా పెట్టుబడులు, ఉద్యోగులు రావాల్సిందేనని స్పష్టంచేశారు. ఈ విషయంలో తనను క్షమించాలని కోరారు. మాగా(మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్)ను ఇప్పటికీ ఆరాధిస్తున్నానని, విదేశాల నుంచి మనకు కావాల్సిన నిపుణులను రప్పించుకోవడం కూడా 'మాగా'అవుతుందని అమెరికా అధ్యక్షుడు వివరించారు. తనకు ఓటు వేసేవారి సంఖ్య తగ్గినా పట్టించుకోబోనని, చివరకు వారే అర్థం చేసుకుంటారని వ్యాఖ్యానించారు.

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని గ్రెవిన్ మ్యూజియం గురువారం ఆవిష్కరించిన దివంగత ప్రిన్సెస్ డయానా నిలువెత్తు మైనం బొమ్మ. 1994లో ఆమె ధరించిన ఈ డ్రెస్‌కు రివెంజ్ డ్రెస్‌గా పేరుంది. 1997లో పారిస్‌లో జరిగిన కారు ప్రమాదంలో ఆమె చనిపోయారు. గ్రెవిన్ మ్యూజియం మైనపు బొమ్మలను ప్రదర్శించే యూరప్‌లోని పురాతన మ్యూజియం.

కుట్లకు బదులు 'ఫెవిక్విక్'!

చిన్నారిపై మీరట్ డాక్టర్ ప్రయోగం

పసిబిడ్డ తలకు గాయమై రక్తమోడుతుంటే, తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. బిడ్డను కాపాడుకునేందుకు ఆసుపత్రికి పరుగులు తీశారు. కానీ, అక్కడి వైద్యుని నిర్వాకం మానవత్వాన్ని, వృత్తి ధర్మాన్ని ప్రశ్నార్థకం చేసింది. కుట్లు వేయాల్సిన చోట, రూ.5 విలువైన 'ఫెవిక్విక్' (సూపర్ గ్లూ) పూశాడు. చికిత్స పేరుతో ఆ పసిబిడ్డపై దారుణ ప్రయోగం చేశాడు. రాత్రంతా నొప్పి తాళలేని బిడ్డ రోదన, తల్లిదండ్రులకు పీడకలగా మిగిల్చింది.

ఫెవిక్విక్‌తో వైద్యం!

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరం జాగృతి విహార్‌కు చెందిన సర్దార్ జస్పిందర్ సింగ్ ఇంట్లో ఆడుకుంటున్న పసివాడి తల అనుకోకుండా టేబుల్ అంచుకు బలంగా తగిలింది. అంతే, రక్తం ధారగా కారిపోయింది. ఉలిక్కిపడ్డ తల్లిదండ్రులు, ఆలస్యం చేయకుండా బిడ్డను వెంటనే సమీపంలోని భాగ్యశ్రీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాధారణంగా తలకు గాయమై రక్తం వస్తుంటే, దాన్ని శుభ్రం చేసి కుట్లు వేయడం వైద్యుని విధి. కానీ, ఆ డాక్టర్.. రూ.5 విలువైన ఫెవిక్విక్ ట్యూబ్ కొనుక్కు రమ్మని చిన్నారి తల్లిదండ్రులను పురమాయించాడు. అదివిన్న తల్లిదండ్రులు షాకైనా, బిడ్డ గాయం తీవ్రత వల్ల ఏమీ మాట్లాడలేకపోయారు. వారు తెచ్చిన గ్లూను డాక్టర్.. ఆ పసిబిడ్డ తలపై రక్తమోడుతున్న గాయంపై పూశాడు. గ్లూ అంటించడంతో.. నొప్పి తట్టుకోలేక చిన్నారి బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వైద్యుడిని ప్రశ్నిస్తే, 'కాసేపట్లో నొప్పి తగ్గిపోతుంది'.. అని తేలిగ్గా కొట్టిపారేశాడట.

కంగుతిన్న వైద్యులు

ఆ రాత్రి ఆ బిడ్డ తల్లిదండ్రులకు కంటి మీద కునుకు లేదు. ఆ పసిబిడ్డ ఏడుపు, నొప్పి ఏమాత్రం తగ్గలేదు. దీంతో, తెల్లవారగానే బిడ్డను తీసుకొని లోకప్రియ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు గాయాన్ని పరిశీలించి కంగుతిన్నారు. తలమీద గట్టిగా అతుక్కుపోయిన ఆ జిగురును చూసి షాకయ్యారు. ఆ గట్టిపడిన అడ్హెసివ్‌ను (ఫెవిక్విక్‌ను) తొలగించడానికి మూడు గంటల సమయం పట్టింది. మొత్తానికి జిగురును తొలగించి, గాయాన్ని పూర్తిగా శుభ్రం చేసి, నాలుగు కుట్లు వేశారు. తల్లిదండ్రులు ఆ డాక్టర్ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒకవేళ ఫెవిక్విక్ గాయం నుంచి కారిపోయి కంట్లోకి పోయి ఉంటే, ఎంత ఘోరం జరిగేది? మా బిడ్డకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహించేవారు?' అని ఆవేదన వ్యక్తం చేశారు.

విచారణకు ఆదేశం..

ఈ దారుణ సంఘటనపై బాధిత చిన్నారి కుటుంబం నేరుగా.. మీరట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కటారియా దృష్టికి తీసుకెళ్లింది. 'చిన్నారి కుటుంబం ఫిర్యాదుపై ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశాం. కమిటీ నివేదిక ఆధారంగా ఆ వైద్యునిపై తగిన చర్యలు తీసుకుంటాం'.. అని డాక్టర్ అశోక్ కటారియా తెలిపారు. బాధిత కుటుంబం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి కూడా తీసుకెళ్లింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

థాయ్‌లో ఫెర్రీ ప్రమాదం..100 మంది సురక్షితం

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతం నుంచి ట్రాట్ ప్రావిన్స్‌లోని ప్రధాన భూభాగం వైపు వస్తున్న ఫెర్రీ ప్రమాదంలో చిక్కుకుంది. సకాలంలో స్పందించిన అధికార యంత్రాంగం సిబ్బంది సహా మొత్తం 100 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో, పెనుప్రమాదం తప్పినట్లయిందని అధికారులు తెలిపారు. ప్రైవేట్ సంస్థకు చెందిన ఫెర్రీ గురువారం పర్యాటక ప్రాంతమైన కోహ్ కూద్ నుంచి ట్రాట్ నగరం వైపు బయలుదేరింది. దాదాపు 40 కిలోమీటర్ల దూరానికి గాను మధ్యలోకి వచ్చేసరికి ఫెర్రీకి రంధ్రం పడి లోపలికి నీరు చేరడం మొదలైంది. సముద్రంలో భారీ అలలు ఎగసి పడుతుండటంతో అప్రమత్తమైన సిబ్బంది ఫెర్రీకి లంగరేసి అధికారులకు ప్రమాద సందేశాన్ని పంపించారు. సమాచారం అందుకున్న ఇతర ఫెర్రీల నిర్వాహకులు, సమీప బోట్లలోని మత్స్యకారులతోపాటు నేవీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని గంట వ్యవధిలోనే ఫెర్రీలో ఉన్న 97 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం ఫెర్రీలోని నీటిని తోడివేసి, తీరానికి తీసుకెళ్లారు.

ఉక్రెయిన్ కోసం అమెరికా-రష్యా ప్రణాళిక

కీవ్: ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించేందుకు అమెరికా, రష్యా ఓ ప్రణాళికను సిద్ధం చేశాయి. రష్యా మొదట్నుంచీ చేస్తున్నట్లుగా కీలక పారిశ్రామిక ప్రాంతం డొన్బాస్ అప్పగింత వంటి డిమాండ్లకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తలొగ్గడం కూడా ఉన్నట్లు మీడియా వర్గాలుంటున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌లకు ఆమోదయోగ్యంగా ఉండేలా అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ నెల రోజులుగా ఈ ప్రణాళిక రూపకల్పనలో బిజీగా ఉన్నట్లు చెబుతున్నారు. పుతిన్ సలహాదారు దిమిత్రియేవ్ కూడా ఇందులో భాగస్వామి అని సమాచారం. ఈ ప్రణాళికపై ట్రంప్ సైతం ఆమోదముద్ర వేశారని చెబుతున్నారు. ఈ ఒప్పందం విషయంలో జెలెన్‌స్కీపై ఒత్తిడి తెస్తారని కథనం.

నేపాల్‌లో ఘర్షణలు.. 10 మందికి గాయాలు

కఠ్మాండు: భారత్ సరిహద్దులకు సమీప నేపాల్‌లోని బారా జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. పదవీచ్యుత ప్రధాని కేపీ శర్మ ఓలి సారథ్యంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్) (సీపీఎన్–యూఎంఎల్) శ్రేణులు సిమారా చౌక్‌లో బుధవారం జెన్ జెడ్ బృందం యువతతో ఘర్షణకు దిగాయి. ఇందుకు కారణమైన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ యువకుల బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే, పోలీసులు స్పందించలేదంటూ గురువారం ఉదయం 11 గంటల సమయంలో మరోసారి యువకులు సిమారా చౌక్‌లో నిరసనకు దిగారు. ముందు జాగ్రత్తగా అధికారులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు కర్ఫ్యూ విధించారు. జెన్ జెడ్ యువత మాత్రం నిషేధాజ్ఞలను లెక్క చేయకుండా వీధుల్లోకి చేరారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించగా యువకులు రాళ్లు రువ్వారు. ఈ ఘర్షణల్లో ఆరుగురు పోలీసులు, నలుగురు యువకులు గాయపడ్డారు. నిరసనకారులు ఓ పోలీస్ పోస్టుకు నిప్పుపెట్టారు. సీపీఎన్–యూఎంఎల్ ఆఫీసును ధ్వంసం చేసి, నిప్పుపెట్టారు. సీపీఎన్–యూఎంఎల్ పార్టీ నేతలు శంకర్ పొఖారెల్, మహేశ్ బస్నెట్‌లు ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలో పాల్గొనేందుకు బుధవారం కఠ్మాండు నుంచి సిమారాకు రాగా ఎయిర్‌పోర్టులో వారిని జెన్ జెడ్ బృందం అడ్డుకుంది. రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగడంతో అధికారులు ముందు జాగ్రత్తగా కర్ఫ్యూ విధించారు. దీంతో, యూఎంఎల్ నేతలు ర్యాలీని రద్దు చేసుకున్నారు. అయితే, ఘర్షణలకు కారకులుగా పేర్కొంటూ ఫిర్యాదులో పేర్కొన్న వారిలో కొందరినే పోలీసులు అరెస్ట్ చేయడం గురువారం గొడవలకు దారితీసింది. తీవ్ర స్థాయిలో జరిగిన జెన్ జెడ్ ఉద్యమం కారణంగా సెప్టెంబర్‌లో ఓలి ప్రభుత్వం గద్దె దిగడం తెల్సిందే.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 33 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజా వ్యాప్తంగా 12 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ బలగాలు చేపట్టిన దాడుల్లో కనీసం 33 మంది చనిపోయారు. అక్టోబర్ 10వ తేదీన అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చాక చోటుచేసుకున్న భారీ దాడులు కావడం గమనార్హం. గూడు కోల్పోయి తలదాచుకున్న వారి టెంట్లపై జరిగిన దాడుల్లో ఐదుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు సహా 17 మంది చనిపోయినట్లు ఖాన్ యూనిస్‌లోని నాస్సెర్ ఆస్పత్రి తెలిపింది. గాజా నగరంలో రెండు చోట్ల జరిగిన దాడుల్లో ఏడుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలు సహా 16 మంది మృతి చెందారని అల్–షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ దాడులను హమాస్ తీవ్రంగా ఖండించింది.

బౌద్ధం ఆచరిస్తా అన్ని మతాల్నీ గౌరవిస్తా

వీడ్కోలు కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ: ఆచరించేది బౌద్ధమతమే అయినా, తాను నిజమైన లౌకికవాదినని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అన్ని మతాలను తాను గౌరవిస్తానని చెప్పారు. సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్(ఎస్‌ఏవోఆర్‌ఏ)గురువారం నిర్వహించిన తన వీడ్కోలు కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. తనకు ఎన్నో అవకాశాలిచ్చిన దేశ న్యాయవ్యవస్థ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఆయన రిటైరవనున్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టులో ఆయనకు శుక్రవారం చివరి పనిదినం కానుంది. 'స్వతహాగా నేను బౌద్ధుడిని. ఇతర మతాలను గురించి లోతైన విషయ పరిజ్ఞానం నాకు లేదు. అయితే, నేను నిజమైన లౌకికవాదిని. హిందూ, సిఖ్, ఇస్లాం, క్రైస్తవం సహా అన్ని మతాలను విశ్వసిస్తా'అని ఆయన తెలిపారు. 'ఇలాంటి వైఖరి మా నాన్న నుంచి నాకు అబ్బింది. ఆయన లౌకికవాది. బీఆర్ అంబేడ్కర్‌కు వీరాభిమాని. చిన్ననాటి నుంచి అనేక కార్యక్రమాలకు ఆయనతో కలిసి వెళ్తుండేవాడిని. స్నేహితులు మా నాన్నను, ఇక్కడో ప్రముఖ దర్గా ఉంది, అక్కడో గురుద్వారా ఉంది అంటూ చెప్పి మమ్మల్ని తీసుకెళుతుండేవారు'అంటూ అప్పటి రోజులను సీజేఐ గుర్తుకు తెచ్చుకున్నారు. బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగం వల్లనే తానీ స్థాయికి చేరుకోగలిగానని చెప్పారు. మున్సిపల్ స్కూలులో నేలపై కూర్చుని చదివిన ఓ బాలుడు ఈ స్థాయికి ఎదుగుతానని కలలో కూడా అనుకునేవాడు కాడన్నారు. కార్యక్రమంలో కాబోయే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌తో తనకు రెండు దశాబ్దాలుగా పరిచయం ఉందని తెలిపారు.

మేధో ఉగ్రవాదం మరింత ప్రమాదకరం

- ఇంజనీర్లు, డాక్టర్లు ఉగ్రబాట పట్టడం ట్రెండ్‌గా మారింది
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఢిల్లీ పోలీసులు
- ఢిల్లీ అల్లర్ల నిందితుల బెయిల్‌పై విచారణ

న్యూఢిల్లీ: సాధారణ ఉగ్రవాదుల కంటే ఉగ్రవాదులు మారుతున్న మేధావులు మరింత ప్రమాదకరంగా తయారయ్యారని ఢిల్లీ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ముతో ఇంజనీర్లు, డాక్టర్లవుతున్న ఇలాంటి వారు దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం నేడొక ట్రెండ్‌గా మారిందని పేర్కొన్నారు. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితుడు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ తదితరుల బెయిల్ పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు పోలీసుల తరఫున ఈ మేరకు వాదించారు. ఇటీవల ఎర్ర కోట వద్ద జరిగిన పేలుడు, వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌ను వెలికి తీయడం వంటి ఘటనలను ఆయన జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం ఎదుట ఉదహరించారు. 2020 నాటి హింస కుట్రపూరితంగా, ముందస్తు ప్రణాళిక మేరకే జరిగిందేనని తెలిపారు. జాతీయ పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా పలుప్రాంతాల్లో షర్జీల్ ఇమామ్ చేసిన రెచ్చగొట్టే ప్రసంగాల వీడియోను కూడా ఎస్‌వీ రాజు ప్రదర్శించారు. ఇమామ్ ఇంజనీరింగ్ పట్టభద్రుడని గుర్తు చేస్తూ ఆయన..వైద్యులు, ఇంజనీర్లుగా సంబంధిత వృత్తుల్లో కొనసాగటానికి బదులుగా దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం నేడు ట్రెండ్‌గా మారిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి అన్ని రకాల సరఫరాలను అడ్డుకోవడంతోపాటు దేశంలోని మిగతా ప్రాంతంతో అసోంను కలిపే చికెన్ నెక్‌ను దిగ్బంధించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు వీరు కుట్ర పన్నారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌లో పర్యటనకు రానున్న వేళ, వీరు కుట్ర పూరితంగా ముందస్తు ప్రణాళిక రచించారని ఎస్‌వీ రాజు చెప్పారు. వీరు చేపట్టినవి సాధారణ నిరసనలు కావు..దేశ సార్వభౌమత్వంపై దాడికి ఉద్దేశించిన హింసాత్మక ప్రదర్శనలని తెలిపారు. ఇటువంటి వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వరాదని ఆయన కోరారు. ఈ కేసులో విచారణలో జాప్యానికి నిందితులే కారణమన్నారు. వారు దీనిని అవకాశంగా తీసుకోలేజాలరని పేర్కొన్నారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)లకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన అల్లర్లలో 53 మంది చనిపోగా 700 మందికి పైగా గాయపడ్డారు. ఇందుకు బాధ్యులంటూ పోలీసులు ఉమర్ ఖలీద్, గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, రెహ్మాన్ లపై ఉపా కింద చట్ట కింద కేసులో నమోదు చేసి, అరెస్ట్ చేశారు. వీరు పెట్టుకున్న బెయిల్ అర్జీలపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది.

తాజ్‌ను వీక్షించిన జూనియర్ ట్రంప్

ఆగ్రా: ఆగ్రాలోని ప్రముఖ చారిత్రక కట్టడం, ప్రేమ సౌధం తాజ్‌మహల్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్ గురువారం సందర్శించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తాజ్‌మహల్ వద్దకు చేరుకున్న ఆయన దాదాపు గంటసేపు గడిపారు. చరిత్ర,, నిర్మాణం, ఇతర నిర్మాణ విశిష్టతలను తెలుసుకునేందుకు ఆయన ఎంతో ఆసక్తి కనబరిచారని గైడ్‌గా వ్యవహరించిన నితిన్ సింగ్ చెప్పారు. 2020లో అధ్యక్షుడు ట్రంప్ సందర్శించిన సమయంలో కూడా ఈయనే గైడ్‌గా ఉండటం విశేషం. జూనియర్ ట్రంప్ రాక సందర్భంగా తాజ్ వద్ద భారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

శబరిమల స్పాట్ దర్శనం 5 వేలకే పరిమితం

పత్తనంతిట్ట: కేరళ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో శబరిమల స్పాట్ బుకింగ్ దర్శనాలను రోజుకు 5వేల మందికి మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డు(టీడీబీ) గురువారం ప్రకటించారు. ఇకపై నిలక్కల్, వండిపెరియార్ కేంద్రాల్లోనే స్పాట్ బుకింగ్ టిక్కెట్లు లభిస్తాయని కూడా తెలిపింది. పంప, ఎరుమెలి, చెంగన్నూర్‌లలోని స్పాట్ బుక్కింగ్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేశామంది. ఈ ఏర్పాట్లు ఈ నెల 24వ తేదీ వరకు అమల్లో ఉంటాయని వివరించింది.

జైపూర్‌లో చిరుత సంచారం కలకలం

జైపూర్: రాజస్తాన్ రాజధాని జైపూర్‌లోని అత్యంత భద్రత ఉండే సివిల్ లైన్స్ ప్రాంతంలో గురువారం చిరుత సంచారం తీవ్ర కలకలానికి కారణమైంది. అటూఇటూ తిరుగుతూ ఓ పాఠశాల ఆవరణతో పాటు అధికార బంగ్లాలోకి కూడా అది ప్రవేశించినట్లు మంత్రి ఒకరు తెలిపారు. కొన్ని గంటల పాటు ప్రయత్నించిన అటవీ అధికారులు ఎట్టకేలకు దానిని బంధించారు. సివిల్ లైన్స్ ప్రాంతంలో రాజ్ భవన్, సీఎం నివాసం, కేబినెట్ మంత్రులు, ఉన్నతాధికారుల అధికార నివాసాలు ఉండటం గమనార్హం.

కునోలో ఐదు కూనలకు జన్మనిచ్చిన చీతా

షియోపూర్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో గురువారం ముఖి అనే చీతా ఐదు కూనలకు జన్మనిచ్చింది. భారత్‌లో జన్మించిన ముఖి, మొదటిసారి పిల్లల్ని కన్నదని, ఇదో అపురూప ఘట్టమని సీఎం మోహన్ యాదవ్ పేర్కొన్నారు. తల్లి, కూనలు ఆరోగ్యంగా ఉన్నాయంటూ ఆయన ఎక్స్‌లో సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే దేశంలో చీతాలు అంతరించిపోగా, కేంద్ర ప్రభుత్వం 2022లో నమీబియా నుంచి 8 చీతాలను రప్పించి, కునో పార్క్‌లో ప్రత్యేకంగా సంరక్షణ ప్రాంతాన్ని ఏర్పాటు చేయడం తెల్సిందే.

మమ్దానీని నేడు వైట్‌హౌస్‌లో కలుస్తా: ట్రంప్

వాషింగ్టన్: న్యూయార్క్ సిటీ మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీని శుక్రవారం వైట్‌హౌస్‌లో కలుసుకోబోతున్నానని అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. కమ్యూనిస్ట్ మేయర్ మమ్దానీ తనతో భేటీ కావాలని అభ్యర్థించాడని, అందుకు తాను అంగీకరించానని తెలిపారు. ఓవల్ ఆఫీసులో తమ సమావేశం జరుగబోతోందని వెల్లడించారు. ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో బుధవారం పోస్టుచేశారు. తదుపరి వివరాల కోసం వేచి చూడాలని కోరారు. మమ్దానీ విధానాలను ట్రంప్ వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. మేయర్ ఎన్నికల్లో ఆయనకు ఓటు వేస్తే ఆర్థికంగా, సామాజికంగా పతనం తప్పదని ఓటర్లను హెచ్చరించారు. అయినప్పటికీ విజయం మమ్దానీనే వరించింది. మేయర్ ఎన్నికల్లో నెగ్గిన తర్వాత మమ్దానీ మాట్లాడుతూ వలసదారుల విషయంలో ట్రంప్ విధానాలను తప్పుపట్టారు. వలసదారులను ఎలా అడ్డుకుంటారో చూస్తానని హెచ్చరించారు. ఇరువురు నేతలు శ్వేత సౌధంలో భేటీ కాబోతుండడం ఆసక్తి కలిగిస్తోంది.

ఆన్‌లైన్‌లో 38 వేల నెహ్రూ పత్రాలు.. చిత్రాలు

విడుదల చేసిన జేఎన్‌ఎంఎఫ్

న్యూఢిల్లీ: మన దేశ మొట్ట మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించిన 35వేల పత్రాలు, 3,000ల చిత్రాలతో కూడిన 100 సంపుటాల 'సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జవహర్‌లాల్ నెహ్రూ'ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్(జేఎన్‌ఎంఎఫ్) వీటిని డిజిటైజ్ చేసి, ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలుగా ఈ నెల 14వ తేదీన ఆన్‌లైన్‌లో ఉంచింది. జెన్‌ఎంఎఫ్ ట్రస్టీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం ఈ విషయం వెల్లడించారు. నెహ్రూ లేఖలు, ప్రసంగాలు, ఇంటర్వ్యూలు, ఫైళ్లు, డైరీలతోపాటు డూడిల్స్ కూడా ఇందులో ఉంటాయని జైరాం రమేశ్ వివరించారు. గాంధీ–నెహ్రూ, సర్దార్ పటేల్–నెహ్రూ, సుభాష్ చంద్రబోస్–నెహ్రూల మధ్య సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలు సంపూర్ణంగా లభ్యం కాగా విన్‌స్టన్ చర్చిల్– నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాకూర్–నెహ్రూ వంటి వారి లేఖలు పూర్తి స్థాయిలో దొరకలేదని చెప్పారు. వాటి కోసం అన్వేషిస్తున్నామన్నారు. అవి కూడా చేరితే ఛ్ఛిజిటఛ్చిటఛిజిజీర్ఛి. జీః విలువ మరింతగా పెరిగేదన్నారు. వాస్తవ ముద్రణ ప్రతితోపాటు డిజిటల్ టెక్స్ట్ కూడా పక్కపక్కనే చూడొచ్చన్నారు. 1920–1960 మధ్య నెహ్రూ స్వాతంత్ర్యోద్యమంలో నాయకుడిగా ఉన్నప్పటి నుంచి దేశ ప్రధానిగా ఎదిగే వరకు దేశ చరిత్రను అధ్యయనం చేసే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జైరాం రమేశ్ చెప్పారు.

ఎస్‌ఐఆర్ ప్రమాదకరం.. ఆపేయండి

సీఈసీకి సీఎం మమత లేఖ

కోల్‌కతా: ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్) ప్రక్రియపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో ఎస్‌ఐఆర్‌తో గందరగోళ పరిస్థితులు తలెత్తాయని, నిర్బంధంగా మారిన ఈ ప్రక్రియ ప్రమాదకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఎస్‌ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని ఆమె ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు రాసిన లేఖలో కోరారు. ఎస్‌ఐఆర్‌పై మొదట్నుంచీ అభ్యంతరం తెలుపుతూనే ఉన్నాననీ, ఈ ప్రక్రియ ప్రమాదకరంగా తీవ్ర ఆందోళన కరంగా మారడంతో లేఖ రాయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని మమత పేర్కొన్నారు. ఎటువంటి ప్రణాళిక, ప్రాథమిక స్థాయి సన్నద్ధత కూడా లేకుండా చేపట్టిన ఈ ప్రమాదకరమైన ఎస్‌ఐఆర్ మొదటి రోజు నుంచే అయోమయం తలెత్తిందన్నారు. బూత్ లెవెల్ అధికారు(బీఎల్‌వో)లు అడుగుతున్న తప్పనిసరి పత్రాలను ఇవ్వడం దాదాపు అసాధ్యమని తెలిపారు. వెంటనే జోక్యం చేసుకుని, ఈ ప్రక్రియను ఆపేయాలని సీఈసీని ఆ లేఖలో మమత కోరారు.

యూకే ఆయుధ దళారి కేసులో రాబర్ట్ వాద్రాపై ఈడీ మరో ఛార్జిషీట్

న్యూఢిల్లీ: యూకేకు చెందిన ఆయుధ దళారి సంజయ్ భండారీతో సంబంధమున్న మనీ ల్యాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారి రాబర్ట్ వాద్రాపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఛార్జిషీట్ దాఖలు చేసింది. ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ)కోర్టులో ఈడీ వేసిన రెండో ఛార్జిషీటు ఇది. హరియాణాలోని షికోపూర్‌లో భూ అక్రమాలకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జూలైలో మొదటి ఛార్జిషీట్ వేసింది. సంజయ్ భండారీతో సంబంధమున్న కేసులో గతంలో ఒకసారి రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించింది. భండారీని పరారీలో ఉన్న నేరగాడిగా ఉన్న ఢిల్లీ కోర్టు జూలైలో ప్రకటించగా ఇతడిని భారత్‌కు అప్పగించేందుకు యూకే కోర్టు నిరాకరించింది. 2016లో ఢిల్లీలో ఇతడిపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు జరిపారు. ఆ తర్వాత ఇతడు లండన్‌కు పారిపోయాడు. భండారీకి లండన్‌లో ఉన్న ఒక ఇంటికి సంబంధించి వాద్రాతో ఉన్న సంబంధాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. అయితే, లండన్‌లోని ఆ ఇంటితో తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎటువంటి సంబంధం లేదని వాద్రా వాదిస్తున్నారు.

ఆర్మీపై వ్యాఖ్యల కేసు.. రాహుల్‌కు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: 2022లో భారత్ జోడో యాత్ర సమయంలో ఆర్మీ జవాన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలున్న కేసులో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనకు వ్యతిరేకంగా దిగువ కోర్టు ఎలాంటి విచారణ చేపట్టకుండా గతంలో విధించిన స్టేను డిసెంబర్ 4వ తేదీ వరకు పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులిచ్చింది. ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయకుండా ఆదేశాలివ్వాలంటూ రాహుల్ పెట్టుకున్న అర్జీని అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై ఆయన ఆగస్ట్ 4వ తేదీన సుప్రీంను ఆశ్రయించగా స్టే విధించింది. స్టేను పొడిగించాలంటూ రాహుల్ వేసిన అర్జీని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం విచారించింది.

ఎస్పీ ఎమ్మెల్యే సుధాకర్ సింగ్ హఠాన్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మౌ జిల్లా ఘోసి నియోజకవర్గ ఎమ్మెల్యే సుధాకర్ సింగ్(67) హఠాన్మరణం చెందారు. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) శాసనసభ్యుడైన సుధాకర్ సింగ్ గురువారం ఉదయం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో వారణాసి చేరుకున్న ఆయన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే వారణాసి ఆస్పత్రిలో చేర్చారు. గుండె సమస్యను గుర్తించిన వైద్యుల సూచనల మేరకు లక్నోకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలోనే చనిపోయారు. సుధాకర్ సింగ్ 2012–17 మధ్య ఘోసి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2017 ఎన్నికల్లో ఓటమి పాలై, తిరిగి 2023లో మళ్లీ ఎన్నికయ్యారు. అంతకుముందు, 1996లో నాథుపూర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. సుధాకర్ సింగ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సీఎం యోగి ఆదిత్యనాథ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సంతాపం తెలిపారు.

కాంబోడియాలో బస్సు ప్రమాదం.. 13 మంది పర్యాటకులు మృతి

నాంఫెన్: కాంబోడియాలో గురువారం వేకువజామున చోటుచేసుకున్న బస్సు ప్రమాదంలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, 25 మంది గాయపడ్డారు. ప్రఖ్యాత అంగ్‌కోర్ వాట్ ఆలయమున్న సియెమ్ రీప్ నుంచి రాజధాని నాంఫెన్‌కు అర్ధరాత్రి సమయంలో బయలుదేరిన ఈ బస్సులో 40 మంది వరకు ప్రయాణికులున్నారు. తెల్లవారు జామున డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి, వంతెన పైనుంచి నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో 13 మంది చనిపోగా, మరో రెండు డజన్ల మంది వరకు గాయపడ్డారని డిప్యూటీ పోలీస్ చీఫ్ శివ్ సోవన్న చెప్పారు. ప్రమాద బాధితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మృతుల్లో బస్సు డ్రైవర్ ఉన్నదీ లేనిదీ ఆయన వెల్లడించలేదు.

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

1857 సిపాయిల తిరుగుబాటు

దేశానికి స్వాతంత్ర్యం రావడానికి 90 ఏళ్ల ముందే సిపాయిల తిరుగుబాటు మీరట్‌లో ప్రారంభమైంది. ఆ సమయంలో లార్డ్ కానింగ్ గవర్నర్ జనరల్‌గా వ్యవహరించారు. సిపాయిల తిరుగుబాటు కాలంలో ఢిల్లీ సైనికులు మొగల్ చక్రవర్తి రెండో బహదూర్‌షాను పాదుషాగా ప్రకటించారు. సిపాయిల తిరుగుబాటు సమయంలో ఢిల్లీ ముట్టడిలో ఆంగ్లేయులు సాగించిన దారుణ హింసాకాండను గాలిబ్ అనే ఉర్దూ కవి వర్ణించాడు.

సిపాయిల తిరుగుబాటుకు అయోధ్యలో హజ్రత్ బేగం నేతృత్వం వహించగా, ఝాన్సీలో లక్ష్మీబాయి, మధ్య భారతదేశంలో తాంతియా తోపే నాయకత్వం వహించారు.

ఈ తిరుగుబాటును అణచి వేయడంలో ప్రముఖపాత్ర వహించిన బ్రిటిష్ సేనానులు సర్‌జేమ్స్, అవుట్రామ్, హూవ్‌లాక్, నికల్‌సన్, నెయిల్ లారెన్స్, కాంప్‌బెల్, సర్ రోజ్‌వుడ్.

తిరుగుబాటుకు కారణాలు

డల్హౌసీ అనుసరించిన దురాక్రమణ విధానం రాజకీయ కారణం కాగా, బ్రిటిషర్ల నూతన ఆర్థిక విధానం ఆర్థిక కారణమైంది. హైందవ సాంఘిక వ్యవస్థను ఖండించటం సాంఘిక కారణమైతే భారత్, ఐరోపా సైనికుల మధ్య ఉన్న తారతమ్యం సైనిక కారణమైంది.

రాజకీయ కారణాలు

తిరుగుబాటుకు ప్రధాన కారకుడు గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ. ఈయన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, జైపూర్, సంబల్‌పూర్, ఝాన్సీ తదితర రాజ్యాలు ఆక్రమించుకున్నాడు. అస్తవ్యస్త పాలన సాకుతో అవధ్ (యూపీ)ను కూడా ఆక్రమించాడు.

పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడు నానా సాహెబ్ (దొండు పంత్). డల్హౌసీ ఇతడి పెన్షన్‌ను నిలిపివేశాడు. నానాసాహెబ్‌కు మద్దతుగా అతడి సోదరుడు రావు సాహెబ్ పోరాడాడు.

బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తి బిరుదును రద్దు చేశారు. చక్రవర్తి కుటుంబీకులు ఎర్రకోటను వదలి వెళ్లాలన్న బ్రిటిష్ కంపెనీ ఆజ్ఞలు భారతీయ ముస్లింలకు బాధ కలిగించాయి. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించడంతో అనేక మంది ప్రభువులు, అధికారులు, సైనికులు, నిరుద్యోగులయ్యారు. బ్రిటిషర్లు వారికి ఉపాధి కల్పించలేదు. జమీందార్లు, తాలుక్‌దార్ల భూములను బ్రిటిషర్లు ఆక్రమించారు. ఇది అయోధ్యలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అసంతృప్తి కలిగించింది. సంస్థానాధీశుల కొలువు నుంచి బ్రిటిషర్లు సైనికులను తొలగించారు. దీంతో వారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే అవకాశం కోసం ఎదురు చూశారు.

ఆర్థిక కారణాలు

ప్రజల్లో బ్రిటిష్ పరిపాలన పట్ల వ్యతిరేకతకు వారు అనుసరించిన ఆర్థిక దోపిడీ విధానమే ప్రధాన కారణం. బ్రిటిషర్లు తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి భారతదేశ సంపదలను కొల్లగొట్టారు. మనదేశం నుంచి ముడి సరకులను ఇంగ్లండ్‌కు చేరవేశారు. ఇక్కడ తయారైన పట్టు, నూలు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి చేయకుండా అడ్డుకున్నారు. వాటిపై సుంకాలు విధించారు. దీంతో స్వదేశీ పరిశ్రమలు మూతపడ్డాయి. పేదరికం ప్రబలి, దేశం కరవు కాటకాలకు నిలయమైంది. సాధారణ ప్రజలు తమ పరిస్థితులను మెరుగుపర్చుకొనే ఉద్దేశంతో తిరుగుబాటుదారులతో చేతులు కలిపారు. సంస్థానాలను బ్రిటిషర్లు ఆక్రమించడం అనేక అనర్థాలకు దారితీసింది. రాజుల అధికారం చేజారింది. వారి సైన్యాలు రద్దయ్యాయి. దీంతో సైనికులు జీవనాధారం కోల్పోయారు. బ్రిటిషర్లు మాత్రం ఉన్నత పదవుల్లో నియమితులయ్యారు. విద్యావంతులైన భారతీయులను కూడా ఉన్నతోద్యోగాలకు అర్హులుగా భావించలేదు. ఉన్నత పదవులకు భారతీయులు అనర్హులని బహిరంగంగా బ్రిటిషర్లు చాటి చెప్పారు. వారి ఆర్థిక విధానం భారతీయ రైతాంగాన్ని, చేతిపని వారిని, స్థానిక ప్రభువులను.. అందరినీ కుంగదీసింది.

సాంఘిక కారణాలు

బ్రిటిషర్లు భారతీయులను తక్కువ జాతివారిగా పరిగణించేవారు. సాంఘికంగా భారతీయులంటే వారికి చిన్నచూపు. భారతీయ స్త్రీలను అగౌరవ పర్చడం, భౌతిక హింసలకు గురి చేయడం, అవి కొన్నిసార్లు మరణాలకు దారి తీయడం లాంటి సంఘటనలు సర్వసాధారణం. మొదటి తరగతి రైల్వే బోగీల్లో భారతీయులు ప్రయాణించడానికి అనుమతించేవారు కాదు. సాంఘిక సమావేశాల్లో ఆంగ్లేయులతో కలవకుండా భారతీయులను దూరంగా ఉంచేవారు. యూరోపియన్లు నడిపే హోటళ్లు, క్లబ్బుల్లో భారతీయులకు ప్రవేశం లేదు. ఆగ్రాలో మెజిస్ట్రేట్ ప్రకటించిన రెగ్యులేషన్ భారతీయుల పట్ల బ్రిటిషర్ల వైఖరికి అద్దం పట్టింది. ఈ రెగ్యులేషన్ పాటించనందుకు గొప్ప సంస్కర్త అయిన రాజా రామ్మోహన్‌రాయ్ కూడా అవమానానికి గురయ్యాడు. ఈ రకమైన వేధింపులకు గురైన భారతీయులకు చాలా సందర్భాల్లో బ్రిటిష్ న్యాయమూర్తులు న్యాయం చేయలేదు.

మత కారణాలు

బ్రిటిషర్లకు హిందూమతం పట్ల ఉన్న అభిప్రాయం భారతీయుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. భారతీయులను క్రైస్తవంలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారని భయాందోళనలకు గురయ్యారు. 1813 చార్టర్ చట్టానికి ముందు క్రైస్తవ మిషనరీలను దేశంలోకి అనుమతించేవారు కాదు. 1813 చార్టర్ చట్టంతో ఈ నిబంధన ఎత్తివేశారు. దీంతో అనేక మిషనరీలు భారతదేశానికి రావడం ప్రారంభమైంది. మిషనరీలు దేశంలో, ముఖ్యంగా అనేక వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలను స్థాపించి, విద్యాబోధన చేసేవి. విద్యార్థులను

క్రైస్తవ మతంలోకి మార్చడమే వీటి ధ్యేయం. మిషనరీలు స్థాపించిన పాఠశాలల్లో బైబిల్ పఠనం తప్పనిసరి. జైళ్లలో ఉన్న ఖైదీలు క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా అనేక విధాలుగా ప్రలోభాలకు గురి చేసేవారు.వారికి క్రైస్తవ గ్రంథాలను బోధించేవారు. క్రైస్తవులుగా మారిన వారిని జైలు నుంచి విడుదల చేసేవారు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రకారం..

1837 కరవు కాటకాల సమయంలో మిషనరీలు అనేక మంది అనాథలను క్రైస్తవ మతంలోకి మార్చాయి. మిషనరీలు క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి ధనాన్ని ఆశగా చూపేవి. ఆ మతంలోకి మారిన వారికి ఉద్యోగాలు ఇచ్చి, గౌరవ మర్యాదలు కల్పించారు. ప్రజల్లో అనుమానాలు సృష్టించేలా బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. ఉపయోగపడే సాంఘిక చట్టాలనూ ప్రజలు అపార్థం చేసుకున్నారు. విలియం బెంటింగ్ 1829లో సతీ సహగమనాన్ని నిషేధించాడు. దీన్ని హిందూ ఉదారవాదులు సమర్థించారు. కానీ సాధారణ ప్రజలు ప్రభుత్వ ఉద్దేశాలను అనుమానించారు. 1832–50 మధ్య కాలంలో ఆస్తి వారసత్వానికి సంబంధించిన చట్టాలను కంపెనీ ప్రవేశపెట్టింది. 1856లో రిలిజియస్ డిజేబిలిటీస్ యాక్ట్, వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాలతో ప్రభుత్వం తమ సాంఘిక, మత విషయాల్లో జోక్యం చేసుకుంటుందని ప్రజలు భావించారు.

సైనిక కారణాలు

భారతీయ సైనికుల్లో అసంతృప్తికి హిదాయత్ అలీ కింది కారణాలను పేర్కొన్నారు.

బెంగాల్ సైన్యంలో ఎక్కువ మంది సైనికులు అయోధ్య ప్రాంతానికి చెందినవారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో అయోధ్యను కలపడంతో వీరు కోపోద్రిక్తులయ్యారు.

పంజాబ్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపాక, సైన్యంలో చేరే సిక్కు, ముస్లిం సైనికులకు గడ్డం లేదా జుట్టు తీసివేసే షరతు పెట్టబోమన్నారు. కానీ తర్వాతి కాలంలో జుట్టు తొలగించాలని ఆజ్ఞాపించారు. ధిక్కరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. బ్రిటిషర్లు 1856 సెప్టెంబర్‌లో ఒక ఆజ్ఞ జారీ చేశారు. దీని ప్రకారం కొత్తగా నియమితులయ్యే సైనికులు ఏ ప్రాంతానికైనా వెళ్లి యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. సముద్ర యానం చేస్తే కులభ్రష్టులవుతారనే నమ్మకం హిందువుల్లో ఉండేది. ఇది బ్రిటిషర్ల పట్ల సైనికుల అనుమానాలు బలపడేలా చేసింది.

తక్షణ కారణం

కొవ్వు పూసిన తూటాల వదంతి వ్యాపించింది. ఇది హిందూ, ముస్లిం సైనికుల మనోభావాలను దెబ్బతీసింది. దాంతో సైనిక కవాతులో పాల్గొనరాదని 1857 ఫిబ్రవరి 20న బరంపూర్‌లోని పదాతిదళం నిర్ణయించింది. 1857 మార్చి 29న 34వ దేశీయ పటాలానికి చెందిన మంగళ్‌పాండే ఆంగ్లేయాధికారిపై కాల్పులు జరిపి తిరుగుబాటుకు అంకురార్పణ చేశాడు. తర్వాత అతడిపై విచారణ జరిపి ఏప్రిల్ 8న బహిరంగంగా ఉరితీశారు. దాన్ని తిరుగుబాటుగా భావించని కంపెనీ పాలకులు అదొక చిన్న సంఘటనగా, కేవలం హైందవ మేధావి వర్గ ఉద్యమమని భావించారు. త్వరలోనే సమసిపోతుందనుకున్నారు.

తిరుగుబాటు విఫలం కావడానికి కారణాలు

సిపాయిలు తిరుగుబాటు చేసే సమయానికి కంపెనీ సైన్యంలో ఏడుగురు సిపాయిలకు ఒక ఆంగ్ల సైనికుడు మాత్రమే ఉన్నాడు. ప్రజలు కూడా సిపాయిలకు మద్దతు ఇచ్చారు. తిరుగుబాటుదారులు విప్లవ ప్రారంభ దశలో ఢిల్లీని వశపర్చుకున్నారు. తర్వాత ఆగ్రా, కలకత్తాల మధ్య ఉన్న ప్రసార సాధనాలను ధ్వంసం చేశారు. తొలి దశలో వారు బ్రిటిషర్లను ఇబ్బందులకు గురి చేసినా, తర్వాత ఆంగ్లేయులు తిరుగుబాటుదార్లను ప్రతిఘటించారు.

విప్లవం విఫలం కావడానికి అనేక కారణాలున్నాయి. తిరుగుబాటు కొద్ది ప్రాంతానికే పరిమితం కావడం, యావత్తు దక్షిణ భారతదేశం, పంజాబ్ ఉత్తర ప్రాంతం, పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, మధ్యభారతం, బెంగాల్‌లో తిరుగుబాటు ప్రభావం లేదు. ఢిల్లీ, అయోధ్య, బిహార్, రోహిల్‌ఖండ్, దాని పరిసర ప్రాంతాలకే తిరుగుబాటు పరిమితమైంది. అందువల్ల విప్లవాన్ని అణచివేయడం ఆంగ్లేయులకు తేలికైంది.

తిరుగుబాటుదారుల కంటే బ్రిటిషర్లకు మెరుగైన వనరులున్నాయి. క్రమేణా బ్రిటిషర్ల సైన్యం పెరిగింది. సుమారు 1.12 లక్షల బ్రిటిష్ సైన్యాన్ని ఇండియాకు తరలించారు. సుమారు 3.10 లక్షల మంది భారతీయులను కొత్తగా సైన్యంలో చేర్చుకున్నారు. తిరుగుబాటుదారులు సంప్రదాయ ఆయుధాలతో యుద్ధం చేస్తే, బ్రిటిష్ సైన్యం కొత్తగా ప్రవేశపెట్టిన రైఫిల్స్‌ను ఉపయోగించింది. టెలిగ్రాఫ్ సదుపాయం ఆంగ్లేయులకు చాలా ఉపయోగకరంగా మారింది. దీని వల్ల సిపాయిల వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలైంది.

అనేక మంది స్వదేశీ రాజులు బ్రిటిషర్లకు సహాయపడ్డారు. పాటియాల, సింధ్, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన సంస్థానాధీశులు ఆంగ్లేయులకు సహాయం చేశారు. నేపాల్ రాజు తన సైన్యాన్ని బ్రిటిషర్ల ఆధీనంలో ఉంచాడు.

తిరుగుబాటుదారుల్లో సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. బహదూర్‌షా వృద్ధుడు, అతడి కుమారులు నిష్ప్రయోజకులు. లక్ష్మీబాయి వీరవనిత అయినప్పటికీ, ఆంగ్లేయులతో పోరాడే శక్తియుక్తులు ఆమెకు లేవు. లారెన్స్, హ్యూరోస్, హల్‌రాక్, నికల్సన్ వంటి సుప్రసిద్ధ సేనానుల సేవలు లభించడంతో ఆంగ్లేయుల విజయం సులభమైంది. తిరుగుబాటుకు ఒక నిర్ణీత పథకం గానీ, నిర్దిష్ట కార్యక్రమం గానీ లేవు. తిరుగుబాటుదారుల ఆశయాలు వేరు, వారిలో ఐకమత్యం లేదు. పీష్వా పదవి కోసం నానాసాహెబ్, దత్తత అంగీకరించకపోవడం వల్ల లక్ష్మీబాయి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల్లో జాతీయాభిమానం, దేశాభిమానం ఉన్నా వారికి సరైన మార్గదర్శకత్వం లేదు. తిరుగుబాటుదారులంతా ఒకేసారి తిరుగుబాటు చేయలేదు. ఎవరికి వారు ఒంటరిగా పోరాడి ఓడిపోయారు. తిరుగుబాటు ఎక్కువ భాగం కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తిరుగుబాటులో పాల్గొనలేదు. కాబట్టే ఇది ప్రజల ఉద్యమంగా రూపాంతరం చెందలేదు.

బెంగాల్ సైనికులు పౌరుల పట్ల దూకుడు ప్రదర్శించేవారు. వారి ప్రవర్తన సరిగా ఉండేది కాదు. ప్రజలు వారిని ద్వేషించారు. అనేక ప్రాంతాల్లో ప్రజలే వారిని అణచివేశారు.

1857లో ఇంగ్లండ్‌కు అంతర్జాతీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. క్రిమియా యుద్ధంలో గెలుపొందడంతో బ్రిటిషర్లకు రష్యా బెడద తొలగిపోయింది. పర్షియాతో యుద్ధం కూడా ముగిసింది. దీంతో బ్రిటన్ తన సైన్యాన్ని భారతదేశానికి మళ్లించగలిగింది. తిరుగుబాటుదారుల్లో వ్యక్తిగత అసూయలు చోటు చేసుకున్నాయి. ఈ అసూయలే తిరుగుబాటు విఫలమయ్యేందుకు దోహదం చేశాయి.

1857 తిరుగుబాటు స్వభావం

సిపాయిల తిరుగుబాటు స్వభావం మీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొంతమంది దీన్ని సిపాయిల పితూరీ అని, మరికొందరు క్రైస్తవుల మీద జరిగిన మత యుద్ధమని లేదా తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన యుద్ధమని, హిందూ, ముస్లింలు కలిసి బ్రిటిషర్ల మీద పన్నిన కుట్ర అని పేర్కొన్నారు. చాలా మంది ఆధునిక భారత చరిత్రకారులు దీన్ని 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించారు.

సిపాయిల పితూరీ

సిపాయిలు తరచూ సొంత కారణాలతో తిరుగుబాటు చేయడం వల్ల సర్‌జాన్ లారెన్స్, సర్‌సీలే, స్మిత్, మార్ష్‌మన్ మొదలైన చరిత్రకారులు ఇది కేవలం సైనికుల తిరుగుబాటుగా భావించారు. అందుకే దీన్ని సిపాయిల పితూరీ లేదా సిపాయిల తిరుగుబాటుగా పిలిచారు. కానీ ఇది వాస్తవదూరం. అనేక మంది పౌరశాఖ ఉద్యోగులు, ప్రజలు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. తిరుగుబాటుకు కేవలం సైనిక కారణాలే కాకుండా అనేక మత, సాంఘిక, ఆర్థిక కారణాలు కూడా దోహదం చేశాయి.

జాతి సంఘర్షణ

కొందరు చరిత్రకారులు ఈ తిరుగుబాటును తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన సంఘర్షణ అని అభిప్రాయపడ్డారు. ఈ దృక్పథం సరైంది కాదు. జె.బి.మోడ్లీ ప్రకారం ప్రతి తెల్ల జాతీయుడికి 20 మంది నల్ల జాతి సైనికులు ఉన్నారు. అనేక మంది భారతీయులు ఆంగ్లేయుల తరఫున పోరాడారు. భారతీయులంతా తిరుగుబాటులో పాల్గొనలేదు.

టి.ఆర్.హోల్‌మస్ అనే చరిత్రకారుడు సిపాయిల తిరుగుబాటును 'నాగరికతకు, అనాగరికతకు మధ్య జరిగిన సంఘర్షణ' అని పేర్కొన్నాడు. కానీ ఈ ధోరణి సరికాదని, భారత సంస్కృతి మహోన్నతమైందని విమర్శకులు దీటుగా సమాధానమిచ్చారు.

తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు విఫలం కావడంతో భారతదేశ దాస్య శృంఖలాలు మరింత బిగిసిపోయాయి. తిరుగుబాటు ఒక శకాన్ని ముగించి, మరొక శకారంభానికి పునాది వేసిందని చెప్పొచ్చు. సామ్రాజ్య విస్తరణ స్థానంలో ఆర్థిక దోపిడీకి నాంది పలికింది. జాతీయ తత్వాన్ని అలవర్చుకున్న ప్రగతిశీల శక్తుల స్వభావాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సవాల్‌గా ఎదుర్కోవాల్సి వచ్చింది. తిరుగుబాటు ఫలితంగా కంపెనీ పాలన రద్దయింది. దాని స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రత్యక్ష పాలన ఆరంభమైంది. బ్రిటన్ రాణి విక్టోరియాను భారత సామ్రాజ్ఞిగా ప్రకటించారు. 1858 నవంబర్ 1న వెలువడిన ఈ ప్రకటనను లార్డ్ కానింగ్ అలహాబాద్‌లో చదివారు.

విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్

ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసే అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర వహించే అంశం విద్యాదృక్పథాలు. ఈ విభాగంలో విద్య చరిత్రాత్మక అంశాలు, సమకాలిన అంశాలు, విద్యా విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. విద్యా దృక్పథాలు అనే అంశాన్ని సరళంగా ఎడ్యుకేషనల్ జి.కె.గా పేర్కొంటారు. ఈ విభాగంలో అధిక భారత్వం కలిగి, లోతైన అధ్యయనానికి అవకాశం ఉన్న అంశం విద్యా చరిత్ర. విద్యా చరిత్రలో ఒక కీలక అంశం బ్రిటిష్ విద్యావిధానంలో ముఖ్య అంశాలు, మాదిరి ప్రశ్నలు గురించి తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) విద్య అనేది భారతీయులను మేధావులుగా తీర్చిదిద్దేలా ఉండాలి – మెకాలే ప్రతిపాదన
   బి) విద్య అనేది భారతీయులను గుమాస్తాలుగా తయారు చేసేదిగా ఉండాలి – వుడ్స్ ప్రతిపాదన.
   1) ఎ, బి రెండూ సరైనవే
   2) ఎ సరైంది, బి సరికాదు
   3) ఎ సరికాదు, బి సరైంది
   4) ఎ, బి రెండూ సరికావు
2. జతపరచండి.
   జాబితా – I
   i) అబ్జర్వేషన్స్
   ii) స్కూల్ అండ్ స్కూల్ బుక్ సొసైటీ
   iii) పుణె సంస్కృత కళాశాల
   iv) సెయింట్ ఆన్స్ పాఠశాల
   జాబితా – II
   a) కెప్టెన్ కెండీ
   b) ఫ్రాన్సిస్ జేవియర్
   c) ఎల్ఫిన్‌స్టన్
   d) చార్లెస్ గ్రాంట్
   1) i-b, ii-c, iii-d, iv-a
   2) i-d, ii-c, iii-b, iv-a
   3) i-d, ii-c, iii-a, iv-b
   4) i-d, ii-a, iii-c, iv-b
3. కింది వాటిలో సరికానిది ఏది?
   1) మనదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టడానికి కారణం – మెకాలే మినట్స్
   2) యుద్ధానంతర విద్యా పథకం – శాడ్లర్ కమిషన్
   3) భారతీయ విద్యకు మాగ్నాకార్టా – వుడ్స్ నివేదిక
   4) తొలి భారతీయ కమిషన్ – హంటర్ కమిషన్
4. కింది వాటిలో వుడ్స్ నివేదికలోని అంశం కానిది ఏది?
   1) ప్రతి రాష్ట్రానికి ప్రజా విద్యా నిర్దేశక శాఖ ఏర్పాటు చేయాలి
   2) కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించాలి
   3) అధోముఖ వడపోత సిద్ధాంతం ద్వారా ఆంగ్ల విద్యను అందించాలి
   4) గ్రాంట్ – ఇన్– ఎయిడ్ విధానాన్ని రూపొందించాలి
5. జతపరచండి.
   జాబితా – I
   i) హలక్ బంధీ పాఠశాలలు
   ii) గాంధీజీ ప్రాతిపదిక విద్య
   iii) తొలి ఉపాధ్యాయ కళాశాల
   జాబితా – II
   a) వార్ధా   b) ఆగ్రా
   c) ట్వింక్వీ బార్
   1) i-a, ii-b, iii-c
   2) i-b, ii-a, iii-c
   3) i-b, ii-c, iii-a
   4) i-c, ii-b, iii-a
6. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రాథమిక విద్యావ్యాప్తిని స్థానిక సంస్థలకు అప్పగించాలి – హంటర్ కమిషన్ సూచన
   బి) ప్రజ్ఞ, నైతికత అభివృద్ధి చెందేదిగా విద్య ఉండాలి – వుడ్స్ ప్రతిపాదన
   సి) భారతీయ భాషల మాధ్యమంలోనే విద్యను అందించాలి – మెకాలే మినట్స్‌లో అంశం
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, బి, సి మూడూ సరైనవే
   3) ఎ, బి, సి మూడూ సరికావు
   4) ఎ, సి మాత్రమే
7. జతపరచండి.
   జాబితా – I
   i) వుడ్స్ నివేదిక
   ii) మెకాలే మినట్స్
   iii) హంటర్ కమిషన్
   iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   జాబితా – II
   a) 1902   b) 1854
   c) 1835   d) 1882
   1) i-b, ii-c, iii-a, iv-d
   2) i-b, ii-c, iii-d, iv-a
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-b, ii-d, iii-c, iv-a
8. నియామక సంవత్సరాలకు అనుగుణంగా కింది వాటిని అవరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ) శాడ్లర్ కమిషన్   బి) సార్జంట్ కమిటీ
   సి) ఎబాట్‌వుడ్ కమిటీ
   డి) హర్టాగ్ కమిటీ
   1) బి, డి, సి, ఎ   2) బి, డి, ఎ, సి
   3) డి, బి, సి, ఎ   4) బి, సి, డి, ఎ
9. కింది వాటిలో మెకాలే మినట్స్‌తో ఏకీభవించని భావన ఏది?
   1) భారతీయులు రక్తంలో, వర్ణంలో భారతీయులై, ఆలోచనలు, అభిరుచులు, అభిప్రాయాల్లో బ్రిటిషర్లుగా ఉండే విద్యను వారికి అందించాలి
   2) ఇండియా, అరేబియా, ఆసియా దేశాల సాహిత్యం మొత్తం ఇంగ్లిష్ గ్రంథాలయంలో ఒక సొరుగు పుస్తకాలతో కూడా సరితూగదు
   3) చౌక వేతనంతో గుమస్తాలను తయారు చేసేదిగా విద్య ఉండాలి
   4) ఏదీకాదు
10. జతపరచండి.
   జాబితా – I
   i) మెకాలే మినట్స్   ii) వుడ్స్ నివేదిక
   iii) హంటర్ కమిషన్
   iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   జాబితా – II
   a) డల్హౌసి   b) లార్డ్ రిప్పన్
   c) లార్డ్ కర్జన్   d) విలియం బెంటింక్
   1) i-d, ii-a, iii-b, iv-c
   2) i-d, ii-a, iii-c, iv-b
   3) i-d, ii-b, iii-a, iv-c
   4) i-d, ii-c, iii-b, iv-a
11. కింది అంశాలకు సంబంధించిన సంవత్సరాలకు అనుగుణంగా ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ) బేసిక్ విద్యావిధానం
   బి) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   సి) ప్రాథమిక విద్యకు గోఖలే తీర్మానం
   డి) స్వదేశీ విద్యా ఉద్యమం ప్రారంభం
   1) ఎ, బి, సి, డి   2) డి, సి, బి, ఎ
   3) సి, డి, బి, ఎ   4) బి, డి, సి, ఎ
12. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
   1) 1921   2) 1917
   3) 1927   4) 1937
13. జతపరచండి.
   జాబితా – I
   i) శాడ్లర్ కమిషన్   ii) సార్జెంట్ కమిటీ
   iii) హర్టాగ్ కమిటీ
   iv) ఎబాట్‌వుడ్ కమిటీ
   జాబితా – II
   a) 1929   b) 1937
   c) 1917   d) 1944
   1) i-c, ii-d, iii-b, iv-a
   2) i-c, ii-d, iii-a, iv-b
   3) i-c, ii-b, iii-d, iv-a
   4) i-c, ii-a, iii-d, iv-b
14. జాకిర్ హుస్సేన్ కమిటీ దేనికి సంబంధించింది?
   1) వృథా, స్తబ్దతల నివారణ
   2) ప్రాతిపదిక విద్య   3) బాలికా విద్య
   4) వయోజన విద్య
15. కింది వాటిలో సరైన జత ఏది?
   i) భారతీయ విద్యా విధానానికి వుడ్స్ నివేదికను 'మాగ్నాకార్టా'గా అభిప్రాయ పడిన విద్యావేత్త – హెచ్.ఆర్. జేమ్స్
   ii) 6–10 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్న వారు – గోఖలే
   iii) భారతదేశ ఆధునిక విద్యా పితామహుడు – చార్లెస్ గ్రాంట్
   iv) ఆంగ్ల విద్య మాత్రమే నవీన విజ్ఞానానికి తాళంచెవి లాంటిది అని భావించిన వారు – మెకాలే
   1) ఎ, బి మాత్రమే   2) బి, సి మాత్రమే
   3) ఎ, బి, సి, డి   4) ఏదీకాదు
16. కింది వాటిలో సరైన అంశం ఏది?
   ఎ) కలకత్తా విశ్వవిద్యాలయ సమస్యల పరిష్కారానికి నియమించింది – హర్టాగ్ కమిటీ
   బి) స్వయం పోషకంగా పాఠశాలల అభివృద్ధి చెందాలన్నదే ప్రాతిపదిక విద్య ప్రధాన ఉద్దేశం
   సి) వృథా, స్తబ్దతల నివారణకు నియమించింది – శాడ్లర్ కమిషన్
   డి) వయోజన విద్యా వ్యాప్తికి బ్రిటిషర్లు నియమించింది – ఎబాట్‌వుడ్ కమిటీ
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, బి, సి మాత్రమే
   3) సి మాత్రమే
   4) బి మాత్రమే
17. జతపరచండి.
   జాబితా – I
   i) బేసిక్ విద్యావిధానం
   ii) గోఖలే విద్యాతీర్మానం
   iii) విశ్వవిద్యాలయాల చట్టం
   iv) జాతీయ విద్యావిధానం
   జాబితా – II
   a) 1913   b) 1904
   c) 1911   d) 1937
   1) i-d, ii-c, iii-b, iv-a
   2) i-d, ii-c, iii-a, iv-b
   3) i-d, ii-b, iii-c, iv-a
   4) i-d, ii-a, iii-b, iv-c
18. '6–14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి. దానిని 40 ఏళ్లలో అంటే 1984లోగా సాధించాలి' అని సూచించింది?
   1) హర్టాగ్ కమిటీ   2) శాడ్లర్ కమిషన్
   3) సార్జెంట్ ప్లాన్   4) ఎబాట్‌వుడ్ కమిటీ
19. జతపరచండి.
   జాబితా – I
   i) సార్జెంట్ కమిటీ   ii) ఎబాట్‌వుడ్ కమిటీ
   iii) హర్టాగ్ కమిటీ   iv) శాడ్లర్ కమిషన్
   జాబితా – II
   a) ఉప కమిటీ
   b) వృత్తి విద్యా కమిటీ
   c) యుద్ధానంతర విద్యా పథకం
   d) విశ్వవిద్యాలయాల సంస్కరణలను సూచించింది
   1) i-c, ii-b, iii-d, iv-a
   2) i-c, ii-d, iii-b, iv-a
   3) i-c, ii-a, iii-d, iv-b
   4) i-c, ii-b, iii-a, iv-d
20. 'ప్రాక్–పశ్చిమ వివాదం' అంటే?
   1) పాశ్చాత్య విజ్ఞానానికి, భారతీయ విజ్ఞానానికి మధ్య వివాదం
   2) భారతీయ భాషలకు, ఇంగ్లిష్‌కు మధ్య వివాదం
   3) భారతీయ సంప్రదాయాలకు, యురోపియన్ సంప్రదాయానికి మధ్య వివాదం
   4) యురోపియన్ సంస్కృతికి, భారతీయ సంస్కృతికి మధ్య వివాదం
21. వివిధ అంశాలు, వాటి సంవత్సరాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) రాష్ట్ర విద్యా నిర్దేశక శాఖలు ఏర్పాటు – 1871
   బి) విశ్వవిద్యాలయాల్లో స్త్రీలకు ప్రవేశం – 1877
   సి) మద్రాస్, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాల స్థాపన – 1857
   1) ఎ, బి మాత్రమే   2) బి, సి మాత్రమే
   3) ఎ, బి, సి   4) ఎ, సి మాత్రమే
22. కింది వాటిలో సార్జెంట్ కమిటీ సూచన కానిది ఏది?
   1) ఎంప్లాయిమెంట్ బ్యూరోను స్థాపించాలి
   2) విశ్వవిద్యాలయాల విరాళాల కమిటీని ఏర్పాటు చేయాలి
   3) 6–14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి
   4) ఇంటర్మీడియట్‌ను రెండు సంవత్సరాలుగా నిర్వహించాలి
23. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) రాజా రామ్మోహన్‌రాయ్ హిందూ కాలేజ్‌ని స్థాపించారు – 1817
   బి) భారతీయుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఈస్టిండియా కంపెనీ ఏటా రూ. ఒక లక్ష కేటాయించాలని తీర్మానం – 1813
   సి) లార్డ్ హార్డింగ్.. ఉద్యోగావకాశాలను కేవలం ఆంగ్ల భాషను అభ్యసించిన భారతీయులకు మాత్రమే ఇవ్వాలని ఆదేశించాడు – 1844
   1) ఎ, బి మాత్రమే   2) బి, సి మాత్రమే
   3) ఎ, బి, సి   4) ఎ, సి మాత్రమే
24. కింది వారిలో విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?
   ఎ) మెకాలే   బి) చార్లెస్ వుడ్స్,
   సి) హంటర్
   1) బి మాత్రమే   2) బి, సి మాత్రమే
   3) ఎ మాత్రమే   4) ఎ, బి, సి
25. కింది వాటిలో హంటర్ కమిషన్ సూచన ఏది?
   1) నిత్యజీవితానికి పనికి వచ్చే భౌతికశాస్త్రం, వ్యవసాయం, క్షేత్ర గణితం లాంటి అంశాలను ప్రాథమిక విద్యాప్రణాళికలో చేర్చాలి
   2) విద్యాలయాల్లో ప్రవేశానికి అన్ని వర్గాల నుంచి ఫీజు వసూలు చేయాలి
   3) ప్రాథమిక పాఠశాలల స్థాపన బాధ్యతను ప్రజలే చేపట్టాలి
   4) ప్రాథమిక విద్యావ్యాప్తిని విశ్వవిద్యాలయాలు చేపట్టాలి
26. 'నిరక్షరాస్యులు, అమాయకులు ఉన్న జాతి సంపూర్ణమైన అభివృద్ధి సాధించ లేదు, పోటీ పడలేదు' అని వ్యాఖ్యానించిన వారు?
   1) హెచ్.ఆర్. జేమ్స్   2) గోఖలే
   3) హాలెండ్   4) సార్జెంట్
27. 10 + 2 + 3 విద్యా నమూనాను మొదటిసారిగా సూచించింది?
   1) హర్టాగ్ కమిటీ   2) సార్జెంట్ కమిటీ
   3) ఎబాట్‌వుడ్ కమిటీ
   4) శాడ్లర్ కమిషన్
28. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్ పునరుద్ధరణను సూచించిన కమిటీ ఏది?
   1) హర్టాగ్ కమిటీ   2) సార్జెంట్ కమిటీ
   3) ఎబాట్‌వుడ్ కమిటీ
   4) జాకీర్ హుస్సేన్ కమిటీ
29. నిర్బంధ ప్రాథమిక విద్య సిద్ధాంతాన్ని ఆమోదించిన తొలి చట్టం ఏది?
   1) పటేల్ చట్టం – 1918
   2) భారత ప్రభుత్వ చట్టం – 1919
   3) భారత ప్రభుత్వ చట్టం – 1921
   4) భారత ప్రభుత్వ చట్టం – 1935
30. స్వదేశీ విద్యా ఉద్యమ కాలంలో మన దేశంలో ఏ విద్యా విధానాన్ని అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది?
   1) చైనీస్ విద్యావిధానం
   2) అమెరికన్ విద్యావిధానం
   3) జర్మన్ విద్యావిధానం
   4) జపనీస్ విద్యావిధానం

సమాధానాలు

1) 4	2) 3	3) 2	4) 3	5) 2
6) 1	7) 2	8) 4	9) 4	10) 1
11) 4	12) 1	13) 2	14) 2	15) 3
16) 4	17) 1	18) 3	19) 4	20) 1
21) 3	22) 4	23) 3	24) 4	25) 1
26) 2	27) 4	28) 1	29) 1	30) 4

నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో వచ్చే వ్యాధి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీర్ణవ్యవస్థ

జీవుల పెరుగుదల, వివిధ కణాల విధుల నిర్వహణ, శక్తి కోసం ఆహారం అవసరం. ఎంజైముల చర్యలతో సంక్లిష్ట ఆహార పదార్థాలు సరళ పదార్థాలుగా మారతాయి. దీన్ని జీర్ణక్రియ అంటారు. జీర్ణక్రియలో పాల్గొనే అవయవాలన్నింటిని కలిపి జీర్ణ వ్యవస్థగా పేర్కొంటారు. మానవుడి జీర్ణ వ్యవస్థను మూడు భాగాలుగా విభజించొచ్చు. అవి..

1) ఆహారనాళం లేదా జీర్ణనాళం
2) జీర్ణగ్రంథులు
3) జీర్ణక్రియా విధానం

ఆహారనాళం

ఆహారనాళం పొడవు 9 మీటర్లు. ఇది నోటితో ప్రారంభమై, పాయువుతో అంతమవుతుంది. ఆహార నాళంలోని భాగాలు వరుసగా..

1) నోరు 2) ఆస్యకుహరం
3) గ్రసని 4) ఆహార వాహిక
5) జీర్ణాశయం
6) చిన్న పేగు, 7) పెద్ద పేగు
8) పురీషనాళం 9) పాయువు

నోరు

ఇది ఆహారనాళం మొదటి భాగం. నోటి ద్వారా ఆహారం తీసుకునే ప్రక్రియను అంతఃగ్రహణం అంటారు. నోటిలో ఆహారం 15 నుంచి 30 సెకన్ల వరకు ఉంటుంది.

ఆస్యకుహరం

రెండు దవడల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఆస్యకుహరం అంటారు. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి..

1) దంతాలు 2) లాలాజల గ్రంథులు
3) నాలుక

దంతాలు

దంతాల అధ్యయనాన్ని ఒడెంటాలజీ అంటారు. ఎక్కువ సంఖ్యలో దంతాలున్న జీవులు..

అపోజం – 50
గుర్రం, పంది – 44

దంతాలు డెంటిన్‌తో ఏర్పడతాయి. దంతాల్లోని సజీవ కణాలు ఒడంటోబ్లాస్టులు. ఈ కణాలు డెంటిన్‌ను స్రవిస్తాయి. దంతం కిరీట భాగాన్ని కప్పుతూ ఉండే మెరిసే పొరను ఎనామిల్ లేదా పింగాణి పొర అంటారు. ఈ ఎనామిల్ దంతాలకు దృఢత్వాన్నిస్తుంది. పింగాణి పొర ఏర్పడటానికి ఫ్లోరిన్ (తక్కువ మోతాదులో) అవసరం. మానవ శరీరంలో అతి దృఢమైన పదార్థం ఎనామిల్ (పింగాణి).

దంత నిర్మాణం

దంత నిర్మాణంలో 3 భాగాలుంటాయి.

1) కిరీటం 2) మెడ 3) మూలం

కిరీటం (క్రౌన్): పైకి కనిపించే దంతభాగం.

మెడ: చిగురు వద్ద ఉండే దంత భాగం.

మూలం (రూట్): దవడ గుంతల్లో ఉండే దంత భాగం.

మానవ దంతాలు దవడ ఎముక గుంతల్లో అమరి ఉంటాయి. ఇలాంటి అమరికను థీకోడాంట్ దంత విన్యాసం అంటారు. మానవుడి జీవిత కాలంలో రెండుసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని ద్వివార దంత విన్యాసం అంటారు. చేపల జీవితకాలంలో అనేకసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని బహువార దంత విన్యాసం అంటారు. పక్షుల్లో దంతాలు ఉండవు.

దంతాలు - రకాలు

మానవుడిలో రెండు రకాల దంతాలు ఏర్పడతాయి. 1) పాలదంతాలు
2) శాశ్వత దంతాలు

పాల దంతాలు

ఇవి 6 నుంచి 7 నెలల వయసులో ఏర్పడి, 8 నుంచి 9 సంవత్సరాల వయసులో ఊడిపోతాయి.

పాల దంతాల సంఖ్య – 20

పాలదంతాల ఫార్ములా:

$$I.C.P.M. = \frac{2102}{2102} \text{ or } (2102 \times 4 = 20)$$

చిన్న పిల్లల పాలదంతాల్లో లోపించిన దంతాల సంఖ్య – 12

అవి.. అగ్ర చర్వణకాలు– 8, జ్ఞానదంతాలు– 4

శాశ్వత దంతాలు

పాలదంతాలు ఊడిపోయి వాటి స్థానంలో శాశ్వత దంతాలు వస్తాయి.

శాశ్వత దంతాల అర్ధ దవడ ఫార్ములా:

$$I.C.P.M. = \frac{2123}{2123} \text{ or } (2123 \times 4) = 32$$

శాశ్వత దంతాలు వివిధ ఆకార, పరిమాణాల్లో ఉంటాయి. కాబట్టి వీటిని విషమ దంతాలు అంటారు.

- ఏనుగు పైదవడలోని కుంతకాలు, ఏనుగు దంతాలు(టస్క్)గా మార్పు చెందుతాయి.
- రదనికలు మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెంది ఉంటాయి. రదనికల అగ్రభాగం మొనదేలి ఎముకల నుంచి మాంసాన్ని చీల్చడానికి ఉపయోగపడుతుంది.
- కుందేలులాంటి శాకాహార జీవుల్లో రదనికలు లోపించి దవడలో ఏర్పడే ఖాళీ ప్రదేశాన్ని 'డయాస్టీమా' అంటారు. డయాస్టీమా లోపించిన జీవులు.. పులి, సింహం, కుక్క.
- సముద్ర క్షీరదాలైన సీల్, వాల్‌రస్‌లో ఏర్పడే రెండు పొడవైన దంతాలు.. రదనికల రూపాంతరాలు.
- పాములోని రెండు కోరలు కూడా రదనికల రూపాంతరాలే.
- చర్వణకాల్లోని చివరి దంతాన్ని జ్ఞానదంతం (విస్‌డమ్ టీత్) అంటారు. ఇది యుక్త వయసులో (21 ఏళ్ల తర్వాత) ఏర్పడుతుంది.

రూట్ కెనాల్ థెరపీ: శాశ్వత దంతాలు ఊడిపోయినప్పుడు దంతవైద్యులు కృత్రిమ దంతాలను దవడ గుంతల్లో అమర్చే ప్రక్రియ.

దంత వ్యాధులు

ఫ్లోరోసిస్: ఫ్లోరిన్ (2 పీపీఎం కంటే ఎక్కువ) నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారుతాయి. ఎముకలు వికృత రూపం దాల్చుతాయి.

పయేరియా: దంతాలు, చిగుళ్ల నుంచి చీము వస్తుంది.

జిజివైటిస్: రెండు దంతాల మధ్యలోని చిగురులో వాపు.

దంతక్షయం: బ్యాక్టీరియా చర్యలతో దంతాలపై ఎనామిల్ క్షీణించడం.

లాలాజల గ్రంథులు

మానవుడిలో మూడు జతల లాలాజల గ్రంథులు ఉంటాయి. కుందేలులో నాలుగు జతలుంటాయి. పాములో లాలాజల గ్రంథులు విష గ్రంథులుగా రూపాంతరం చెందుతాయి. లాలా జల గ్రంథులు రోజుకు ఒక లీటరు లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తాయి. లాలాజలం ఆమ్లం స్వభావం (pH– 6.8) లో ఉంటుంది.

దీనిలో టయలిన్ (లాలాజల అమైలేజ్), లైసోజోమ్ అనే ఎంజైములు ఉంటాయి. టయలిన్ పిండి పదార్థాలను డెక్ట్రిన్, మాల్టోజ్ చక్కెరలుగా మారుస్తుంది. లైసోజైమ్ సూక్ష్మజీవ నాశినిగా పని చేసి నోటి దుర్వాసనను దూరం చేస్తుంది.

నాలుక

నాలుక రుచులను గుర్తించే జ్ఞానేంద్రియం. దీనిపై రుచులను గుర్తించే నాలుగు రకాల రుచి మొగ్గలు ఉంటాయి. అవి..

- నాలుక కొన – తీపి రుచి మొగ్గలు
- నాలుక కొన వెనక భాగం – ఉప్పు
- నాలుక పక్క భాగాలు – పులుపు
- నాలుక లోపలి భాగం (గొంతులో)– చేదు రుచి మొగ్గలు ఉంటాయి.

గ్రసని

ఆహార, వాయు నాళ మార్గాల కూడలిని గ్రసని అంటారు. గ్రసనిలో ఎలాంటి జీర్ణక్రియ జరగదు.

ఆహార వాహిక

ఇది గ్రసనితో ప్రారంభమై జీర్ణాశయంలోకి తెరుచుకుంటుంది. ఆహార వాహికలోనూ ఎలాంటి జీర్ణక్రియ జరగదు. ఆహారం మింగినప్పుడు అది ఆహార వాహికలోకి చేరుతుంది.



- ఆహారాన్ని మింగడం నియంత్రిత చర్య.
- ఆహార వాహికలో ఆహారం 10 నుంచి 15 సెకన్లు ఉంటుంది.
- ఆహార వాహికలోని పెరిస్టాలిటిక్ చలనాలతో ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.

జీర్ణాశయం

జీర్ణాశయం సంచి లాంటి కండర నిర్మిత భాగం. ఇది ఉదరంలో ఎడమ వైపు ఉంటుంది. జీర్ణాశయం గోడల్లోని జఠర గ్రంథులు జఠర రసాన్ని స్రవిస్తాయి. జఠర రసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HCl), పెప్సిన్, రెనిన్ అనే ఎంజైములు, మ్యూసిన్ ఉంటాయి.

- జీర్ణాశయంలోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఆహారంలోని సూక్ష్మజీవులను చంపుతుంది. ఆహారానికి ఆమ్ల స్వభావాన్ని కలిగిస్తుంది.
- జీర్ణాశయంలో ఆమ్లం అధికంగా ఉత్పత్తి అయితే పెప్టిక్ అల్సర్ వస్తుంది.
- పెప్టిక్ అల్సర్ నివారణకు మిల్క్ ఆఫ్ మెగ్నిషియాన్ని ఔషధంగా వాడుతారు. దీనిలో మెగ్నిషియం హైడ్రాక్సైడ్ ఉంటుంది.
- హెలికో బ్యాక్టర్ పైలోరి అనే బ్యాక్టీరియా వల్ల జీర్ణాశయ అల్సర్ వస్తుందని రోబిన్ వారెన్, బెరిమార్షల్ కనుగొన్నారు. వీరి పరిశోధనకు 2005లో నోబెల్ బహుమతి లభించింది.

విధులు

- ఆహారాన్ని తాత్కాలికంగా నిల్వ చేయడం (2 నుంచి 4 గంటలు)
- ఆహారంలోని పదార్థాలను కలపడం.
- ఆహారంలో భౌతిక రసాయన మార్పులను కలిగించడం.
- జీర్ణాశయ గోడల్లోని వర్తుల కండరాలు ఆహారాన్ని మెత్తగా చేస్తాయి.
- జీర్ణాశయంలో పాక్షికంగా జీర్ణమై ద్రవరూపంలోకి మారిన ఆహారాన్ని కైమ్ అంటారు. (కైమ్ ఆమ్ల స్థితిలో ఉంటుంది).

మానవుడి జీర్ణాశయంలో మూడు గదులుంటాయి. కానీ, నెమరువేసే జంతువుల్లో నాలుగు గదులుంటాయి. అవి.. 1) ప్రథమ ఆమాశయం 2) జాలకం 3) తృతీయ ఆమాశయం 4) చతుర్థ ఆమాశయం.

వీటిలో ప్రథమ ఆమాశయం పెద్దది. ఈ గదిలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులుంటాయి. ఈ గది మానవుడిలో లోపించి ఉంటుంది.

గ్యాస్ట్రో ఎంటరాలజీ: జీర్ణాశయం, ఉదరం లోని భాగాల అధ్యయనాన్ని గ్యాస్ట్రో ఎంటరాలజీ అంటారు.

అన్నవాహికను ఎక్స్‌రే తీసే ముందు రోగికి బేరియం ద్రావణాన్ని తాగిస్తారు. బేరియం ఎక్స్ కిరణాలను బాగా గ్రహిస్తుంది.

బేరియాట్రిక్ సర్జరీ

ఊబకాయుల్లో బరువును తగ్గించడానికి బేరియాట్రిక్ సర్జరీ చేస్తారు. ఉదరంలోని అన్నకోశం (జీర్ణాశయం) సైజు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. లైపోసక్షన్ ఇందుకు పూర్తి భిన్నం. దీనిలో వివిధ శరీర భాగాల్లో అదనంగా పేరుకున్న కొవ్వును తొలగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. గ్యాస్ట్రో ఎంటరాలజీ దేని అధ్యయనం?
 1) మెదడు అధ్యయనం
 2) కిడ్నీ అధ్యయనం
 3) ఉదరం లోపలి భాగాల అధ్యయనం
 4) పైవన్నీ
2. మానవుడిలో దంతాల సంఖ్య?
 1) 23 2) 43 3) 28 4) 32
3. ఎనామిల్ దేన్ని కప్పి ఉంచుతుంది?
 1) దంతం 2) దంత కిరీటంపైనా, లోపల
 3) డెంటిన్ ఉన్న భాగం 4) పైవన్నీ
4. పిల్లల పాల దంతాల్లో లోపించినవి?
 1) ఇన్‌సిజర్స్ 2) కైనైన్స్
 3) ప్రిమోలార్స్ 4) మోలార్స్
5. లాలాజలం స్వభావం?
 1) తటస్థ 2) ఆమ్ల
 3) క్షార 4) పైవన్నీ
6. రూట్ కెనాల్ థెరపీ అనేది?
 1) పాడైన పళ్లు 2) పాడైన కిడ్నీ
 3) పాడైన గుండె 4) పాడైన గోళ్లు
7. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి?
 1) గుండె బైపాస్ సర్జరీ
 2) ఉదరం బైపాస్ సర్జరీ
 3) మెదడు సర్జరీ
 4) గుండె ఓపెన్ హార్ట్ సర్జరీ
8. కింది వాటిలో ఎంజైమ్?
 1) గ్లూకగాన్ 2) ఇన్సులిన్
 3) ట్రిప్సిన్ 4) సొమాటోట్రోపిన్
9. మానవుడి జీర్ణాశయంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం?
 1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
 3) పార్మిక్ ఆమ్లం 4) నైట్రికామ్లం
10. పయేరియా వ్యాధి దేనికి సంబంధించింది?
 1) చిగుళ్లు 2) ముక్కు
 3) గుండె 4) ఊపిరితిత్తులు
11. మానవ శరీరంలో ఆహారనాళం సగటు పొడవెంత?
 1) 2 మీటర్లు 2) 4 మీటర్లు
 3) 6 మీటర్లు 4) 9 మీటర్లు
12. నీటిలో ఏ పదార్థం ఎక్కువగా ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
 1) ఫ్లోరైడ్ 2) క్లోరైడ్
 3) లెడ్ 4) ఏదీకాదు
13. నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో వచ్చే వ్యాధి?
 1) క్షయ 2) కాలేయ జబ్బు
 3) ఎముకల్లో బలహీనమైన కీళ్లు
 4) ఏదీకాదు

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2; 6) 1; 7) 2; 8) 3; 9) 2; 10) 1; 11) 4; 12)1; 13) 3.

Farmers used the constellations in the night..

Model Questions

Directions (Q.No. 1- 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. I enjoy (1)/ playing (2)/ musical instruments like (3)/ piano and violin. (4)/ No error (5)
2. Having read the book, (1)/ there is no question (2)/ the book is better (3)/ than the film. (4)/ No error (5)
3. I don't know if I am ready (1)/ to take the test now and whether (2)/ I will ever be ready (3)/ in the future. (4)/ No error (5)
4. A flock of birds, (1)/ flying south (2)/ for the winter, (3)/ was above us. (4)/ No error (5)
5. He cooked the salmon (1)/ well because (2)/ he attended (3)/ culinary school. (4)/ No error (5)

Directions: (Q.No.6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Once almost covered under centuries of debris, skilled artisans have now restored some original famous paintings during the Italian Renaissance.
 1) Some original famous paintings during the Italian Renaissance now have been by skillful artisans restored.
 2) The restoration of some original famous paintings during the Italian Renaissance has been done by skilled artisans.
 3) Skilled artisans during the Italian Renaissance have now restored some original famous paintings.
 4) Some original famous paintings during the Italian Renai ssance have now been restored by skilled artisans.
 5) No correction required
7. I asked him to quickly clean the table.
 1) I asked him to clean the table quickly.
 2) I asked quickly him to clean the table.
 3) I quickly asked him to clean the table.
 4) I asked him to clean the quickly table.
 5) No correction required
8. I thought my plan would sure succeed
 1) I thought my plan would sure succeeding.
 2) I thought my plan would surely succeeds.
 3) I thought my plan would certain succeed
 4) I thought my plan would certainly succeed
 5) No correction required
9. As soon as I hear the dog bark, I knew you were at the door.
 1) As soon as I hear the dog bark, I know you are at the door.
 2) As soon as I hear the dog bark, I had known you are at the door.
 3) As soon as I hear the dog bark, I will know you are at the door.
 4) As soon as I hear the dog bark, I will be knowing you will be at the door.
 5) No correction required
10. It seemed like he liked me.
 1) It seemed liked he liked me.
 2) It seemed like he liking me.
 3) It seemed as if he liked me.
 4) It seemed liked he like me.
 5) No correction required

Directions (Q. No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The good news is that both Smartphone operating systems are excellent.

B) Microsoft has thrown in the towel with Windows Phone, BlackBerry makes Android devices now, and there are very few other options worth considering.

C) Ultimately, the best platform for you depends on you. Pick the things that matter most to you, count the wins in those categories, and you have a recommendation.

D) If you're buying a new smartphone today, chances are very good that it will run Google's Android or Apple's iOS mobile operating systems.

E) These two platforms accounted for more than 99 percent of all new smartphones shipped in 2016, and that rose to 99.7 percent last year, according to IDC.

F) They have far more in common than what divides them, but there are some important differences that you'll want to consider.

BANK EXAMS
GENERAL ENGLISH

11. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) D 5) E
12. What is the THIRD sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) F 5) E
13. What is the SECOND sentence after rearrangement?
 1) A 2) B 3) D
 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
 1) B 2) A 3) C
 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) D 5) F

Directions (Q.No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Security is freedom from, or ____ against, potential harm ____ external forces.
 1) rigidity, for 2) resilience, from
 3) firmness, to
 4) stiffness, towards 5) spirit, with
17. A firewall typically establishes a barrier ____ a trusted internal network and ____ external network, such as the Internet.
 1) below, trusted
 2) amid , believed
 3) among, untrusted
 4) between, untrusted
 5) linking, conviction
18. The restaurant has a ____ buffet with authentic Indian dishes, if you do not like it, you can go for an equally ____ a-la-carte menu of exquisite continental dishes.
 1) lavish, exciting
 2) generous, boring
 3) unstinted, dreary
 4) copious, uninspiring
 5) fulsome, electrify
19. Farmers used the constellations in the night sky for ____ the seasons.
 1) seeing 2) observing
 3) practicing 4) predicting
 5) monitoring
20. It is a story of two men and a batch of ____ armoured cars.
 1) deceased 2) diseased
 3) decrepit 4) defeated
 5) vigorous

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

According to a new study by the School of Medicine of the University of Pittsburgh, spending hours every day on social media sites lead to body image issues and a higher risk of eating disorders. For someone with an eating disorder, comparisons with others are common, with a tendency to compare with those perceived to be thinner or fit. Eating disorder sufferers may **berate** themselves for not being as thin or sick as others they know with eating disorders, those they have met in treatment or online communities, or even friends or acquaintances. Social media can **warp reality** if you surround yourself with individuals struggling with the same condition as your sense of what is normal can be swallowed up. Sufferers of eating disorders may also measure their own achievements and accomplishments against their peers and as a result may feel they are lagging behind. A constant stream of acquaintances that constantly share news of their work advances, family and relationship statuses can lead to an **influx** of self-hate and the thought that any personal successes are lacking. This may be especially relevant if someone has missed out on chances to pursue milestones due to illness and/or treatment. Focusing on your own endeavors, however small they may seem is crucial.

21. What is the suitable tile for the passage?
 1) reality check
 2) what should you be eating?
 3) Research on eating disorders.
 4) Social Media and eating disorders.
 5) trends in eating
22. What is the reason for self hate?
 1) Comparisons with others
 2) Measuring their own achievements and accomplishments against their peers
 3) Associates constantly sharing news of their work advances, family and relationship statuses
 4) Focusing on your own endeavors
 5) Spending hours every day on social media sites
23. What does warp reality mean?
 1) a rare and powerful phenomenon
 2) power to change the properties
 3) a popular culture
 4) reality distortion
 5) ability to manipulate reality
24. The synonym of berate is
 1) rebuke 2) praise
 3) extol 4) eulogize
 5) tribute
25. The antonym of influx is
 1) invasion 2) flood
 3) deluge 4) torrent
 5) dearth

Directions (Q.No. 26-28): Identify the word which is closest in meaning to the word provided and mark it as your answer.

26. Nabob
 1) bigwig 2) doubter
 3) frolic 4) converse
 5) adverse
27. Pall
 1) light 2) satiate
 3) carry 4) horror
 5) disgust
28. Sacrosanct
 1) prayer 2) sanctuary
 3) pious 4) sacred
 5) worship

Directions (Q.No. 29-30): Identify the word which is opposite in meaning to the word provided and mark it as your answer.

29. Placid
 1) gauche 2) fine
 3) brilliant 4) indecent
 5) roaring
30. Stentorian
 1) violent 2) muffled
 3) loud 4) stealthy
 5) tranquil

KEY

1) 3	2) 2	3) 1	4) 5	5) 3
6) 4	7) 1	8) 4	9) 3	10) 3
11) 1	12) 2	13) 4	14) 4	15) 3
16) 2	17) 4	18) 1	19) 4	20) 3
21) 4	22) 3	23) 5	24) 1	25) 5
26) 1	27) 2	28) 4	29) 1	30) 2